# మిసిమి

మాసపత్రిక
**సంపుటి 33** **సంచిక 11**
**నవంబర్ - 2022**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

*సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్***

*సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం*

KALA JYOTHI
— Since 1946 —

Printed & Published by
**BAPANNA ALAPATI**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,
**Hyderabad - 500 020.**
Ph: 040 - 27612436, 27645538.

ప్రతి : ₹ 50/- సంవత్సరానికి : ₹ 600/-

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),
కార్యదర్శి : వి. ఆశారాణి
సెల్: 994 951 6567
040 - 27645536

**Scan QR to Pay**
**Misimi Publication**

LIBRARY OF CONGRESS
**LCCN 91-903060**

**UGC Care**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
**ISSN 2454-4329**

**misimi90monthly@gmail.com**
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi
facebook.com/misimimaasapathrika
YouTube **: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## *నవంబర్ నెల సూచికలు...*


శతజయంతులు : ... 5

అనర్ఘ రత్నాలు : ఆచార్య పప్పు వేణుగోపాల రావు... 6

కాశీ : కిల్లాడ సత్యనారాయణ... 7

విశ్వదాభిరాముడు : బడేసాబ్... 14

పెదయ్యగారు దొడ్డమనిషి : గాదే ఈశ్వరరావు... 15

ఔదార్యశీలి : మురళి... 16

మాట్లాడింది పదినిమిషాలే - పడిన ముద్ర చెరిగిపోనిది : వలేటి గోపీచంద్... 17

సినీ సీమలో సంగీతం : ఘంటసాల వెంకటేశ్వరరావు... 19

గిరిజా కల్యాణం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య... 23

కమ్మతెమ్మెరలు : ... 34

బౌద్ధధర్మ సేవలో చెన్నూరు ఆంజనేయరెడ్డి : ముంగర జాషువ... 35

డా. నారాయణతో మాటామంతీ... : అశ్వినీకుమార్... 39

కబీర్ దాస్ - 8 : ప్రొ. లక్ష్మీ అయ్యర్... 50

కిలిమంజారో-2 : డా. నిమ్మగడ్డ శేషగిరిరావు... 55

విలియం బ్లేక్ - విలియం టర్నర్ : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్... 65

సెర్వాంటెస్ - డాన్ కిహోటీ : ముక్తవరం పార్థసారథి... 67

స్పర్శరేఖ : వి. రాజారామమోహనరావు... 76

దానగుప్తుడు నిజాం వెంకటేశం : సి. యస్. రాంబాబు... 79

పత్రహరిత పుడకల పరిమళభరిత సంకలనాలు : చంద్రశేఖర్ మల్లాది... 80


---

**ఆలపాటి రవీంద్రనాథ్ శతజయంతి స్మృతి సంచిక**

### అట్టమీది బొమ్మలు

4



అందానికి...
రష్యన్ చిత్రకారుడు:
Konstantin Razumov

1



అలంకారమెందుకు?
జర్మన్ చిత్రకారుడు:
ఆల్బర్ట్ లించ్

3




Red Dragon - Woman clothed with Sun (1805)
చిత్రకారుడు: విలియం బ్లేక్

2




Village



Fishing Boats (Rotterdam)
చిత్రకారుడు: విలియం టర్నర్

# శతజయంతులు


ఈ నెల – ఈ సంవత్సరం ఎంతో ప్రత్యేకం – నవంబరు 4వ తేది – ఆలపాటి రవీంద్రనాథ్ జయంతి – ఈ సంవత్సరం ఆయన శతజయంతి. మీరు మరచిపోకపోతే నవంబరు 2021 ఒక రంగుల పత్రికను మీకందించాము – **మిసిమి** సంస్థాపక సంపాదకుని శతజయంతి సందర్భంగా – కాలం రెక్కలు కట్టుకున్నట్లు అప్పుడే సంవత్సరం తిరిగిపోయింది.



ఆలపాటి రవీంద్రనాథ్

ఈ నవంబరు వారి శతజయంతి సంపూర్తిగా మా స్మృతి నివాళి అర్పిస్తున్నాము. వారితో పరిచయమున్న కొందరి జ్ఞాపకాలు ప్రచురిస్తూ...

తెలుగువానికి వారి గళం వినకపోతే పొద్దుపొడవదు – నిద్దుర రాదు – ఘంటసాల వెంకటేశ్వరరావుగారి శతజయంతి ఈ సంవత్సరమే – వారిని మరవకపోయినా గుర్తు చేసుకుంటూ వారి సంగీత శోధన లాంటి రచనను అందిస్తున్నాము. అలాగే వారు స్వరపరచిన యక్షగానం 'గిరిజా కళ్యాణం' – మల్లాదివారి కుసుమ కోమల సాహిత్యానికి ఘంటసాల గారు సుగమ సంగీతంతో పరిమళాలలద్దిన వైనం – పాఠకులకు చూపిస్తున్నాము పురుషోత్తమాచార్యగారి విశిష్టమైన విశ్లేషణతో.





ఘంటసాల వేంకటేశ్వరరావు



చెన్నూరు ఆంజనేయరెడ్డి

ఈ సంచికలోనే... **మిసిమి** కి పునరుజ్జీవనాన్ని (పునర్భవాన్ని?) దర్శించిన చెన్నూరు ఆంజనేయరెడ్డిగారి బహుముఖ కార్యాచరణపై నివేదికలాంటి ముంగర జాషువా రచనను చదవవచ్చు – ఇంతకంటే మరొక అక్షరం ఇక్కడ రాసినా వారు నివారిస్తారు!

మరొక అరుదైన వ్యక్తిత్వం కలిగిన – డా. నారాయణగారితో **మిసిమి** జరిపిన మాటామంతీ – ఈ నెల ప్రత్యేకం. నారాయణగారు ఒక జాతీయ రాజకీయ పార్టీకి కార్యదర్శిగా ఉంటూనే తన జీవిత పోరాటాన్ని ఉద్యమాలవైపుగా నడిపిన ప్రజల మనిషి. అలుపెరుగని 'పాదయాత్రలు' చేస్తున్న అనధికార ప్రజల ప్రతినిధి – అధికారం అవసరంలేని ప్రజానిధి!



నారాయణ

గత కొన్ని నెలలుగా ప్రచురిస్తున్న చాలా అరుదైన యాత్రాకథనాలు డా. శేషగిరిరావుగారి సాహసయాత్రలు పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆయన ఈ వారం ఎవరెస్టు 'బేస్‌కాప్'కి బయలుదేరుతున్నారు. వారి యాత్ర క్షేమంగా – విజయవంతంగా జరగాలని కోరుకుందాం.

# అనర్ఘ రత్నాలు

*– పప్పు వేణుగోపాల రావు*

పూర్వం ప్రయాణ సౌకర్యాలు అంతగా లేని రోజులవి. చాలామంది కాలి నడకనే ప్రయాణం చేసేవారు. దూర దేశాలు వెళ్తే, వస్తారో రారో కూడా తెలీదు. అందుకే కాశీకి వెళ్ళినవాడు, కాటికి వెళ్ళినవాడు ఒకటే అనేవారు. అలాంటి రోజుల్లో ఒకాయన ఒక గ్రామం నుంచి మరో గ్రామం వెళ్తున్నాడు. దారిలో ఒక అడవి దాటాలి, ఆయాసం వచ్చి ఒక చెట్టుకింద కూర్చున్నాడు. అలాగే ప్రాణం పోయింది పాపం. ఆ శవం అలా పడి ఉంది. ఒక నక్క ఆహారం కోసం వెళ్తూ ఈ శవాన్ని చూసి తినాలనుకుంది. ఇంతలో మరో నక్క వచ్చి ఒద్దుఒద్దు, వీడు మంచివాడు కాదు. వీడి చేతులు ఎప్పుడూ దానం చెయ్యలేదు, చెవులు ఏ మంచి కీర్తనలూ వినలేదు, ఈ కళ్ళతో ఈయన ఏ మంచి మనుషులనీ చూడలేదు. ఈ కాళ్ళతో ఏ తీర్థయాత్రలకో పుణ్యస్థలాలకో వెళ్ళలేదు. వీడి పొట్ట అంతా అన్యాయంగా ఆర్జించిన డబ్బుతో నిండి ఉన్నది. తల మదంతో, అహంకారంతో విర్రవీగి ఉంది. ఓయీ! జంబుకమా! ఏ రకంగా చూసినా నీచుడయిన ఈ మానవుడి శరీరాన్ని ముట్టుకోకు, అంది. అంటే నీచుని శవాన్ని జంతువులు కూడా ముట్టుకోవన్నమాట!

చాణక్యుడు వ్రాసిన నీతిలో 12వ అధ్యాయంలో 4వ శ్లోకం ఇది:

*హస్తౌ దాన-వివర్జితౌ-*
*శ్రుతి పుటౌ నో కీర్తనాకర్ణితౌ*
*నేత్రౌ సజ్జన వీక్షణేన విముఖౌ -*
*పాదౌ న తీర్థం గతౌ*
*అన్యాయార్జిత-విత్త-పూర్ణముదరం-*
*గర్వేణ తుంగం శిరః*
*రేరే జంబుక! ముంచ ముంచ సహసా*
*నీచస్యనింద్యం వపుః..* (చాణక్య నీతి 12-4)

ఇలాంటి నీతి శ్లోకాలు మానవత్వ విలువలని ధ్వనిగా చెప్పేవి సంస్కృతంలో కోకొల్లలు.

✧ ✧ ✧

**చాటువులు:** తెలుగు భాషలో వేలకొలది చాటు పద్యాలు కనిపిస్తాయి. అసలు చాటువు అంటే ఏమిటి? నిఘంటువులు చూస్తే 'చాటువు' అనే పదానికి ప్రియమైన మాట అనే అర్థం కనిపిస్తుంది. అజ్ఞాతమైన కవులెందరో వారికెదురైన పరిస్థితులలో అలవోకగా ఆశువుగా చెప్పినవి చాటువులు. అందులో జనరంజకత్వం, వాస్తవికత, ఒక మాధుర్యం ఉంటాయి. ఒక్కో పరిస్థితిలో అక్కడకక్కడ చెప్పిన చిన్నచిన్న పద్యాలు. అందులో రకరకాలైన చాటువులూ ఉన్నాయి. తెలుగు సాహిత్యంలో ఇలా ప్రాచుర్యం పొందిన కొన్ని చాటువులని ఒక్కొక్కటిగా చూద్దాం. వేమన చాటువుల గురించి ఓ మంచి పద్యం చెప్పాడు. ఒక మంచి విలువైన నీలంలాంటిది ఒక్కటి చాలు, తట్టెడు మెరిసే రాళ్లకన్నా ఒక్క నీలం మంచిది కదా అంటాడు.. పుట్టెడు పుస్తకాలూ, పద్యాలూ ఎందుకు, చాటుపద్యం ఒకటి చాలు అంటాడు.

*నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు*
*తళుకుబెలుకురాళ్లు తట్టెడేల*
*చాటుపద్యమిలను చాలదా ఒక్కటి*
*విశ్వదాభిరామ వినురవేమ!*

అలాటివి చాటుపద్యాలు. ఈ నెలకి ఒక చాటు పద్యం చూసి అందులో చమత్కారాన్ని ఆస్వాదిద్దాం. పూర్వం తిరుమలరాయడు అని ఓ రాజు ఉండేవాడు. ఆయనకి పాపం ఒకటే కన్ను. ఆయన ఎందఱో కవులను తనని వర్ణిస్తూ కవిత్వం చెప్పమన్నాడు. ఏం చెప్తారు. చివరికి తెనాలి రామలింగడు వచ్చి ఆయన్ను ఇలా వర్ణించాడు. అయ్యా మీరు మీ ఆవిడ కలిసి ఉంటే మీకు మూడుకళ్ళు, పరమశివుడంతటివారు. ఆవిడ పక్కన లేకపోతే రాక్షసులకు గురువైన శుక్రాచార్యులంతటివారు. ఆ ఉన్న ఒక్క కన్ను పోతే... కౌరవపతి ధ్రుతరాష్ట్రుడంతటివారండీ మీరు అన్నాడు. ఆ పద్యం ఇది. ఇందులో అర్థం చమత్కారం పద్యాన్ని గుర్తుపెట్టుకోనేలా చేస్తాయి.

*అన్నాతిగూడ హరుడవు / అన్నాతిని గూడకున్న అసురగురుడవౌ*
*అన్నా తిరుమలరాయా! / కన్నొక్కటి మిగిలెగాని కౌరవపతివే..*

ఇలా చాటువులు కొన్నివేలు ఉన్నాయి తెలుగులో చమత్కారం, కవితా పరిమళంగలవి.

ఆచార్య పప్పు వేణుగోపాల రావు
చెన్నై. e-mail: pappuvenu@gmail.com

# కాశీ - చారిత్రక నగరం

– కిల్లాడ సత్యనారాయణ



కాశీ విశ్వనాథ్

కాశీ...

ఈ రెండక్షరాల్లో సప్తసముద్రాలంత ఆధ్యాత్మిక భావామృతం నిండి ఉంది.

కాశీ....

ఈ రెండక్షరాలు చెవినబడితే చాలు. జన్మజన్మల భవబంధాల నుండి ముక్తి పొందిన అనుభూతి కలుగుతుంది.

కాశీ....

ఈ రెండక్షరాల క్షేత్రం కంటబడితే చాలు, 'ఇక చాలు' అనే తృప్తితో మనసు కుదుటపడుతుంది.

ప్రపంచంలో ఏ నగరానికైనా మనిషి బ్రతకడానికి వెళ్తాడు. ప్రపంచంలో కాశీ నగరం ఒక్కటే, మనిషి మరణించడానికి వస్తాడు.

భూత, భవిష్యత్‌ల వర్తమాన వారధి కాశీ. ప్రపంచంలో కొన్ని నగరాలు ప్రాచీన యుగంలో ప్రసిద్ధి పొందాయి. ఆ నగరాలు మధ్యయుగంలో తమ అస్తిత్వాన్ని కోల్పోయాయి. కొత్త ప్రాంతాలు నగరాలుగా మధ్యయుగంలో ప్రఖ్యాతి చెందాయి. కానీ అవి ఆధునిక యుగంలో తమ ప్రాముఖ్యతను కోల్పోయాయి. అన్ని యుగాల్లో సమానంగా ప్రాముఖ్యతను పొందిన అతి తక్కువ నగరాల్లో కాశీని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. కాశీ ఖ్యాతి యుగం నుండి యుగానికి మరింత పెరగడం విశేషం. జెరూసలేం, ఏథెన్స్, పెకింగ్ నగరాలవలే ప్రపంచంలో ఇప్పటికీ నివసిస్తున్న అతి పురాతన నగరం కాశీ.

కాశీ అంటే ప్రకాశించేది అని అర్థం. కాశీ అంటే ప్రకాశనగరం (City of Light). అంటే జ్ఞానోదయం కలిగించేది, మోక్షం ప్రాప్తింపజేసేది అని కూడా అర్థం.

'కాశీ' పేరు 'కాశ్య' నుండి వచ్చిందని చెబుతారు. కాశ్య ప్రాచీన కాలపు రాజు. కాశీని పాలించిన ప్రఖ్యాత రాజు దివోదాస ఈ వంశానికి చెందినవాడే. సుహోత్ర కుమారుడు కాశ్య. విష్ణు, వాయు, బ్రహ్మ, భాగవత పురాణాల్లో కాశ్య రాజు గురించి ఉంది.

కాశీ 'కాష' నుండి వచ్చిందని మరికొందరి అభిప్రాయం. కాష అన్నది గంగానదీ తీరాన వెండిలా ధగధగా మెరిసే పువ్వులు పూసే ఒక గడ్డి అని మరి కొందరి అభిప్రాయం. దాని నుండే 'కాశీ' పేరు వచ్చిందని చెబుతారు.

మహాభారతంలోని భీష్మపర్వంలో భారత వర్షంలో కాశీ, అపరకాశీ అనే రెండు జాతుల ప్రజలు ఉండేవారని పేర్కొంది. వీరు అనార్యులుగా తెలుస్తుంది.

కాశీకి ఇంకా ఏఏ పేర్లున్నాయి? అవి ఎలా వచ్చాయి?

'వారణాసి'. ఇది కూడా ప్రాచీనమైన పేరే. మహాభారతంలోనూ, బౌద్ధ జాతక కథల్లోనూ ఈ పేరు కనిపిస్తుంది. 'వరుణ, అస్సీ నదుల నడుమగల భౌగోళిక ప్రాంతాన్ని వారణాసిగా' పిలుస్తారని కూర్మ పురాణం చెబుతోంది. లార్డ్ కనింగ్ హాం కూడా దీన్ని తన 'ఏన్సెంట్ జాగ్రఫీ' గ్రంథంలో అంగీకరిస్తాడు.

ఈ రెండు నదులూ ఆదిపురుషుని శరీరం నుండి ఉద్భవించాయని వామన పురాణం చెబుతోంది. ఈ రెండు నదుల నడుమగల ప్రదేశం ముల్లోకాలలో అతి పవిత్ర ప్రదేశమని, సకల పాపాలను హరిస్తుందని ఈ పురాణం చెబుతుంది. జాబాల ఉపనిషత్తులో ఈ రెండు నదుల



గంగా ఘాట్

గురించి చెప్పబడింది. మత్స్య పురాణంలో పరమ శివుడు వారణాసిని ఈ విధంగా వర్ణిస్తాడు.

*వారణస్యాం నదీ పుణ్యా సిద్ధగంధర్వ సేవితా*
*ప్రవిష్టా త్రిపథా గంగా తస్మిన్ క్షేత్రే మమ ప్రియే*

అనగా "సిద్ధ గంధర్వుల చేత సేవించబడే వారణాసిలో పుణ్య నది గంగ ఉంది. అది నాకు చాలా ప్రియం" అంటాడు శివుడు.

పాళీ భాషలో 'వారణాసి' 'బనారసి'గా మార్పు చెందింది. అది బనారస్‌గా ప్రాచుర్యం పొందింది.

మధ్యయుగంలోనూ, బ్రిటిష్ కాలంలోనూ ఇది బెనారస్‌గానే పిలువబడేది. స్వాతంత్ర్య భారతదేశంలో ఇది వారణాసిగా అధికారికంగా పిలువబడుతోంది.

కాశీకి మరొక పేరు 'అవిముక్త'. శ్రీ మహావిష్ణువు కోరికమేరకు పరమ శివుడు ఈ నగరాన్ని ఎప్పుడూ విడిచిపెట్టనని ప్రమాణం చేస్తాడు.

"దీన్ని నేనెప్పుడూ విడిచిపెట్టలేదు. అది ఎప్పుడూ నాకు దూరమవలేదు. అందుకే దీన్ని అవిముక్తగా పిలుస్తారు." అని సాక్షాత్తు ఆ పరమేశ్వరుడే ఒక పురాణంలో చెప్పారు. ఎన్ని విపత్తులు ఎదురైనా ఈ నగరానికి ఏమీ కాకుండా ఆ శివుడే దీన్ని ఎప్పుడూ కాపాడుతూ ఉంటారని ఇక్కడి ప్రజల విశ్వాసం. అందుకే కాశీప్రజలు కూడా కాశీని విడవకుండా, ఇక్కడినుండే మోక్షాన్ని పొందాలనుకుంటారు.

*అవిముక్తం సమాసాధ్య తీర్థసేవీ కురుద్వః*
*దర్శనాద్ దేవదేవస్య / ముచ్యతే బ్రహ్మహత్యయా*

అనగా "అవిముక్త ప్రదేశం చేరుకుని, అక్కడ దేవదేవుని దర్శించుకుని యాత్రికులు అత్యధిక పుణ్యాన్ని పొందుతారు."

కాశీని 'ఆనందవనం'గా కూడా పిలుస్తారు. మొదట్లో కాశీ నగరం కాదు. వనం. ఆనందవనం. చెట్లు, పొదలు, సెలయేర్లు, నదులతో... పక్షులు, పురుగులు, జంతువులతో సంతోషానికి నిలయంగా ఉండేది. పార్వతీ దేవిని వివాహమాడిన తర్వాత, శివుడు కైలాసాన్ని విడిచి, ఇక్కడ నివసించాలని నిర్ణయిస్తారు. అందుకు పృథ్విపైన అందమైన ఈ వనాన్ని ఎన్నుకుంటారు.

క్రీ.శ. 18వ శతాబ్దంలో విలియం హోడ్జెస్, విలియం డేనియల్ గీచిన చిత్రంలో కూడా గంగా నది ఒడ్డున చెట్లతో, అక్కడక్కడ దేవాలయాలతో కాశీ కనిపిస్తుంది. ఈ సమయానికి దక్షిణం వైపు నగరీకరణ ప్రారంభమైనది. ఆ ప్రాంతాన్ని 'వన్ కటీ'గా పిలిచేవారు. 20వ శతాబ్ది ప్రారంభంలో ఉన్న మేప్‌లలో ఈ నగరపు దక్షిణ ప్రాంతంలో తోటలు, పొలాలు కనిపించేవి. లహురాబీర్, దుర్గా కుండ్ చుట్టుప్రక్కల ప్రదేశాలు అడవులతో ఉండేవని తెలుస్తుంది.

మీర్జా గాలిబ్ కాశీ వైభవం మీద చాలా శాయరీలు రాసారు. ఈయన 18-19 శతాబ్దివాడు.

*త ఆల్ అల్లా బనారస్ చష్మ్ - ఎ - బద్ దూర్*
*బిహిస్త్ - ఎ - ఖుర్రమ్ ఫిదౌస్ - ఎ - మామూర్*

(బనారస్ ఒక అందమైన పచ్చని స్వర్గం. దేవుడు దానిని చెడు ప్రజల దృష్టి నుండి కాపాడాలి).

కాశీని 'రుద్రవాసం'గా కూడా పిలుస్తారు. శివుడు శాశ్వతంగా నివసించే ప్రదేశం కాశీ. శివుడి ప్రాచీనమైన పేరు రుద్రుడు. కాశీలో శివుడు మందిరాల్లోనే కాదు, ఇక్కడి రాళ్ళూ రప్పల్లో కూడా నివసిస్తాడు. శివుడు నివసిస్తూ ఉండడంవల్ల మాత్రమే కాశీ రుద్రవాసం కాలేదు, ఇక్కడ నివసిస్తున్న ప్రతి ఒక్క వ్యక్తీ రుద్రుడు కావడంవల్ల కూడా ఇది రుద్రవాసం అయ్యింది. "ఇక్కడ నివసిస్తున్న ప్రతి ఒక్కరూ రుద్రుని రూపాన్నో, గుణాన్నో, అలంకారాన్నో పొందుతారు. అందుకే వాళ్ళను గౌరవించాలి. వాళ్ళు చనిపోయిన తర్వాత రుద్ర - శివలో మమేకమవుతారు." అని కాశీఖండంలో పరమేశ్వరుడు వివరిస్తాడు.

'మహాశ్మశానం'గా కూడా కాశీని కొన్నిచోట్ల పేర్కొన్నారు. మృత్యువు కోసం ఎదురు చూస్తూ కాశీలో నివసిస్తున్నవారిని 'జీవన ముక్తులు'గా పేర్కొంటారు. కాశీలో ప్రతిచోటా దహనసంస్కారం చేసేవారు. శివ

పురాణంలో దక్షుడు శివుణ్ణి ఆహ్వానిచకుండా యజ్ఞం నిర్వహిస్తాడు. దీన్ని ఖండిస్తూ దదీచి ఆ యజ్ఞ ప్రదేశాన్ని స్మశానంగా పిలిచాడు.

ప్రస్తుతం మణికర్ణికా ఘాట్, హరిశ్చంద్ర ఘాట్‌లలో మాత్రమే దహన సంస్కార క్రియలు జరుగుతున్నాయి. చనిపోయినవారికి కర్మకాండలు జరిపించేందుకు దేశం నలుమూలల నుండి ఇక్కడకు వస్తారు.

కాశీకి 'బ్రహ్మవర్ధన్' పేరు కూడా ప్రాచీన సాహిత్యంలో లభిస్తుంది. దీని అర్థం 'జ్ఞానపురి'. బౌద్ధ జాతక కాలంలో కాశీ జ్ఞానానికి కేంద్రంగా పేరుగాంచింది.

కాశీ రాజ్యానికి రాజధాని వారణాసి అని తెలుస్తుంది.

కాశీ శబ్దం మొట్టమొదట అథర్వవేదంలోని పైప్పలాద శాఖలో కనిపిస్తుంది. ఈ వేదంలో ఒక మంత్రకారుడు ఒక రోగి రోగాన్ని నయం చేయడం కోసం "ఈ రోగం ఇతన్ని విడచి, గాంధార, కాశీ, మగధ ప్రజల్లో నివసించుగాక!" అని ప్రార్థిస్తాడు. అంటే ఆ కాలంలో ఈ ప్రాంతాలలో అనార్యులు ఉండేవారని తెలుస్తుంది. ఈ వేదంలోనే 'వరణావతి' నది పేరు కూడా కనిపిస్తుంది. వైదిక ఇండెక్స్ పుస్తకంలో కీత్ కూడా 'వారణాసి పేరు చాలా పురాతనమైనది'గా పేర్కొన్నారు.

ఈ నగరాన్ని ఎవరు నిర్మించారు? మనిషా? దేవుడా?

స్కందపురాణంలోని కాశీ ఖండం కాశీ నగరం గురించి వర్ణిస్తుంది. పరమేశ్వరుని కుమారుడు స్కందుడు.

బౌద్ధ సాహిత్యంలోని 'గోవిందసుత్త'లో రాజా రేణు కాశీని స్థాపించినట్లుగా పేర్కొంది. ఐతరేయ బ్రాహ్మణంలో రాజా రేణు మహర్షి విశ్వామిత్రుని కుమారుడుగా వివరించబడింది. ఈ నగరాన్ని ఎప్పుడు నిర్మించారు? మనిషి పుట్టక ముందా? ఊరు పుట్టక ముందా?

వైదిక కాలంలో శతపథ బ్రాహ్మణంలో కాశీ పేరు కనిపిస్తుంది. ఈ బ్రాహ్మణం క్రీ.పూ. 1000 సంవత్సరాలనాటిదని చరిత్రకారులు నిర్ధారించారు.

కాశీ రాజు దివోదాస కాలం మహాభారతానికి ముందుదే అని తెలుస్తుంది. మహాభారత కాలం సుమారు క్రీ.పూ. 1000 – 1200 కాలం నాటిదని చరిత్రకారుల అభిప్రాయం. ఈ కాలం నాటికే కాశీ ఉందని కొందరు అభిప్రాయం.

వేదవ్యాసుడు కాశీ వచ్చాడట. మూడు రోజులు ఆయనకు ఎవరూ పట్టెడన్నం పెట్టలేదట. ఆయన కోపించి, గంగకు ఆవలి వైపుకు వెళ్లి ఉన్నట్లు చెబుతారు. అందుకే గంగకు అటువైపు ఉన్న కాశీని 'వ్యాసకాశీ' గా పిలుస్తారు.

వేల సంవత్సరాల క్రితం పొట్టిగా శ్యామల రంగులో ఉన్న ప్రజలు కాశీని నిర్మించారని పురాణాల నుండి తెలుస్తుంది. ప్రాచీనకాశీ ఆధునిక రాజ్ ఘాట్ వద్ద ఎత్తైన ప్రదేశంలో ఉండేదని చరిత్రకారుల అభిప్రాయం. అది వరుణా నదివైపు మాత్రమే ఉండేదని, అస్సీ నదివైపు కాదని పురావస్తు అవశేషాల ఆధారంగా చరిత్రకారులు చెబుతున్నారు.

ఆర్యులకు ముందు ఇక్కడ ఎవరు ఉండేవారు?

ఈ ప్రశ్నలకు సమాధానం చరిత్ర పేజీల్లో దొరకడం లేదు.

వీటికి ఖచ్చితమైన సమాధానం లేదు. అయితే ఆర్యులకు ముందు భర్, సుయిర్ వంటి ఆదిమ జాతులు నివసించేవారని తెలుస్తుంది. ఇది గాజీపుర్, మీర్జాపురంలోని తవ్వకాలలో బయటపడిన వస్తువులను బట్టి తెలుస్తుంది.


శివుడు ముందా? కాశీ ముందా?

ఈ నగరాన్ని పాలించింది ఎవరు? ప్రభువా? పరమేశ్వరుడా?

వాయు, బ్రహ్మాండ పురాణాల ప్రకారం కాశీ రాజు దివోదాసును ఓడించి హైహేయ్ రాజు భద్రశ్రేన్యుడు కాశీని వశపరచుకున్నాడు. అతని చేతి నుండి క్షేమకుడు అనే రాక్షసుడు చేజిక్కించుకున్నాడు. ఆ తర్వాత దివోదాసు మనుమడైన అలర్క్ రాజు క్షేమకుడిని చంపి, కాశీని తన అధికారంలోకి తెచ్చుకున్నాడు.

శ్రీ ఎఫ్.ఇ. పార్జిటర్ 1922లో రాసిన 'ఇండియన్ హిస్టోరికల్ ట్రెడిషన్' పుస్తకంలో పురాణాల ప్రకారం కాశీ రాజుల వంశ వృక్షాన్ని తయారు చేసారు. ఈ పట్టికలో కాశీని పాలించిన 72 మంది రాజుల పేర్లు ఉన్నాయి. అందులో ధృతరాష్ట్రుడు, అజాతశత్రువుల పేర్లు కూడా ఉన్నాయి.

రామాయణంలోని ఉత్తరకాండలో కాశీరాజు పురువసుని గురించి ప్రస్తావన ఉంది. యయాతి పుత్రుడు 'పురు'ని కాశీ రాజుగా చేసినట్లు చెప్పబడింది.



ఒకప్పటి కాశీ విశ్వనాథుడు

కాశీలో కౌరవుల, పాండవుల అమ్మమ్మ ఉన్నట్లుగా మహాభారతంలో చెప్పబడింది. మహాభారతంలోని ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణుడు వారణాసిని కాల్చివేసినట్లు వర్ణించబడింది. శ్రీకృష్ణుడు ఫౌండక్ అనే రాజును సహకరించేందుకు వెంబడిస్తూ కాశీ చేరుకున్నాడు. కాశీ రాజు పౌండక్‌కు ఆశ్రయం ఇవ్వడంవల్ల, శ్రీకృష్ణుడు కోపించి కాశీని కాల్చివేసినట్లు మహాభారతం చెబుతుంది. భగవద్గీతలో కుడా కాశీ గురించి ప్రస్తావన ఉంది. అగస్త్య మునికి కాశీతో సంబంధం ఉంది.

గౌతమ బుద్ధుడు ఉపదేశించిన స్థలం కాశీ. ఇరవై మూడవ తీర్థాంకరుడు పార్శ్వనాథుడు కాశీ రాజు అశ్వసేనుని పుత్రుడు. అతడు క్రీ.పూ. 8వ శతాబ్దికి చెందినవాడు. అతనికి ముందున్న తీర్థాంకరులు సుపార్శ్వనాద్, శ్రేయాంసనాథ్‌ల జన్మస్థలం కూడా కాశీనే.

పాళీ సాహిత్యం ప్రకారం బుద్ధుడు జన్మించడానికి కొన్ని శతాబ్దాల పూర్వం కాశీని బ్రహ్మదత్తుడు పాలించేవాడు. ఆ సమయంలో మగధ, వత్స, కాశి, కోశల, పాంచాల ముఖ్యమైన గంగానది తీరపు మహాజనపదాలుగా ఉండేవి. 16 మహాజనపదాల్లో కాశీ ఒకటి. మత్స్య పురాణంలో బ్రహ్మదత్తుని వంశంలో సుమారు 100 మంది రాజులు కాశీని పరిపాలించారని మత్స్యపురాణం చెబుతోంది. మహాజనపదాల్లో కోసల రాజు కంసుడు కాశీని క్రీ.పూ. 6వ శతాబ్దంలో ఓడించి తన రాజ్యంలో కలుపుకున్నాడు. కోసల రాజు తన సోదరి వివాహంలో కాశీని కట్నంగా మగధకు ఇచ్చాడు.

క్రీస్తుపూర్వం ఆరో శతాబ్దంలో గౌతమ బుద్ధుడు కాశీకి వచ్చాడు. ఆ సమయంలో కాశీ తన స్వాతంత్ర్యం కోల్పోయి ఉంది. అయినా కూడా కాశీ జ్ఞానానికి కేంద్రంగా నిలిచి ఉంది. ఆ కాలంలో కాశీ వస్త్రాలకు చాలా ప్రాముఖ్యత ఉండేది. కాశీకి దగ్గర్లో ఉన్న సార్నాథ్ (ఇసి పటాన)లో బుద్ధుడు తన తొలి ఉపదేశం 'ధర్మ చక్ర ప్రవర్తన'ను లోకానికి అందిస్తాడు. బౌద్ధ సాహిత్యంలో కాశీ, వారణాసి అనేకసార్లు కనిపిస్తాయి. బుద్ధుని మహాపరినిర్వాణానికి ముందు కాశీని 'అజాతశత్రువు, ఉదయుడు, కాలాశోకుడు' పరిపాలించారని బౌద్ధ గ్రంథం 'మహావంశం' చెబుతోంది. వీరు మగధ రాజులు.

మహాజనపద కాలం తర్వాత కాశీని శిశు నాగవంశం, నందవంశం, మౌర్యవంశం, శృంగవంశం, స్మశానవంశం, గుప్తవంశాలు పరిపాలించాయని మనకు తెలుస్తుంది. మౌర్య సామ్రాట్ అశోకుడు క్రీస్తుపూర్వం 3వ శతాబ్దిలో సార్‌నాథ్‌లో 'దమ్మేక స్థూపాన్ని, సింహ స్తంభాన్ని' స్థాపించాడు.

క్రీ.శ. మొదటి శతాబ్దంలో కాశీని కనిష్కుడు పరిపాలించాడు. ఆఖరి కుషాను రాజు వాసుదేవుడు క్రీ.శ. 176లో మరణించిన తర్వాత కాశి స్వాతంత్రం పొందింది.

క్రీ.శ. మూడవ శతాబ్దంలో కాశీ కౌశ్యాంబి రాజుల చేతుల్లోకి వెళ్ళింది. ఆ తర్వాత కాశీపై గుప్తుల ఆధిపత్యం మొదలైంది. వాయు పురాణంలోని ఈ క్రింది శ్లోకం ద్వారా మొదటి చంద్రగుప్తుని కాలంలోనే కౌశాంబి, బెనారస్ గుప్త సామ్రాజ్యంలో భాగమైనట్లు అర్థమవుతుంది.

***అనుగంగాప్రయాగం చ సాకేతం / మగధ స్తథా***
***ఏతాగ్ జనపదాన్ సర్వాన్ భోక్ష్యంతే గుప్తవంశజా***

క్రీ.శ. 350లో సముద్రగుప్తుడు దశాశ్వమేధ ఘాటువద్ద అశ్వమేధ యజ్ఞాన్ని చేశాడు. సముద్రగుప్తుని నాణాలు రాజ్‌ఘాట్‌వద్ద త్రవకాల్లో దొరికాయి. ఈ నాణాలపై ముద్రల ద్వారా గుప్తుల కాలంలో వారణాసి 'నగరం' (నిగమ్) అని స్పష్టమవుతుంది. డాక్టర్ ముజుందార్ తన 'కార్పొరేట్ లైఫ్ ఇన్ ఏన్షియెంట్ ఇండియా'లో మహా జానపదాల కాలంనుండి వారణాసి నగరమని వ్యాఖ్యానించారు.

సారనాథ్ కళలు, మధుర కళలు గుప్తుల పోషణలో వికసించినవే. గుప్తుల కాలంలో కాశీలో శైవమతం పునరుద్ధరించబడింది. వీరి కాలంలో అనేక శివలింగాలు

స్థాపించడం జరిగింది. రెండవ చంద్రగుప్తుని కాలంలో చైనా యాత్రికుడు పాహియాన్ కాశీయాత్ర చేస్తూ, 'ఇక్కడ అవముక్తేశ్వర్ పట్ల ప్రజల భక్తి తారస్థాయిలో ఉన్నట్లు' రాశాడు.

సామ్రాట్ హర్షవర్ధన కాలంలో కూడా కాశీ విద్యా కేంద్రంగా పేరుగాంచింది. చైనా యాత్రికుడు హుయేన్ సాంగ్ భారతదేశాన్ని దర్శించాడు.

చైనా యాత్రికుడు హుయేన్ సాంగ్ 'కాశీ జనసాంద్రతగల సంపన్న నగరం' అని వ్యాఖ్యానించారు. ఇక్కడ సుమారు 300 బౌద్ధవిహారాలు, 3000 మంది బౌద్ధ భిక్షువులు ఉండేవారని, సుమారు 100కు పైగా దేవాలయాలు, 10000 పైగా భక్తులు ఉండేవారని హుయేన్ సాంగ్ రాసారు. అంతేకాక కాశీలో 20 శివాలయాలు ఉన్నట్లు, వాటిలో కాశీ విశ్వనాథ మందిరం ప్రముఖమైనదిగా పేర్కొన్నారు.

ఆ తర్వాత ప్రతిహార రాజు భోజుడు పరిపాలించాడు. ప్రతిహారుల తర్వాత రాష్ట్ర కూటులు కాశీని పరిపాలించారు. ఆ తర్వాత చందేలుల పాలన మొదలైంది. క్రీ.శ. 8వ శతాబ్దంలో శంకరాచార్యులు కాశీ వచ్చి, 'బ్రహ్మసూత్రాల'ను రచించినట్లు తెలుస్తుంది.

క్రీ.శ. 11వ శతాబ్దంలో కాశీపై గహడ్వాల్ వంశ పాలన మొదలైంది. ఈ వంశంలో ప్రముఖ రాజు చంద్రదేవుడు తనకు తాను కాశీ రక్షకుడిగా చెప్పుకునేవాడు. ఈయన గంగా వరుణ సంగమ స్థలంలో సుప్రసిద్ధ ఆదికేశవ మందిరాన్ని స్థాపించాడు. చంద్రదేవ్ తర్వాత గోవిందచంద్ర, విజయచంద్ర, జయచంద్ర కాశీని పరిపాలించారు. గహడ్వాలులు వారణాసిని రాజధానిగా చేసుకొని పాలించారు. గహడ్వాలులే విశ్వనాథ మందిరాన్ని స్థాపించినట్లు లక్ష్మీధరుడు 'కృత్య కల్పతరు' గ్రంథంలో రాస్తాడు. అయితే అందుకు ఆధారంగా ఆయన తీసుకున్న 'లింగ పురాణం' అంతకు ముందు నుండే ఉందని చరిత్రకారుడు డా. మోతీచంద్ 'కాశీ చరిత్ర'లో పేర్కొన్నారు.

దేవాలయ శిల్పకళలకు ప్రముఖంగా చెప్పుకోదగిన కందవా దేవాలయం కూడా ఈ కాలంలో నిర్మించిందే.


జయచంద్రను మహమ్మద్ ఘోరీ ఓడించి కాశీలో విధ్వంసం సృష్టించాడు. కాశీలోని ధారానగర్‌లోని ప్రాచీన విష్ణు మందిరాన్ని కుతుబుద్దిన్ ఐబక్ కూలగొట్టి, మసీదు నిర్మించాడు. ఢిల్లీ సుల్తానుల కాలంలోనే క్రీ.శ. 15వ శతాబ్దంలో కాశీ విశ్వనాథ దేవాలయం చుట్టూ ఉన్న మందిరాలను నేలమట్టం చేసారు. వాటిపై మసీదులు నిర్మించారు. క్రీ.శ. 1447లో జోన్‌పూర్‌లోని లాల్ దర్వాజా మసీదును ఇక్కడి దేవాలయాల విధ్వంసపు అవశేషాలు ఉపయోగించి నిర్మించారు. కంగురే మసీదు 24 స్తంభాల మసీదు బక్రియాకుండు మసీదు మొదలైనవాటిలో దేవాలయ గుర్తులు ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

క్రీ.శ. 14వ శతాబ్దం నుండి 17వ శతాబ్దం మధ్య మొదలైన భక్తి ఆందోళనకు కాశీ కేంద్రంగా నిలిచింది. రామానందుడు, కబీరు, వల్లభాచార్య, తులసీదాస్, రవిదాస్‌వంటి ప్రముఖ ధర్మ గురువులకు వారణాసి కేంద్రంగా నిలిచింది. చైతన్యుడు, గురునానక్ కూడా బనారస్ వచ్చారు.

క్రీ.శ. 16 శతాబ్దంలో కాశీ ముఘల్ చక్రవర్తి బాబర్ చేతిలోకి వెళ్ళింది. హుమాయూన్ చునార్ యుద్ధంలో ఓడిపోయిన తర్వాత కాశీలో ఆశ్రయం పొందాడు. అప్పుడు సారనాథ్‌లోని చౌఖండీ స్థూపాన్ని చూడడానికి వెళ్లినట్లు, ఆ తర్వాత అక్కడ నిర్మించిన ఎనిమిది కోణాల శిఖరాన్ని (గుంబద్)బట్టి తెలుస్తుంది.

అక్బర్ కాలంలో కాశీ అభివృద్ధి ప్రారంభమైంది. 1585లో తోడర్మల్ సహాయంతో నారాయణ బట్టు కాశీ విశ్వనాథ మందిర పునర్నిర్మాణం చేసాడు. దీనికి అక్బర్ చక్రవర్తి 1500 దినార్లను ఇచ్చినట్లు తెలుస్తుంది. తోడమల్ వారణాసిలోని ద్రౌపదికుండును స్థాపించాడు. బిందుమాధవ దేవాలయ మరమ్మత్తు చేయించాడు. తోడర్మల్ కుమారుడు గోవర్ధన్ కాశీలో అనేక ధార్మిక కార్యక్రమాలు చేసాడు. అక్బర్ కాలంలో బ్రిటిష్ యాత్రికుడు రాల్ఫ్ పించ్ కాశీ వచ్చాడు. ఆయన కాశీలోని గంగా ఘాట్లు గురించి, కాశీ సంస్కృతి గురించి విస్తృతంగా రాసారు.

ఈ కాలంలోనే రాజా మాన్ సింగ్ గంగా నది తీరంలో 'కంగన్వాళి హవేలీ'ని నిర్మించారు. అంతేకాక ఆయన ఒక రోజులోనే 1000 దేవాలయాలకు పునాదిరాయి వేసారు. ఆయన మాన్ మందిర్ ఘాట్‌ను నిర్మించారు.



వారణాసి గంగ

మొఘల్ చక్రవర్తి షాజహాన్ 1632లో దేవాలయాలపై ఒక ఫర్మాను జారీ చేసాడు. దీని ప్రకారం వారణాసిలో 76 దేవాలయాలు కూల్చివేయబడ్డాయి. దీనిని వారణాసి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయం మనకి 'బాద్షా నామా' గ్రంథం ద్వారా తెలుస్తుంది. బ్రిటిష్ యాత్రికుడు పీటర్ మున్ డి కూడా దీని గురించి రాసాడు.

1666లో ఛత్రపతి శివాజీ ఢిల్లీలోని ఔరంగజేబు కైదు నుండి తెలివిగా తప్పించుకొని బనారస్ వస్తాడు. ఇక్కడ ఆశ్రయం పొందుతాడు. దీనికి ఔరంగజేబు కాశీపై కోపగిస్తాడు. ఔరంగజేబు పాలనలో కాశీ స్థితి మరింత అధ్వాన్నమయ్యింది. కాశీలో అనేక దేవాలయాలు ధ్వంసం చేయబడ్డాయి. 1669లో కాశీ విశ్వనాథ్ మందిరాన్ని కూలగొట్టి దానిపై 'జ్ఞానవాపి మసీదు'ను నిర్మించాడు. మసీదులో ఇప్పటికీ దేవాలయ ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తాయి. ఔరంగజేబు ఈ మందిరాన్ని కుల్చివేయడానికి వస్తున్నాడన్న వార్త తెలిసి, ఆలయ పూజారులు శివలింగాన్ని పట్టుకుని బావిలోకి దూకివేశారట. శివలింగం స్వయం భూ అని, శివుడే పూజారుల ద్వారా తనను తాను కాపాడుకున్నాడని చెబుతారు.

ఈ మసీదు వివాదం ప్రస్తుతం కోర్టులో నడుస్తుంది. అలాగే బిందు మాధవ, కృతి వాసేశ్వర మందిరాలను కూల్చి వాటిపై మసీదులు నిర్మించాడు. యూరోపియన్ యాత్రికుడు ట్రావెర్నియర్ ఈ మందిరాల గురించి రాస్తాడు. అక్కడితో ఆగకుండా ఔరంగజేబు బనారస్ పేరును 'మొహమ్మదాబాద్'గా కూడా మారుస్తాడు.

18వ శతాబ్దంలో మొగలుల తర్వాత కాశీ అవధ్ నవాబుల చేతుల్లోకి వెళ్ళింది. వీరి కాలంలో మీరు రుస్తుం అలీ చాలా భవనాల నిర్మాణం చేసాడు.

క్రీ.శ. 1780లో ఇండోర్ మహారాణి అహిల్యా భాయ్ హోల్కర్ పూర్వ మందిర స్థానానికి దగ్గరలో ప్రస్తుత కాశీ విశ్వనాథ మందిరాన్ని నిర్మించారు. ఈమె కాశీలోని చాలా ఘాట్లు, సరోవరాలు, మందిరాలకు మరమ్మత్తు చేయించారు. అహిల్యభాయ్ హోల్కర్ మే 1725లో మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ జిల్లాలో జన్మించారు. ఎనిమిది సంవత్సరాల వయస్సులో ఆమె పేదలకు అన్నదానం చేస్తుండగా, మాళవ రాజు మల్హార్ రావు హోల్కర్ చూసాడు. చలించి, తన కుమారునితో వివాహం నిశ్చయించాడు. ఆమెకు 29 ఏళ్ల వయస్సులో భర్తను యుద్ధంలో పోగొట్టుకొంది. తర్వాత 1767లో ఇండోర్ రాణిగా పట్టాభిషేకం చేసింది. సుమారు మూడు దశాబ్దాలు పాలించింది.

సోమనాథ్ నుండి కాశీవరకూ ఆమె అనేక దేవాలయాలను పునరుద్ధరించింది. 1835లో మహారాజా రంజిత్ సింగ్ విశ్వనాథ దేవాలయ గోపురం మీద 1000 కిలోల బంగారు తొడుగు వేయించారు.

సంక్షిప్తంగా చెప్పాలంటే, 1194లో కుతుబుద్దిన్ ఐబక్ ద్వారా కాశీ విశ్వనాథ మందిరం కూల్చబడింది. ఇల్ తుత్ మిష్ (1211-1266) కాలంలో గుజరాత్ వ్యాపారి ద్వారా పునర్నిర్మించబడింది. 1447-1458 మధ్యలో సికందర్ లోడి ద్వారా మళ్ళీ కూల్చివేయబడింది. అక్బర్ కాలంలో రాజా తోడర్ మల్ ద్వారా 1585లో పునర్నిర్మించబడింది. మళ్లీ ఇది ఔరంగజేబుచే కూల్చివేయబడింది.

ఆధునిక వారణాసి నిర్మాతగా మనసారాం పేరు వినిపిస్తుంది. ఆయన మీర్ రస్తుం అలీ వద్ద ఉద్యోగం చేసేవాడు. అలీకి సన్నిహితుడయ్యాడు. వారణాసిలో అనేక అభివృద్ధి కార్యాలు చేసాడు.

మనసారాం కుమారుడు బల్వంత్ సింగ్ 1738లో కాశీ రాజుగా పట్టాభిషేకం చేసాడు. ఈయన 'రామనగర్ కోటను' నిర్మించాడు. చందేలులను ఓడించి 'విజయగడ్ దుర్గాన్ని' చేజిక్కించుకున్నాడు. ఈయన 'చిత్రచంద్రిక' అనే గ్రంథాన్ని రాసాడు. రాజా బల్వంత్ సింగ్‌నే 'కాశీరాజు'గా ఇప్పటికీ ప్రజలు గుర్తుంచుకుంటారు. ఈయన దుర్వ్యసనాలకు లోనై, ఆరోగ్యాన్ని కోల్పోయి 1770లో మరణించాడు. బల్వంత్ సింగ్ ఉంపుడుగత్తె కుమారుడైన

చేత్ సింగ్ రాజ్యాధికారాన్ని చేపట్టాడు. ఈయన కాలంలో బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారన్ హెస్టింగ్స్ కాశీపై దండెత్తాడు. కాశీ ప్రజలు హేస్టింగ్స్ పై ప్రజా యుద్ధం ప్రకటించారు. వారెన్ హెస్టింగ్స్ స్త్రీ వేషం ధరించి, పారిపోయాడు.

1857 తిరుగుబాటులో బెనారస్ ముఖ్య భూమిక నిర్వహించింది. ఝాన్సి లక్ష్మీభాయి కాశీలోనే పుట్టింది. వారణాసి మిలిటరీ కంటోన్ మెంట్ నుండి చాలా మంది సిపాయిలు తిరుగుబాటు చేసారు.

1885లో కాంగ్రెస్ స్థాపనలో బెనారస్ నుండి సి. రామకలి బాబు ప్రతినిధిగా పాల్గొన్నారు. 1905లో కాంగ్రెస్ సమావేశం కాశీలో జరిగింది. దీనిలో బాబూ శివప్రసాద్ గుప్త పాల్గొన్నారు. బాబు శివప్రసాద్ గుప్తా కాశీలో మహాత్మా గాంధీ కాశీ విద్యా పీఠం, 'ఆజ్' దినపత్రిక, భారత్ మాతా మందిరం, గాంధీ ఆశ్రమం స్థాపించారు. బనారస్‌ను కేంద్రంగా చేసుకొని శ్రీమతి అనిబిసెంట్ హోం రూల్ ఉద్యమాన్ని నడిపించారు. ఆమె బనారస్‌లో హిందూ కళాశాలను కూడా స్థాపించారు. 1917లో అనిబిసెంట్ అరెస్టును వారణాసి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు.

1920లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మీటింగ్ బెనారస్‌లో జరిగింది. ఈ మీటింగ్‌కు గాంధీజీ హాజరయ్యారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో వారణాసి నుండి పండిత్ కమలాపతి త్రిపాఠి, కుబేర్ సింగ్, రఘునాథ సింగ్, కాంతా ప్రసాద్ విద్యార్థి నేతృత్వం వహించారు.

1928లో సైమన్ కమిషన్‌ను కాశీ కూడా వ్యతిరేకించింది. ఫలితంగా కమిషన్ వారణాసి రాకుండానే వెనుదిరిగింది. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమానికి కాశీ ప్రతిస్పందించింది. స్వాతంత్రోద్యమానికి సంబంధించిన ప్రతి ఉద్యమంలోనూ కాశీ సక్రియ భూమిక నిర్వహించింది.

1983 నుండి విశ్వనాథ మందిరాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తుంది.

1992కు ముందు మసీదు ప్రాంగణంలోకి అన్ని మతాలవారూ ప్రవేశించేవారు. 1992 బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు



గంగా హారతి

ఇతరుల ప్రవేశాన్ని నిషేధించారు. విశ్వ వైదిక సంఘానికి చెందిన ఐదుగురు మహిళలు జ్ఞానవాపి మసీదు పునాది భాగంలో ఉన్న శృంగార గౌరీ, గనేశ, హనుమాన్ విగ్రహాలను నిరంతరం పూజించడానికి అనుమతి ఇవ్వాలని వారణాసి కోర్టులో పిటిషన్ వేసారు.

సెప్టెంబర్ 12, 2022 న వారణాసి జిల్లాజడ్జి గారు హిందువుల వాదనలో బలముందని, పూజా స్థలాల చట్టం ఈ కేసుకు వర్తించదని తీర్పు చెప్పారు. 2017లో గౌరవనీయులైన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి శ్రీ యోగీ ఆదిత్య నాథ్ గారు విశ్వనాథ మందిరాన్ని కాశీ విశ్వనాథ్ ధాంగా అభివృద్ధి చేసేందుకు పథకాన్ని ఆమోదించారు. గుడి చుట్టూ ఉన్న 296 ప్రైవేట్ గృహాలను, భవంతులను తొలగించారు. సుమారు 600 కోట్ల రూపాయల బడ్జెట్‌తో విశ్వనాథ గుడి విశ్వనాథ ధాంగా అభివృద్ధి చెందింది.

2700 చ. అడుగులుగల విశ్వనాథ దేవాలయ వికాసానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీగారు మార్చి 8, 2019లో పునాది వేసారు. అయిదు లక్షల చ. అడుగుల ప్రదేశానికి విస్తరింపజేసి, వికసించిన కాశీ విశ్వనాథ ధాంను డిసెంబర్ 13, 2021న ప్రధాని ప్రారంభిస్తూ, జాతికి అంకితం ఇచ్చారు.

కాశీలో కేవలం దేవాలయాన్నే కాకుండా, రోడ్లను, కల్చరల్ సెంటర్‌ను, ట్రేడ్ సెంటర్‌ను, స్టేడియంను ప్రధాని అభివృద్ధి చేసారు. ఒక్క మాటలో చెప్పాలంటే, అధునాతన కాశీ నిర్మాతగా శ్రీ నరేంద్ర మోదీని చెప్పుకోవచ్చును.

కిల్లాడ సత్యనారాయణ
వారణాసి. ఫోన్: 833 398 7838.



ఆలపాటి రవీంద్రనాథ్

# విశ్వదాభిరాముడు


– బడేసాబ్

కొందరి వ్యక్తులతో కొద్దిపాటి పరిచయం కూడా గాఢమైన స్నేహంగా వర్థిల్లి జీవితాంతం లతలా అల్లుకుపోతుంది. అలాంటి అతి కొద్దిమంది వ్యక్తుల్లో ఆలపాటి రవీంద్రనాథ్‌గారు ఒకరు. ఆయన నాకు 1952లో మొట్టమొదటిసారి పరిచయమయ్యారు. ఆయన ప్రింటర్ మాత్రమే కాక, పబ్లిషర్ కూడా అయినందున డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ ఆఫీసుకు పనులమీద వచ్చిపోతుండేవారు. చందా నారాయణ శ్రేష్ఠిగారి ద్వారా రవీంద్రనాథ్‌గారిని ముఖాముఖి కలుసుకుని పరస్పరం మాట్లాడుకునే అవకాశం కలిగింది. ఆ రోజుల్లో నేను శివాజీ ప్రెస్ వర్కింగ్ పార్ట్‌నర్‌ని. రవీంద్రనాథ్‌గారు విక్కాజీస్‌లో దిగేవారు. అదే తరువాత శ్రీ ఏసెస్‌గా ప్రఖ్యాతి పొందింది. చాలా కాలం క్రిందటే అదీ చాప చుట్టేసింది. రవీంద్రనాథ్‌గారికి ఇష్టమైన మరో హోటల్ వైట్ హాల్. నాయుడుగారని ఆ హోటల్ ప్రొప్రయిటరు. నాకు రవీంద్రనాథ్‌గారి ద్వారా పరిచయమయ్యాడు. టెక్ట్‌బుక్స్ టైటిల్ పేజి, ఇన్నర్ టైటిల్ మార్చాల్సిన పడినప్పుడల్లా వస్తుండేవారు. వారు కోరింది నేను చేసిపెట్టేవాడిని. అప్పటికి ఆయన ఆల్ మకాం తెనాలే. 1957లో ఆయన హైదరాబాదు వచ్చినప్పటి నుంచి మేమిద్దరం తరచూ కలుసుకోవటంతో మా మధ్య దోస్తీ పెరిగింది. ముద్రాపకుల మధ్య సంఘీభావం పెరగాలి, నష్టకారకమైన పోటీ తగ్గాలి అన్నది రవీంద్రనాథ్‌గారి ఆశయం. ప్రింటర్స్ అసోసియేషన్‌లో చేరారు. టెండర్ వేసే విషయం ప్రింటర్ల మధ్య పరస్పరం గొంతులు కోసుకొనే ప్రమాదకర ధోరణి నశించి ఉభయతారకంగా ఉండే సహకార వైఖరి ఆకు తొడగాలని ఆయన భావించారు. ఆ దిశగా కృషి చేశారు. సఫలీకృతులయ్యారు. నాడు ఎ.పి. టెక్ట్ బుక్ ప్రెస్ అధిపతిగా ఉన్న నారాయణరావుగారిని నేను, రవీంద్రనాథ్‌గారు, మురళిగారు కలిశాం. మా సమస్యలు చర్చించాం. చక్రపాణిగారి అబ్బాయి సుధాకర్‌గారు మాతో సన్నిహితంగా ఉండేవారు. మేం నలుగురం తరచు కలుసుకుంటుండేవాళ్లం. ఫతే మైదాన్ క్లబ్‌కు రవీంద్రనాథ్‌గారు డిన్నరుకు ఆహ్వానించేవారు. చాలా సాయంత్రాలు సరదాగా గడిపేశాం. ఆయన సాన్నిధ్యంలో మాధుర్యం ఆస్వాదించాను కాబట్టి ఈ విశేషాలు చెప్పాల్సి వచ్చింది. 1969–70లో అని నాకు గుర్తు – కేరళలో బుక్ ఫెయిర్ జరిగితే వెళ్లాం. సెమినార్‌కు హాజరయ్యాం. మురళిగారు కూడా మాతో కలసి వచ్చారు. పుస్తకాలంటే ఆయనకెంత ప్రాణమో అప్పుడు ప్రత్యక్షంగా చూశాను. మళయాళ సాహిత్యం మనకన్నా చాలా పురోగమించిందని చెప్పారు. టి. శివశంకర పిళ్లై, చెమీన్ మొదలైనవారి నవలల పైన మాతో ముచ్చటించారు. తెలుగు మీడియంలో చదువుకున్నాను. ఉర్దూతో నా పరిచయం కొద్ది. ఆంధ్రప్రదేశ్ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్‌లో రవీంద్రనాథ్‌గారు క్రియాశీల పాత్ర నిర్వహించేవారు. ఆయన ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ముద్రాపకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అసోసియేషన్ కింద లక్షల రూపాయల నిధి ఉంది. దానికి సంబంధించిన ట్రస్టుకు ఆయనే చైర్మన్. వారు ఇప్పుడు లేకపోయినా ఇంకా దానికి ఛైర్మన్ వారే. వీరిని గురించిన మధుర స్మృతులెన్నో, వారి కుమార్తె దుర్గ వివాహానికి విజయవాడ వెళ్లాం. మురళి బ్రదర్ మ్యారేజికి గుడివాడ వెళ్లాం. చిన్నబాబు పెళ్లి చూశాను. పప్పన్నం తిన్నాను. రవీంద్రనాథ్‌గారి మనవరాలి పెళ్లి కొండాపూర్‌లో చాలా వైభవోపేతంగా జరిగినప్పుడూ వెళ్లాను. ఆశీర్వదించి వచ్చాను. రవీంద్రనాథ్‌గారు లేని లోటు స్పష్టంగా కనిపించింది. వారు లేరే అని హృదయం మూలిగింది.

ఆయనను హాస్పిటల్‌లో చేర్చినప్పుడు నాకు ఎవ్వరూ చెప్పలేదు. మురళిగారికి తెలుసట! కాని ఆయన నాకు చెప్పలేదు. తీరా ఆయన పోయాక ఆ విషాద వార్తను వినాల్సి వచ్చింది. అంతిమ దినాలలో ఆయనను చూడలేకపోయానే అన్న బాధ నా మనస్సులో కలుక్కుమంటూనే ఉంటుంది. రవీంద్రనాథ్‌గారికన్నా మిన్నగా నేను ప్రేమించిన మిత్రుడు వేరొకరు లేరు. సాయంత్రాలు సరదాగా దొర్లించేటప్పుడు, ఒక ఊపులో ఆయన వల్లించిన వేమన శతకంలోని పద్యం గుర్తుకొచ్చి నవ్వుకుంటూ ఉంటాను. "చెప్పులోని రాయి, చెవిలోన జోరీగ, కాలిలోని ముల్లు, కంటిలోని నలుసు" అంటూ విశ్వదాభిరామ వినురవేమతో ముగించేవారు. ఆ పద్యమే ఎందుకు చదివేవారో నాకు తెలియదుగాని రవీంద్రనాథ్‌గారు మాత్రం ఆయన మిత్రులకు విశ్వదాభిరాముడే.

(బడేసాబ్: హైదరాబాద్. లోగడ శివాజీ ప్రెస్ వర్కింగ్ పార్ట్‌నర్. ప్రస్తుతం సికింద్రాబాద్‌లో సొంత ప్రెస్ నిర్వహిస్తున్నారు.)

– రవీంద్రస్మృతి



ఆలపాటి రవీంద్రనాథ్ - సర్వేపల్లి రాధాకృష్ణన్

# పెదయ్యగారు దొడ్డమనిషి

*- గాదే ఈశ్వరరావు*

ఇప్పటికి 42 సంవత్సరాల నాటి మాట. జ్యోతి ప్రెస్ ముషీరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తా దగ్గర్లో ఉండేది. బైండరుగా జీవితం ప్రారంభించి, కొన్నేళ్ల అనుభవం సంపాదించిన నేను 1959లో బైండింగ్ కాంట్రాక్ట్ దొరుకుతుందేమోనని జ్యోతి ప్రెస్‌కు వెళ్లాను. ఆ రోజుల్లో గవర్నమెంటువారి పాఠ్యపుస్తకాల ప్రింటింగు పనిలో అయిదు ప్రెస్‌లు బిజీగా ఉండేవి. శివాజీ ప్రెస్, సిటిజన్ ప్రెస్, చారి ప్రెస్, వెంకట్రామ, జ్యోతి ప్రెస్‌లు ఆ అయిదూ. అందుకని నేను జ్యోతి ప్రెస్‌కు వెళ్లాను. పెదయ్యగారు (రవీంద్రనాథ్‌గారు) కూర్చుని ఉన్నారు. ఆ రూపం, ఆ దర్జా చూడగానే చెప్పకనే ఆయనెవరో తెలిసిపోయింది.

"సార్ బైండింగు కాంట్రాక్టు కోసం వచ్చాను. మీ దయ" అన్నాడు. పెద్దయ్యగారిని చూడటం నాకదే మొదటిసారి.

"నిన్ను బొత్తిగా ఎరగను కదా! ఏమీ తెలియకుండా ఎలా ఇవ్వమంటావ్?" అన్నారాయన. ఆయనన్నదీ సబబే.

"నీకంటే ముందు ఒకరిద్దరు కాంట్రాక్టర్లు వచ్చారు. రేపు వాళ్ల మనుషులందరినీ తీసుకొని వస్తానన్నారు" అని ఆయనే చెప్పారు. నేను పని చేసిన ప్రెస్‌లేవో మనవి చేశాను.

"నేను పుట్టి పెరిగింది ఇక్కడే సారూ. శివాజీ ప్రెస్ బడే సాబ్‌కు ఫోన్‌చేసి అడగండి" అన్నాను. పెద్దయ్యగారు శివాజి ప్రెస్‌కు ఫోన్ చేశారు.

"మీ చేతికి బంగారం దొరికింది. అతనిని నేనెట్లా వొదులుకుంటాను?" అని జవాబిచ్చినట్లుగా బడేసాబ్ నాతో తరవాత చెప్పారు.

"రేపు రండి చూద్దాం" అన్నారు రవీంద్రనాథ్‌గారు. మరుసటి రోజు ఉదయం 7.30కి జ్యోతి ప్రెస్‌కు వెళ్లాను. నాతోపాటు పనివాళ్లను కూడా తీసుకొనిపోయాను. నన్ను చూడగానే పెదయ్యగారు "నీ మనుషులందర్నీ వెంటబెట్టుకుని వచ్చావా?" అని ప్రశ్నించారు. నా మనుషుల్ని హాజరు పర్చాను. పని ప్రారంభించడానికి ముందు పూజ కోసం 50 రూపాయలిచ్చారు. అవి తీసుకుని పూజకు కావాల్సిన సామగ్రి కొనడానికి బజారుకు వెళ్లగానే పెద్దయ్యగారిని మొట్టమొదట దర్శనం చేసుకున్న ముఠావాళ్లు నేను పూజా సామగ్రి కొనటం చూసి తిరుగుముఖం పట్టారు. ఆ రోజు మొదలుకొని 1979 దాకా 20 సంవత్సరాల పాటు ఏకధాటిగా జ్యోతి ప్రెస్‌లో బైండింగ్ చేశాను. ఆ రోజుల్లో జ్యోతి ప్రెస్‌లో విక్టోరియా ప్రింటర్ అని పెద్ద పేరు కలిగిన జర్మన్ మెషీను ఉండేది. రోజుకు రెండు లక్షల ఇంప్రెషన్స్ ఇచ్చేది. పెద్దయ్య ప్రతిరోజూ ఉదయం ఏడున్నరకి వచ్చి 11.00 గం.లదాకా ఉండేవారు. తరువాత మళ్లీ సాయంత్రం నాలుగింటికి వచ్చి కొద్దిసేపు కూర్చుని టెన్నిస్ ఆడటానికి వెళ్లేవారు. నేను ప్రెస్‌లో చేరిన తరవాత గమనించిన అంశం ఇది. పెద్దయ్యగారు దొడ్డమనిషి. పైసలు కావాలని అడిగితే ఇస్తానని నోటితో చెప్పేవారు కాదు. లేదనీ చెప్పేవారు కాదు. కింది పెదవి పైకి లేపితే శాంక్షన్ అయినట్టు లెక్క!

1979 తరవాత నాకు శ్రీ రామాబుక్ డిపో నుంచి పిలుపు వచ్చింది. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు 172 రకాల ఇంగ్లీషు మీడియం పాఠ్య పుస్తకాలు ప్రచురించే సంస్థ అది. 1985లో అది మూత పడింది. జ్యోతి ప్రెస్‌లో 20 సంవత్సరాల పాటు నేను పని చేసినప్పటి కాలాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే పెద్దయ్య గారి ఔదార్యాన్ని చూపే ఘట్టాలు కళ్లముందు ఆడతాయి. ప్రతి శనివారం మాకు పేమెంటు జరిగేది. 1964 దసరా రోజుల్లో కొంత పైకం కావాలని అడిగాను. ఆయన కొంచెం కోపగించుకున్నారు.


"టైమెంతయింది?" అనడిగారు.

"నా దగ్గర వాచీ లేదు సార్!" అన్నాను.

"వాచ్ కొనుక్కోవడానికి కూడా డబ్బు లేనంతటి బీదరికమా?" అనడిగారు.

"సంపాయించిన పైసలు పొట్టకూటికి, ఒంటిమీద బట్టకీ సరిపోతై సార్. ఇంకా వాచ్ ఏం కొనను?" అన్నాను. మేనేజరు శర్మగారికి చెప్పారు నాకు వాచ్ కొనివ్వమ్మని. దసరా గిఫ్ట్‌గా నాకు వాచ్ దొరికింది. పెద్దయ్యగారి దయాగుణం అలాంటిది. నా వర్కర్లకు వారు ఈనాం ఇవ్వాల్సిన పనిలేదు – అయినా 500 రూపాయలు ఈనాముగా ఇచ్చారు. రాంగోపాల్ బాబుగారు ప్రెస్ చూసుకుంటున్నప్పుడూ నేను పని చేశాను. చాలా ఉత్తముడు. ఆయన తరవాత వెంకట్‌బాబుగారు వచ్చారు. వారూ సమర్థులు, ఉదారులు. ఇప్పుడు నాకు 70 ఏళ్లు. ఏడుగురు కొడుకులు, ఒక కూతురు. మనవలు, మనవరాళ్లు 28 మంది. ఈ ముసలితనంలో నన్ను పోషించేవాడు ఒక్కడూ లేడు. ఎవరి బతుకులు వాళ్లవే. కూలిబతుకు కుక్క బతుకు! ఈ కష్టకాలంలో మళ్లీ చిన్నబాబుగారే ఆదరువయ్యారు. నా దగ్గర ఒకనాడు అర్థరూపాయి కూలికి పనిచేసినవాళ్లు కళాజ్యోతిలో ఈవాళ హెడ్ బైండర్లుగా పని చేస్తున్నారు. నాకు సంతోషమే కాదు గర్వంగా ఉంటుంది.

- రవీంద్రస్మృతి



ఆలపాటి రవీంద్రనాథ్

# ఔదార్యశీలి

– మురళి

సుమారుగా నాలుగు దశాబ్దాలనాటిది మా పరిచయం. 1963లో నాకు రవీంద్రనాథ్‌గారు పరిచయమైనప్పటికీ, పబ్లిషర్‌గా ఎరుగుదును, కానీ ఆయన నన్నెరగరు. పరిచయం అయిన తరవాత మా మధ్య స్నేహం అల్లుకుపోయింది. ఆయన గొప్ప స్నేహ శీలి, ఆర్ద్రమనస్కుడు.

రవీంద్రనాథ్‌గారు నాకంటే 14 సంవత్సరాలు పెద్దవారు. అయినా నాతో చాలా ఆత్మీయంగా ఉండేవారు. చనువుగా మెలిగేవారు. పదేళ్లపాటు దాదాపు ప్రతి రోజు నేను వారి ప్రెస్‌కు వెళ్లి కొద్దిసేపయినా మాట్లాడి వస్తుండేవాడిని. ఏ రోజైనా నేను వెళ్లకపోతే ఆయనకు తోచేది కాదు. వెంటనే నా కోసం ఆరా తీసేవారు. కబురంపేవారు.

ముద్రాపకుల సంక్షేమం ఆయనకు చాలా ముఖ్యం. చిన్నచిన్న ప్రింటర్లు టెండర్లు వేసేటప్పుడు తక్కువ రేటు కోట్ చేసి పోటీకి వచ్చిన సందర్భాల్లో ఆయన నన్ను వెంటబెట్టుకొని వారితో సమావేశమయ్యారు. అలా కోట్ చేయటం వల్ల కలిగే నష్టాన్ని వివరించి వారిని కన్విన్స్ చేసేవారు. వారికి వేరేచోట్ల వర్క్ లభించే అవకాశాలు కల్పించేవారు. చక్రపాణిగారు మద్రాసు నుంచి అడపదడప హైదరాబాదు వచ్చి ఓ వారం రోజులు గడిపి తిరిగి వెళ్లిపోయేవారు. నేను, రవీంద్రనాథ్‌గారు ఆయనను కలుసుకుని సమస్యలు చర్చించేవాళ్లం. రవీంద్రనాథ్‌గారు పుస్తక ప్రియుడు, సాహిత్యాభిరుచి కలిగినవాడు కావటంవల్ల చక్రపాణిగారితో సాహిత్యం, సినిమాలపై మాట్లాడేవారు. ప్రింటర్స్‌కి సంబంధించిన సమస్యల మీద సమావేశమవుతున్నామంటే, చక్రపాణిగారు హైదరాబాదులో ఉంటే తప్పకుండా వచ్చేవారు. రవీంద్రనాథ్‌గారంటే ఆయనకు చాలా అభిమానం. చక్రపాణిగారు, రవీంద్రనాథ్‌గారు ఇద్దరూ నిర్మొహమాటానికి పెట్టింది పేరు. వారి మధ్య ఒక తేడా ఉంది. చక్రపాణిగారు కట్టె విరిచి పొయ్యిలో పెట్టినట్లుగా మాట్లాడేవారు. రవీంద్రనాథ్‌గారు చాలా మృదువుగా చెప్పేవారు. ఒక వాక్యంలో చెప్పాల్సింది పది వాక్యాలలో చెప్పేవారు. ఎదుటి వ్యక్తి ఎక్కడ నొచ్చుకుంటాడో అని ఆలోచించేవారు. పరుషంగా మాట్లాడటం ఆయన స్వభావానికే విరుద్ధం.

ప్రింటింగ్ బిజినెస్‌లో ఆయన ఆనాడు తెగ సంపాదించి ఉండవకపోవచ్చు. కానీ ఆయన వ్యాపార దక్షత అమోఘం. ఆయన డబ్బు మనిషి కాదు. ఔదార్యం జాస్తి. మిత్రుల పనయితే, చాలా తగ్గించి తీసుకునేవారు. చిన్నా చితకా ప్రింటర్స్‌ని ఉదారంగా ఆదుకున్న సందర్భాలు నాకు చాలా తెలుసు. ఔదార్యం వారి రక్తంలో ఉంది.

బడేసాబ్, సుధాకర్, రంగారావు, నేను రవీంద్రనాథ్‌గారితో చాలా చనువుగా ఉండేవాళ్లం. కలిసి పార్టీలు చేసుకునేవాళ్లం. కలిసి డిన్నర్లు ఆరగించేవాళ్లం. ఆయన నన్ను తన పిల్లలకన్నా ఎక్కువగా దగ్గరకు తీశారు. నా ఉన్నతిలో ఆయన పాత్ర ఉంది. మిత్రులందరం కలిసి ఒక మాట అనుకున్నప్పుడు దానికి కట్టుబడి ఉండాలనేది ఆయన ప్రిన్సిపాల్. అలా కలసిమెలసి ఉన్న మిత్రుల్లో ఒకరు ఏదో టెండర్ వేసే సందర్భంలో ఉమ్మడిగా అంగీకారానికొచ్చిన రేటును కాదని ద్రోహబుద్ధితో తక్కువ రేటు కోట్ చేశాడు. రవీంద్రనాథ్‌గారు అలాంటి పెడపోకడని క్షమించేవారు కాదు. అంతిమంగా అతడు సకాలంలో పని పూర్తి చేయలేకపోయాడు, నష్టాల పాలయ్యాడు, ప్రభుత్వం అతడిని బ్లాక్‌లిస్ట్ వేసింది. ఆ వర్క్ మేమే పూర్తి చేశాం. ఎవడు తీసుకున్న గోతిలో వాడే పడతాడని ఆయన నమ్మిక. ఆయన తన ఆహారపుటలవాట్లలో ఎంత నియమబద్ధంగా ఉండేవారో, వ్యాపార విషయాల్లో అంత సూత్రబద్ధంగా ఉండేవారు.

ఆయన నుంచి నేను చాలా నేర్చుకున్నాను. ఆయన శీల, సంస్కారాల్ని ఒరవడిగా భావిస్తాను. ఆయనతో నేను గడిపిన రోజుల నాటి జ్ఞాపకాలు నాకెప్పటికీ అనిర్వచనీయ ఆనందానుభూతి కలిగిస్తాయి. స్ఫూర్తినిస్తాయి.

(మురళి, హైదరాబాద్. చారి & కంపెనీ ముద్రణాలయ అధిపతి.)

*- రవీంద్రస్మృతి*

### మాట్లాడింది పదినిమిషాలే

## పడిన ముద్ర చెరిగిపోనిది

*– వలేటి గోపీచంద్*

1945లో ఏర్పాటైన బాపట్ల వ్యవసాయ కళాశాల దక్షిణ భారతంలోనే రెండోది. ఆ కళాశాల పునాదికి రాళ్ళు వేసిన ఎందరో మహానుభావులు. వారందరికీ వందనాలు. వారిలో ముందు వరుస ఆ నాటి జిల్లా బోర్డ్ ఛైర్మన్ పి.వి. కృష్ణయ్య చౌదరిగారిది. కళాశాల స్వర్ణోత్సవాల నేపథ్యంలో వారి విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ రావూరి వీర రాఘవయ్య నాయకత్వంలో ప్రారంభమైన పూర్వ విద్యార్థి సంఘం భావించి ఓ పత్రికా ప్రకటన ఇచ్చినపుడు వివరాలకు వలేటి గోపీచంద్‌ని సంప్రదించగలరు అని నా ఫోన్ నంబర్ ఇవ్వటం జరిగింది. దీనికి స్పందించినవారిలో మొదటివారు ***మిసిమి*** ఆలపాటి రవీంద్రనాథ్‌గారు. ఈ కొద్దిపాటి జ్ఞాపకంతో వారి శతజయంతి సందర్భంగా వస్తున్న సంచికలో నాకు నాలుగు మాటలు రాసే అవకాశం దొరకటం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఎందుకంటే మా బాపట్ల వ్యవసాయ కళాశాల స్వర్ణోత్సవాల సమయంలో వచ్చిన పరిచయం గురించి కళాశాల ప్లాటినం జూబ్లీ పూర్తి చేసుకున్న సందర్భంలో వారి శత జయంతి రావటంతో నాకు మననం చేసుకునే అవకాశం లభించటం ఒక మరుపు రాని అనుభూతి.



ఆలపాటి రవీంద్రనాథ్

రవీంద్రనాథ్ గారి ఫోన్‌కు స్పందించి వారి ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను. అప్పుడే సర్ మెట్లు దిగుతూ కిందికి వస్తూ ఉంటే వారి స్ఫురద్రూపం తెల్లటి లాల్చీలో మెరుస్తూ ఉన్న దృశ్యం ఇప్పటికీ నా కళ్ళలో మెదులుతూనే ఉంది. పైగా ఆజానుబాహులు కూడా వారు. నడకలో హుందాతనం, రాజసం ఉట్టిపడుతూ ఉంది. నాకే కాదు ఎవరికైనా అలానే అనిపిస్తుంది కూడా. ముందు నా ఊరు, ఉనికి వివరాలు అడిగారు. తరువాత నన్ను పిలిచిన విషయం చెప్తూ పి.వి. కృష్ణయ్య చౌదరి గురించి ఏమి తెలుసు? ఎందుకు వారి విగ్రహం పెట్టాలని అనుకుంటున్నారని ఆరా తీశారు. నేను నాకు వారి గురించి ఏమీ తెలియదు అని చెప్పా. అయితే 1994 జూలైలో స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలు జరిగినపుడు మా టీచర్ కృష్ణకుమారి మేడం పాట పాడారు. ఆ పాటలో వారి కృషి ఫలితమే మన చదువుల తల్లి అనే చరణం ఉంది. ఆ పాట స్ఫూర్తితోనే ఆలోచన కలిగిందని చెప్పటం జరిగింది. రవీంద్రనాథ్‌గారు అభినందనలు తెలియజేస్తూ చౌదరి గురించి తెలియని విషయాలు అనేకం చెప్పారు. వాటిలో ముఖ్యంగా గుంటూరు జిల్లా విద్యా వికాసానికి వారి ముందు చూపే కారణం. పెద్దగా చదువుకోకపోయినా విద్య మీద మమకారంతో వారు జిల్లా బోర్డ్ ఛైర్మన్‌గా విరివిగా స్కూల్స్ పెట్టించారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ అధికారులను ఒప్పించి అనుమతులు తీసుకు వచ్చారు. ప్రధానంగా ఆ రోజుల్లో చిన్న వయస్సులో మరణాలు ఉండేవి. తిరిగి పెళ్ళిళ్ళు చేసుకునేవారు కాదు. అటువంటివారిని ఒప్పించి మీకున్న ఆస్తిలో కొంత పాఠశాలకు ఇవ్వండి. మీ పేరు పెడతాం, వారిని తరతరాలు వారి జీవితాంతం గుర్తు పెట్టుకుంటారు అని చెప్పి, వారిని ఒప్పించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఏర్పాట్లు చేశారు. అందుకే గుంటూరు జిల్లాలో ఎక్కువ పాఠశాలలకు దాతల పేర్లు ఉండటానికి కారణం అదే అని చెప్పారు. అంతే కాదు గుంటూరులో వైద్య కళాశాల రావటంలో వారి కృషి ఎంతో ఉందని చెప్పారు.

నాకు వారిని చూడటం మొదటిసారి. అది తొలి పరిచయం. నేను రెండు కాళ్ళకు పని చెప్పి చెమటలు కక్కుతూ వారింట్లోకి భయం భయంగా బెరుకుగా అడుగు పెట్టా. హైదరాబాద్ ఆకాశవాణి వ్యవసాయ విభాగంలో ఉద్యోగంలో చేరి పట్టుమని ఐదు సంవత్సరాలు కాలేదు. నాకు రాజకీయాలు, సాహిత్యంతో కొద్దిపాటి పరిచయం ఉండటం, తెనాలి సాహితీ వారసత్వం గురించి కొద్దిపాటి అవగాహన ఉండటం వల్ల వారు చెప్పిన మాటలు బాగానే అర్థమయ్యాయి. ఇంతకీ విగ్రహాఖర్చులు ఎలా? మీ పూర్వ విద్యార్థి సంఘానికి సేకరించే శక్తి ఉందా? మీ విశ్వవిద్యాలయం అనుమతి ఇచ్చిందా? ఎప్పుడు ఆవిష్కరించే అవకాశముంది? వారి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. వారిని కూడా

సంప్రదించండి అని పలు సూచనలు ఇచ్చారు. సలహాలు చెప్పారు. అలా చెప్తూ పలు ప్రశ్నలు ద్వారా నాకు పరీక్ష పెట్టారు. వారికి కావలిసిన వివరాలు రాబట్టారు. పాత్రికేయ మిత్రులు ఏలూరు రఘుబాబు **మిసిమి** పత్రిక రెగ్యులర్‌గా బాగా ఇష్టంగా చదువుతారు. వారి ద్వారానే పత్రిక నాకు పరిచయం. అది వారికి చెప్పాలని మనస్సులో ఉంది. **మిసిమి** పత్రిక ముఖచిత్రంతో పాటు రెండో కవర్, మూడో కవర్, నాల్గో కవర్ మీద ప్రచురించే బొమ్మలు నాకు బాగా ఇష్టం. వాటి గురించి కూడా ఆలపాటి గారిని అడగాలని అనుకున్నా కానీ ధైర్యం చాలలేదు. ఈ లోపు టీ వచ్చింది. రవీంద్రనాథ్ గారు తిరిగి తిరిగి దృష్టి అంతా మరలా మరోసారి చౌదరి విగ్రహం ఏర్పాటు వార్త గురించే గుచ్చి గుచ్చి అడిగారు. “మీరు అనుకున్నట్లు చౌదరి విగ్రహ ప్రతిష్ట విషయంలో ముందుకు వెళ్లి శిల్పికి అడ్వాన్స్ ఇచ్చే సమయంలో నా తరపున ఒక 25 వేలు విరాళం ఇస్తా తీసుకు వెళ్ళండి, అందుకే పిలిచాను” అని చెప్పారు.

వారు ఎందుకు అన్నిసార్లు ప్రత్యేకంగా అడిగారో తెలియదు కానీ వారు అన్నట్లు పని పూర్తి కావటానికి సుదీర్ఘంగా ఏడు సంవత్సరాల కాలం పట్టింది. 1995 జూలై నెలలో స్వర్ణోత్సవ ముగింపు వేడుకలలో భాగంగా అప్పటి వ్యవసాయ శాఖామాత్యులు కోటగిరి విద్యాధరరావు, వైస్ ఛాన్సలర్, మంగిన వెంకటేశ్వర రావు తదితరులు విగ్రహ ప్రతిష్టకు శంఖుస్థాపన చేశారు. ఆ తరువాత ఉత్సాహం తగ్గటంతో మరో అడుగు ముందుకు పడలేదు. శిల్పికి అడ్వాన్స్ ఇవ్వటానికి సిద్ధమయ్యేసరికి ఆలపాటి రవీంద్రనాథ్ గారు 1996 ఫిబ్రవరిలో కాలం చేశారు. వారు ఇచ్చిన మాట ఇంట్లో మరెవరికీ తెలియదు. వారి కుటుంబ సభ్యులు కూడా మాకు పరిచయం లేదు. అందువల్ల వారింట్లోవారిని అడిగే సాహసం చేయలేకపోయాము. కానీ వారికి మాట ఇచ్చిన ప్రకారం వారి కోర్కెను మాత్రం తీర్చాం. ఈ క్రమంలో అడుగడుగునా అవరోధాలు. అడ్డంకులు ఎన్ని ఉన్నా ప్రొఫెసర్ రావూరి నాయకత్వంలోని అప్పటి పూర్వ విద్యార్థి సంఘం ప్రత్యేకంగా దానికోసం నిధులు సేకరించింది. పీవీ కృష్ణయ్య చౌదరిగారి పిల్లలు, వారి మనుమలు మిలిటరీలో మంచి స్థాయిలో పనిచేశారు. రవీంద్రనాథ్ గారి సూచనలు మేరకు వారి జీవిత వివరాలు, చిత్రపటం సేకరణకు 1978 బ్యాచ్ దయాకర్, 1973 బ్యాచ్ జువారి శ్రీనివాసరావుగారితో కలిసి వారి మనుమలు ఇంటికి వెళ్లటం జరిగింది. ఇక విగ్రహ ఖర్చులు కోసం 1978 బ్యాచ్‌కి చెందిన ఎస్.వి.ఎస్.ఎస్. ప్రసాద్‌గారు 75 వేలు సేకరించి ఇచ్చారు. యజ్ఞ ప్రసాద్ అనే మిత్రుడి మాట ద్వారా ఘంటా పున్నరావు 25 వేలు, 1973 బ్యాచ్ జువారి శ్రీనివాస్, 1972 బ్యాచ్ కె. సాంబశివరావులు మరికొంత సేకరించి ఇచ్చారు. దిమ్మకు కావలిసిన గ్రానైట్, కార్యక్రమ ఖర్చులు 1967 బ్యాచ్ పోతుల రామారావులు పెట్టుకున్నారు. ఇవి అన్నీ సమన్వయపరచి పని పూర్తి కావటానికి చాలా సమయం పట్టింది. విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ చేసిన ఏడు సంవత్సరాలకు 2002లో అప్పటి వ్యవసాయ శాఖామాత్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, వైస్ ఛాన్సలర్ డా. ఈడ్పుగంటి వెంకట సుబ్బారావు అలియాస్ డా. ఐ.వి. సుబ్బారావుల చేతుల మీదుగా పివి కృష్ణయ్య చౌదరి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఆలపాటి రవీంద్రనాథ్‌గారి దివ్య ఆశీస్సులతో వారు మనఃస్ఫూర్తిగా వెన్ను తట్టి ప్రోత్సహించిన కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయగలిగాం. అయితే ఇప్పటికీ ఈ పని మీ పూర్వ విద్యార్థులు పూర్తి చేస్తారా అనే సంశయం వారికి ఆ రోజు ఎందుకు కలిగింది అన్నది మాత్రం నాకు శేష ప్రశ్నే... అంతటితో ఆగకుండా కళాశాల చరిత్రను ‘ఒక నేల అనేక ఆకాశాలు’ పేరుతో పుస్తకం ప్రచురించాము. ఆ కళాశాల నుంచి వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన సుమారు 180 మంది జీవన రేఖలను మూడు సంపుటాలుగా *వెలుతురు తోవలు, వెలుగు పూలు, వెలుగు దివ్వెలు* పేర్లతో తీసుకు వచ్చాం. వీటి అన్నింటినీ పూర్వ విద్యార్థులు 1974 బ్యాచ్ తుమ్మల. సురేష్, 1962 బ్యాచ్ బి. శ్రీహరి రెడ్డి, 1970 బ్యాచ్ టి. రత్న సుధాకర్, 1978 బ్యాచ్ యాగంటి వెంకటేశ్వర్లు, 1980 బ్యాచ్ డి. పురుషోత్తం, జె. అఖండరావు, 1982 బ్యాచ్ టి. లక్ష్మి నరసయ్య మరెందరో సహకారంతో తీసుకురావటం జరిగింది. ఒక కొత్త స్ఫూర్తిదాయక చరిత్రకు శ్రీకారం చుట్టామని భావిస్తున్నాం.

వలేటి గోపీచంద్
హైదరాబాద్. 944 127 6770.



ఘంటసాల వెంకటేశ్వరరావు

# సినీ సీమలో సంగీతం

– ఘంటసాల వెంకటేశ్వరరావు

సుమారు రెండు దశాబ్దాల నుంచి సంగీత దర్శకునిగా, నేపథ్యగాయకునిగా సినిమా సంగీత ప్రపంచంలో నేను చేసిన పరిశ్రమకు ఆధారభూతమైన విశ్వాసాలు, తద్భవమైన అనుభవాలు రసికులూ, రసజ్ఞులూ అయిన ప్రేక్షక లోకానికి తెలియజేయడం అప్రస్తుతం కాదనే నమ్మకంతో ఈ మాటలు వ్రాస్తున్నాను. తన సాధనా, కృషి ఫలించాలంటే, సార్థకత చెందాలంటే ప్రతి కళాకారుడూ ప్రజలతో తనకుగల సంబంధాన్ని నిత్యము గుర్తిస్తూ, కళారంగంలో తనకున్న బాధ్యతలను, ఎదుర్కొనవలసిన శక్తులను వారికి తెలియజేస్తూ వారి నుండి విజ్ఞతాపూరకమయిన సలహాలను, అభిమానోపేతమయిన సానుభూతినీ పొందుతుండడం అవసరమవుతుంది.

ప్రతి జాతి సంస్కృతి కళారంగంలో తన కృషిని, ధ్యేయాన్ని, ఒక విశిష్టమైన పద్ధతిని రూపొందించుకొంటుంది. భారతదేశం కూడా సహస్రాబ్దాలుగా లలితకళలన్నిటిలోనూ తన విశిష్టతను అడుగడుగునా ప్రస్ఫుటంగా ప్రకటిస్తూ తన సాధనను కొనసాగిస్తూనే ఉంది.

భారతీయ జీవన రంగంలో సంగీతకళకున్న స్థానం మరే సంస్కృతిలోనూ లేదని చెప్పటం సాహసం కాదు. భారతజాతి అనాదిగా, సంగీతకళను ప్రత్యేకమైన విధానాలతో, విభిన్న మార్గాలలో పయనింపజేసి ఎంతో ఉజ్వలమైన ఫలితాన్ని సాధించింది. సంప్రదాయ సిద్ధమైన ఈ కళావిశేషాన్ని విస్మరించి మనం ఏ విధమైన అభివృద్ధినీ సాధించలేము.

భారతీయ సంగీతం ఎన్ని భిన్న సాంప్రదాయాల్ని అనుసరించినా, ఎన్ని భిన్న రీతుల్ని ప్రదర్శించినా, రససిద్ధిలో ఈ భిన్న ఫణుతులు అవలంబించే మార్గములో ఒక విచిత్రమైన ఐక్యతను ఏర్పరచుకొంది. సూక్ష్మంగా పరిశీలిస్తే, భారతీయ సంగీతంలో ఏ ప్రాంతపుదైనా సరే ఏకత్వం గోచరించక మానదు.

ప్రధానంగా భారతీయ సంగీత స్రవంతి రెండు రస వాహినులుగా ప్రవహించినది. ఒకటి స్వరరాగ తాళ ప్రధానమైనది. శాస్త్రీయమైన వ్యక్తిత్వాన్ని కలిగినది. నాదోపాసన కుపయుక్తమైనది. రెండవది జీవన శకట ప్రయాణానికి అహరహమూ లయ కలుపుతూ నిత్యజీవితాన్ని సమధురం చేసేది. మొదటిది 'మార్గ' సంగీతమని, రెండవది 'దేశి' సంగీతమని పండితులు చెప్పారు. ఒకటి రసాత్మకమైనది. రెండవది భావాత్మకమైనది. ఒకటి స్థితి ప్రధానమైనది. మరొకటి గతి ప్రధానమైనది. జీవితంలోని వైవిధ్యాన్ని తొలగించి ఒకే నాదాత్మలో స్వరాన్ని అనుభవింపజేసేది మార్గ సంగీతమైతే, ఒకే ఆత్మను జీవితంలోని వివిధ రంగాలలో ప్రతిబింబించి హృదయ స్పందనం కలిగించేది దేశి సంగీతం.

మార్గ సంగీత సంప్రదాయ సరళి ఉన్నత వర్గాన్ని ఆకర్షించి రాజాస్థానములలోనూ, దేవస్థానములలోనూ తన ప్రతిభను ప్రసరింపజేస్తే, దేశ సంగీతం ప్రతి పామరుని హృదయ స్థానంలోను సింహపథం చేసుకొంది. మార్గ సంగీతం భారతీయాత్మతను తాత్వికమైన రసానుభూతితో మైమరపింపజేస్తే దేశి సంగీతం రసికమైన రస పుష్టితో ప్రజానీకాన్ని మురింపజేసింది. ఇందుచేతనే శాస్త్రీయ వాగ్గేయ రచనలలో భక్తిభావానికే అధికమైన ప్రాచుర్యం లభించింది. ఒక విధంగా అనుకోవచ్చును. శాస్త్రీయ సంగీతం భక్తి భావ పునీతమైతే దేశి సంగీతం

నవరసభరితం. జీవితంలోని ప్రతి రసాత్మక సన్నివేశాన్ని తనలో ఇముడ్చుకుంది దేశి సంగీతం. ఈ భిన్న రసాల సన్నివేశాలను ఒకే నాద వర్ణంలో చిత్రించినది మార్గ సంగీతం.

ఊడుపుల వేళల్లో పచ్చని పొలాల్లో పనిచేస్తూ, తమ కష్టాన్ని మరచి గొంతెత్తి పాడే పల్లెపడుచుల పాటలలోనూ, మార్పుల కళ్లాలలో ఆనందోత్సాహంతో ఊగుతున్న రైతు యువకుల పదాలలోను, ఏలేలో పాటలలోనూ, జోలపాటలలోనూ, పెండ్లి పాటలలోనూ, వదినా మరదళ్ల సరాగాలలోనూ, ఆలుమగల సరసాలలోనూ, అత్తాకోడళ్ల సంవాదాలలోనూ, నలుగు పాటలలోనూ, తత్వ కీర్తనలలోనూ, పడవ పాటలలోనూ, యక్షగానాలలోనూ, బుర్రకథలలోనూ, గొల్ల సుద్దులలోనూ వీధి భాగవతాలలోనూ, జముకల పాటలలోనూ వినిపించేది దేశ సంగీతమే.

ఇంతవరకు మన జాతీయ సంగీతం, మార్గ పద్ధతి అయితేనేమి, దేశిపద్ధతి అయితేనేమి, వివిధ శాస్త్రీయ సంగీత రచనల రూపంలోనూ, పద్య పఠన రూపంలోనూ హరికథాది రూపాలలోనూ, పైన చెప్పుకున్న దేశీయ రూపాలలోనూ వ్యక్తమయింది.

ప్రస్తుత నాగరిక జీవన విధానాన్ని బట్టి, పాశ్చాత్య సంగీత ప్రభావాన్ని బట్టి వ్యావహారిక భాషా ప్రభావాన్ని బట్టి, ఒక నూతన సంగీత సంప్రదాయం భారత సంగీతంలో రూపొందించుకొంటున్నది. ఇదే సినిమా సంగీతం. ప్రజా బాహుళ్యంలో సినిమాలకున్న అశేషాదరాన్నిబట్టి, ఈ నూతన సంగీత సంప్రదాయ నిర్మాణం అతి ఉత్సాహంగాను, అతి త్వరితంగాను సాగుతున్నది. కొంతకాలం నిశ్చలంగా ఉన్న మన దేశీయ సంగీతం సినిమా కళయొక్క అభివృద్ధితో నూతనోత్తేజాన్ని పొంది కొత్త రంగులు నంగరించుకొంది.

ఈ నూతన సంగీత సంప్రదాయ నిర్మాణం సినీ సంగీత దర్శకుల ప్రతిభా విశేషాలబట్టి నిర్మింపబడుతున్నది అనడం సాహసం కాదు. కారణం ఏమంటే మన మార్గ సంగీతకళ ఏ విధమైన మార్పుల్ని చేర్పుల్ని వహించగలిగే స్థితిలో లేదు. ఏ విధమైన పరిణామమైనా, తన విశిష్టతకు భంగం కలిగిస్తున్నదేమోయని భయపడుతున్నది. అందుచేత సంగీతంలో నూతనమైన ప్రయోగాలనూ, వినూత్నమైన విశేషాలనూ, విచిత్రానుభూతులను వివిధ మార్గాలలో అభివృద్ధులను సినీ సంగీత దర్శకుల నుండి మాత్రమే దేశం ఆశిస్తున్నదనడం వాస్తవం.

ఇటువంటి పరిస్థితిల్లో సంగీత దర్శకుడు మన జాతీయ ధోరణులైన రసాత్మక ప్రాధాన్యమైన మార్గ సంగీతాన్ని, భావాత్మక ప్రాధాన్యమైన దేశసంగీతాన్ని, విజాతీయ సంగీత రీతుల్ని, తన నూతన సంప్రదాయ సృష్టికి ఉపకరణములుగా తీసుకొంటున్నాడు. ఈ నూతన సంప్రదాయ నిర్మాణం ఉత్తర భారతదేశంలోనే ప్రారంభించబడినదనటం సాహసం కాదు. సినిమా పరిశ్రమకు పూర్వం కూడా మన నాటక సంగీతంలో పద్యపఠనానికి శాస్త్రీయ సంగీత రాగాలనూ, పాటలకు ఉత్తర దేశ లలిత సంగీత రచనలనూ, ఒరవడిగా తీసుకొనడం జరిగింది. అయితే ప్రస్తుతం ఈ సంప్రదాయ నిర్మాణం సినిమా యొక్క పారిశ్రామిక పరిమితుల్ని బట్టి మాత్రమే సాగుతున్నదన్నమాట యధార్థం.

నేటివరకూ నడచిన సినిమా సంగీత చరిత్ర ఒకమారు సింహావలోకనం చేస్తే తొలినాటి సినిమా సంగీతంలో శాస్త్రీయ సంగీత ప్రభావమే ఎక్కువగా ఉండి రాగ ప్రధాన రచనలే ఎక్కువగా కనబడతాయి. కానీ కాలక్రమాన సంగీత దర్శకుల భాష యొక్క పలుకుబడికి, నుడికారపు గమనానికి, భావావేశానికి దేశీ సంగీతమే అనుకూలమైనదని గ్రహించారు. ఈ దేశరీతిని సినిమా సంగీతంలో మొదట ప్రవేశపెట్టిన మార్గదర్శి నౌషద్ అనే మాట సర్వ జనామోదం పొందుతుందనే నమ్ముతున్నాను. దేశీ సంగీత పద్ధతులలో, ప్రతి రసాత్మక సన్నివేశానికి ఆయన తన సంగీత రచనలతో రూపించిన రాగం తాళముల ప్రయోగం సమకాలిక సంగీత దర్శకులకు స్వీకార యోగ్యమయినది. శృంగార గీతాలు, యుగళగీతాలు, విషాదగీతాలు, ప్రేమగానాలు, బృందగానాలు మొదలైన ఆయన సంగీత రచనలన్నీ ఆయనను నవ్య సాంప్రదాయ నిర్మాతగా నిరూపిస్తాయి.

నౌషద్‌తో పాటు, ప్రతిభావంతులయిన ఇతర సంగీత దర్శకుల మేధస్సు కూడా ఈ క్రొత్త సంప్రదాయాన్ని సముజ్వలపరిచింది. నవ్య సంగీత నిర్మాతలగా పేర్కొనబడవలసినవారిలో ప్రధానులు సి. రామచంద్ర, అనిల్‌బిస్వాస్, పంకజ్మల్లిక్, వసంతదేశాయి, హేమంతకుమార్, ఒ.పి. నయ్యర్, శంకర్ జైకిషన్లు మరొక ముఖ్యులు

ఎస్.డి. బర్మన్, దక్షిణ దేశంలో స్వర్గీయ సుబ్బరామన్, శ్రీయుతులు రామనాథన్, కె.వి. మహదేవన్, విశ్వనాథ్‌రామ్మూర్తి, ఎస్వి. వెంకటరామన్, సాలూరు రాజేశ్వరరావు, పెండ్యాల నాగేశ్వరరావు మొదలగువారు గణనీయులు.

సినిమా సంగీతాన్ని స్థూలంగా పరిశీలించినప్పుడు గేయానికి చెందిన భాగం మన సంప్రదాయాలను, చిత్రీకరణకు అవసరమయే నేపథ్య సంగీతం పాశ్చాత్య పద్ధతులను అనుసరిస్తున్నట్లు తెలుసుకొనవచ్చును. గేయ భాగాలలో కూడా విదేశీ సంగీతరీతుల్ని వాడిన సందర్భాలు లేకపోలేదు. అయితే ఈ విధమైన ప్రయోగాలవలన మన జాతీయమైన పలుకుబడికి దూరమై అవాంఛితికి పాల్పడే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ విషయంలో సంగీత దర్శకులు శ్రద్ధ తీసుకొనటం ఎంతైనా అవసరం.

అయితే ప్రస్తుత సంగీత రనా విధానం ప్రయోగస్థితిలో ఉంది. నిర్దిష్టమైన పరిమితుల్ని ఏర్పరిచి ప్రతిభావంతులైన సంగీత దర్శకుల కృషికి అవరోధం కలిగించే పరిస్థితిలో లేదు. యుక్తమైన రాగప్రస్తారానికి ప్రాముఖ్యతనిస్తుంది. ఇట్లుకాక పాశ్చాత్య సంగీతం హార్మోనికి ప్రాధాన్యం ఇవ్వడం వలన జంత్రసమ్మేళనల విషయంలో పాశ్చాత్య సంగీతకారులు అతి ఉదాత్తమైన ఫలితాలను సాధించియున్నారు. ఈ సమ్మేళన విషయంలో పాశ్చాత్య పద్ధతి నుంచి మనం తెలుసుకొనవలసినది ఎంతో ఉన్నది. వాది, సంవాది, వివాది స్వర ప్రయోగాలలో పాశ్చాత్యులు రసార్ణవం యొక్క అగాధమైన లోతులలోకి పోయారు.

ఈ పరిస్థితులలో భారత సంగీత దర్శకుడు ప్రజారంజన అనే తన లక్ష్యసిద్ధి కోసం వివిధ విజాతీయ సంగీత సంప్రదాయాలు సమన్వయం తన కృషితో భాగంగా తీసుకొంటున్నాడు. ఈ క్రొత్త ప్రయోగాలలో కొన్ని అవాంఛనీయమైన ఫలితాలు రావచ్చును అందుకు రసికలోకం నిరుత్సాహ పడకూడదు.

సంగీత దర్శకుని బాధ్యత పాటలతోనే తీరదు. చిత్రంలోని ప్రతి సన్నివేశానికి ఆయా రసాలకు తగినట్లుగా నాదరూపమైన వ్యాఖ్య ఇవ్వడం కూడా అతని పనే. ఈ నాదాత్మకమైన వ్యాఖ్యనే రీ రికార్డింగ్ అంటారు. ఈ రీరికార్డింగ్‌లో వినపడే నేపథ్య సంగీతం ఒక సంగీత దర్శకుని ప్రతిభకు దర్పణంవంటిది. రసాత్మకమైన సన్నివేశాలకు ఆయా రసోత్పన్న శక్తిగల ఈ సంగీత వ్యాఖ్యను సృష్టించడానికి ఎంతో భావనా శక్తి, కాల జ్ఞానమూ, అనుభవమూ అవసరం. అసమర్థమైన రీ రికార్డింగ్ చిత్రం పేలవంగా తోపింపజేస్తుంది. ప్రజ్ఞావంతమైన రీ రికార్డింగ్ బలహీనమైన సన్నివేశాన్ని కూడా చిత్రంలో కుదుటపర్చగలదు.

ఎంతో ప్రతిభ, వ్యుత్పత్తి, అనుభవమూ కలిగిన సంగీత దర్శకుని కృషి కూడా వ్యక్తిగతమైన ఉదాత్త కళ లోభం వలన ప్రజాభిరుచికి దూరమయే అవకాశం ఉంది. అందుచేత సంగీత దర్శకుడు తన స్వంత కళాభిరుచితో పాటు ప్రజాభిరుచి చిత్ర పరిశ్రమ యొక్క ఆర్థిక నిబంధనలనీ గుర్తుపెట్టుకొనవలసి ఉన్నది.

నేపథ్య గాయకునిగా నాకుగల అనుభవాన్నిబట్టి నాలుగు మాటలు చెప్పవలసి ఉంది. నేపథ్య గాయకునికి శ్రావ్యమైన కంఠస్వరమూ, వివిధ సంగీత గనుకములను పలికించగల శక్తితో పాటు రసభావములకు అనుగుణ్యమైన వాదోత్పత్తి, సుస్పష్టమైన ఉచ్చారణ, కంఠస్వరము యొక్క పట్టువిడుపులు తెలియడం చాలా అవసరం. తన భావాలను పోషించగల గాత్రశైలి ఏ శాస్త్రములోను, ఏ పారిభాషిక పదాలలోను నిర్వచించబడినది. అనుభవమే గురువుగా తనకు తానై తెలుసుకోవలసినది. నా భావనలో నేపథ్య గాయకునికి సంగీత హృదయంతో పాటు కవి హృదయము, కంఠస్వరములోని మెళకువలతోనే నటించగల నటనా కౌసల్యము కూడా అవసరం.

వృత్తినిబట్టి నేపథ్య గాయకుని బాధ్యత ఇంకా ఉన్నవి. తన నుండి ఉత్తమ ఫలితాన్ని ఆశించే సంగీత దర్శకుల భావనకు అనుగుణంగా రస సంపూర్ణ సహకారం ఎంతో సద్భావంతో ఇవ్వవలసి ఉంది. ఈ సందర్భంలో వివిధ సంగీత దర్శకుల ప్రతిభాన్వితములైన సంగీత రచనలను తమ గాత్ర మాధుర్యంతో రసికలోకానికి అందించిన ఉత్తమ గాయకులు ప్రశంసార్హులు లతామంగేష్కర్, గీతాదత్, షంషాద్, ఆశా, మహమ్మద్ రఫీ, తలత్ మహమ్మద్, మన్నాడే, ముఖేష్ మొదలగు ఉత్తరదేశ గాయకులు, సుశీల, లీల, జానకి, సౌందర్య రాజన్, గోవింద రాజన్, జయరామన్, లోకనాథన్, శ్రీనివాస్, రాజా, మాధవపెద్ది, పిఠాపురం మొదలగు

దక్షిణ దేశ గాయకులు సినీసంగీత సీమకు వరప్రసాదులుగా భావించవలసి ఉంది.

కళాకారునిగాను అనుభవాన్నిబట్టి నా గాఢ విశ్వాసాన్ని తెలియజేసేమాట ఒకటి చెప్పవలసి ఉంది. కళాకారుని నుండి వ్యక్తమయే కళాకాంతిలో అతడు జీవితంలో పొందిన అనుభవాల గాఢత్వము, తీవ్రత, ప్రతిబింబించక మానవు. భావతీవ్రత, ఆర్ద్రత లేని హృదయం నుండి ఉత్తమమైన కళ వ్యక్తమయే అవకాశం లేదు. అందుచేత కళాకారుడు కళాసాధనతో తుల్యంగా జీవిత అనుభవాల నుండి హృదయం సంస్కారాన్ని కలిగించుకోవలసి ఉంది.

ప్రజల ఉత్తమమైన అభిరుచులతో, విజ్ఞత, బాధ్యత, సానుభూతితో కూడిన సద్విమర్శతో ప్రతిభావంతులైన సంగీత దర్శకుల ప్రజ్ఞా విశేషంతో, నేపథ్య గాయకుల వైపుణీరాగంతో మన క్రొత్త సంగీత సంప్రదాయం ఎంతో వృద్ధిని, ఉత్తేజాన్నీ పొందగలదని అచంచల విశ్వాసం.

సేకరణ: చల్లా సుబ్బారాయుడు
కనిగిరి (29-3-1963 ఆంధ్రపత్రిక వారపత్రిక)


## విషయ వైవిధ్యంతో కూడిన వ్యాసాలు

*తెనాలి గొప్ప ఊరు. ఆ ఊరి మట్టి మనుషులకు ప్రేమను ప్రసాదిస్తుంది. కళల పట్ల ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఎంతోమంది కళాకారులకు, రచయితలకు పుట్టిల్లు కూడా. అలాంటి తెనాలిలో గత యాభై సంవత్సరాలుగా పేదల డాక్టర్‌గా పేరుగాంచిన డా. పి. దక్షిణామూర్తిగారికి కళాకారులన్నా, సాహితీమూర్తులన్నా అపారమైన అభిమానం. ఆ అభిమానమే తెనాలికి ఎవరొచ్చినా వారి ఆతిథ్యాన్ని పొందేలా చేస్తుంది. వారితో అనుబంధాన్ని అక్షర పరిమళంగా మారుస్తుంది. తను చదివిన పుస్తకాలు, తనకు తెలిసిన ప్రముఖులు గురించి వ్యాసాలు రాయటం వారికిష్టమైన వ్యాపకం. అలా రాసినప్పుడు ఒకటి రెండు కొత్త విషయాలను పాఠకులతో పంచుకోవటం వారి సునిశిత పరిశీలనా శక్తిని సూచిస్తుంది. ఇటీవలే వారు "డా. పి. దక్షిణామూర్తి మరికొన్ని వ్యాసాలు – జ్ఞాపకాలు" శీర్షికతో తమ రెండవ వ్యాస సంపుటి వెలువరించారు. పన్నెండు ఉపశీర్షికలతో డెబ్బైఐదు వ్యాసాలు పాఠకుడిని అలరిస్తాయి. సమీక్షను కూడా స్వతంత్ర వ్యాసంలా రాయటం వారి ప్రత్యేకత. వైద్యులవటంవలన వైద్య విజ్ఞాన వ్యాసాలు, విజ్ఞాన రంగ ప్రముఖులను పరిచయం చేశారు. విషయాన్ని సూటిగా స్పష్టంగా సరళంగా చెప్పటం ఈ వ్యాసాలలో గమనిస్తాం. వైద్య వృత్తిలో ఉంటూనే తనకిష్టమైన సాహిత్యాభిరుచిని కొనసాగించే స్నేహశీలి డా. పి. దక్షిణామూర్తిగారు. ఈ వ్యాసాలన్నీ ఆ అభిరుచిని ప్రతిబింబించేవే.*

✧ ✧ ✧

*నేటి రోజుల్లో డాక్టర్ లేని సమాజాన్ని ఊహించటం కష్టం. ఆరోగ్యానికి ఆపద ముంచుకొచ్చినప్పుడు ముందుగా డాక్టరు దేవుడే గుర్తుకొస్తాడు. అన్ని రంగాలతో పాటు వ్యాపారమయమైన వైద్యరంగంలోనూ ఆర్జన సంగతటుంచి మానవతా భావనతో పేదరోగుల సేవలో గడిపిన డాక్టర్లు లేకపోలేదు. తమ వైద్యసేవలతో వైదో నారాయణో హరిః అన్న పెద్దల మాటలకు ప్రతిరూపంగా నిలుస్తున్నారు కొందరు డాక్టర్లు. అలాంటివారిలో డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి ఒకరు.*

*పేదలే కాదు.. ఎవరు వెళ్లినా శ్రద్ధగా చూస్తారు. అనవసరంగా పరీక్షలు చేయించరు. అతి తక్కువ ధర మందులు రాస్తారు. ఆసుపత్రిలో ఇన్‌పేషెంటుగా అడ్మిట్ అయినప్పటికీ డిశ్చార్జ్ అయినప్పుడు బిల్లుల భారం ఉండదు. అందుకే ఆయన్ను 'దాక్షిణ్యమూర్తి' అంటారు. సినిమాలకన్నా, సాహిత్యమన్నా ఆయనకు అపరిమిత ఇష్టం. చక్కని విమర్శకుడు. కళాకారులు, సాహితీవేత్తలు ఎవరొచ్చినా ఆప్యాయంగా పలకరిస్తారు. వైద్య విజ్ఞాన వ్యాసాలే కాకుండా తనకు తెలిసిన, చదివిన ప్రముఖుల గురించి రాయటం ఆయన హాబీ. అలా రాసిన వ్యాసాల మొదటి సంపుటం గతంలో వెలువడింది. ఇటీవల కాలంలో రాసిన వ్యాసాలు, జ్ఞాపకాలతో ఇప్పుడు రెండోభాగం మీ చేతిలో ఉంది. చదవండి... ఇందులోని కథనాలు రచయిత అభిరుచికి, వ్యక్తిత్వానికి అద్దంపడతాయి.*




*పేజీలు: 208, వెల: ₹ 300/- ప్రతులకు: డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, తెనాలి. ఫోన్: 7901014749.*

సి. యస్. రాంబాబు, హైదరాబాద్. ఫోన్: 837 481 8961.



రతీమన్మథులు

# గిరిజా కల్యాణం
## (కూచిపూడి యక్షగానం)

*- ఎమ్. పురుషోత్తమాచార్య*

చిత్రం : **రహస్యం** (1967)
రచన : **మల్లాది రామకృష్ణశాస్త్రి**
సంగీతం : **ఘంటసాల వేంకటేశ్వరరావు**
గానం : ***ఘంటసాల, మల్లిక్, రాఘవులు, పి. సుశీల, పి. లీల, ఎ.పి. కోమల, పి.ఎస్. వైదేహి, పద్మ.***
అభినయం : సూత్రధారులు : ***వేదాంతం రాఘవయ్య, వేదాంతం రత్తయ్యశర్మ, భాగవతుల యజ్ఞనారాయణ శర్మ.***
శివుడు : ***కోరాడ నరసింహారావు***
మన్మథుడు : ***వేదాంతం సత్యనారాయణశర్మ***
గిరిజ : ***బి. సరోజాదేవి***
రతీదేవి : ***గీతాంజలి***
చెలికత్తెలు : ***రాజనాల నాగమణి, స్వరూపరాణి, సుజాత, సరోజ***
నిర్వహణ : ***వేదాంతం రాఘవయ్య***

**సూత్రధారులు**

**మోహన-మిశ్రచాపు**

అంబా పరాకు దేవీ పరాకు
మమ్మేలు మా శారదాంబా పరాకు

**నాట-త్రిశ్రగతి**

ఉమామహేశ్వరప్రసాదలబ్ధ పూర్ణజీవనా గజాననా
బహుపరాక్ బహుపరాక్
చండభుజామండల దోధూయమానవైరిగణా షడాననా
బహుపరాక్ బహుపరాక్
మంగళాద్రి నారసింహ ॥బహు॥
బంగరుతల్లి కనకదుర్గ ॥బహు॥
కృష్ణాతీర కుచెన్నపూడినిలయా గోపాలదేవ ॥బహు॥

**మధ్యమావతి -ఆది**

అవధరించరయ్యా విద్యల నాదరించరయ్యా
లలితకళల విలువ తెలియు సరసులు
పదింపదిగ పరవశులై ॥అవ॥

1. ఈశుని మ్రోల హిమగిరి బాల
కన్యతనము ధన్యమైన గాథ ॥అవ॥

2. కణకణలాడే తామసాన
కాముని రూపము బాపి అల
కాముని రూపము బాపి,ఆ కోపి
కాకలుతీరి, కనుతెఱచి, తను తెలిసి, తన
లలనను పరిణయమైన ప్రబంధము ॥అవ॥

చెలికత్తెలు: **కాంభోజి-రూపకం**

రావో రావో లోలలోల లోలంబాలక ॥రావో॥
లోకోన్నత మహోన్నతుని తనయా మేనాకుమారి
రాజసలోచన రాజాననా ॥రావో॥

**అఠాణ-మిశ్రచాపు**

చెలువారు మోమున లేలేత నగవున
కలహంస గమనాన కలికీ ఎక్కడికే?
మానససరసిని మణిపద్మదళముల
రాణించు అల రాజహంస సన్నిధికే
వావిలిపూవుల మాలలు గైసేసి
వయ్యారి నడల బాలా ఎక్కడికే?
కన్నార నన్నేల కైలాసనిలయాన
కొలువైన అల దేవదేవు సన్నిధికే ॥

మన్మథ: **వసంత-ఆది**

తగదిది తగదిది తగదిది ధర
ణీధరవర సుకుమారీ ॥తగ॥

1. అందగా మదనుడుండగా మన
విరిశరముల పదనుండగా నిను

బోలిన కులపావని తానై వరు
నరయగ బోవలెనా ఆ.ఆ.ఆ. ॥తగ॥

2. కోరినవాడెవడైనా ఎంతటి ఘనుడైనా
కోల నేయనా సరసను కూలనేయనా కను
గొనల ననమొనల గాసి చేసి నీ
దాసు జేయనా ఆ.ఆ.ఆ. ॥తగ॥

గిరిజ : **రీతిగౌళ-ఆది**

ఈశుని దాసుని జేతువా అపసదా
అపచారము కాదా? ॥ఈ॥

చ॥ కోలల గూలెడి అలసుడు గాడు
ఆదిదేవుడే అతడు
సేవలు జేసి ప్రసన్నుని జేయ
నా స్వామి నన్నేలునోయి
నీ సాయమే వలదోయి ॥ఈ॥

చెలి : **శహన-ఆది**

కాని పని మదనా అది నీ చేత ॥కాని॥
అహంకరింతువ హరుని జయింతువ అది నీ చేత ॥కాని॥

**సరస్వతి-ఆది**

చిలుకతత్తడిరౌతా ఎందుకీ హుంకరింత? ॥చిలు॥
వినకపోతివా ఇంతటితో
నీ విరిశరముల పనిసరి
సింగిణి పని సరి తేజీ పనిసరి
చిగురుకు నీ పనిసరి మదనా ॥చిలు॥

గిరిజ : **హిందోళం-ఆది**

సామగ సాగమ సాధారా
శారద నీరద సాకారా
దీనాధీనా ధీసారా ॥సామ॥

చ॥ ఇవె కైమోడ్పులు ఇవె సరిజోతలు
వినతులివే అరవిందోజ్జ్వలా
ఇదె వకుళాంజలి మహనీయా
ఇదె హృదయాంజలి ఈశా మహేశా ॥సామ॥

మన్మథుడు : అమ్మా....అమ్మా...(ఆర్తనాదం)

రతీదేవి : **(పద్యం) సావేరి**

**విరులన్ నిను పూజసేయగా విధిగా నిన్నొక గేస్తు జేయగా / దొరకొన్న రసావతారు చిచ్చురకంటన్ పరిమార్తువా ప్రభూ! కరుణన్ గిరిరాజకన్యకన్ సతిగా తాము పరిగ్రహింపగా మరుదేపున రూపున వర్ధిలుగా రతి మాంగల్యము రక్షసేయరా ప్రభూ....పతిభిక్ష ప్రభూ.....**

గిరిజ : **ఆరభి-రూపకం**

అంబాయని అసమశరుడు
నను పిలిచెను వినవో
జనకుడవై ఆదరణగ
తనయునిగా జేకొనవో ॥అం॥

చ॥ మనమే నీ మననమై తనువే నీ ధ్యానమై
నీ భావన లీనమైన గిరిబాల నేలవో
శరణం భవ శరణంభవ
శరణంభవ స్వామిన్
పరిపాలయ పరిపాలయ
పరిపాలయ మాం స్వామిన్॥

సూత్ర : **మధ్యమావతి-ఖండగతి**

బిడియపడి భీష్మించి పెండ్లికొడుకైనట్టి
జగమేలు తండ్రికి జయమంగళం
విరులచే వరునిచే కరము చేకొనజేయు
జగమేలు తల్లికి జయమంగళం॥

*సాకీ.* *కూచెన్నపూడి భాగవతుల*
*సేవలందు దేవదేవా*
*శ్రీవేణుగోపాల జయమంగళం*
*త్రైలోక్యమందార శుభమంగళం॥*

**భావం :** ఓ పరమేశ్వరీ! నీకు నీరాజనాలు. ఓ జగదంబా! నీకు బహుపరాకు. ఉమామహేశ్వరుల అనుగ్రహం చేత వర్ధిల్లే గణేశ్వరా! బహుపరాకు. భుజబలపరాక్రమం చేత శత్రుసమూహాలను కలవరపరిచే కుమారస్వామీ! బహుపరాకు. మంగళగిరి నరసింహా! విజయవాడ కనకదుర్గాదేవీ! కృష్ణానదీతీరాన కూచిపూడిలో వెలసిన గోపాలదేవా! మీ అందరికీ బహుపరాక్.

సరసులైన కళాభిమానులారా! లలితకళల విలువ తెలిసి ఎంతో పారవశ్యం పొందే రసికులారా! పరమేశ్వరుని చెంత హిమగిరితనయ తన జీవితాన్నే ధన్యం చేసుకున్న కథను వినండి. శివుడు అగ్నిలోచనుడై కాముని మదమణచినాడు. గిరిబాలను కరుణించి పరిణయమాడిన దివ్యకథ ఇది.

చెలులు : గిరిజాదేవీ! నీకు స్వాగతం. లోకోన్నతుడైన

హిమగిరిరాజు కూతురువు. రాజనం తొణకిసలాడే ఓ మేనకాతనయా! రావమ్మా! అది సరే, అందమైన ముఖంమీద చక్కని చిరునవ్వుతో కలహంస రీతిగా నడుస్తూ ఎక్కడికి బయలుదేరావు?

గిరిజ : మానససరోవరంలో మణి పద్మదళాల మధ్య విహరించే రాజహంస దగ్గరికి వెళుతున్నాను.

చెలులు : ఉహుం. సరిగా చెప్పవమ్మా. వావిలిపూవుల దండల్ని మెడలో ధరించి ఇంత వయ్యారంగా నడుస్తూ ఉన్నావు. ఎక్కడికో సరిగా చెప్పు తల్లీ!

గిరిజ : నన్ను కటాక్షాలతో అనుగ్రహించే పరమేశ్వరుడు కొలువున్న కైలాసమందిరానికి వెళుతున్నాను.

మన్మథ : *(వస్తూ)* ఓ పార్వతీ! నువ్విలా ఒంటరిగా వెళ్ళడం తగదు. నీకు తోడుగా ఈ మన్మథుడున్నాడు, నా పదునైన పూలబాణాలూ ఉన్నాయి. నీబోటి కులకాంత ఇలా తనంతట తాను వరుణ్ణి వెదుకుతూ వెళ్ళాలా? నా సామర్థ్యం నీకు తెలియదేమో! ఎంతటి ఘనుడనైనా నా బాణాలతో పడగొడతాను. శివుడిని నా కనుచూపుల పూలబాణాలతో సతమతం చేసి అతన్ని నీ దాసునిగా చేస్తాను. చూడు.

గిరిజ : ఓయీ అల్పుడా! ఈశ్వరుడిని దాసునిగా చేస్తావా? అది అపచారం కదా! మహేశుడు నీ బాణాలకు లొంగే సామాన్యుడు కాదు. అతడు ఆదిదేవుడు. అతనికి సేవలు చేసి ప్రసన్నునిగా చేసుకోవాలి కాని భుజబలంతో కాదు. కనుక నాకు నీ సహాయం అక్కరలేదు.

చెలులు : ఓ మదనా! నువ్వు చేసేది కానివని. అహంకారంతో హరుని జయించడం నీ చేతగానిపని.

మన్మథ : *(అయినా వినకుండ ముందుకు వెళుతున్నాడు)*

చెలులు : ఓయీ మన్మథా! నీకీ గర్వం పనికిరాదుసుమా! మా మాట వినకపోతే, నీ ధనున్సు, పూలబాణాల పని, నీ వాహనమైన చిలుక పని, పదునైన చిగురుటమ్ములకు, చివరికి నీ పని



మన్మథుడు

తీరిపోతుంది. చాలా ప్రమాదం.

మన్మథ : *(నిర్లక్ష్యంగా నవ్వి, వెంటనే వెళ్ళి పరమేశ్వరునిపై పూలబాణాలను ఎక్కుపెట్టాడు)*

గిరిజ : సామగాన స్వరూపుడవైన పరమేశ్వరా! నీవు దీనులకు అధీనుడవు. ఇదిగో, వకుళమాలికలను స్వీకరించు. ఇదే నా హృదయపూర్వక భక్త్యంజలి. ఓ పరమేశా! నమోన్నమః.

మన్మథ : *(పూలబాణాలను శివునిపై కురిపిస్తాడు) (తపోభంగం జరిగిన శివుడు కనులు విప్పి, లేచి, తాండవం చేస్తూ, చటుక్కున తన మూడో కన్ను తెఱచి మన్మథుని భస్మం చేశాడు)*

మన్మథ : అమ్మా అమ్మా *(అరుస్తూ బూడిదగా మారాడు)*

రతీదేవి : *(పరుగున వచ్చి బూడిదను చూసి ఏడ్చింది. శివుడిని దర్శించి)* ప్రభూ! బాణాలతో కాదు, పూలతో నిన్ను పూజించడానికి నా నాథుడు వచ్చినాడు. దేవతాకార్యం కోసం, నిన్ను గృహస్థునిగా చేయడానికి తన జీవితాన్ని సమర్పించుకున్నాడు. అటువంటి శృంగార రసమూర్తిని బూడిద చేశావు స్వామీ! ఈ గిరిరాజకన్యకను సతిగా పరిగ్రహించండి. నా నాథుని బ్రతికించి, నాకు పతిభిక్ష పెట్టండి ప్రభూ!

గిరిజ : ప్రభూ! మన్మథుడు నన్ను అమ్మా అని పిలిచినాడు. కనుక నీవే అతనికి జనకుడవై భవదీయ పుత్రునిగా కరుణించండి స్వామీ! మనసంతా నీ నామస్మరణలో, తనువంతా నీ నామధ్యానంలో, తలపులన్నీ నీ భావనలోనే లీనం చేసిన నన్ను ఏలుకొనుడు. స్వామీ! శరణు శరణు.

ఆ ప్రార్థనను ఆలకించిన పరమేశ్వరుడు మన్మథుని బ్రతికించి గిరిజను కల్యాణమాడినాడు. మొదట బిడియపడినా తరువాత పెండ్లికొడుకైన శివునికి, పూజతో శివుని మెప్పించిన పార్వతీదేవికి జయమంగళం. కూచిపూడి భాగవతుల సేవలను అందుకునే శ్రీవేణుగోపాలా! నీకు శుభమంగళం.

**అర్థాలు :** దోధూయమాన = తరిమికొట్టబడిన; లోలంబ + అలక = తుమ్మెదరెక్కలవంటి నల్లని వెంట్రుకలుగలది; కైసేసి = అలంకరించుకుని; కోల = బాణం; ననమొనలు = పూల అంచులు; గాసి = బాధ; అపసదుడు = నీచుడు; చిలుక తత్తడిరౌతు = చిలుకను వాహనంగా కలిగిన మన్మథుడు; సింగిణి = విల్లు; తేజి = వాహనం; చిచ్చరకంట = నిప్పుకంటితో; గేస్తు= గృహస్థుడు; మరాళం = హంస.

చలనచిత్ర సాహితీ రంగంలో, ఘంటసాల సుమధుర సంగీత జీవితంలో, నవరత్నోజ్జ్వల కాంతిమంత మణిహారం ఈ యక్షగానం. దీన్ని రచించిన మహనీయ పండితకవి మల్లాది రామకృష్ణశాస్త్రి. వీరు 1905లో కనకమ్మ, నరసింహశాస్త్రి దంపతులకు బందరులో జన్మించారు. యడవల్లి సుబ్బావధాన్లు, నోరి సుబ్రహ్మణ్యం, శిష్టా నరసింహశాస్త్రి అనే విద్వాంసుల వద్ద వైదిక, మహాభాష్య, బ్రహ్మసూత్రాది శాస్త్రాలను అధ్యయనం చేశారు. 'విద్యాభూషణ' అనే బిరుదును పొందారు. తెలుగు, సంస్కృతం, ఉర్దూ, ఆంగ్లం, పాళీ, హిందీ, కన్నడం, గుజరాతీ, మరాఠీ, బెంగాలి, తమిళ,నేపాలీ, మళయాళ, అస్సామీ, సింహళ, ఫ్రెంచి, గ్రీకు, లాటిన్, జపనీస్, చైనా, బర్మా భాషలలో అనర్గళమైన పాండిత్యం సంపాదించారు. గుంటూరులో 'దేశాభిమాని' పత్రికను నడిపారు. "కిరణావళి, మణిదీపాలు, దుములు, ఆనందకాననం, తేజోమూర్తులు, కృష్ణాతీరం, ఖుషీ, శివరంజని, వెలదివెన్నెల, ఖుదావాలే" అనే రచనలు చేశారు. 1951లో 'చిన్నకోడలు' సినిమాతో చిత్రరంగంలోకి ప్రవేశించారు. 'చివరకు మిగిలేది, సువర్ణసుందరి, రేచుక్క, చిరంజీవులు, అనురాగం, పల్నాటియుద్ధం, జయభేరి, రాజనందిని, వీరాంజనేయ, జయసింహ, రహస్యం' మొదలైన సినిమాలకు పాటలు, కొన్నిటికి మాటలు కూడా సమకూర్చారు. శాస్త్రిగారు 1965 సెప్టెంబరు 12న తనకిష్టదైవమైన ఆనందకృష్ణునిలో లీనమయ్యారు.

మొదట ఈ యక్షగానాన్ని 1956-57లో 'ఉషాపరిణయం' సినిమా కోసం రాయడం జరిగింది. కాని ఆ సినిమా నిర్మాణం ఆగిపోయింది. అయితే, ఈ యక్షగానాన్ని 1963లో జ్యోతి మాసపత్రికవారు తమ ఆగస్టు సంచికలో 'కేళీగోపాలమ్' పేరుతో ప్రచురించారు. దాన్ని చదివిన శ్రీలలితాశివజ్యోతి ఫిలింస్ అధినేత ఎ. శంకర్‌రెడ్డిగారు వేదాంతం రాఘవయ్యగారిని కలిసి ఈ యక్షగానాన్ని తమ 'రహస్యం' సినిమాలో చిత్రిస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. అప్పుడు వారిద్దరూ మల్లాదివారిని కలిసి సినిమాకు అనుగుణంగా దాన్ని రూపొందించమన్నారు. ఆయన ఆ పనిలో ఉండగానే మరణించారు. వెంటనే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారికి ఈ పనిని అప్పగించారు. అంతేకాదు, వెంటనే దీనికి సంగీతం సమకూర్చమని ఘంటసాలను కోరితే ఆయన ఎంతో ఉత్సాహంగా దీనికి బాణీలు సమకూర్చారు. నిర్మాత అనుమతి తీసుకుని దీన్ని వేదికల మీద ఘంటసాల పాడడానికి సిద్ధం అయ్యారు. దీన్ని మొదటిసారి కంచి శృంగేరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతీస్వామివారి సమక్షంలో మద్రాసులో గానం చేశారు. తరువాత 1966లో హైద్రాబాదు శంకరమఠంవారి ఆధ్వర్యంలో కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ జయేంద్రస్వామివారి సన్నిధిలో దీన్ని ఆలపించగా హైద్రాబాదు ఆకాశవాణివారు రికార్డు చేసి భక్తిరంజనిలో వినిపించారు.

వైభవోపేతంగా దీన్ని వెండితెరకు ఎక్కించిన 'రహస్యం' సినిమా 1967 నవంబరు 10న విడుదల అయింది. కాని ప్రజలు ఈ చిత్రాన్ని ఆదరించలేదు. కాని పాటల్ని, సంగీతాన్ని నెత్తిన పెట్టుకుని పూజించారు. శంకర్‌రెడ్డిగారికి ఈ సినిమా సంగీతం బాగా నచ్చింది. ఘంటసాలపై విపరీతమైన ఆరాధనాభావం ఏర్పడింది. 1974లో ఘంటసాల మరణించినప్పుడు జరిగిన ఖర్చులన్నిటినీ శంకర్‌రెడ్డిగారే భరించి ఆయన పట్ల తన భక్తిని వెల్లడించుకున్నారు.

ఈ యక్షగానానికి మల్లాదివారు పెట్టిన పేరు 'కేళీగోపాలమ్'. శ్రీకృష్ణుడే పరమేశ్వరుని వేషం కట్టి నర్తించే

నృత్యనాటకమిది. ఉషాదేవి, అనిరుద్ధుల ప్రేమ సంగతి తెలిసిన బాణాసురుడు అనిరుద్ధుని బంధించాడు. ఇది తెలిసిన కృష్ణుడు తన మనవడిని విడిపించుకుపోవడానికి శోణపురానికి వచ్చి కోటకు కాపలాగా ఉన్న శంకరుని ప్రసన్నం చేసుకోవడానికి ఈ నాటకాన్ని ఆడారు. శివుని వేషంలో గోపాలుడు నటించాడు కనుక దీనిని 'కేళీగోపాలమ్' అన్నారు. 'రహస్యం' కోసం ఇది 'గిరిజాకల్యాణం' అయింది.

మల్లాదివారు ప్రయోగించిన ఎన్నో అపురూపమైన సమాసాలు, పదబంధాలు ఈ రచనలో కనిపించి సరసులను మురిపింపజేస్తాయి. 17వ శతాబ్దంలో భాగవత ప్రదర్శనను తిలకించిన అప్పటి గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానాషా ఎంతో సంతోషించి కృష్ణాజిల్లాలోని కూచిపూడి గ్రామాన్ని ఆ భాగవతులకు అగ్రహారంగా ఇచ్చాడు. అప్పటి నుంచి అక్కడి నృత్యకళకు 'కూచిపూడి నృత్యం' అనే పేరు వచ్చింది. కూచిపూడినే కూచెనపూడి, కుచెన్నపూడి, కుచిపూడి అనే పేర్లతో పిలుస్తారు.

"మ్రోల, బాల, బాపి, కోపి"వంటి అయాచిత అంత్య ప్రాసా ప్రయోగాలు ఒక కవితావేశం నుండి, భావోద్వేగం నుండి పుట్టిన సహజ సుందర రూపాలే కాని, కావాలని తెచ్చిన కృత్రిమ ప్రయోగాలు అనిపించవు. ఈ రచన ఒక ప్రబంధం. అట. నిజమే, ప్రకృష్టమైన బంధమే ప్రబంధం. అంటే పార్వతీపరమేశ్వరుల అనుబంధం ఎంతో విశిష్టమైనది, ప్రకృష్టమైనది అన్నమాట. చెలికత్తెలు ఆలపించిన పాటలో కవిగారు అక్షరాలతో ఆడుకున్నారు. 'లోలలోల లోలంబాలక' పంక్తిలో 'లోల'ను యమకశ్లేషతో పరిమళింపజేశారు. ఊగుతున్న కోరికతో తుమ్మెదరెక్కల వంటి వెంట్రుకలుగలది అనే భావాన్ని మనోహర శబ్దాలతో అలంకరించారు. 'రలయోరభేదః' ప్రకారం లోలంబ, రోలంబ పదాలు రెండూ ఒకటే. 'రాజసలోచన'లో సభంగశ్లేష కనిపిస్తుంది. దీన్ని రాజ+స+లోచన అని విడదీస్తే చంద్రునితో సమానమైన చల్లని వెన్నెల కురిపించే, అంటే అనుగ్రహాన్ని చూపే లోచనాలు కలది అని అర్థం వస్తుంది. రాజస+లోచన అని విడదీస్తే రాచరికపు దర్పం (గిరిరాజు కూతురు గదా) కలిగిన హుందాతనం ఉన్న లోచనాలు కలది అనే అర్థం చెప్పుకోవచ్చు. దీని తరువాత పదంలో మళ్ళీ చంద్రుడే వస్తాడు ముఖబింబంగా రాజ+ఆననా అంటూ. ఇలాంటిదే మరోచోట



దార్శనికుడు వేదాంతం రాఘవయ్య

గుంభనమైన శ్లేష ఇంపుగా ఉంటుంది. 'కలహంస గమనాన కలికి ఎక్కడికే' అని చెలులు అడిగితే 'మానససరసిని మణిపద్మదళముల రాణించు అల రాజహంస సన్నిధికే' అంటుంది పార్వతి. ఆవిడ కలహంస, ఆయన రాజహంస. ఎంత గొప్ప సమ్మేళనం! ఒక హంస మరో హంస దగ్గరకు వెళ్ళాలికదా! అంతేకాదు, దీనిలో మరో పరమార్థం కూడా ఉంది. మానససరోవరంలో విహరించే రాయంచ అనేది సామాన్యార్థం. జీవుల ఆత్మలనే సరస్సులో విహరించే 'హంసలకు హంస' రాజహంస. అంటే, ఆత్మలకు ఆత్మ పరమాత్మ. అది ఎక్కడ తిరుగుతుంది? మణిపద్మదళాల మధ్యన. అవి మామూలు పద్మాలు కావు. సహస్రారకమలాలు. వాటి మధ్యన విహరించే హంస ఇది. జీవునికి, ప్రాణానికి పర్యాయ పదంగా 'హంస' అంటూ మనం తత్త్వరచనలోనూ. సంభాషణల్లోనూ ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటాం. దీన్నే జానపదులు 'చిలుక' పేరుతో పిలుస్తారు. ఇది విశేషార్థం.

'తగదిది తగదిది' పదరచనలో మనం 'తకధిమి తకధిమి' అనే పదగతులను వింటాం. కవిగారి నృత్యకళామర్మజ్ఞతకు ఇదియొక సూచిక. 'కనుగొనల, ననమొనల' అనేవి అచ్చతెలుగు భాషాపదబంధాలు. పార్వతి ఓరచూపులకు, మన్మథుని పూలబాణాల మొనలు జతగూడితే పరమేశ్వరునంతటివాడు కూడా దాసుడైపోతాడు అని మన్మథుని అతివిశ్వాసం. 'అపసద' అనేది చాలా అరుదైన పదం. అలాగే 'పులుగుతత్తడిరౌతు' అనే విష్ణువు పేరుకు సమాంతరంగా 'చిలుకతత్తడిరౌతు'ను మన్మథుని కోసం సృష్టించారు. ఇటువంటి అపురూపమైన పదాలను మన పిల్లలకు పరిచయం చేయడం చాలా అవసరం. ఈ పాటలో కవిగారు స్వరాక్షరాలను పొదిగారు. 'పనిసరి, నీ పనిసరి' అనే పదాలలో సంగీత స్వరాలు వినవస్తాయి. కాని స్వరస్థానాలను మాత్రం మాస్టారు

ఉపయోగించలేదు. ఇలాంటిదే మరోచోట పరమేశ్వర స్తోత్రంలో కనిపిస్తుంది. 'సామగ సాగమ సాధారా'లో స్వరాక్షరాలు స్వస్థానాలలోనే వినిపిస్తాయి. 'సామగ' అంటే సామవేదం నుండి గమించేవాడా అని చెప్పొచ్చు. స+ఆగమ అంటూ ఆగమాలయందు వ్యాపించినవాడా అని చెప్పొచ్చు. స+ఆధారా అంటే, జీవులకు, సత్త్వగుణానికి ఆధారభూతుడైనవాడా అని స్థూలంగానూ, తాత్త్వికంగానూ అర్థాలు చెప్పవచ్చు. త్యాగయ్యగారి 'నాదతనుమనిశం' కృతిని పాడుకోవడంలోని అంతరార్థాన్నే మల్లాదివారు ఈ చిరుపాటలలో ఎంతో శక్తిమంతంగా నిక్షిప్తం చేశారు. ఈ పాటలోనే దీన+అధీనా, ధీ సారా అంటూ అక్షరాలతో ఆటలాడడం కూడా మనం గమనించవచ్చు.

చివరి మంగళగీతికలో 'బిడియపడి భీష్మించి పెండ్లికొడుకైనట్టి' , అన్నారు. పరమేశ్వరుడు బిడియపడిన వైఖరి, కథాకమామీషూ తెలియాల్సి ఉంది. కామదహనం తరువాత శివుని నిష్క్రమణ, పార్వతి తపస్సు, శివుని పరీక్ష వగైరా సన్నివేశాలు ఉన్నాయి. అయితే, వీటికి సినిమాలో అవకాశం లభించదు. అవన్నీ జరిగాయి అని మనం సర్దుకుపోవాల్సిందే.

రతీదేవి విలపిస్తూ పాడిన పద్యరచన విలక్షణమైన శైలిలో సాగింది. కాలక్రమాన వచ్చిన పరిణామంలో ఈ పద్యం కూడా విచ్ఛిన్నమై 'సలక్షణత'ను కోల్పోయింది. పద్యాన్ని పరిశీలిస్తే కొన్ని విషయాలు తెలుస్తున్నాయి. ప్రతి పాదంలో 21 అక్షరాలు ఉన్నాయి కాబట్టి ఇది 21వ ఛందస్సు అయిన 'ప్రకృతి'కి సంబంధించినది. ఈ పద్యంలో 'స స జ భ త జ ర' అనే ఏడు గణాలు వరుసగా ఉన్నాయి. 11వ అక్షరం యతిస్థానం. ఈ పద్యంలో మొదటి పాదంలో తప్ప మిగిలిన పాదాలలో యతినియమం కనిపించలేదు. మరి ఈ పద్యం పేరేమిటో తెలియవలసి ఉన్నది. ప్రకృతిచ్ఛందంలో పుట్టిన రెండు లక్షల తొంభైఏడువేల నూటయాభైరెండు పద్యాల పేర్లు తెలిసిన మహానుభావులు ఎవరైనా ఉంటే వారే చెప్పగలరేమో! అంత విశిష్టమైనది, అపురూపమైనది ఈ పద్యం. ఈ పద్యం నాలుగవ పాదంలో గణభంగం స్పష్టంగా కనిపిస్తున్నది. రెండు అక్షరాలు అదనంగా వచ్చి చేరాయి. 'రూపున వర్ధిలుగా' అనేచోట 'రూపు వర్ధిలన్' అంటే సరిపోతుంది. కానీ మూలస్వరూపం తెలియాలికదా! 'మరుడేపున రూపున వర్ధిలుగా'లో 'మరుడే పునరూపున' అనేది కవిగారి భావం కావచ్చు. అంటే, మన్మథుడు మళ్ళీ రూపు ధరిస్తాడు అని అని అర్థం చెప్పుకోవాలి. అయితే, పునః+రూపు= 'పునరూపు' అవుతుందా, 'పునారూపు' అవుతుందా? సంస్కృత పండితులు దీన్ని ఆమోదిస్తారా? లేకపోతే మరుడు+ఏపున+రూపున అని విడదీసి 'మన్మథుడు వృద్ధియగు రూపంతో' అని అర్థం చెప్పుకోవాల్సి వస్తుందా? కొంతమంది విద్వాంసులు అసలిది పద్యమే కాదు, ఏదో రగడకు సంబంధించినదై ఉంటుందన్నారు. మరికొంతమంది గేయవిశేషమే తప్ప పద్యం కాదన్నారు. ఏదైనాసరే, కవిపండితులు దీన్ని చర్చిస్తే వాస్తవం వెలుగులోకి వస్తుంది.

'అంబాయని అనమశరుడు' అనే పాటలో మల్లాదివారి గడుసుదనం చమత్కారంగా, సరదాగా సాగింది. మన్మథుడిని 'అనమశరుడు' అన్నారు. సాహిత్యార్థంలో బేసి సంఖ్య అయిన అయిదు బాణాలు కలిగినవాడు అని అర్థం చెప్పుకోవాలి. కానీ ఇక్కడ అతడు చేసిన పని 'సరి' కాదు 'క్రమం' కాదు. అసమం, అక్రమం, అసమంజసం, సరిపడని పిచ్చి పని చేశాడని కవి గుంభనంగా చెబుతున్నారు. పార్వతి ప్రార్థిస్తూ 'మన్మథుడు' నన్ను 'అంబా' అన్నాడు. అంటే, అమ్మా అని పిలిచాడు కనుక నువ్వు జనకుడవు కావాలి. కావాలంటే నన్ను వివాహమాడాలి. అట్లయితేనే జనకశబ్దం సార్థకమవుతుంది. అనేది నిగూఢార్థం. దీంట్లో ప్రేమ, భక్తి, ఆరాధన ముప్పిరిగొన్నాయి.

ఇంకో విశేషం చూద్దాం. అసలు మన్మథుడు లక్ష్మీనారాయణుల పుత్రుడు. కానీ ఇక్కడ భస్మమయ్యాడు. దాంతో జన్మ మారింది. ఆ బంధం ప్రక్కకు జరిగింది. మళ్ళీ బ్రతికించాడు కనుక ఇప్పుడు అతడు శివుని కొడుకు. అంటే, "శివాయ విష్ణురూపాయ" ప్రకారం శివుడైనా, శ్రీహరియైనా ఒక్కరేకదా! అనే హరిహరాద్వైతాన్ని కవిగారు ఎంత జాగ్రత్తగా ప్రతిపాదించారో ఆలోచిస్తే చాలా ఆనందం కలుగుతుంది. "మనసంతా జపం, తనువంతా తపం'' ఇంతకంటె అర్హత ఇంకేం కావాలి తనను స్వీకరించడానికి? అని సహేతుకంగా తన మనోనిశ్చయాన్ని ఈశ్వరుని ముందు నివేదించిన అంబ నిజంగా 'జగదంబ'యే కదా! ఈ పాట చరణంలో 'విరులచే

వరునిచే కరము చేకొనజేయు' అంటూ 'చే' అక్షరంతో చేసిన శబ్దచమత్కారం ఉల్లాసంగా సాగింది. ఇది వట్టి శబ్దాలంకారం కాదు, పూజాకుసుమాలతో వరుడైన హరునిచేత కరమునందుకొనజేయగలిగిన చాతుర్యం ఉన్న జగమేలు తల్లి అంటూ పార్వతీపరమేశ్వరుల అభేదతత్త్వాన్ని సంగ్రహంగా మనముందు సాక్షాత్కరింపజేసిన మల్లాదివారు ఎంతో ధన్యులు, చరితార్థులు.

ఏ సుముహూర్తంలో ఘంటసాల మాస్టారు ఈ యక్షగానానికి స్వరకల్పన చేశారో కాని, మల్లాదివారి సాహితీ స్వర్ణకమలానికి మాస్టారి స్వరసౌరభం సంపూర్ణంగా అబ్బింది. అది పారిజాతకుసుమంకంటె నిత్యనూతన పరిమళాలుగా తెలుగువారి హృదయాలను చుట్టేసింది. మాస్టారు తాను నేర్చుకున్న శాస్త్రీయ సంగీత ధర్మాలను, తన మనోధర్మ సంగీత కల్పనానల్పచాతుర్యంతో జోడించి ప్రాణశక్తినంతా ధారవోసి దీన్ని రూపొందించినట్లు తోస్తుంది. చిత్రదర్శకులు వేదాంతం రాఘవయ్యగారి తోడ్పాటుతో నృత్యసంప్రదాయ ధర్మాలను పొదువుకుని, వాద్యబృంద సహకారంతో నగిషీలు చెక్కి, బృందగాయకుల తళుకులద్ది, మాస్టారు తన మానసపుత్రికగా దీన్ని తీర్చిదిద్దారని చెప్పడం ఏమాత్రమూ అతిశయోక్తి, అసత్యమూ కాదు.

ప్రారంభంలో రెండు ఆవర్తాలలో సూత్రధారులు జతులు పలికాక మంద్రధైవతం నుండి 'అంబా పరాకు'ను అనాగత పద్ధతిలో అందుకున్నారు మల్లిక్, రాఘవులు ఇద్దరూ. అయితే దీని బాణీ కూచిపూడివారు ఏర్పరచిన ప్రార్థనాసంప్రదాయానిదే. మోహనరాగంలాగా ప్రారంభమైనా శుద్ధమధ్యమం తగలడంవల్ల శంకరాభరణపు రంగు కొంత వచ్చింది. ప్రారంభపు రెండు పంక్తులు కూడా 'దసరిగమప' స్వరాలను దాటిపోలేదు. ఈ రెండు పాదాలను రెండోసారి పాడుతున్నప్పుడు నేపథ్యంలో కొనగోలుగా జతులను వినిపించి ముక్తాయిని ఇచ్చారు. ఇవే రెండు పాదాలను 'మాయాబజార్' సినిమా టైటిల్స్‌కు నేపథ్యంగా వాద్యాలపై మాస్టారు వినిపించడం ఒక విశేషం. కూచిపూడివారు ఒకప్పుడు 'శశిరేఖాపరిణయం' అనే యక్షగానాన్ని ప్రదర్శించారన్న విషయాన్ని మాస్టారు ఇలా గుర్తు చేస్తున్నారని



గిరిజా కళ్యాణంలోని ఒక ఘట్టం

భావించవచ్చు. నాట రాగంలో 'బహుపరాకులు' ప్రారంభించారు. 'బహుపరాక్' పదప్రయోగం విచిత్రమైనది. ఒకప్పటి రాజుల కాలానికి సంబంధించింది. 'పరాకు' అనే పదానికి విముఖత్వమనేది రూఢ్యర్థంగా చెలామణిలో ఉన్నది. మన వాడుక కూడా అలాగే ఉంది. అయితే, దీనికి 'తత్పరత' అనే మరో అర్థం కూడా ఉంది. 'తత్పరత' అంటే "దానియందే ఆసక్తి కలిగియుండడం". మహారాజుల కొలువులో ఉన్న వందిమాగధులు ఈ విశేషార్థాన్ని స్వీకరించి హెచ్చరిక పూర్వకంగా వినియోగించారు. 'మహారాజుగారు విజయం చేస్తున్నారు – బహుపరాక్' అంటూ అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నట్లుగా దీన్ని ప్రయోగించారు. అప్పటి నుండి ఈ అర్థంలోనే విశేష ప్రచారంలోకి వచ్చింది. ఈ రచనలో బహుపరాకులు మనకు కాదు, ఆయా దేవతలకు. గణేశుడు, కుమారస్వామి, నృసింహుడు, కనకదుర్గ, శ్రీకృష్ణుడు మొదలైనవారందరిని శివకల్యాణానికి అప్రమత్తులుగా చేసే ధోరణిలో బహుపరాకులు పాడుతున్నారు.

మొదటి పంక్తిని నాటరాగం షడ్జమంలో తాళరహితంగా మాస్టారు ప్రారంభించారు. 'మల్లిక్, రాఘవులు' బహుపరాక్‌ను లయబద్ధంగా రెండుసార్లు చెప్పారు. మాస్టారు రెండో పాదాన్ని రిషభం నుండి ఎత్తుకున్నారు. పురుషబృందం బహుపరాక్ రెండుసార్లు చెప్పారు. త్రిశ్రగతిలో మృదంగం అనుసరించింది. తరువాత లయాన్వితంగా మాస్టారు మిగతా పంక్తులను కూడా రిషభంలోనే అందుకుని పాడి ఆధారషడ్జమంలో వదిలేశారు. వెంటనే దేశాది తాళంలో ఒక ఆవర్తంలో కొనగోలు పలికాక మధ్యమావతి రాగంలో సమంలో పంచమం నుండి పురుషబృందం 'అవధరించరయ్యా'ను

అందుకున్నది. రెండుసార్లు పాడాక తరువాతి రెండు పాదాలను మాస్టారు తారషడ్జమం నుంచి సమంలో ప్రారంభించారు. కాగానే బిట్‌వర్క్ ఏదీ లేకుండానే మొదటి చరణం 'ఈశుని మ్రోల'ను మాస్టారు పైషడ్జమం నుంచి అందుకున్నారు. 'మ్రోల, బాల' పదాల దగ్గర అర ఆవర్తంపాటు కొనగోలు చెప్పారు. రెండోసారి ముగ్గురూ కలిసి చరణమంతా పాడారు.

రెండో చరణం 'కణకణలాడే'ను కూడా పైషడ్జమంలోనే మాస్టారు అందుకున్నారు. 'అల కాముని' పాదాన్ని బృందం పాడింది. తారస్థాయిలోనే మిగిలిన చరణాన్ని మాస్టారు పూర్తిచేశారు. తిరిగి పల్లవిని పాడుతున్నప్పుడు నేపథ్యంలో ముక్తాయిని సూత్రధారులు కొనగోలుగా చెప్పారు. ఇంతవరకు ముగ్గురు సూత్రధారులపైననే చిత్రించారు.

తరువాత పాత్రాభినయం ప్రారంభమవుతున్నది. చెలికత్తెలు ప్రవేశించి గిరిజాదేవికి స్వాగతం చెబుతున్నట్లుగా గాయనీమణుల బృందం కాంభోజిరాగం, రూపకతాళంలో సమంలో పైషడ్జమం నుంచి 'రావో'ను ప్రారంభించారు. రెండోసారి 'రావో'ను 'సరిగమరిస' అనే సంగతితో హృద్యంగా ఆలపించారు. వెంటనే పంచమం నుండి అనాగత విధానంలో 'లోకోన్నతుని' చరణాన్ని ఎత్తుకున్నారు. రెండోసారికి 'లోకోన్నతుని'ని 'పదసనిదప' సంగతితో పాడారు. చరణం తరువాత 'రావో'ను 'దసరిగమగరిగ' అనే మరో సంగతితో అందంగా పాడారు.

చెలికత్తెలు పార్వతిని ప్రశ్నలడుగుతున్నారు. మృదంగం, మోర్సింగులు అనుసరిస్తున్నాయి. ప్రశ్నలను అడగడానికి బాగా వీలుండేలాగా అఠాణారాగాన్ని ఉపయోగించుకున్న తీరు ఎంతో ముచ్చటగా ఉంది. 'మపసస దనిపా' అనే సంచారంలో నిలదీసి అడిగే రాగభావం వినిపిస్తుంది. పార్వతి 'కలహంసగమన' కనుక అలాంటి మందగమనంతో సాగే మిశ్రచాపును తాళగతిగా ఎన్నుకున్నారు. 'మపదనిపా' అనే స్వరసంపుటిని 'ఎక్కడికే' దగ్గర పొదగడంవల్ల ప్రశ్నభావం చక్కగా కుదురుకుంది. 'పమరి మారీసా' అంటూ 'సన్నిధికే' అంటూ సవినయంగా సమాధానాన్ని ఇస్తున్న షడ్జమాంతంగా వాలుతున్న గానం ఎంతో వినసొంపుగా ఉంది. వినయంతో తలవంచినట్లుగా అనిపిస్తుంది. 'ఎక్కడికే'లో 'కే'మీద 'నినిదమపా' అనే అనుస్వరాన్ని పొందించి తక్కువ జాగాలో ఎక్కువ సంగతిని వినిపించే తన ముద్రను మాస్టారు నిరూపించారు. ప్రశ్నను పైషడ్జమంలో అడిగితే, సమాధానం పంచమంలో ఒదిగి ఉండడం గొప్ప సాహిత్య గౌరవం. ఈ పాటంతా ఒక అక్షరం జాగా వదిలి అనాగత విధానంలోనే ప్రారంభమై మనోహరంగా సాగింది. పార్వతి పాత్రకు సుశీల కంఠం ఎన్నో అలంకారాలు చేసింది.

'మానస సరసిని' పాదంలో 'సరసిని, దళముల' పదాలపై మాత్రమే లయవాద్యాలు చూపిన విన్యాసం బాగుంది. అలాగే 'నన్నేల, నిలయాన' పదాలపై కూడా ఈ విన్యాసాన్ని చూపారు. ఈ పాట కాగానే మిశ్రగతిని చతురశ్రగతిలోకి మారుస్తూ లయవాద్యాలతో ఆదితాళాన్ని రెండు ఆవర్తాలలో వినిపించారు.

మన్మథుని ప్రవేశగీతాన్ని వసంతరాగంలో బాణీ చేశారు. ఎందుకంటే, ఋతురాజైన వసంతుడు మన్మథుని ప్రియమిత్రుడు కనుక. మాస్టారులోని రాగ, సాహిత్యపరిజ్ఞాన పాండిత్యగరిమ అది. 'తగదిది' గీతం ఎత్తుగడను మల్లాదివారి భావానుసారమే లయగతులకు అనుకూలంగా 'ససనిద నినిదమ దదమగా' అని అని మాస్టారే ఆలపించారు. దీని చరణాల చివరలో ఆఁ ఆఁ ఆఁ అంటూ ఆలపించడం 'అవును అవును' అని చెప్పే మంచి నాటకీయలక్షణం. అంతేకాదు, ఇవి ప్రశ్నార్థక శబ్దాలు కూడా. ప్రశ్నలను సందేహాలుగా అడుగుతూ ముందుకు ఒక్కో అడుగు వేస్తూ వెళ్లే భావాన్ని ఈ 'ఆఆఆ'లలో ధ్వనింపజేయడం మాస్టారి మేధావిశేషం. కాని దీన్ని మన్మథపాత్రధారి ఈ ధోరణిలో అభినయించలేదు. దీని రెండవ చరణంలో రెండవ భాగాన్ని పాడేప్పుడు లయలో అతీత విధానాన్ని అనుసరించారు. 'కనుగొనల'లో 'కను'ను పైకి లాక్కుని 'గొనల'ను సమంలోనూ, 'నీ'ని పైపంక్తిలో కలిపి 'దాసు'ను సమంలోనూ పాడడంవల్ల పాట నడకకు ఒక చురుకైన ఊపు వచ్చింది. దేశాది తాళంలో మాస్టారు 'తగదిది'ని రెండుసార్లు పాడాక అర ఆవర్తంలో లయవాద్యాలు ముక్తాయిని ఇచ్చాయి. తరువాత తారషడ్జమం నుంచి సమంలో 'అందగా' చరణాన్ని ఎత్తుకున్నారు. దీని తరువాత పల్లవిని ఎత్తుకుని పాడాక అర ఆవర్తంలో ముక్తాయిని వినిపించారు. అప్పుడు ఇంకో చరణం 'కోరిన

వాడెవడైనా'ను మధ్యమంలో నమం నుంచి ప్రారంభించారు. మొదటి పాదాన్ని భావప్రాధాన్యం కోసం రెండుసార్లు పాడారు. పల్లవిని తిరిగి పాడాక అర ఆవర్తం ముక్తాయిని ఇచ్చి వదిలేయగా వెంటనే 'ఈశుని దాసుని' ప్రారంభమైంది.

'ఈశుని దాసుని' పాట ఇంచుమించు శ్రీరంజని రాగధోరణిలో సాగింది. కాని 'కోలల గూలెడి' దగ్గర పంచమంలోకి రావడంవల్ల రీతిగౌళరాగపు వన్నె పూర్తిగా సాక్షాత్కరించింది. అనాగత పద్ధతిలో సుశీల ఒక అక్షరం జాగా వదిలి పైషడ్జమం నుంచి 'ఈశుని దాసుని' పల్లవిని ఎత్తుకున్నారు. 'అతడు' దగ్గర ఒక ఆవర్తంలో వీణ బిట్టును వినిపించారు. వెంటనే అదే పాదాన్ని మళ్ళీ పాడారు. 'నన్నేలునోయీ'లో 'యీ' అక్షరాన్ని లాగి పాడడంవల్ల మన్మథునిపై తిరస్కారభావం వ్యక్తమవుతున్నది. 'వలదోయీ'లో వేసిన సంగతులు తలను అడ్డంగా ఊపుతూ అసమ్మతిని ప్రకటిస్తున్నట్లుగా సాగడం గొప్ప సాభిప్రాయం. 'అపసదా' అని నిందించే పదంలోని 'సదా'ను షడ్జమ, ధైవతాలను ఉపయోగించి స్వరాక్షరవిన్యాసపూర్వక ఆలాపనను సుశీల వినిపించి ఆనందం కలిగించారు.

తరువాత ఇదే రాగంలో కొనసాగిస్తూ వీణ బిట్టును వైబ్రోఫోన్‌తో కలిపి ఒక ఆవర్తంలో వినిపించారు.

పిదప చెలికత్తెలు మన్మథుని హెచ్చరించే 'కానిపని మదనా' మహిళాబృందగీతంలో శహనరాగవిన్యాసంతో వెక్కిరింతను ధ్వనింపజేశారు. సాధారణంగా శహనరాగాన్ని కరుణరసానికి సంబంధించిన దైవప్రార్థనల్లోనో, పిల్లను అత్తవారింటికి పంపేటప్పుడో, ప్రభువును దీనంగా వేడుకోవడంలోనో ఉపయోగిస్తారు. కానీ ఇక్కడ మాస్టారు హెచ్చరికకు, నిలదీయడానికి, బుద్ధి చెప్పడానికి వినియోగించడం చెప్పుకోదగ్గ విశేషం. 'కానిపని'ని సమం నుండి 'దరిసనీదపమ' బాణీలో ప్రారంభించారు. 'మదనా' దగ్గర వీణపై అర ఆవర్తంలో 'రిరిగమప' అనే బిట్టును ఇచ్చాక సమంలోనే పంచమం నుండి 'అహంకరింతువ, హరుని జయింతువ' పాదాన్ని రెండుసార్లు పాడారు. ఈ పాదంలోని పదాలను ఒకదానికంటె ఒకటి పెంచుతూ అంటే, దైవత, షడ్జమాలను ఉద్ధృతంగా పలుకుతూ, బలమైన ప్రశ్నలతో నిగ్గదీస్తున్నట్లు శక్తిమంతంగా వినిపించారు. 'అది నీ చేతకానిపని' అక్షరాలను వెక్కిరిస్తున్న ధోరణిలో 'దరిసరి సనిదనిప' అనే స్వరసంపుటితో శబ్దించడం మరో ప్రతిభావిశేషం. తిరిగి పల్లవిని అందుకుని పాడాక 'రిరిగమదపా' అనే బిట్టును వీణపై వినిపించి పాటను ముగించారు. అయినా వినకుండా ముందుకు సాగుతున్న మన్మథునిపై చెలికత్తెలు మాటలతో థర్డ్‌డిగ్రీని ప్రదర్శించారు, అదీ సరస్వతి రాగంతో. ఇందులో మరింత వ్యంగ్యం స్ఫురిస్తుంది. అంతేకాదు, హుంకరింతకు ఏ ఫలితాన్ని అనుభవించాల్సివస్తుందో ఆ ఫలసిద్ధిని కూడా చెబుతున్నారు. ఇందులో కొంత కొంటెతనం కూడా కనిపిస్తున్నది. (ఇది ఒక ఊహ మాత్రమే) మానవీయ సంబంధాల ప్రకారం దేవుళ్ళకు వరుసలు కలిపితే పార్వతి సరసిజనాభసోదరి. అంటే ఆమె విష్ణువుకు చెల్లెలు. కనుక పార్వతికి మన్మథుడు మేనల్లుడు. అందుకే ఆమె మేనల్లునికి మర్యాదరీతిని (రీతిగౌళ) అనుసరించి నీతులు చెప్పింది. చెలికత్తెలు ఊరుకోక 'సరస్వతి'ని ప్రయోగించారు. శ్రీహరి నాభికమలసంభవుడు కనుక బ్రహ్మ విష్ణువుకు జ్యేష్ఠపుత్రుడు. ఆయన భార్య సరస్వతి. ఆమెకు మన్మథుడు మఱది వరుసలోనివాడు. వదినగారు మఱదికి చురకలు వేయడం, మేలమాడడం లోకసహజమేకదా! సంగీతవిశారద అయిన శారద సంగీతస్వరాలతో సాభిప్రాయంగా 'నీ పనిసరి' అంటూ చెంపలు వాయిస్తున్నట్లుగా నిందాపూర్వకమైన బాణీని అతనిపై విసిరింది. పైగా తాను 'శుకవాణి కనుక 'చిలుకతత్తడిరౌత' అని పిలిచి 'నా పలుకంత లేదు నీ వాహనం. నువ్వెంత, నీ విహారమెంత? వినకపోతివా....' అంటూ బెదిరిస్తున్నదా అని స్ఫురించేట్టుగా బాణీ చేసి పాడించిన మాస్టారి విజ్ఞత అపారం, అజరామరం. సరస్వతి రాగంలో అనాగతవిధానంలో 'చిలుకతత్తడి'ని పైషడ్జమంలో ప్రారంభించారు. మొదటిపాదాన్ని, రెండో పాదాన్ని రెండేసిమార్లు హెచ్చరిక పూర్వకంగా ఆలపించినారు. 'నీ విరిశరముల పనిసరి' దగ్గరి నుంచి చకచకా పాడుతూ 'తేజీ' పదాన్ని 'రిపపమరిస' బాణీలో బెదిరిస్తున్నట్లుగా ఎలుగెత్తి పాడారు. తరువాత 'రౌతా' దగ్గర ముగించారు.

వెంటనే తబల 'నాధింధినా' అనే హిందూస్తానీ పద్ధతిలో కహర్వా నడకతో సాగుతూ ఉండగా, వీణ, వైబ్రోలలో 'సాసస మామమ దాదద సా' అనే స్వరాలలో హిందోళరాగంతో బిట్టును ఇచ్చారు. అప్పుడు సమంలో

ఆధారషడ్జమం నుండి ప్రశాంతంగా 'సామగ సాగమ' అనే పల్లవిని సుశీల ప్రారంభించారు. ఈ పదాలలో స్వరసాహిత్యాలు రెండూ అందంగా కుదిరాయి. అలాగే 'శారద నీరద'ను కూడా 'సానిద నీదమ' అంటూ కొన్ని స్వరాలు కలిపారు. పల్లవిని పాడి 'సాధారా' దగ్గర వదిలేశాక అతీతవిధానంతో 8వ అక్షరం నుండి దైవతంలో బిట్టును ప్రారంభించి ఏ క్లిష్టతా లేకుండా నిరాడంబరంగా ఒక ఆవర్తంలో వీణపై వినిపించి మధ్యమంలో వదిలేయగా అక్కడి నుంచే 'ఇవె కైమోడ్పులు' చరణాన్ని ప్రారంభించారు. 'మహేశా' దగ్గర అవరోహణ గమకాన్ని అందంగా పలికించారు. తిరిగి పల్లవిని ఎత్తుకుని మొదటి పంక్తిని రెండో పంక్తితో కలిపి పాడుతున్నప్పుడు తబలాపై చక్కని రేకాలో చర్తీని వినిపించారు. జనసామాన్యం మెచ్చి నీరాజనాలు పట్టే రాగాలలో మొదటిది మోహనరాగం. రెండోది ఈ హిందోళరాగం. తరువాతనే శ్రీరాగం, శివరంజని వగైరాలు....

గుజరాత్, రాజస్థాన్‌లలో కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా రాదాకృష్ణుల విగ్రహాలను ఊయలలో అలంకరించి ఊపుతూ "హిం డోల" అనే పండుగ చేస్తారు. అప్పుడు వారు మాల్‌కౌంస్ రాగాన్ని తప్పకుండా ఆలపిస్తారు. దాక్షిణాత్యులు ఆ పండుగ సందర్భాన్ని గుర్తుంచుకోవడానికి వీలుగా ఆ రాగానికి 'హిందోళం' అని పేరుపెట్టి 19వ శతాబ్దం నుంచి కర్ణాటకసంగీతంలో ఉపయోగించడం ప్రారంభించారని ఒక కథనం ప్రచారంలో ఉన్నది. అందుకే త్యాగయ్యగారి కాలంలో చతుశ్రుతి దైవతంతో ఉన్న ఈ రాగంలోకి మాల్‌కౌంస్ ప్రభావంతో శుద్ధదైవతం ప్రవేశించి స్థిరంగా కుదురుకుందని మరికొందరు భావిస్తున్నారు. సినిమా పాటల్లో సుమారు సగానికి పైగా ఈ రాగమే వినవస్తుంది. ఇప్పటికీ ఎక్కడో ఓ చోట ఇది వినిపిస్తూనే ఉంది. ఈ రాగానికున్న సమ్మోహనశక్తి అద్భుతమైనది. "The Four" అనే చైనా చిత్రంలోని ఒక సన్నివేశంలో ఈ రాగాన్ని పియానోపై నేపథ్య సంగీతంగా వినిపించడం దీని విశ్వవ్యాప్తతకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. దీనికింత శక్తి ఉన్నది కనుకనే 'సామగ సాగమ' పాట అయ్యో! అప్పుడే అయిపోయిందా? అని అనిపిస్తుంది. 'అరవిందోజ్జ్వలా, మహనీయా'వంటి సంబోధనలకు తారస్థాయి సంచారం ఇవ్వడం సత్సంప్రదాయం, భావానుగుణవిధానం. మాస్టారు సంగీతం నిర్వహించిన సినిమాలలో కనీసం ఒక్కటైనా ఈ రాగంలో తప్పక ఉంటుంది.

దీని తరువాత మన్మథుడు తన పూలబాణాలను ఎక్కుపెట్టి శివునిపైకి విసురుతున్న దృశ్యంలో హిందోళరాగాన్నే ఉపయోగించుకున్నారు. వయొలిన్స్‌పై షడ్జమాన్ని కంపితగమకంతో వాయిస్తూ ఉండగా మొదటి పూలబాణం అరవిందం నాటుకునేప్పుడు మధ్యమాన్ని వినిపించారు. అప్పుడది శివుని హృదయంలో నాటుకుంది.

షడ్జమాన్ని కంపితగమకంతో వయొలిన్స్‌పై వినిపిస్తూ ఉండగా రెండవ పూలబాణం అశోకం నాటుకునేప్పుడు దైవతాన్ని వినిపించారు. ఇది శివుని కంఠంలో నాటుకుంది.

మధ్యమాన్ని కంపితగమకంతో వయొలిన్స్‌పై వినిపిస్తూండగా మూడవ పూలబాణం మామిడిపువ్వు నాటుకునేప్పుడు నిషాదాన్ని వినిపించారు. ఇది శివుని శిరస్సుపై నాటుకుంది.

'అయ్యో! ఆలస్యమవుతున్నదే, తొందరగా పని జరిపించాలి' అని మన్మథుడు తొందరపడుతున్నట్లుగా దైవతాన్ని కంపిత గమకంతో వయొలిన్స్ వినిపిస్తూ ఉండగా నాలుగవ పూలబాణం మల్లికను, అయిదవ పూలబాణం నల్లకలువను రెంటినీ ఒకేసారి ప్రయోగించగా, అవి నాటుకునేప్పుడు పైషడ్జమాన్ని వినిపించారు. ఈ రెండు బాణాలు శివుని రెండు కళ్ళకు నాటుకున్నాయి.

మరుక్షణమే శివుడు లేచి క్రోధంతో తాండవమాడాడు. ఈ తాండవాన్ని మాస్టారు నాలుగు రకాల తాళవైవిధ్యంతో నిర్వహించారు. ఆదితాళంలో మూడు ఆవర్తాలు, మిశ్రగతిలో 12 ఆవర్తాలు, ఖండగతిలో 18 ఆవర్తాలు, త్రిశ్రగతి ఆదితాళంలో మూడు ఆవర్తాలు వినిపించారు. చివరిలో నాలుగవ ఆవర్తం నుంచి క్రమంగా ఆదితాళంలోకి మారి ఉధృతంగా వినిపించారు. ఈ లయగతులను వినిపించేటప్పుడు నేపథ్యంలో హంసధ్వని రాగాన్ని ఉపయోగించారు. శివతాండవలయ గతుల కోసం మృదంగం, తబల, కంజీర, మోర్సింగ్, చండా, ఉడుక్కి, ఢమరుకం వాద్యాలను ఉపయోగించారు. అయిదవ ఆవర్తంలో శంఖనాదాన్ని కోపసూచకంగా వినిపిస్తూ కంటిమంటలను స్ఫురించేట్లుగా వైబ్రోఫోనును వినిపించారు. తారస్థాయి అంతరగాంధారం పైన

వయొలిన్స్ వినిపిస్తూ ముగించారు. వెంటనే 'అమ్మా' అనే మన్మథుని ఆర్తనాదాన్ని హృదయవిదారకంగా వినిపించారు. అది వింటే ఎటువంటివారికైనా గుండె కరిగిపోతుంది. మన్మథుడు బూడిద అయినాడు.

రతీదేవి మెల్లగా ప్రవేశించి, బూడిదకుప్పను చూసి విలపించి, పరమేశ్వరుని దర్శిస్తూ ఉండగా వయొలిన్స్‌పై "సా మా దా సా" అనే స్వరాలను వినిపించారు. హిందోళానికి, సావేరికి ఇవే స్వరాలుండడాన్ని మాస్టారు గమ్మత్తుగా ఉపయోగించుకున్నారు. తోడి, భైరవి, సావేరివంటి రాగాలను సంగీతశాస్త్రంలో ఉద్దండులైన తమిళదేశపు పండితులు చాలా ఇష్టపడతారు. ఆ రాగాలను పాడి మెప్పించినవారిని నెత్తిన బెట్టుకుని పూజిస్తారు. వాటిలో 'సావేరి' రాగాన్ని జాగ్రత్తగా ఆలపించాలి. లేకపోతే, ఏమాత్రం చెదిరినా మాయామాళవగౌళనో, మలహరినో, నాదనామక్రియయో అయిపోయి గాయకులను తలకిందులు చేస్తుంది. ఆర్తిని, మనోవేదనను, విన్నపాన్ని ప్రకటింపగలిగిన శక్తి సావేరిరాగంలో ఉందని తెలిసిన మాస్టారు 'విరులన్ నిను' పద్యాన్ని సావేరి రాగంలో బాణీ చేసి లీలతో పాడించి శివునితోబాటు అందరి గుండెల్ని కరగించారు. లీల పద్యాన్ని పైషడ్జమంలో అందుకుని పాడారు. ప్రభూ అని ఆవేదనతో పిలుస్తున్నట్లుగానే లీల పాడారు. 'మరుదేపున రూపున వర్ధిలుగా' మాటలను వ్యాఖ్యానిస్తున్న పద్ధతిలో 'మపదాదద సాసస' అంటూ 'మరుదే' పదాన్ని మకారంతోనే ప్రారంభించి క్రమవర్ధితస్వర స్వరూపాన్ని ఆవిష్కరించారు. పద్యం ముగింపులో 'ప్రభూ' అని ఆలపించిన తీరును జాగ్రత్తగా గమనిస్తే 'రోదన' శబ్దం తప్పకుండా వినిపిస్తుంది.

సావేరి రాగం 15వ మేళకర్త మాయామాళవగౌళ జన్యం.

ఆరో : సరిమపదస

అవ : సనిదపమగరిస

ఈ రాగంలో 'రామబాణత్రాణ' అనే త్యాగయ్యగారి కృతి; 'శంకరి శంకురు' అనే శ్యామశాస్త్రిగారి కృతి; 'కరి కలభముఖ' అనే దీక్షితార్ కృతి; 'బాగాయె నీ వగలెల్ల' అనే క్షేత్రయ్యపదం ప్రసిద్ధి పొందాయి. సినిమాపాటలు లేవు. అయ్యకంటె అమ్మ మనసు మెత్తది కనుక కామదహనానికి ఆవేదన చెందిన పార్వతి రతీదేవిపై సానుభూతితో పరమేశ్వరుని ప్రార్థించింది. 'అంబా యని' పాటను సుశీల తారస్థాయి షడ్జమం నుంచి ఆరభి రాగంలో, రూపకతాళంలో ప్రారంభించారు.

కొందరు ఈ పాట సామరాగంలో ఉందని, మరికొందరు దేవగాంధారిలో ఉందని చెబుతారు. కాని సూక్ష్మంగా పరిశీలిస్తే ఆ లక్షణాలు అంతగా ఇందులో కనిపించవు. సామ, ఆరభి, దేవగాంధారి రాగాలు చాలా దగ్గరి పోలికలతో ఉంటాయి. క్షుణ్ణంగా పరిశీలిస్తే తప్ప తేడాలు తెలియవు. సామరాగంలో నిషాదం ఉండదు. కాని ఈ పాటలో కాకలి నిషాదం ఛాయామాత్రంగా అవరోహణలో వినిపిస్తుంది. ముఖ్యంగా 'అంబాయని – జేకొనవో – గిరిబాల' పదాల దగ్గర సూక్ష్మంగా నిషాదం వినవస్తున్నది. దేవగాంధారిరాగంలో నిషాదం ప్రముఖంగా వినిపించాలి. కైశికనిషాదం కూడా తగుల్తూ ఉండాలి. 'దనీదవ' ప్రయోగంలో ఇది కనిపిస్తుంది. కాని దేవగాంధారి రాగపు పోకడ, రాగముద్ర, నిషాద సంచారం ఇవేవీ 'అంబాయని' పాటలో లేవు. కనుక దీన్ని మాస్టారు 'ఆరభి' రాగాన్ని దృష్టిలో పెట్టుకునే బాణీ చేశారని చెప్పవచ్చు.

'అంబాయని' పల్లవిని రెండోసారి పాడేప్పుడు 'అసమశరుడు' పదాన్ని మరోరకమైన సోపానక్రమపు విశేషసంగతితో పాడారు. మన్మథుడి విషయంలో 'తనయునిగా చేకొనవో'లో 'చేకొనవో'ను తారస్థాయిలో పాడలేదు. అలా పాడితే శాసించినట్లవుతుంది. ప్రభువును అర్థించాలి కాని శాసించకూడదు కదా! అందుకని 'చేకొనవో'ను 'సదరిస దపమగ రిమపద' అని ఒదిగివుండే తీరున బాణీ చేయడం విశిష్టమైన ఆధ్యాత్మిక గౌరవ పరిరక్షణయే. 'మనమే నీ' అనే చరణాన్ని పంచమం నుండి అనాగతం విధానంలో ఎత్తుకున్నారు. 'శరణం భవ' అని విడదీసి పాడడంవలన 'ఓ భవుడా! నీకు శరణం' అనే భావం ధ్వనించింది. ఇది మాస్టారి సాహిత్యవిచక్షణ. 'శరణంభవ' దగ్గరినుంచి సంస్కృతభాషా సంప్రదాయంలో పాట సాగింది. 'స్వామిన్' అనే సంబోధనాప్రయోగం అందులోని భాగమే. 'స్వామిన్' ను తారషడ్జమంలో వదిలేసి పాటను ముగించారు.

చివరలో నాదస్వరం, డోలు వాద్యాలతో మధ్యమావతి రాగంలో రిషభం నుండి బిట్టును పెండ్లి




మేళంలాగా వినిపించారు. అప్పుడు తారషడ్జమంలో 'బిడియపడి'ని సమంలో ప్రారంభించి గాయనీగాయక బృందం ఖండగతిలో పాడారు. 2, 4 పాదాలను మల్లిక్, రాఘవులు మాత్రం రిపీట్ చేశారు. ఈ మంగళం తరువాత 'కూచెన్నపూడి' నుంచి చివరిదాకా మల్లిక్ మాత్రమే సాకీలాగా పాడుతూ రాగాలాపనతో ముగించారు. మాస్టారుగారి సౌజన్యానికి, సహృదయానికి ఇది చక్కనైన తార్కాణం. ప్రారంభంలోని 'అంబా పరాకు'ను, ఈ చివరి సాకీని మల్లిక్‌గారితోనే పాడించడం మాస్టారుగారి విశాలహృదయం. ఇతర గాయకులకు ఆయన ఇచ్చే ప్రోత్సాహం, గౌరవం ఇంత గొప్పగా ఉంటాయి. సాటి గాయకులపట్ల ఆయనకు ఎంతో అభిమానం, ఆప్యాయత, ప్రేమ ఉండడం మంచి ఆదర్శం.

సాధారణంగా స్త్రీపురుషకంఠాల స్థాయీభేదాన్ని బట్టి ఆయా గీతాలను శ్రుతులు మారుస్తూ పాడేట్టుగా చాలామంది బాణీ చేయడం మనం వింటూంటాం. కాని మాస్టారు గారి ప్రయోగం గమనించండి. 'అంబాపరాకు' దగ్గరి నుంచి 'జయమంగళం' దాకా ఒకే శ్రుతిలో (C. Sharp) ఆయన నిర్వహించి యక్షగానానికి ఒక చక్కని శిల్పాన్ని నిర్మించారు. ఎక్కడా శ్రుతి మార్చడం కాని, మధ్యమ శ్రుతిలోకి తీసుకోవడం కాని చేయలేదు. దీనివల్ల 15 నిమిషాలపాటు రాగమాలికలో ఒకే పాటను విన్నంత తృప్తి, ఆనందం మనకు కలుగుతాయి. అదీ ఘంటసాల మాస్టారుగారి ప్రజ్ఞాధురీణత.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ. ఫోన్: 939 661 1905.

## కమ్మతెమ్మెరలు

"... *మనసు జారిపోయే చోటు కిలిమంజారో* సాసయాత్ర గురించి చాలా చక్కటి వ్యాసం ***మిసిమి*** అక్టోబర్ – 22 పత్రికలో ప్రచురించారు. చాలా మంచి వ్యాసం. అనువాదకులు *భ్రమణకాంక్ష* ఎమ్. ఆదినారాయణ గారికి శుభాకాంక్షలు. రచయిత డా. నిమ్మగడ్డ శేషగిరిరావుగారికి శుభాకాంక్షలు.."

*– డా. బి. నాగశేషు, మైసూర్*

"... గౌరవనీయులైన అశ్వనీకుమార్‌గారికి, ఈ నెల ***మిసిమి*** (అక్టోబర్–22)లో ఆచార్య సచ్చిదానందమూర్తి పై యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేరుతో వచ్చిన వ్యాసం (75వ పేజీ) ఆయన వ్రాసింది కాదేమోననిపిస్తోంది! దయచేసి మరొక్కమారు చదివి చూడండి. ఆయన తెలుగులో గొప్ప రచయిత కాకపోయినా, అంత అధ్వాన్నంగా మాత్రం రాయలేదు!..."

*– డా. కృష్ణమూర్తి, వాట్సాప్*

"... ఎడిటర్ గారికి, ***మిసిమి*** సెప్టెంబర్–22లో మీరు ప్రచురించిన నా వ్యాసం *హరివంశ కృష్ణ* చదివి ప్రశంసిస్తూ 32 ఫోన్లు వచ్చాయి... మీకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు"

*– మోదుగుల రవికృష్ణ, గుంటూరు*

"... ***మిసిమి*** సెప్టెంబర్–22లో మీరు ప్రచురించిన *భారతీయ రిజర్వు బ్యాంకు: వ్యక్తా వ్యక్త రూపం* క్షుణ్ణంగా చదివాను. ఎంతో సమాచారం నింపుకొని, రిజర్వ్ బ్యాంక్ గురించి సామాన్య పాఠకులకు తెలియని ఎన్నో విషయాలు దీని ద్వారా తెలుసుకున్నాను. రాయవరపు సత్యనారాయణగారికి ధన్యవాదాలు..."


*– కోదూరు పుల్లారెడ్డి, హైదరాబాద్*

"... ఈ మధ్య ***మిసిమి*** లన్నీ మళ్లీ చదువుతున్నాను. ఒక్కో వ్యాసం ఒక్కో ప్రత్యేకత. విషయ పరిజ్ఞానంలో, పరిశోధనలో, ఎంతో లోతుగా అధ్యయనం చేసి రాసినవి.. యువతకు ఎంతో ఉపయుక్తమైనవి. కొన్ని సంపాదకీయాలు అద్వితీయం... ఇంకా చాలా చెప్పాలి...."

*– పతివాడ సూర్యనారాయణ, హైదరాబాద్*

# బౌద్ధధర్మ సేవలో చెన్నూరు ఆంజనేయరెడ్డి

*- ముంగర జాషువ*



చెన్నూరు ఆంజనేయరెడ్డి

ప్రపంచ ప్రఖ్యాత బౌద్ధగురువు అనగారిక ధర్మపాల స్థాపించిన మహాబోధి సొసైటీ ఆఫ్ ఇండియా, కలకత్తా వారు 2009 సం॥లో చెన్నూరు అంజనేయరెడ్డిగారికి అరుదైన 'ధర్మశ్రీ' పురస్కారాన్ని అందించి గౌరవించారు. నా దృష్టిలో, వాస్తవ దృష్టిలో అనేకమంది అందుకొంటున్న 'పద్మశ్రీ' పురస్కారానికన్నా ఇది ఉన్నతమైంది. ఎందుకంటే, ప్రపంచంలో అనేక దేశాల్లో సామాన్యులు, మేధోజీవుల మస్తిష్కాలతో మెలగుతున్న, వెలుగుతున్న బౌద్ధధర్మానికి సేవచేసినందుకు ఇచ్చిన గౌరవ పురస్కారం కాబట్టి!

ఈ మహాసభలో ప్రసిద్ధ బౌద్ధగురువు రేవతిథేరొ సత్యనారాయణ బోధి, ప్రముఖ బౌద్ధ రచయిత శ్రీ అన్నపురెడ్డి, మంచి బౌద్ధుడు వలపర్ల జానుగారు ఇంకా అనేక ప్రముఖులు పాల్గొన్నారు. దాదాపుగా యాభై సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ నుంచి కలకత్తా సభకు హాజరయి మన తెలుగువాడికి జరిగిన ఘనసన్మానం చూసి ఆనందించాము. ఇది ఒక అపూర్వ సన్నివేశం. అక్కడే వారం రోజులు ఉన్నాం. కలకత్తా అనేసరికి శరత్‌చంద్రుడు, రవీంద్రుడు, బంకించంద్రుడు, నందాలాల్ బోస్, హసిత్ కుమార్ హల్దార్‌లాంటివారు జ్ఞాపకం రాకుండా ఉండరు. మహామానవుల ప్రభావం అలాంటిది. పూర్వం దేశగతిని మార్చిన ఆదర్శవాదాలు, ఉద్యమాలు అన్నీ బెంగాల్ నుంచి ఆంధ్రప్రదేశ్ దిగుమతి చేసుకొనేది.

శ్రీ చెన్నూరు వారు, ఆ సభలో చేసిన ఆంగ్లోపన్యాసం, నాలాంటివారికి కొంత అర్థం కాకపోయినా, ఆయన మెత్తని స్వరంలో నుంచి వచ్చిన మాటలు అమ్మ పాడే జోలపాటలాగా, దాదాపు వేయిమంది సభికులను ఒక తన్మయీ భావంలోకి నెట్టివేశాయి. రెడ్డిగారి స్వరం వికృతి స్వరం. సంగీత నాదంలో ప్రకృతి స్వరాలు, వికృతి స్వరాలుంటాయి. ప్రకృతి స్వరాలయిన సరిగమపదనిసల కన్నా, చతుశ్రుతి రిషభం, సాధారణ గాంధారం, చతుశ్రుతి దైవతం కైశికీనిషాదంలాంటి కొన్ని వికృతి స్వరాల్లో ప్రకంపనలు ఎక్కువగా ఉండి ఒక విస్తృత రసతన్మయతకు దారితీస్తాయి. అతిసూక్ష్మ శబ్దనాదాలవి. రెడ్డిగారితో స్నేహం చేస్తున్న అనేకమంది మిత్రులు, కవులు, కళాకారులు, బౌద్ధులు ఆయన్ని వదలకపోవడానికి ఆయన స్వరనాదం లేక నాదస్వరం ఔతుంది. నా స్వీయానుభవం కూడా ఇదే! రెడ్డిగారు బౌద్ధమత ఆదర్శాల, సామాజిక వాస్తవికాల, కళాదృక్పథ సేవా కార్యక్రమాల రసాయనిక సమ్మేళం అనడం సమంజసమూ, సహేతుకం గూడా!

సికింద్రాబాద్ అనంద బుద్ధవిహార్ ట్రస్టు, నాగార్జునసాగర్, హిల్‌కాలనీలో 270 ఎకరాల్లో ఉన్న బుద్ధవనం, విపశ్యనా ధ్యానకేంద్రం, ఇంకా అనేక బౌద్ధ ఆరామాలను నిర్మించినా, పునర్నిర్మించినా, అనేక కళా, తాత్త్విక గ్రంథాలను ప్రచురించినా, తెలుగు త్రిపిటికాల ప్రాజెక్టును చేపట్టినా, సుహృల్లేఖ, బుద్ధభూమి, ***మిసిమి*** లాంటి ప్రముఖ పత్రికలకు వెన్నుదన్నుగా నిలచినా, పేద కళాకారులకు, కవులకు దానపారమితను అమలుపరచినా లక్ష్యం ఒక్కటే! అస్తవ్యస్తంగా ఉన్న సమాజాన్ని ఒక ధార్మిక క్రమబద్ధీకరణకు తీసుకురావాలనే ఉద్దేశ్యం మాత్రమే! ఇంత ఉన్నత లక్ష్యంలో కొంత అసఫలత ఉన్నా అది గొప్ప సఫలత క్రిందే లెక్క! మహా ఆదర్శాల అంతిమ ఫలం యీ విధంగానే ఉంటుంది.

ఇంకా అనేక రంగాల్లో రెడ్డిగారు తెలుగువారికి చేసిన సేవలు విస్మరించరానివి. నేను దగ్గర ప్రయాణాలు చేస్తున్నప్పుడు, రెడ్డిగారు నాకు తెలుసునని అవతలివారికి సూచించడానికి, టూరిజం, పోలీసు, ఆర్.టి.సి.




మహాబోధి బుద్ధవిహార - మహేంద్రహిల్స్, సికింద్రాబాద్

ఉద్యోగులను, రెడ్డిగారి గురించి మాట్లాడినప్పుడు రెండు చేతులెత్తి నమస్కరించేవాళ్లు. రెడ్డిగారు తెలుసునని నన్ను గూడా గౌరవంగా చూసేవారు. వారి గుండెల్లోని ఆనందం కళ్లల్లో మెరిసేది. ఆయన సేవలు, సంస్కరణలు ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపి, ప్రభుత్వాలకు గూడా పేరు తెచ్చాయనడం సహజోక్తి మాత్రమే!

ఆంజనేయరెడ్డిగారికి నచ్చిన పదం 'ధర్మం' నడిచే పదం 'ధమ్మపథం'. మనం చూస్తున్న మఠాధిపతులు, ఫాదరీలు, వామపక్ష మేధావులు, కవులు, కళాకారులు 'ధర్మం' అనే పదాన్ని తేలిగ్గా తీసుకొంటారు. ఏది 'ధర్మం' అనేది వారికి అంతుపట్టదు. వైదిక, జైన, బౌద్ధ, క్రైస్తవ, ముస్లిం, సిక్కు మతధర్మాలను, ఇంకా తాత్త్విక మార్గాలను పరిశీలిస్తే, ఏ మత సిద్ధాంత వాసనలను అంటని, పాక్షికతలేని, 'ధర్మం' అనేది మాత్రమే ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. దీనికి దగ్గరలో ఉన్న బౌద్ధ ధర్మాన్ని చాలావరకు రెడ్డిగారు అవలంభిస్తున్నప్పటికీ, ఆయనలో ఉన్న కొంత స్వేచ్ఛా చింతన సృజనాత్మక ధర్మాన్నే అవలంభిస్తుంది. ఏ క్షణానికాక్షణం నవ్యన్యాయాన్ని తెలుసుకొనేదే సృజనాత్మక ధర్మం. ఏ పాత, కొత్త చట్టాలలో లేనిది ఇది. ఈ భావజాలం ఆయనలో పైకి కనిపించని ఆంతరంగిక స్ఫూర్తి, మూర్తిమత్వం!

శ్రీ చెన్నూరు చేసిన కార్యక్రమాలను ఒకసారి విహంగ వీక్షణం చేసినట్లయితే ఆయన 'మానవుడే మహనీయుడు' అనే బౌద్ధసూత్రాన్ని తీసుకొని (సినారె పాటను గాదు) సామాజిక రుగ్మతలకు కారణం అయిన పేదరికాన్ని, అజ్ఞానంతో ఏర్పడిన దుఃఖాన్ని వివేచన చేసినట్లు అవగతం ఔతుంది. ఒక ధార్మిక వాతావరణం ఆయన అనేక రచనల్లో నేపథ్య చిత్రంగా కనిపిస్తుంది. ఆయన భావాలు ఆచరణాత్మక అనుభూతి లేని శుష్కవచనాలు కావు. జీర్ణంకాని శాస్త్ర ఉట్టంకింపులు కావు. శబ్దాన్ని విడగొట్టి అధ్యయనంవలన ఏర్పడిన జ్ఞానం. సమ్యక్ సంబోధి, ప్రతీత్య సముత్పాదం, అష్టాంగ మార్గం, శూన్యతా సిద్ధాంతాల నీడలో ఉన్నప్పుడు ఏర్పడిన జ్ఞానం. అందుకే కాకతీయ యూనివర్సిటీ నిర్వహించిన జాతీయ సదస్సులో చేసిన కీలకోపన్యాసంలో ఆయనంటాడిలా "The shramana thought as it has come down to us in both Jain and Buddhist traditions has had no concept of a creator; they believed in the doctrine of Karma which is an impersonal natural law that operates in accordance with our actions and without the intervention of any external agency. Karma in Buddhism is a substitute for God In this profound insight of dependend co-orgination, 'Pratitya Samutpada', the Buddha explains the arising, abiding and Ceasing of all phenomena, physical and mental, due to configuration of causes and conditions. This implies the absence of any permanent or inherent essence of self in any Phenomena. Buddhist and Jain traditions strongly believe in man's capacity to raise himself spiritually? by his own effort".

(సమణుల ఆలోచన, మనకు జైన, బౌద్ధాల నుంచి వచ్చినదేమిటంటే 'సృష్టికర్త దేవుడు' అనే ఆలోచన లేదు. వాళ్లు నమ్మిన కర్మ సిద్ధాంతం, మానవీయ, ఆత్మలేని ప్రాకృతిక న్యాయం, మనల్ని మన క్రియలకు అనుగుణంగా నడిపిస్తుందిగాని, అందుకు బాహ్యమైన కర్తృత్వం ఏదీ కారణం కాదు. కర్మ అనేది బౌద్ధంలో దేవుడికి ప్రత్యామ్నాయం. బుద్ధుని లోతైన అంతర్దృష్టి సహకారంతో ఉనికిలోకి వచ్చిన 'ప్రతీత్యసముత్పాదం'లో అతను విశ్లేషించిన దృశ్యప్రపంచం కలగటం, స్థిరత్వం పొందడం, నశించడం, శారీరక, మానసిక అంశాలు వివిధ కారణాల, పదార్థాల, వివిధ స్థితుల కలయిక మాత్రమే. ఇందువలన తెలిసేదేమిటంటే, శాశ్వతమైన ఉనికి, అంతఃస్సారంగా ఉన్న ఆత్మ – దృశ్య ప్రపంచంలో లేదు. బౌద్ధ, జైన సాంప్రదాయాలు దృఢంగా మానవశక్తియే తనంత తాను

ధార్మికంగా ఎదుగుతుందని నమ్ముతాయి''). (స్వేచ్ఛానువాదం వ్యాసకర్త).

ఇటువంటి క్లిష్టమైన ప్రామాణికమైన విశ్లేషణ రెడ్డిగారికి బౌద్ధ, జైన ధర్మాల పైనవున్న ప్రగాఢమైన విశ్వాసాన్ని సూచిస్తుంది. రచయితలో ఒక విశిష్టమైన 'ధర్మం' లేకపోతే ఈ పద్ధతిలో రచన చేయడానికి అవకాశం ఉండదు. ఒక మనిషి అంతఃకరణలో ధార్మిక ప్రవృత్తి ఉంటే దానికి వెలుపల జ్ఞానం ఉంటుంది. ఇంద్రియాలు, మనస్సు స్వీకరించే జ్ఞానాన్ని పరిశోధించి తెలుసుకోవాలి. అయితే ఈ జ్ఞానం తాత్త్వికాచరణ ఉంటేగాని ఏర్పడదు. జ్ఞానం, ధర్మం అనేవి పోష్య పోషకాలు, ఆధార అధేయాలు. తత్త్వజ్ఞానంతోనే ధర్మాన్ని ఆచరించవలసి ఉంది. సమ్యక్ జ్ఞానం తెలుసుకోకుండా ధర్మం ప్రయోజనం ఫలవంతం కాదు. అందరూ 'సమ్యక్' పదాన్ని జ్ఞానం ముందు తగిలిస్తారు. ఒక మేరువులాంటి వైదిక ధర్మం విఫలం చెందింది ఇక్కడే. సమ్యక్ జ్ఞానం లేకుండా బ్రాహ్మణ ధర్మం, క్షత్రియ ధర్మం, శూద్రధర్మంలాంటివాటిని నిర్మించడంవల్లనే! అతి స్వార్థానికి పీఠం వేయడంవల్లనే! ఇదంతా, ఇటువంటి విషయాలను అవగాహన చేసుకొని, బౌద్ధ తత్త్వజ్ఞానంతో ధర్మాన్ని ఆచరించే స్థితికి, ఒక మామూలు స్థాయిలోనైనా రెడ్డిగారు నిలబడగలిగారు. ఇది మనం గమనించదగిన విశేషం.


రెడ్డిగారిని గురించి ఇంకా కొన్ని విషయాలు చెప్పుకోవలసిన ఆవశ్యకత తరుముతుంది. ఒక సామాన్యుడినిగాని, అసమాన్యుడినిగాని సులభంగా నమ్మేదిశలో వీరు ముందువరుసలో ఉంటారు. ఇది ఆయనకు ఎక్కువసార్లు ఆశాభంగాన్ని, నష్టాన్ని కలిగించి ఉంటుంది కూడా! ఈ రోజుల్లో ఒక మనిషిని సులభంగా నమ్మడం అనేది ఒక గొప్ప మానవత్వానికి గుర్తు అయినప్పటికీ సమర్థించవలసిన విషయం కాదు. గర్భిణీ మేఘం మనం అడగకపోయినా వర్షించినట్లు, కోయిల కోమల స్వరాలాపన చేసినట్లు, ఉత్తమ మానవులు తాము బాధపడినా, నష్టపోయినా ఉదాత్త ప్రవృత్తి నుంచి క్రిందకు జారిపోలేరు. ఈ ప్రవృత్తియే శ్రీ చెన్నూరు సమాజసేవకు అంకితమవడానికి కారణం అయింది. ఆయన శక్తి పరిమితం కనుక, ఒక పరిధిలోనే సమాజసేవ చేయగలుగుతున్నారనడం వాస్తవం.

మనం స్థూలంగా చూచినా సమాజం అస్తవ్యస్తంగా, హేయమైన పరిస్థితుల్లో ఉన్నదని అర్థమవుతుంది. ఇందుకు సాక్ష్యంగా ప్రసిద్ధి చెందిన జె.కె. రచనల నుంచి, ఉదాహరణలు ఇవ్వనవసరం లేదు. సామాజిక సంస్కర్తలు, కవులు, కళాకారులు, మేధావులు, వ్యక్తినీ, సమాజాన్ని, ప్రభుత్వాలను మార్చాలని అనేక ప్రయోగాలు, రచనలు, కళాఖండాలను నిర్మించారు, నిర్మిస్తున్నారు కూడా! రెడ్డిగారు ఇదే మార్గంలో కాకుండా ఒక ప్రాచీనపథం, బౌద్ధపథం త్రొక్కాడు. మహామేధావి డా॥ అంబేద్కర్ ప్రారంభించిన బౌద్ధ పునఃర్జాగృతి ఉద్యమాన్ని ఆంధ్రదేశంలో రెడ్డిగారు ప్రారంభించి నాగార్జునసాగర్‌లో 'బుద్ధవనం' రెండు, మూడు ప్రభుత్వాల, ఇతరుల సహకారంతో నిర్మింపజేశాడు. అందువల్లనే బౌద్ధులు "ఆంధ్రా అశోకుడు" అంటారు. ఒకటి, రెండు శతాబ్దాలు గడచిన తర్వాత అలసత్వం పూనిన చరిత్రకారులు, ఇది అశోకుడు నిర్మించాడని రాస్తారనడం అతిశయోక్తి కాదు. అంత బృహత్ నిర్మాణం అది. శిల్ప, వాస్తు కళాకౌశలంలో!

శ్రీ చెన్నూరు వారిని చూసినప్పుడల్లా, అసలే ఎక్కువగా 'దాడాయిస్టులు' మెసలే పోలీసు శాఖలో ఉన్నతాధికారిగా అన్ని సంవత్సరాలు ఎలా ఉద్యోగం చేశారనిపిస్తుంది. ఆయన శరీరాకృతిలో కనిపించే 'మొరటుతనం' ఆయన మాటల్లో, చేతల్లో కనిపించదు. అందుకు ప్రధాన కారణం ఆయనొక 'రసాస్వాదకుడు' (connoissor) కావడమే. రాగాలాపనల్లోని లయమాధురిని, ఒక రమణీయ దృశ్యంలోని 'రూపలయను' కవితా సౌందర్యంలోని శబ్దార్థలయను ఆస్వాదిస్తాడు, విశ్లేషిస్తాడు కూడా! అందువల్లనే 'జీవనకళ' మంద్రస్థాయిలో, ఆర్ద్రంగా సాగిపోతూవుంది.

రెడ్డిగారు కవికాదు, కవితా హృదయం ఉంది. వీరిని చూస్తుంటే నవరంగ్ సినిమాలో శాంతారామ్ జ్ఞాపకం వస్తాడు. తాత్త్వికుడు కాదు, అయితే బలమైన సొంతంగా design చేసుకొని మలచుకొన్న దార్శనిక దృక్పథం ఉంది. చిత్ర, శిల్పాలలోని కళామర్మజ్ఞత ఆయనకు తెలుసు. ఎన్ని విషయాలు తెలిసినా, ఏమీ తెలియనట్లు ఉండటం కూడా ఆయనకు తెలుసు.

శ్రీ చెన్నూరు వారు సహజంగా భావపరిణామం చెందారని ఎవరైనా చెబితే నేను నమ్మను. ఆయన ముఖం



బుద్ధవిహార నాగార్జున సాగర్

చూస్తుంటే అకుశలాల నుంచి కొంత బలవంతంగా, బ్రహ్మప్రయత్నం చేసి కుశలాలవైపుకి మరలిన వ్యక్తిగా కనిపిస్తారు. ఈ కాలంలో మేథావులంతా ఇంతే! ఏది ఏమైనా రెడ్డిగారు 1986లో బౌద్ధధర్మ ప్రభావంతో, ప్రస్తుత దలైలామా ఆశీస్సులతో బౌద్ధానికి మరలటం రెండు తెలుగు రాష్ట్రాలలోని బౌద్ధుల అదృష్టం. అన్నిటికీ మూలం అయిన ప్రాచీన సూక్తి ఒకటుంది. 'నిన్ను నీవు తెలుసుకో' అనేది. రెడ్డిగారు ఈ మార్గంలో పయనిస్తున్నారు. ఒక గాఢమౌనం ద్వారా, ఒక విపశ్చిన ధ్యానం ద్వారా, నిరంతర ఆత్మవిశ్లేషణ ద్వారా అవగతం ఔతుంది అది. ఇది అర్థం చేసుకొని, సంపన్నులందరూ తొక్కే మార్గం త్రొక్కలేదు. ఆయన జీవితాదర్శం పీడితుల గుండెల్లో నిండి, కన్నీళ్ల ద్వారా బయటకు రాని దుఃఖాన్ని, దాని కశ్మలాలను తొలగించాలనే తీవ్ర ప్రయత్నం వారిది. ఇది సామాన్య మార్గం కాదు, ముళ్లదారి. ఇది నెయ్యితాగి నీతులు చెప్పే మార్గం కాదు. శ్రమతో, ధార్మిక దృష్టితో కూడుకొన్నది. ఇది గొప్ప ఆదర్శమానవునికే సాధ్యం ఔతుంది.

తెనుగులెంక అన్నట్లు బౌద్ధ సేవకుడు రెడ్డిగారి రచనల నుంచి ఇంకా ఒకటి, రెండు ఉదాహరణలు ఇచ్చి ముగింపుకు వస్తాను. ఆయన "Influence of Buddhism on Indian way of life" అనే వ్యాసంలో ఆయన– "Philospahy and psychology - both started with the Buddhists. The Buddhist ideas like living in the moment, impermanence and change continued down the ages to 20th century philosophers like J.K. and Rajaneesh that they used modern terminology."


తత్త్వశాస్త్రం, మనోవిజ్ఞానశాస్త్రాలు, రెండూ కూడా బౌద్ధులతోనే ఆవిర్భవించాయి. బౌద్ధుల భావనలయిన ఈ క్షణంలో జీవించడం, అశాశ్వితత్త్వం, మార్పు అన్ని కాలాల్లో నుంచి వచ్చి, 20వ శతాబ్ది తాత్త్వికులైన జె.కె., రజనీష్‌లు ఈ భావాలనే ఆధునిక పదజాలంతో ఉపయోగించారు. (అనువాదం వ్యాసకర్త)

ఇంకొక చిన్న ఉదాహరణ. రెడ్డిగారు 'సిద్ధార్థ గౌతముని జీవనగాథ' అనే వ్యాసంలో (***మిసిమి*** మే, 2012) బుద్ధునిలోని ఒక పార్శ్వాన్ని ఈ విధంగా ఉల్లేఖించారు. "శాక్యులను ఆత్మాభిమానం, సమరశీలస్వభావంగల జాతిగా త్రిపిటకాలు వర్ణించాయి. గౌతముడు ఎంతో సాధుమూర్తి, సంయమనశీలి అయినా స్వతంత్ర భావవ్యక్తీకరణలోనూ, వైదిక కర్మకాండలను ఖండితంగా నిరసించడంలోనూ, సాధికారధోరణిలోనూ ఆయన జాతి లక్షణాలు ప్రస్ఫుటమౌతాయి" (అనువాదం కీ.శే. గజ్జల మల్లారెడ్డి). రెడ్డిగారి రచనలను, ఆయన జీవన విధానాన్ని, కార్యక్రమాలను రేఖామాత్రంగా విశ్లేషించగలిగాను. ఇంకా చెప్పవలసిన విషయాలు అనేకం ఉండవచ్చు, ఉన్నాయి కూడా. రెడ్డిగారిలో నాకు నచ్చని అంశాలు కూడా ఉన్నాయి. 'రెడ్డితనానికి' దూరంగా ఉండటం, ధనాన్ని తృణప్రాయంగా భావించడం, కొన్నిసార్లు అపాత్రదానం చేయడం, తనకు చిక్కులు కల్పించినవారిని క్షమించడం, తన సన్నిహితులందరికన్నా మిన్నగ బౌద్ధపండితుడు శ్రీ వీరనారాయణరెడ్డిని 'అన్నా' అని ప్రత్యేక మర్యాదనీయడం, తనకు వృద్ధాప్యం వచ్చిందని మర్చిపోవడం, టెలివిజన్ ఛానల్స్ చర్చల్లో అవతలివారు మాట్లాడిన తర్వాత మాట్లాడటం, తెలుగును విస్మరించి ఆంగ్ల పత్రికలు దక్కన్ క్రానికల్, హిందూ దినపత్రికలకు రచనలు చేయడంలాంటివి ఇంకా ఉన్నవి. సమయానికి జ్ఞాపకం రావటం లేదు.

ఈ వ్యాస రచయిత పునర్జన్మను, నమ్మడుగనుక సరిపోయింది. లేకుంటే శ్రీ చెన్నూరు ఆంజనేయరెడ్డిని, ఆనందుడితోనో, బావరితోనో పోల్చేవాడు. ఆ అవకాశం చేజారిపోయింది.

రెడ్డిగారు ఒక మహానది. రెండు రాష్ట్రాలలో ప్రవహించే జీవనదుల మధ్య, ధర్మసూత్రాలను ప్రవహింపచేస్తూ ఉంటుంది ఈ మహానది, నిరంతరంగా, గతిశీలత్వంతో! ❁

ముంగర జాషువ - నాగార్జునసాగర్, ఫోన్: 824 783 9312.



డా. నారాయణ

## డా. నారాయణ తో మాటామంతీ...

– అశ్వినీకుమార్

***మిసిమి***: *నారాయణగారు నమస్కారమండీ.. మీ బాల్యం, చదువు విశేషాలతో ఇంటర్వ్యూని ప్రారంభిద్దాం..*

**నారాయణ**: నమస్కారమమండీ.. చిత్తూరు జిల్లా నగరి మండలం ఐనంబాకం మా ఊరు. తమిళనాడు బోర్డర్‌లో ఉంటుంది.. ప్రాథమిక విద్య మా పక్క ఊరు తామరపాకంలో చదివాను. హైస్కూల్ విద్యంతా అంటే SSLC వరకు నగరి జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో చదవటం జరిగింది. తరవాత PUC మదనపల్లిలోని బెసెంట్ థియోసాఫికల్ (BT) కాలేజీలో సాగింది. అది పూర్తి చేశాక గుంటూరులోన ఆయుర్వేద కళాశాలలో BAMS పూర్తి చేశాను.

***మిసిమి*** : *విద్యార్థి దశనుండే మీపై వామపక్షభావాలు, సిద్ధాంతాలు ప్రభావం చూపాయా? లేదంటే కాలేజీ చదువు పూర్తయ్యాకా?*

**నారాయణ**: మా గ్రామంలో మాది వ్యవసాయ కుటుంబం. మా నాన్న వ్యాపారం చేసేవాడు. ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం ఉండేది కాదు, మాకు కానీ, మా బంధువులకుగానీ, మా ఊరికిగానీ.. రాజకీయాలు ఎప్పుడు ప్రభావితమయ్యాయంటే ఎన్టీ రామారావు అధికారంలోకి వచ్చాక నాన్ పొలిటికల్ సెక్షన్ కాస్తా పొలిటికల్ అయ్యారు.

నేను హైస్కూలులో ఉన్నప్పుడు రోజూ ఇంటికి పోతే దీపం పెట్టేవాడిని. ప్రతి శనివారం గుడి కడిగేవాడిని. గుళ్ళో దీపం పెట్టడం, శనివారం కడగడం నావంతు. అలాగే ఏ పండగొచ్చినా ఆచరించేవాడిని. SSLC పాసయాక కొండకు వెళ్లి గుండుకొట్టించుకున్నవాడిని. అయితే గుంటూరులో చేరిన తరువాత ముందు స్టూడెంట్స్ యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేవాడిని. తరవాత నేను మా కాలేజీ యూనియన్ జనరల్ సెక్రటరీగా గెలిచాను. అప్పట్లో గుంటూరులో ఒక అలవాటుండేది. అన్ని కాలేజీల యూనియన్ల ఆఫీసు బేరర్లు అప్పుడప్పుడు సమావేశం అవుతుండేవారు. అలా నేను AISF (All India Students Federation)కు పరిచయం అయ్యాను. AISF పరిచయం అయాక సిద్ధాంతాలు, రాజకీయ అంశాలు తెలియటం మొదలయింది. అలా నాకు మార్క్సిస్టు భావజాలం అవగాహన చేసుకునే అవకాశం వచ్చింది. ఆ పొలిటికల్ థాట్ అలవడింది. చివరికి భావవాదిగా ఉండేవాడిని భౌతికవాదినయిపోయాను (నవ్వు).

***మి***: *అంటే కాలేజీ చదువు ప్రభావం మీ మీద లేదు?*

**నా** : కాలేజీలో చేరిన మొదటి రెండు సంవత్సరాలు సిన్సియర్‌గా ఉన్నా. ప్రొఫెషనల్ కాలేజీ కదా! ఉదయం పూట హాస్పిటల్‌కు వెళ్ళాలి. మధ్యాహ్నం క్లాసెస్‌కు హాజరవ్వాలి. హౌస్ సర్జన్సీ చేయాలి. మూడో సంవత్సరంవరకూ అన్నీ చేశాను. నాలుగో సంవత్సరం వచ్చేసరికి ఇటువైపు యాక్టివ్ అయిపోయాను. ఫుల్ టైమ్ యాక్టివిస్ట్‌గా మారేటప్పటికి BAMS చదువు మధ్యలో మానేశాను. ఈ చదువు నాకు సరిపడదనిపించటం దానికి కారణం అనుకుంటాను. కానీ పార్టీ నాయకులు తమ్మారెడ్డి సత్యనారాయణగారు మాత్రం నువు డిస్‌కంటిన్యూ చేయటానికి వీలులేదు. చదువు పూర్తి చేయాల్సిందే అని ఆదేశించారు. ఆదేశించటం అంటే

ఏమిటో అప్పటికింకా తెలీదు నాకు. ఆ ఆదేశం ఉల్లంఘిస్తే పార్టీలోంచి తీసేస్తారు. దాంతోటి కాలేజీలో రీజాయిన్ అయ్యి పరీక్షలు రాశాను. అప్పట్లో హౌస్ సర్జన్సీ హైదరాబాద్‌లో చేయాలి. అది కూడా చార్మినార్ హాస్పిటల్‌లో. ఇక్కడ చదువుతుండేటప్పుడు గుంటూరు జిల్లా AISF కార్యదర్శిగా ఉన్నాను. హైదరాబాదులో రాష్ట్ర కార్యదర్శిగా ప్రమోట్ చేశారు. అలా ఆ బాధ్యత నిర్వహిస్తూనే హౌస్ సర్జన్ పూర్తి చేశాను. చదువుకు ఆటంకం ఏర్పడకుండా నాకిచ్చిన బాధ్యత నెరవేరుస్తూ వచ్చాను.

**వి:** *మీరు చదివిన చదువుతో ప్రాక్టీసు చేశారా?*

**నా :** లేదు. ప్రాక్టీసు చేయలేదు. రెండు పడవల ప్రయాణం సరికాదని నా అభిప్రాయం. ఉంటే సీరియస్‌గా ప్రాక్టీసులో ఉండాలి. లేదంటే సోషల్ సర్వీసులో ఉండాలి. అదే విషయం మా ప్రిన్సిపాల్‌కు చెప్పాను. ఆయన అలా ఎందుకు చేస్తావని బాధపడ్డారు. నేను బి.ఏ.ఎమ్.ఎస్. కోర్సు ఎందుకు చేశానో కూడా ఒకమాట చెప్పాలి. నాకు హైస్కూల్ చదువులో ఉన్నప్పుడు టి.బి. బారిన పడ్డాను. నగరిలో డా. రామచంద్రరాజుగారని ఆర్.ఎమ్.పి. డాక్టరుండేవారు. ఆయన ఫేమస్ డాక్టర్. ఆయనకి నగరి, పుత్తూరు, తిరుత్తణిలలో మూడు హాస్పిటల్స్ ఉన్నాయి. ఆయన నన్ను వారింట్లో ఉంచుకుని చికిత్స అందించారు. అలా మా కుటుంబానికి సన్నిహితులయిపోయారు. వారికి పిల్లలు లేరు. నా పి.యు.సి. చదువయిపోయాక ఆయనే మా నాన్ననడిగాడుట. ''నాకు పిల్లలు లేరు. మీ అబ్బాయి డాక్టరీ చదివితే నా హాస్పిటల్స్ చూసుకుంటాడు అని''. అలా నేను గుంటూరు ఆయుర్వేద కళాశాలలో చేరాను, తిరిగి వెళ్లి వారి హాస్పిటల్స్‌లో చేరే ప్రాతిపదికన. అలా రా మెటీరియల్‌గా గుంటూరు వచ్చినవాడిని ఫినిష్డ్ ప్రాడక్ట్‌గా మారిపోయాను. అయిదేళ్ళ తరువాత అదే డాక్టర్ అడిగారు నన్ను. "ఇంకా రాలేదేమిటి నువ్వు" అంటూ. "నా లైన్ మారిపోయిందిలెండి సర్" అని చెప్పాను. అంటే ఆ కాలంలో ఫోన్లు, టీవీలు అంతగా లేకపోవటంవలన గుంటూరులో ఏం జరిగిందో వాళ్ళకు తెలియదు. "నువ్వు నన్ను డిసప్పాయింట్ చేశావురా! నిన్ను నమ్ముకున్నానురా!" అని తిట్టి ఇంట్లో వాళ్లకి చెప్పాడు. అప్పుడు వాళ్ళు "చదువు వద్దు, చట్టుబండలు వద్దు. ఇక్కడే ఉండిపో" అన్నారు. వాళ్ళకు చెప్పకుండా గుంటూరు వెళ్లిపోయాను. అట్లా ఫుల్‌టైమ్ కార్యకర్తగా మారిపోయాను.

**వి:** *మార్క్స్ సిద్ధాంతాలను మీరెప్పుడు చదివారు?*

**నా :** 1970లో మెంబర్ షిప్ తీసుకున్నాను. అప్పటి నుంచి జనరల్ బాడీ మీటింగ్స్, పొలిటికల్ స్కూల్స్, సమ్మర్ క్యాంపుల్లో పాల్గొంటుండేవాడిని. పశ్చిమ గోదావరి జిల్లా కానూరులో మొదటి పొలిటికల్ స్కూల్‌కు హాజరయాను. అప్పుడు వై. విజయకుమార్ మార్క్సిస్ట్ మేధావి. ఆయనో టీచర్. ఆయనతో పాటు అలాంటివారు చాలామందున్నారు. అలా అక్కడ మార్క్సిస్ట్ అధ్యయనానికి బీజం పడింది.

**వి:** *మీరు కలిసిన మేధావుల గురించి చెప్పాలంటే?*

**నా :** గుంటూరులో చాలామంది మేధావులున్నారు. వై. విజయకుమార్, కృష్ణారావు, గిరిప్రసాద్‌లాంటి వాళ్ళు మా పార్టీకి చెందినవారున్నారు. వావిలాల గోపాలకృష్ణయ్యగారున్నారు. ఎన్.జి. రంగాగారి మీటింగ్‌కు వెళ్లేవాడిని. అప్పటికి స్వతంత్ర పార్టీ ఉన్నది. ఇక సోషలిస్టు పార్టీ నాయకులు కొంతమందున్నారు. వాళ్లని కలుస్తుండేవాడిని. నా యాక్టివిటీస్ మాత్రం AISF కు సంబంధించినవే ఉండేవి. జనసంఘ్ నుంచి జూపూడి యజ్ఞనారాయణ, మన్నవ గిరిధరరావు ఉండేవారు. అప్పట్లో మాది ప్రైవేటు మెడికల్ కాలేజీ దాన్ని ప్రభుత్వమే నడపాలని సమ్మె చేశాం. న్యాయపోరాటం చేశాను. చివరికి విజయం సాధించాను.

**వి:** *కమ్యూనిస్టు పార్టీలో చురుకుగా ఎప్పట్నుంచి ఉన్నారు?*

**నా :** గుంటూరు జిల్లా సెక్రటరీ తరువాత 1972–73లో హైదరాబాద్ ఉండటంతో స్టేట్ సెక్రటరీ అయాను. మూడేళ్ళ పాటు పనిచేశాను. 75–76లో తిరుపతి వెళ్లమన్నారు. నేను గుంటూరులో పనిచేస్తానన్నాను. సొంతూరు తిరుపతి కాబట్టి అక్కడికే పోవాలని మళ్లీ

ఆదేశించారు. అప్పుడు తిరుపతి యూనివర్సిటీ బేస్‌గా ఏఐయస్ఎఫ్ మొదలుపెట్టాను.

**మి:** *మిమ్మల్ని వ్యక్తిగతంగా ప్రభావితం చేసిన వ్యక్తులు ఎవరు?*

**నా :** నేను గుంటూరులో AISFలో రావటానికి కారణం స్టాలిన్ బాబు. అప్పటికే ఆయన ఫెడరేషన్‌లో చురుకుగా ఉండేవారు. నాలాగే పొడుగ్గా ఉండేవారు. మమ్మల్ని చూస్తే కవలలనుకునేవారు. నేను పోటీ చేసినప్పుడు మా ప్రత్యర్థులు SFI వాళ్ళని కూడా నాకు తెలియదు. నాకేమో మైకులో మాట్లాడ్డం రాదు. మీటింగ్ నిర్వహించడం రాదు. అవతలివారేమో పకడ్బందీగా ఉండేవారు. అయినా కూడా మేమే గెలిచాం, వాళ్ళు ఓడిపోయారు. ప్రచారంలో ప్రతిసారీ నన్ను ఏడిపిస్తుంటే నా ప్రత్యర్థిగా ఉన్న ర్యాలీ ప్రసాదరావుని అడిగాను.

"ఏమయ్యా మీరేదో సంస్థలో ఉన్నారుట కదా! ఇట్లాంటి పనికిమాలిన పనులు చేయమన్నారా అని మొరటుగా అడిగాను. రాయలసీమ వాడినికదా (మళ్లీ నవ్వు).

"ఎవరు మీ నాయకులు అన్నా!"

"రండి పోదాం" అన్నాడతను.

సరే పోదాం అని బయలుదేరాం.

బ్రాడీపేట నాల్గవ లైనులో ఉన్న SFI ఆఫీస్‌కు తీసుకుపోయాడతను. అక్కడ స్టాలిన్ బాబు, నల్లూరి వెంకటేశ్వర్లు (ఉమ్మడి ప్రకాశం జిల్లా) ఇద్దరూ ఉన్నారు.

"ఏమయా వీడు ఇలా చేస్తున్నాడు" అని నేను వారితో అన్నాను. నేను చిత్తూరు జిల్లావాడిని కాబట్టి, నా భాష ఎలా ఉంటుందో తెలుసు వారికి.. కాబట్టి నన్ను కూర్చో బ్రదర్ అని కూర్చోబెట్టి సుద్దులు వాడికి చెప్పారు. కానీ వాళ్ళు వ్యూహాత్మకంగా తిట్టారని అప్పుడు నాకు తెలియదు. అప్పటినుండి రోజూ వాళ్ళు నా రూమ్‌కు రావటం మొదలయింది. మా కాలేజీకి రావటం మొదలుపెట్టారు. భాష సరిగ్గా రాని నా చేత నాటకం వేయించారు. అలా తొలి రోజుల్లోనే స్టాలిన్ బాబు ఆదుకుంటే ఆ తరువాత నాకు అన్ని విషయాలు నేర్పించింది సురవరం సుధాకర్‌రెడ్డిగారు. ఆ తర్వాత ఇంకా చాలామందున్నారు.

**మి:** *మీరు సుందరయ్య గారినెప్పుడయినా కలిశారా?*

**నా :** ఆయన స్టేట్ సెక్రటరీగా ఉన్నప్పుడు కరువు యాత్ర చేశారు. అప్పుడు నేను చిత్తూరు జిల్లాలో ఉన్నాను. పుంగనూరు నుంచి వారితో యాత్రలో పాల్గొన్నాను. అంతకముందు ఫెడరేషన్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు కలిశాను. మరీ దగ్గరగా ఉండలేదు. పరిచయమయితే ఉంది.

**మి:** *చాలాకాలం కార్యకర్తగానే ఉండిపోయారు కదా?*


**నా :** దేనిలో ఉన్నా చాలా చురుకుగా ఉండేవాడిని. స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో ఉనప్పుడు నాకన్నా సీనియర్లు ఉన్నా వారిని అధిగమించి ముందుకు వెళ్లిపోయాను.

**మి:** *మీరు రాష్ట్ర స్థాయి నాయకుడెప్పుడయ్యారు?*

**నా :** స్టూడెంట్ ఫెడరేషన్‌లో ఉండగా రాష్ట్ర స్థాయి లీడర్‌గా ఉండేవాడిని. చిత్తూరు వచ్చేశాక చిత్తూరు జిల్లా పార్టీ కార్యక్రమాల్లో ఉన్నా. 85-86లో నాకు పెళ్ళయ్యింది. జిల్లా సెక్రటరీగా ఉండేవాడినప్పుడు. జిల్లా సెక్రటరీ నుంచి స్టేట్ ఎక్సిక్యూటివ్ మెంబరుగా వెళ్ళాను. అనంతరం నేషనల్ కౌన్సిల్ మెంబర్ని అయాను. అలా మూడుసార్లు అయిన తర్వాత మేం రిలీవ్ అవుతాం. ఆ తర్వాత సెంట్రల్ సెక్రటరీ మెంబర్‌గా రమ్మన్నారు. ముందు కార్యదర్శి వర్గంలో చేర్చుకున్నారు. సుధాకరరెడ్డిగారు పార్లమెంటు సభ్యులయ్యాక అసిస్టెంట్ సెక్రటరీగా నన్ను ప్రమోట్ చేసి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు షిఫ్ట్ చేశారు నన్ను. సుధాకరరెడ్డిగారు సెక్రటరీగా ఉండేవారు. కొన్నాళ్ల తరవాత సుధాకరరెడ్డిగారు సెంటర్‌కు వెళ్లిపోయారు. నేను స్టేట్ సెక్రటరీ అయ్యాను. అలా కింద నుంచి పని చేసుకుంటూ పైకి వచ్చాను.

**మి:** *జాతీయ స్థాయిలో వచ్చాక పార్టీ బాధ్యతలు ఎక్కువుంటాయి కదా. వ్యక్తిగత జీవితానికి, రాజకీయ జీవితానికి బ్యాలెన్స్ ఎలా చేశారు?*

**నా :** నేను మొట్టమొదటి నుంచి యాక్టివ్‌గా ఉంటానని చెప్పాను కదా. అలా ఉన్న తరుణంలో యూనివర్సిటీలో వసుమతి పరిచయం. తను ఎమ్.ఎస్‌సి., చేస్తున్నప్పుడు వాళ్ల బంధువులు నాకు



స్నేహితులు. వాళ్ళు నాకామెను పరిచయం చేశారు! SF మెంబర్‌షిప్ అవీ చెప్పాను. ఒకరితో ఒకరికి పరిచయాలేర్పడ్డాయి. ఆ తర్వాత ఆమె ఎమ్.ఎస్‌సి., అయిపోయి వెళ్లిపోయింది. నన్ను మాస్కో పంపించారు. రాజకీయ అవగాహన కోసం సంవత్సరంపాటు పంపించారు. అక్కడున్న సొసైటీని అధ్యయన చేయటం.. సోషలిజం అంటే ఏమిటో తెలుసుకోవటం.. వీటితో పాటు పొలిటికల్ టూర్లుండేవి. అవి ఉపయోగపడ్డాయా అంటే ఉపయోగపడ్డాయి. ఇండియాలో చూశాం కదా. ఇక్కడా చూశాం. డెఫినిట్‌గా తేడా ఉంది. ఓహో! మనం దీనికోసం పోరాడాలి అని తెలిసింది. తిరిగొచ్చిన తరవాత పెళ్ళిచేసుకుందామన్న ఆలోచన వచ్చింది. బంధువుల అమ్మాయి కాకుండా మన యాక్టివిటీస్ తెలిసిన అమ్మాయయితే నయమనిపించింది. అప్పుడు వసుమతి కోసం ఎంక్వైరీ చేస్తే శ్రీశైలంలో స్కూల్ పెట్టిందని తెలిసింది. మాట్లాడితే అంగీకరించింది. ముందున్న పరిచయంతోటే ఒప్పుకుంది. లేకుంటే కమ్యూనిస్టుని ఎవడ్రా చేసుకునేది అనుకోవచ్చుగా. అప్పుడు చెప్పాను మా యాక్టివిటీస్ ఇలా ఉంటాయని. నాకు తెలుసని చెప్పింది. పెళ్ళయిన సంవత్సరానికి ఆమెకి ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి కుటుంబ బాధ్యతలు ఆమే చూసుకునేది. అంతకుముందూ నేను చూసుకోలేదనుకోండి (నవ్వు). పార్టీ హోల్ టైమర్‌గా 350 రూపాయల జీతంతో ఉండేవాడిని. పెళ్లయిన తర్వాత కూడా పార్టీ అలవెన్స్‌తో బతికాం. మా ఇంట్లో వాళ్లకి ఇష్టం లేకుండా పెళ్ళి చేసుకున్నాం. వాళ్ళెవరు సాయం చేయటానికి సిద్ధంగా లేరు. అందువలన వాళ్ళ మీద ఆధారపడటం నాకిష్టం లేదు. ఆమె కూడా అదే అంది. మా ఇంట్లోది మనకొద్దు, మీ ఇంట్లోది మనకొద్దు అని. సరే ఆమె కుటుంబ బాధ్యతలు, నేను పొలిటికల్ యాక్టివిటీస్‌లో బిజీగా ఉన్నప్పుడు మా అమ్మ కూడా మా దగ్గరకు వచ్చేసింది. రాన్రాను ఏమయిందంటే మా ఇంట్లో అన్నదమ్ముల మధ్య, కుటుంబ సభ్యుల మధ్య ఏ తగువులేర్పడినా మా ఇంటికొచ్చే వాతావరణం ఏర్పడింది. అలా బాలన్స్ చేసుకున్నాను జీవితాన్ని. నాకు ఇంటెన్సివ్ టూర్లుండేవి. కొట్లాటలు, గొడవలు.. ఇంటినుంచి బయటకు వెళితే వెంటనే రాను. ఎక్కడున్నానో తెలిసేది కాదు. అయినా నన్ను ఓపికగా భరించింది. అసంతృప్తి అనేది లేదు. పిలకాయల్ని కూడా అదే పద్ధతిలో పెంచింది. మీ నాయన ఏం చేస్తాడు, ఏం సంపాదిస్తున్నాడు అన్న మాట లేకుండా పెంచింది. కుటుంబ బాధ్యతలు మోస్తూ పిల్లలను పెంచింది. అందుకనే వాళ్ళకీ ఆ గౌరవం ఉంది. వసుమతి నా జీవితంలోకి రావటంవలన నా పొలిటికల్ కెరీర్‌కు ఎలాంటి ఆటంకం కాలేదు. ఫైనాన్స్ అంటారా! ఎంతొస్తే అంతలో సర్దుకోవటం, లేనిదానికి ఆశించకపోవటం తనకు అలవాటు. లేదని ఏనాడూ బాధపడలేదు. ఆమె నాకు గిఫ్ట్. ఆమే లేకపోతే నాకింత పేరొచ్చేది కాదు. నాకు చాలా గర్వకారణం ఆమె సహచర్యం.

**మి:** *ఇప్పుడున్న కార్పొరేట్ వాతావరణంలో శ్రామిక వర్గం లేనేలేదు కదా?*

**నా :** ఇప్పుడేమయింది. కేపిటల్ వెర్సస్ వర్కింగ్ క్లాస్ మొత్తం ఒకటే అయిపోయిన స్థితిలో ఉన్నాం. సాఫ్ట్‌వేర్ రంగం వచ్చాక, కాంట్రాక్టు సిస్టమ్ వచ్చాక వాళ్ళే ఓనర్లు, వాళ్ళే వర్కర్స్‌గా మారిపోయిన వింత పరిస్థితి. లిబరలైజేషన్ మూలంగా వాళ్ళని కూడా భాగస్వామ్యులుగా చేసేసుకున్నారు.

**మి:** *ఉదాహరణకు డెక్కన్ క్రానికల్‌ని ఎంప్లాయిసే మేనేజ్ చేస్తున్నారు. కొన్ని హోటల్స్ కూడా అదే పద్ధతిలో నడుస్తున్నాయి. కాబట్టి శ్రామిక వర్గం తరఫున మనకి యాక్టివ్‌గా ఉండే అవకాశం లేదు కదా!*

**నా :** అవకాశం లేదు కాని ఒకటుంది. మార్క్సిస్టు ఫిలాసఫీకి వ్యతిరేకంగా ఉన్నవాళ్ళేమంటారంటే మార్క్స్ రాసినప్పుడున్న కార్మికవర్గం వేరు. ఇప్పుడున్న కార్మిక వర్గం వేరు. ఇప్పుడు కార్మిక వర్గం కూడా దోపిడీదారులుగా మారిపోతున్నారు.

లక్షరూపాయలు, రెండులక్షల రూపాయల జీతం తీసుకుంటున్నారు. వాళ్లకూ కార్లున్నాయి. అందుకని వాళ్ళు కార్మికులు ఎలా అవుతారని వీళ్ల వాదన. దాస్ కేపిటల్ తీర్మానం తప్పని వాదిస్తుంటుందీ వర్గం. దీనికి మేం చెప్పేదేమిటంటే – నిజమే! కార్మికులకు జీతాలు పెరిగాయి. కార్లొచ్చాయి వారికి కూడా. మరి వారి ఓనర్లకు ఎంత పెరిగింటుంది.. ఎంతొచ్చుంటుంది, మళ్లీ అతను దోపిడీదారుడుగా మారిపోతున్నాడు కదా. క్రూడ్‌గా ఉండటం పోయి సోఫిస్టికేషన్ వచ్చింది. మరి పేదరికం పెరిగిపోతోంది కదా. ఎవరో ప్రపంచ కుబేరుడిగా మారుతున్నాడు. మన సంతోషాలు కొంచెం పెరిగాయేమో కానీ అంతకన్నా ఎన్నో రెట్లు వ్యాపారాలు పెరిగాయి.

**మ:** *ఈ వాతావరణం మనం కమ్యూనిస్టు దేశాలనుకునే చైనా, రష్యాలలో ఎలా ఉంది?*

**నా :** మొట్టమొదట సోవియట్ యూనియన్‌లో విప్లవం వచ్చినప్పుడు అంతా ఫ్రీ చేసేశారు. అది సక్సెస్ కాలేదు. పీడితులు దోపిడీ చేశారు అని కాదు.. కంట్రోల్ ఉండాలి అని వారప్పుడు తెలుసుకున్నారు. నువ్వెంత పని చేస్తావో అంతే వేతనం తీసుకో. అదే కమ్యూనిజం థియరీ ఏమంటుంది – నీ అవసరంకొద్దీ తీసుకో అంటుంది. అదెప్పుడు, నువు సోషలిజం దశ దాటిపోయాక. నువ్వు ముందు పని చేయటానికి అలవాటు పడాలి. దానిలోంచి లాభం పొందాలి. దాంట్లోంచి కొంత సమాజానికి పోవాలి.. దాంతోటి కొంచెం కంట్రోల్ వచ్చింది. అక్కడేదీ ఫ్రీ కాకపోవడం నేను చూశాను. బ్రెడ్ ఐదుపైసలు, టీ మూడు పైసలు ఇలా ఉండేవి రేట్లు. సోవియట్ యూనియన్ దెబ్బతిని, మేలుకొని మార్కెటింగ్ సిస్టమ్ మొదలుపెట్టారు. ఈ విధానంలో కనీస అవసరాలు చాలా తక్కువ ఖర్చుతో ఉంటాయి. లగ్జరీ గూడ్స్ వేరు. అవి ఇంపోర్టెడ్ షాపుల్లో కొనుక్కోవలసిందే. అంటే సామాన్యుడుకి ఏం కావాలో వాటి అందుబాటు కోసం ప్రయత్నం చేశారు.

**మ:** *మీరు కనీస అవసరాలకు అందుబాటులో ఉంచుతారు అని చెప్పారు. అట్లా అమెరికాలోను ఉంచుతారే..*

**నా :** అమెరికాలో కనీస అవసరాలు తక్కువలో ఉన్నా వాళ్ళ బిజినెస్ యాంగిల్ వేరేగా ఉంటుంది. అమెరికాలో పెట్టుబడిదారుడు పెట్టుబడి పెడతాడు. నష్టమొస్తే అతనే భరిస్తాడు. కానీ రష్యాలో ప్రభుత్వమే కదా పెట్టేది. ఒక ఉదాహరణ చెబుతారు. జీన్‌పాంట్లు ఎందుకు తయారు చేయరు అని అడిగితే, ఇరవై ఐదు కోట్ల జనాభాలో పదికోట్లమంది వాడతారు. సంవత్సరం సంవత్సరం ఫ్యాషన్లు మారిపోతుంటాయి. కొత్త వస్తువు మార్కెట్‌లోకొస్తే జనం క్యూలు కడతారు. కొనుగోలు శక్తి మాకెక్కువ కాబట్టి అన్నీ తయారు చేయలేం. సమతుల్యత కొరవడుతుంది. కాబట్టి కామన్‌గా పనికొచ్చేవి పెడతామని వాళ్ళు మొండికేశారు. అది కూడా ఒక అసంతృప్తి సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావటానికి. అక్కడ జీన్‌పాంట్ల వ్యామోహం నేను ప్రత్యక్షంగా చూసినవాడిని. ఒకసారి నేను జీన్ పాంట్ వేసుకుని బజారులో పోతున్నా. ముగ్గురు యువకులు నా వెంటే వస్తున్నారు. ఏంట్రా నా వెంట పడ్డారు వీళ్లు అనుకుంటూ మా ఇన్‌స్టిట్యూట్ దగ్గరకు వచ్చాను. అక్కడ ఇంగ్లీష్–రష్యన్ తెలిసిన వ్యక్తిని అడిగాను, నా వెంటే వచ్చినవారెవరో, ఎందుకొస్తున్నారో కనుక్కోమని.. వాళ్లేం చెప్పారో తెలుసా.. ఆయన జీన్ పాంట్ బావుంది. ఆ ప్యాంట్ మాకిస్తే కొత్త ప్యాంట్ కొనిచ్చి నూరు రూపాయలిస్తామన్నారుట. ఇదీ నా అనుభవం అక్కడ..

**మ:** *ఇప్పుడు కమ్యూనిజం ఎక్కడా లేకుండా పోయింది కదా.. సిద్ధాంతముంది. ఆచరణ లేదు. మునుపటి సోవియట్ యూనియన్‌లోని దేశాలన్నీ స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాయి. ఒక్క రష్యాలోనే కమ్యూనిజం ఉందని చెప్పుకోవాలి. అక్కడ చైనాలో చూస్తే దాన్ని కమ్యూనిజం అంటారో ఇంకేమంటారో తెలియదు.. అక్కడున్నది మాత్రం వేరు.*

**నా :** కాన్సెప్ట్‌లో తేడా ఉంది. కమ్యూనిజం అనేది ఇప్పటివరకూ ఎక్కడా లేదు, చైనాతో సహా.. కమ్యూనిజం అనేది డెవలప్డ్ సొసైటీ. పెట్టుబడిదారీ వ్యవస్థ నుంచి మధ్యేమార్గంగా సోషలిస్టు వ్యవస్థ

అనేదాన్ని కనుక్కున్నారు. అది మార్క్స్ కనుక్కోలేదు. ఎందుకంటే పెట్టుబడిదారి వ్యవస్థ నుంచి ఒక్కసారే జంప్ చేయలేంకదా. అది డెవలప్ కావాలి. బానిస యుగం నుంచి రాచరిక వ్యవస్థకు, రాచరిక వ్యవస్థ నుంచి పెట్టుబడిదారి వ్యవస్థకు వచ్చాక మార్పు చోటుచేసుకుంటుంది. పెట్టుబడిదారి వ్యవస్థ నుంచి మారాలంటే మొత్తం మారాలి, సామూహికంగా.. పెట్టుబడిదారి, రాచరిక దర్భనుంచి పెట్టుబడిదారి వ్యవస్థ ఆవిర్భవించింది. పెట్టుబడిదారి నుంచి కార్మికులు రావాలంటే మొత్తం వ్యవస్థ మారాలి. అందువలన గ్యాప్ ఉంటుంది. అందుకే దానికి First step of Socialism అని పేరు పెట్టుకున్నాం. దీనిలో ఏం చేశామంటే ఆంక్షలు పెట్టుకున్నాం. పేరుకు సోషలిజం, కమ్యూనిజం అని పేర్లు పెట్టవచ్చు. సోషలిజంలో ఏం చెప్పారు.. అయ్యా నువ్వెంత కష్టపడతావో అంతే అనుభవించు అని పెట్టారు. ఇది సోషలిజం.. మరి కమ్యూనిజం అంటే ఏమిటి.. ఇదంతా అయ్యి ప్రజల మనోభావాలు మారిపోయి ఎవరూ సోమరిపోతుగా ఉండకపోవటం.. అందరూ కష్టపడతారు.. నీ శక్తిమేర కష్టపడు. నీకు అవసరమున్నంత వాడుకో. డెవలప్ అవ్వు. అక్కడివరకూ మనమింకా చేరలా. ఇక్కడివరకే వచ్చాం. చైనావాళ్ళు On The Way to Socialism అంటారు తప్ప మేము సోషలిస్టు రిపబ్లిక్ అయ్యామని చెప్పలా. సోవియట్ యూనియన్‌లో కూడా On The Way to Socialism అని చెప్పారు తప్ప.. ఇంకా టైం పెడితే వస్తుందని చెబుతారు.. ఇది తెలియని వాళ్ళు, బయటివాళ్ళు ఇంకా కమ్యూనిజం ఎక్కడుంది అంటారు, కమ్యూనిజం పని అయిపోయింది అంటారు. కానీ వియత్నాంలో ఉంది, క్యూబాలో ఉంది. అక్కడ కూడా పూర్తి కమ్యూనిజం లేదు. ప్రపంచమంతా మార్పు రాకుండా ఒక దేశంలో కుదరదది.

**ప్ర:** *మీరు చెప్పేదాన్నిబట్టి కమ్యూనిజం అంటే అందని స్వర్గమా? ఒక యుటోపియన్ ఆలోచన? లేక సిద్ధాంతాలకే పరిమితమా? అంటే ఇప్పుడు మనం సిద్ధాంతాలు మాట్లాడడానికి వీలులేదన్నమాట..*

**నా :** ఎందుకులేదు. వాళ్ళేమంటారంటే మేం నమ్మింది మార్క్సిజం. దాన్ని విమర్శించటంలో తప్పులేదు. కాని ప్రత్యామ్నాయం చూపండి. పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ పనికిరాదని నిరూపించాం. పెట్టుబడిదారి సమాజంలో అవకతవకలుంటాయని నిరూపించాం. ఇప్పుడు ఆ వ్యవస్థలో అవి ఉండవని చెబుతున్నాం. దీనికంటే మంచిదుంటే చూపించండి. అందుకని ఉన్న కమ్యూనిజాన్ని పడగొట్టడానికి ప్రయత్నిస్తే మేం ఊరుకోం.

**ప్ర:** *ఫ్రాన్స్‌లో సోషలిజం ముందర నుండి ఉన్నది. Modified Socialism అన్నారు వాళ్ళు దాన్ని.*

**నా :** సోషలిజం అంటే అందరూ సమానంగా ఉండి ప్రైవేటైజేషన్ లేకుండా అన్నీ గవర్నమెంట్ పరంగా ఉంటే సోషలిజం అంటాం కానీ, చాలా దేశాలలో ప్రభుత్వాలే నడిపించే సంస్థలున్నాయి. అంతమాత్రాన సోషలిజం ఉన్నట్టు కాదక్కడ. సోషలిజం పేరు చెప్పగానే వాటి డెఫినిషన్స్ వేరే ఉంటాయి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉంది, పబ్లిక్ స్కూల్స్ ఉన్నాయి, పబ్లిక్ హెల్త్ ఉంది కాబట్టి మాది సోషలిజమే కదా అంటారు వాళ్ళు.

**ప్ర:** *ఇప్పుడంతా వ్యాపారం అయిపోయింది, మానవ సంబంధాలను తెంపేస్తోంది ఆ వ్యాపారం.*

**నా :** సకల మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని మార్క్స్ ఏనాడో చెప్పాడు. పెట్టుబడిదారి వ్యవస్థలో ఆర్థిక సంబంధాలే మూలం. ఒక కుటుంబంలో నలుగురుంటే అందులో ఇద్దరే సంపాదిస్తుంటే, ఇద్దరు సంపాదించకపోతే ఆ సంపాదించని ఇద్దరిని లెక్క చేయని పరిస్థితి వచ్చేసింది. కాబట్టి పెట్టుబడిదారి వ్యవస్థలో ఆర్థిక సంబంధాలే తప్ప మానవ సంబంధాలుండవు. రూపాయి పెట్టుబడి పెట్టి రూపాయి సంపాదించేటప్పుడు ధర్మం, మంచి, నీతి గుర్తుకు రావు. అధర్మంగానైనా రూపాయి సంపాదించాలని నిర్ణయించుకుంటారు. ఇదే దృష్టి కోణం వ్యాపార రంగంలో వచ్చింది, సాంస్కృతిక రంగం, కళారంగం, సినిమా రంగం, సామాజిక రంగాలలో కానవస్తుంది. రాజకీయాల్లోకి కూడా వచ్చేసింది. రాజకీయ వ్యవస్థ

నుంచి మతంలోకి వచ్చింది, కులంలో వచ్చింది.. కాబట్టి అది కలవని వ్యవస్థ లేదు. దానికితోడు అన్నింటిలోనూ దిగజారిపోతున్నాం. లేకపోతే బిగ్‌బాస్‌ను ఎలా ఆదరిస్తారు జనం. ఆర్థిక సంబంధాలు మనుషులను కూల్చేస్తున్నాయి. మన కల్చర్ ఎగిరిపోయింది. కూచిపూడి లేదు. భరతనాట్యం లేదు.

**మి:** *అభివృద్ధి చెందిన దేశాలను ఇవాళ పరిశీలిస్తే థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వెళ్లినవారే పనిచేయడం గమనించవచ్చు. ఆ దేశాలు కూడా ఆ వర్క్ ఫోర్స్ మీద ఆధారపడ్డాయి. అది వాళ్ళు కూడా కాదనటం లేదు. అందుకే వీసా ఇచ్చి మరీ ఆహ్వానిస్తున్నాయి. ఆయా దేశాల్లోని లోకల్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లో మనకు కనిపించేదెవరంటే ఇండియా, పాకిస్థాన్, ఆఫ్రికా దేశాలకు చెందినవారనే చెప్పాలి. కానీ వీరెవరు సిస్టమ్ బాహ్యా ముఖం కారు. వీళ్ళమీద ఆధారపడకుండా అభివృద్ధి చెందిన దేశాలు మనలవు. అదే కాంట్రాస్ట్.. మీరేమంటారు?*

**నా :** మీరు చెప్పినట్లు గల్ఫ్ దేశాలలో మాన్యువల్ వర్క్ చేసేవారు మనవారే. అలాగే కరేబియన్ దేశాలలో కూడా. అమెరికాలో భారతీయ సంతతికి చెందినవారు సమ్మె చేస్తే ప్రభుత్వం పడిపోయేంత ప్రమాదముంది. ఇక్కడ నుంచి వెళ్లినవారు చదువుకుంటున్నారు, ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అయితే ఇక్కడ పనిచేయరు కాని, అక్కడ పనిచేస్తారన్న విమర్శ కూడా ఉంది. మన పిలకాయలు అంతేకదా. నన్నెవరో అడిగారు. నువు అమెరికాను ఊరికే తిడతావుకదా.. ఎందుకూ అని.. నేను చెప్పాను. అమెరికాను తిట్టడం లేదు. అమెరికా ఇంపీరియలిస్ట్ పాలసీలను తిడుతున్నానని. ఇక్కడ అమెరికా వర్క్ కల్చర్ నేర్పుతామా.. అక్కడ మేనేజ్ చేయటంకన్నా నేర్చుకునే పొజిషన్ కల్పిస్తారు. మనం కూడా ఆ పొజిషన్ కల్పించాలి.

**మి:** *ఇక్కడ ఆ వర్క్ కల్చర్ ఇప్పటికీ రాలేదండీ..*

**నా :** దానికి కొన్ని పేరామీటర్లున్నాయి. కొన్ని సౌకర్యాలు కల్పించాలి. ఆ సౌకర్యాలు కల్పిస్తే పనిచేయడం నేర్చుకుంటారు. దానికి తంటాలు పడుతున్నారు.

**మి:** *ఇప్పుడు హైటెక్ సిటీ అంతా ఆ పద్ధతిలోనే ఉంది కదా?*

**నా :** ఒక సెక్షనే కదా. నూట ఇరవై కోట్ల జనాభాలో ఒక సెక్షనే కదా. అలాంటి కల్చర్ నేర్పించాలి.

**మి:** *ఆ కల్చర్ అగ్రికల్చర్‌లో ఉంది.*


**నా :** అవును.. అగ్రికల్చర్‌లో ఉంది. నువ్వా ప్రకారం చేయగలిగితే మంచి ఫలితాలుంటాయి.

**మి:** *ఇదివరకు చేసేవాళ్ళు. ఉచితాలిచ్చి ఆపేశారు కానీ.*

**నా :** ఇప్పుడు ఇంటర్నేషనల్ అరేంజ్మెంట్స్ వచ్చాక పెస్టిసైడ్స్ నుంచి అన్నీ బయటినుంచే. దాంతోటి ఖర్చు పెరిగిపోయింది. చేతికొచ్చిన పంటకు అందుకు తగిన గిట్టుబాటు ధరలేదు. వాళ్ళకు ప్రభుత్వ ప్రోత్సాహం లేదు. చెరకు రైతులనే తీసుకుంటే వారి ఉత్పత్తికి తగిన ధర లేదు. బయటినుంచే తెచ్చుకుంటున్నాం. ఆర్థిక వ్యవస్థ నిర్వహణ ఫెయిల్ అయింది. గ్రామీణ, పట్టణ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. అందుకని ఇక్కడుంటే లాభం లేదని పనికోసం బయటకు వెళ్లేవారి సంఖ్య ఎక్కువయింది.

**మి:** *ఇప్పుడు దేశంలో, రాష్ట్రంలో ప్రాతీయ పార్టీలున్నాయి కదా! వాతావరణం అనుకూలంగా లేదు. ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలన్న ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం కానీ రాష్ట్ర ప్రభుత్వాలు కానీ ఉన్నాయి. ప్రాంతీయ పార్టీలపై ఆధారపడాల్సి వస్తోందని, వాటిని లేకుండా చేయాలన్న ఆలోచనలకు కొదువ లేదు. అది ఎంతవరకు కరెక్ట్ అంటారు!*

**నా :** ఇదివరకు జాతీయ స్థాయిలో కాంగ్రెస్, పార్టీ, కమ్యూనిస్టు పార్టీలే ఉండేవి. ప్రాంతీయ పార్టీలు ఉండేవి కావు. కమ్యూనిస్టు పార్టీ చీలిపోయిన తరవాత కాంగ్రెస్ వ్యతిరేక జాతీయ పార్టీగా బలహీనపడింది. అంటే కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఉన్న జనం యాడికిపోవాల వాళ్ళు. వాళ్లు ఆటోమేటిక్‌గా ప్రాంతీయపార్టీ పెట్టుకున్నారు. 1963–67 సంవత్సరాల మధ్య కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. చీలిపోయిన 67లో ఎన్నికలు జరిగాయి. ఎనిమిది రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. కమ్యూనిస్టులు ఒకటిగా ఉంటే గెలిచేవాళ్ళు. వీళ్లు చీలిపోయాక ప్రాంతీయ పార్టీలు



వచ్చేశాయి. ఇప్పుడు అన్ని రాష్ట్రాలలోను ప్రాంతీయ పార్టీలు వచ్చేశాయనుకోండి. అంతేనా కుల పార్టీలు, మత పార్టీలు, డబ్బుల పార్టీలొచ్చేశాయి. ఇప్పుడేమయింది. జాతీయ పార్టీల బలం తగ్గుతా ఉంది. కేంద్రంలో ఉన్న అధికార పార్టీ ఏం చేస్తోంది. ప్రాంతీయ పార్టీలను కొట్టేసి మొత్తం మనమే రావాలని ప్రయత్నం చేస్తోంది. అందుకే రాష్ట్రాల మీద దాడులు చేస్తోంది. ఇక ప్రాంతీయ పార్టీలు ఏం చేస్తాయంటే ముందు వాళ్ళ కుటుంబం బాగుపడాలని కోరుకుంటాయి. ఆ తర్వాత రాష్ట్రం బలపడాలని కోరుకుంటాయి. ఫస్ట్ ప్రిఫరెన్స్ ఫామిలీ ఎస్టాబ్లిష్ కావాలి. తరవాత రాష్ట్రం, ఆ తరువాత దేశం. సో ప్రియారిటీస్ మారిపోయాయి. ఎప్పుడయితే ప్రియారిటీస్ మారిపోయాయో సంకుచిత ధోరణులు.. Narrow out look వచ్చేసింది. ఇది వచ్చేశాక ఇతర రాష్ట్రాలతో మనకేమిటి సంబంధం, ఇతర ఊళ్లతో మనకేమిటి సంబంధం, ఇతర కులాలతో మనకేమిటి సంబంధం అనే Narrow out look వచ్చేశాక ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోయింది. దీన్ని ఫైట్ చేయాలంటే ప్రాంతీయ పార్టీకి, అధికార పార్టీకి ఈజీ కంట్రోల్ చేయడం.. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కంట్రోల్ చేయడం కష్టం కానీ చిన్న రాష్ట్రాలయాక కంట్రోల్ చేయడం సులభం. పొలిటికల్ పవర్, మజిల్ పవర్, మనీ పవర్, పోలీస్ పవర్ అన్నీ ఉంటాయి కదా. అందుకే ఎక్కడయితే ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటాయో అక్కడ ప్రజాస్వామ్యానికి నష్టం వస్తాది. జాతీయ పార్టీలకు సహకారమందటం లేదు. ఇప్పుడైనా సరే జాతీయ స్థాయిలో అందరం కలిసికట్టుగా ఉంటే తప్ప సాధ్యం కాదని మా ప్రతిపాదన. కానీ కేంద్ర అధికార పార్టీవాళ్లు కలిసొచ్చేవాళ్లని అడ్డుపెట్టి, కలిసిరానివాళ్ళను కొట్టేస్తా ఉంటే వాళ్ళు పోయాక మరొకరు కొట్టేయవచ్చు. హిట్లర్ పరిపాలనలాగా వాళ్ళు పరిపాలన చేస్తున్నారు. ఈ విషయంలో ఇండియన్ పొలిటికల్ సిస్టమ్ చాలా ఆలోచించాల్సిన అవసరం ఉంది.

**ఖ:** *ఈ విషయంలో మీ ఆలోచన ఎలా ఉంది?*

**నా :** అంటే తాత్కాలికంగా ప్రజలను సంతృప్తిపరచడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పుడు పెన్షన్ల కోసం ఆఫీసుకు పోనక్కర్లా. వాడు నిద్రపోతుంటే దిండుకిందపెట్టి పోతా ఉన్నారు. నిద్ర లేపకుండా దిండుకింద డబ్బులు పెట్టిపోవటం మా ఇళ్ల దగ్గర నేను చూశాను. దానివలన జనానికి కొంచెం ఆవేశం తగ్గుతుంది. అర్ధరాత్రివేళయినా ఇస్తున్నారు కదా. అట్లా జనాన్ని కంట్రోల్ చేసే మార్గం ప్రాంతీయ పార్టీలకు తెలిసిపోయింది. ఎప్పుడయితే అదొచ్చిందో ప్రజాస్వామ్య ఉద్యమానికి నష్టం వస్తా ఉంది.

**ఖ:** *ఇప్పుడు ప్రాంతీయ పార్టీల మూలంగా డెమొక్రాటిక్ నియంతృత్వం వచ్చిందని ఒప్పుకుంటారా?*

**నా :** వచ్చింది కానీ అలా చెప్పలేం. ప్రజాస్వామికంగా అధికారంలోకి వచ్చాకే ఈరకమైన బిగింపులు జరుగుతున్నాయి. పెరిగేవాడు పెరుగుతున్నాడు. డబ్బులు సంపాదించేవాడు సంపాదిస్తున్నాడు. అధికారంలో రకరకాల పద్ధతులొస్తున్నాయి. జనం చూస్తున్నారు. విధిలేని పద్ధతులలో ఫాలో అవుతున్నారు. ఇది ఎంతో కాలం సాగదు. ఇది టెంపరరీ. జీవితంలో నుంచి వచ్చే స్ట్రగుల్ నుంచే బయటపడతాయి ఉద్యమాలు. కొన్నాళ్లవరకే చేయగలిగేది సహాయం. ఎన్నాళ్లో చేయలేరు. ఒకపక్క ఆర్థికంగా అగాధాలు పెరిగిపోతున్నాయి. అప్పుడు కట్టలు తెంచుకుని వస్తాయి ఆవేశాలు. అప్పుడు తిరుగుబాటు వస్తుంది. అదింకా టైం పడుతుంది.

**ఖ:** *మీరు కట్టలు తెంచుకుని ఆవేశాలు వస్తాయంటున్నారు కదా.. ఇప్పుడు ఇరాన్‌లో ఒక చిన్న సంఘటన ఆ దేశాన్ని కంట్రోల్ చేయలేనంత స్థితికి వెళ్లిపోయింది కదా!*

**నా :** అసంతృప్తి ఎలా వస్తుందంటే అది రకరకాల పరిస్థితులవలన వస్తుంది.

**ఖ:** *మన దగ్గర కూడా అలాంటి పరిస్థితి వస్తుందంటారా?*

**నా :** ఒక జిల్లాకు పేరు పెట్టే అంశం మీద కోస్తా జిల్లాలలో జనం తిరగబడి అధికార పార్టీ నాయకులపై దాడి చేశారు. జనం ఒక్కసారి బరస్టయ్యారు. అది పేరు పెట్టటంపై వచ్చిన అసంతృప్తి మాత్రమే కాదు.. అదీ ప్రభుత్వంపై వచ్చిన అసంతృప్తిగా భావించాలి. కాబట్టి లోపలి అసంతృప్తి ఎక్కడో ఒకచోట ఏదో ఒకరూపంలో ఏదో ఒక టైమ్‌లో బయటకు వస్తుంది. మనది కర్మ సిద్ధాంతం కదా. ఈ కర్మ సిద్ధాంతంవలన ఓర్పు ఎక్కువ.

**మి:** *మళ్లీ ఇంతకు ముందు ప్రశ్న. మీ ఉద్దేశంలో జాతీయ పార్టీలే ఉండాలంటారు?*

**నా :** నేషనల్ పార్టీ అయితే దానికుండే అవుట్ లుక్, ప్రజాస్వామ్య విధానాలు,సెక్యులర్ ట్రెడిషన్స్ వేరు.

**మి:** *ఈ నియంతృత్వాలు ఉండవంటారు?*

**నా :** అవి పోతాయి. అవే జాతీయ స్థాయి పార్టీలు బలహీనపడితే మామూలుగా అది ప్రాంతీయ పార్టీల బలం పెరగడానికి కారణమవుతుంది. అరాచకానికి దారితీస్తుంది. మానవ కళ్యాణానికి ఉపయోగపడదు. వినాశనానికే ఉపయోగపడతాయి..

**మి:** *ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉండటాన్ని మీరు సపోర్ట్ చేయరన్నమాట!*

**నా :** అయితే జాతీయ స్థాయిలో పొలిటికల్ సిస్టమ్‌లో అనుకూలమైన పరిస్థితుల్లో ప్రాంతీయ పార్టీలు వస్తాయనుకోండి. వాటిని మేం వ్యతిరేకించలేం. ఉదాహరణకు డి.ఎమ్.కె. ఆ పార్టీ జాతీయ స్థాయిలో అధికార పార్టీని వ్యతిరేకిస్తోంది. ప్రాంతీయ పార్టీల ఆలోచననుబట్టి మేం పోతూ ఉంటాం.

**మి:** *రెండేళ్ల తరవాత ఎన్నికలు రాబోతున్నాయి. ఇటు రాష్ట్రాలలో కానీ, జాతీయ స్థాయిలో కాని మీ ప్రణాళికలు ఎలా ఉండబోతున్నాయి.!*

**నా :** మాదెప్పుడు వర్కింగ్ క్లాస్ పార్టీ కాబట్టి కార్మిక, శ్రామిక వర్గానికి ఉపయోగపడే పద్ధతిలో గ్రామీణ వ్యవస్థ బలోపేతం కావటానికి ఉపయోగపడే పద్ధతిలో మా విధానాలుంటాయి. ఆ విధంగా మా ఉద్యమాలను కొనసాగిస్తాం. ఎన్నికలొచ్చినప్పుడు ఆ ఎత్తుగడలుంటాయి. సొంతానికి పోటీ చేసేచోట సొంతంగా పోటీ చేస్తాం. చట్టసభల్లో ఉండడం ముఖ్యం కాబట్టి సౌలభ్యం బట్టి కలిసొచ్చే శక్తులుంటే కలిసి పోటీచేస్తాం. అదెప్పటినుంచో జరుగుతోంది. ఆ ప్రాక్టీసు కొనసాగిస్తాం.

**మి:** *పార్టీల సమీకరణలు, పొత్తు పెట్టుకోవడాలు సిద్ధాంతపరంగా జరగటంలా. మీరేమంటారు?*

**నా :** సిద్ధాంతమొకటే. ఈ భారత దేశాన్ని లౌకిక వ్యవస్థగా కాపాడాలన్న సిద్ధాంతమొకటే ఇపుడున్నది.

ఈ లౌకిక విధానం వద్దు. మత ఛాందసవాదంతోనే పోవాలనే ఆలోచన ఇంకోటి వచ్చింది. అది అధికార పార్టీ నాయకత్వంలో. ఈ రెండు సిద్ధాంతాల మధ్య ఒకలాంటి ఘర్షణ ఏర్పడిన కాలంలో ఉన్నాం. సెక్యులర్ క్రెడెన్షియల్స్ కలిగున్నవారి వేదిక కావాలనే కోరిక ఒకటుంది.

**మి:** *సెక్యులర్ అంటే మీ డెఫినిషన్ ఏమిటి?*

**నా :** అంటే భిన్నత్వంలో ఏకత్వం. ఈ భారతదేశంలో అనేక కులాలు, మతాలున్నాయి. ఎవరి కులాన్ని వారు పూజించుకోవచ్చు. ఎవరి మతాన్ని వారు అవలంబిచవచ్చు. ఎవరి దేవుణ్ణి వారు పూజించుకోవచ్చు. ఒకే మతం ఆధిపత్యంలో ఉండాలి. ఒకే కులం ఆధిపత్యంలో ఉండాలి అనేటువంటి పరిస్థితి ఉండకూడదు. ఎలాంటి కుల, మత భేదం లేకుండా కలిసుండటమనేది సెక్యులరిజం కిందకు వస్తుంది.

**మి:** *మీరు చెప్పిందెక్కడయినా ఉందా ఈ ప్రపంచంలో!*

**నా :** ప్రపంచంలో అంటే... మొదటి నుంచి మన దగ్గర కుల వ్యవస్థ ఎక్కువ కదా?

**మి:** *కాస్ట్ సిస్టమ్ వదిలేయండి. మీరు చెప్పిన సెక్యులరిజం ప్రపంచంలో ఎక్కడయినా ఉందా?*

**నా :** అమెరికాలో క్రిస్టియన్ మెజారిటీ ఉందేమో కానీ అక్కడ సెక్యులరిజం ఉంది.

**మి:** *అక్కడ సెక్యులరిజం లేదు, కామన్‌లా ఉంది.*

**నా :** అలాకాదు.. పాకిస్థాన్ మాదిరి, ఇరాక్‌లోలాగా, ఇరాన్‌లో మాదిరి లేదు కదా!

**మి:** *మీరు చెప్పినవన్నీ మతపరమైన రాజకీయాలు పాకిస్థాన్ మతం ప్రాతిపదికన ఏర్పడిన దేశం. ఇరాన్ కూడా అంతే. మతాన్ని ఆలంబన చేసుకుంది. అంతకుముందు పాశ్చాత్యీకరించబడిన దేశంగా ఉండేది.*

నా : అలా అయితే మనది కూడా హిందూ మతం ఆధారంగా ఏర్పడిన దేశమే కదా.

*ప్ర: అలా కాదు.. నెహ్రూ సెక్యులరిజం పేరుతో దానికి దూరం చేశారు.*

నా : అదే చెబుతున్నా. స్వాతంత్ర్య పోరాటంలో, బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో అందరినీ ఒకచోట కలిపి ఒకతాటిపైకి తెచ్చే ప్రయత్నం గాంధీజీ చేశారు. అందులో ఆ మతం, ఈ మతం, ఈ కులం, ఆ కులం అనే ప్రస్తావన లేకుండా చేశాడు.

*ప్ర: స్వాతంత్ర్యం కోసం సెక్యులరిజాన్ని వాడారు గాంధీజీ.*

నా : బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం కాబట్టి అందరూ కలిశారు.

*ప్ర: పేదరికాన్ని కూడా ఆయుధంగా వాడాడాయన. ఇవాళ శత్రువు లేదు కదా!*

నా : తెలియని శత్రువున్నాడు. తెలిసిన శత్రువు లేడు.

*ప్ర: ఈ విషయం చెప్పండి.. ఒక పార్టీ ఒక పార్టీకి వ్యతిరేకంగా పుట్టింది. ఇవాళ వెళ్లి మళ్లీ అదే పార్టీలో కలుస్తోంది. అంటే సిద్ధాంతం వదిలేసినట్టే కదా.*

నా : మౌలిక సిద్ధతాలు ఎవరివి పోవు. మాకు మార్క్సిజం, లెనినిజం థియరీ. ఈ భారతదేశాన్ని సెక్యులరిజం వైపు తీసుకెళ్లటానికి అంతిమంగా సోషలిజం వైపు తీసుకెళ్లటానికి మా థియరీ ఉంది. ఆ థియరీకీ రోజువారీ జరిగే కార్యక్రమాలకు లింక్ పెట్టడం సాధ్యం కాదు. ఇక్కడ ప్రాక్టికల్‌గా జరుగుతున్న పరిణామాలలో ఏది కొద్దిగా బెటరో, ఆ బెటర్‌ని మనం కలుపుకునే ప్రయత్నం తప్ప సిద్ధాంతాన్ని అడ్డం పెట్టుకోవడానికి కుదరదు.

*ప్ర: ఇప్పుడు ప్రపంచంలో రాజకీయ పరిస్థితి ఎలా ఉందంటారు?*

నా : ఒకప్పుడు అమెరికాలో సామ్రాజ్యవాదముండేది. సోవియట్ యూనియన్‌లో చీలిక వచ్చింది. ఇప్పుడు వరల్డ్ వార్ లేదు. ఏ దేశానికా దేశానికి పద్ధతి పెట్టుకున్నారు.

*ప్ర: ఏ దేశ రాజకీయమయినా ప్రజలకు మేలు చేయటం కోసమే కదా!*

నా : అవును. అలా జరగటం లేదుగా. అమెరికా ఇంపీరియలిజాన్ని అన్ని దేశాలపై ప్రయోగించేవారు. తమ విస్తరణకు ఉపయోగపడేట్టు చేసుకునేవారు. సిరియాలో ఏం జరిగింది. సద్దాం హుస్సేన్‌ని ఎందుకు చంపారు. సిరియా నుంచి ఎందుకు వెళ్ళమన్నారు. అక్కడ ఉన్నటువంటి ముడిసరుకులు, మాంగనీస్ ఖనిజాలు వారి హేండోవర్‌లో ఉండాలి. సద్దాం హుస్సేన్ ఆయిల్ జాతీయ చేశాడని వాళ్ళు ఒప్పుకోలేదు. వారి థియరీ ఏమిటంటే దేశం మీదయినా దోపిడీ మాదే అంటారు వాళ్ళు. అలా దోపిడీ కాంక్ష పెరిగిన అమెరికా ఇప్పుడు తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. క్యూబా, చిలీ, దక్షిణ అమెరికా దేశాలు ఆ మార్గంలో ఉన్నాయి

*ప్ర: పోస్ట్ కోవిడ్‌లో అమెరికాలో కూడా చాలా ద్రవ్యోల్బణం వచ్చింది కదా.*

నా : ఇంకా పెద్ద క్రైసిస్ రాబోతోంది. 2008లో వచ్చిన ఆర్థిక మాంద్యంకంటే ఇంకా ప్రమాదకరమైన మాంద్యం రాబోతుందంటున్నారు ఆర్థికవేత్తలు


*ప్ర: అప్పుడు లేమన్ బ్రదర్స్ పోయారు. ఇప్పుడు రెడీగా ఇంకో ఇద్దరు ముగ్గురున్నారు. సరే మనం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. మీరు CR Foundation ఛైర్మన్‌గా ఉన్నారు. ఈ ఫౌండేషన్ గురించి నాలుగు మాటలు చెప్పండి.*

నా : చంద్ర రాజేశ్వరరావుగారు అమూల్యమైన సేవలు అందించారు. వారి చివరి దశలో ఆయన గుర్తించిందేమిటంటే సొసైటీ కోసం త్యాగం చేసిన కుటుంబాలను ఎలా కాపాడుకోవాలి! అందుకు ఆయనే ఒక హాస్పిటల్ కట్టాల్సి వచ్చింది.. అనుబంధంగా దీనికో "హోమ్" ఉండాలి. ఎవరయితే సమాజం కోసం త్యాగం చేశారో అట్లాంటివారిని చేరదీసేందుకు ఆ హోమ్ ఉపయోగపడాలని భావించారాయన. వారు అమరులయ్యాక దాన్ని అమలు చేసేందుకు నాయకులు పూనుకొని ప్రభుత్వం నుంచి తగిన స్థలం పొంది అందులో హోమ్ కట్టడానికి ప్రయత్నం చేశారు. ఇందుకు చాలామంది పెద్దవాళ్లు సహాయం చేశారు.

*ప్ర: అంటే ముఖ్యంగా మీ పార్టీ పరంగా పనిచేసిన కార్యకర్తలకా?*

**నా :** మొదటి ప్రాధాన్యత పార్టీ కార్యకర్తలు. వాళ్ళకు సహాయం చేయాలి. రెండవ ప్రాధాన్యత సామాజిక సేవ చేసినవారు. వాళ్ళకు కూడా చేయాల్సిందే కదా. అచ్చంగా కమ్యూనిస్టులకే చేయాలని కాదు. ఆచరణలో ఏమయిందంటే నిజంగా కమ్యూనిస్టు పార్టీ కోసం పనిచేసినవాళ్ళను రమ్మంటే రావటంలా వాళ్ళు. వారికి సెల్ఫ్ ఆత్మగౌరవం ఎక్కువ. ఆర్థికంగా బాగా సెటిలయినవాళ్ళు చేరుతున్నారు. పిల్లలే అమెరికాలో ఉంటారు. చూసేవారు ఉండరు. ఎవరినీ పెట్టుకోలేరు. మేం డబ్బు కడతాం. మీరు ఓల్డేజ్ హోమ్‌లో ఉండండంటారు. అలాంటి వాళ్ళొస్తున్నారు. నిజంగా రావలసినవారు రావట్లేదు. మొదట్లో వచ్చేవారు. మేమే వారి కోసం తిరిగాం. పేదరికంలో ఒక ప్రిస్టేజ్ ఉంటుంది. డబ్బున్నవారికి ప్రిస్టేజ్ గొడవలేదు. వాళ్ళు సౌకర్యాలు చూస్తారు. మా అమ్మంటుండేది. వీడు సిగ్గు సిలుక్కు (చిలక్కొయ్య) తగిలించొచ్చాడురా అని. ఇక నేను తెలంగాణలో చాలా ఊళ్లకు పోయాను. కటికి మంచంలో పడున్నావు, గంజినీళ్ళు తాగుతున్నావు రావయ్యా అంటే కొడుకులు, కూతుళ్ళు ఒప్పుకునేవాళ్ళు కాదు. మా నాయనను, మా అమ్మను మేం సాదుకోలేమా అని వాదించేవాళ్ళు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఎక్కడ లాభముంటే అక్కడ పోతారు. పేదరికంలో ఉన్నవారిలో మాకిదే చాల్లేరబ్బా అనుకుంటున్నారు. మా కాన్సెప్టేమో నిజమయిన సేవచేసిన వారికిద్దామని. వచ్చేవాళ్లేమో దానికి సంబంధం లేనివారు. వద్దని చెప్పలేము.

**మి :** కుటుంబ సంబంధాల్లో తేడా వచ్చింది. పెద్దవాళ్ళు పిల్లలతో కలిసి ఉండలేకపోతున్నారు. భార్యాభర్తలు



ఎడిటర్, డా. నారాయణ - మధ్యలో చెన్నకేశవరావు

ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్లిపోవటం, పిల్లలు స్కూలు, చదువు హడావిడిలో ఉండటం.. వీళ్ళను చూసేవారు లేకపోవటం.. ఇవన్నీ ప్రభావితం చేస్తున్నాయి. పనివారిని పెట్టడం ఖరీదైన వ్యవహారం కావటం.. ఇవన్నీ కలిసి ఇక్కడ చేర్పిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదనుకుంటున్నారు.

**నా :** మీరన్నది నిజమే. కొంతమందికి అన్నీ ఉన్నా ఇంట్లో పిల్లలుండరు. మరేం చేస్తారు. ఇక్కడుంటే సమవయస్కులతో మాట్లాడవచ్చు. కొంత కాలక్షేపం జరుగుతుంది.

**మి :** *యువతకు మీరిచ్చే సందేశం?*

**నా :** ఇప్పుడున్న ప్రపంచంవే భూతల స్వర్గమని భావించకండి. ఇదే శాశ్వతమని అనుకోకండి. మీరు సాధించాల్సింది చాలా ఉంది, సామాజిక పరంగాను, ఆర్థిక పరంగానూ.. అది సాధించేందుకు లక్ష్యం పెట్టుకోండి. మీ జీవితం గురించే ఆలోచించకండి. చుట్టూవున్న సామాజిక జీవనం గురించి కూడా ఆలోచించండి. సమాజానికి, వికాసానికి దూరంగా కోట్లాదిమంది ప్రజలున్నారు. వారందరి బాగుకోసం ఉపయోగపడు ఆలోచన చేయమని కోరుతూ సెలవు తీసుకుంటాను.

---

మకుటం లేని మహారాణి ***మిసిమి***
మలినము లేని మాణిక్యం ***మిసిమి***
మనోవికాసానికి (చింతనకు) ***మిసిమి***
సంగీత సాహిత్యాల మేలుకలయిక ***మిసిమి***
దూరతీరాల యాత్రా సాహిత్యంతో ***మిసిమి***
మహనీయుల భావాలతో ***మిసిమి***
అరుదైన చిత్రాల అలంకరణతో ***మిసిమి***
మాసపత్రికలలో మేటి ***మిసిమి***

శేషగిరిరావు, హైదరాబాద్.

# కబీర్ దాస్ - 8

**- లక్ష్మీ అయ్యర్**



ప్రొ. శాంతిశ్రీ ధూళిపూడి పండిట్, వైస్ ఛాన్సలర్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ, న్యూ ఢిల్లీ - ప్రొ. లక్ష్మీ అయ్యర్ (కుడిప్రక్క)

**(గత సంచిక తరువాయి)**

ఇరవై తొమ్మిదవ అధ్యాయము సాధ్ సాఖీ భూత్ కౌ అంగ్. ఇందులో 21 దోహాలున్నాయి. సాధువుల కోసం రాయబడ్డది. నిజమైన సాధువు అనేవాడు ఎలా ఉండాలి? ఎలా వ్యవహరించాలి? ఎలా జ్ఞానాన్ని అందివ్వాలి? అతని గుణ గణాలు ఏవి? అన్నింటి గురించి ఈ అధ్యాయంలో చెప్పబడ్డాయి. ఈ అధ్యాయములో కబీరు భక్తులకు అంతరాత్మకు ఉన్న సంబంధాన్ని ప్రతిపాదిస్తున్నారు. భక్తులు ఎలా ఉంటారు?

భగవంతుని వీడి విరహంలో జీవిస్తూ తహతహలాడుతారు. ఆ భగవంతుడు ఎప్పుడు దర్శనమిస్తాడు? ఆ ఘడియ ఎప్పుడు వస్తుంది? అని తలచి బాధపడుతూ ఉంటారు. ఆ భక్తుల బాధలు వర్ణనాతీతం. తాంబూలం వేసిన తర్వాత నోరంతా ఎర్రగా అవుతుంది కానీ మూలతత్వం ఆకు ఒక రంగు, వక్క మరొక రంగు, సున్నం తెల్ల రంగు. కానీ తాంబూలం వేసిన తర్వాత ఎర్రగా మారిన నోటిలో ఆ రంగులు కనబడవు. అదేలా భగవంతుని స్మరిస్తూ ఆయన గురించి మాట్లాడే వివిధ భక్తులు ఆ భగవంతునితో కలిశాక ఒకే రూపమే భాగవత రూపంతో దర్శనమిస్తారు. కానీ మూల తత్వాన్ని దర్శించనంతవరకు వికల మనస్సుతో బాధపడుతూ ఉంటారు. వారు బెంగతో చిక్కి శల్యమవుతారు. కబీరు హిందీ సాహిత్యపు ప్రథమ తాత్విక కవి. ఆయన వర్ణించిన విరహ వేదన ఎవరూ వర్ణింపడలేదు. ఆయన వర్ణన లౌకికమయినా అది అలౌకికం. సమాజాన్ని ఉద్ధరించడానికై ఆయన రాసిన దోహాలలో క్రాంతి తిరుగుబాటు ప్రతిధ్వనించే తీవ్ర భాష. కొండలను పిండి చేసే కఠోర భావంతో కూడిన భాష మన వేమనలాగ. అదే కబీరు ఆత్మను నాయికగా పరమాత్మను నాయకుడిగా తలచి ఆయన కోసం దారులు చూసి ఆయన కోసం అలమటించేటపుడు వాడిన భాష అతి కోమలమైన భక్తుని భాష. కఠోర హృదయాలను ద్రవింపజేసే లలిత భాష. భక్తుని హృదయంలోని ఆవేదనలను, దుఃఖాలను దర్శనానికై వేచియున్న మనస్సును తెలిపే రాతిని కరగించే రమ్య భాష. అందుకే ప్రసిద్ధ విమర్శకులు ఆచార్య హాజరీ ప్రసాద్ ద్వివేదీగారు కబీరును వాణి కె Dictator అన్నారు. కబీరు భావనల వెనుక భాష పరుగు పెడుతుంది. ఆ భాషలో వ్యాకరణ దోషాలు ఉండవచ్చు, గ్రాంథిక భాష కాకపోవచ్చు, కానీ ఆయన భాష ఆయన తీవ్ర భావనలను చూసి భయపడి ఆయన వెనుక పరుగుపెడుతుంది అంటున్నారు.

***రామ్ వియోగి తన్ వికల్ తాహి న చీన్ హే కోయీ***
***తంబోలి కే పాన్ క్యోయాన్ దిన్ దిన్ పీలా హోయ్***

కబీరు భగవంతుని మీద నమ్మకం గురించి పద్నాలుగో దోహాలో చక్కగా వివరిస్తున్నారు. భగవంతుని మీద నమ్మకం ఉంచి వాళ్లకు సందేహం అనేది రాదు. సందేహం ఉంటే భగవంతుని మనం పొందలేము. ఆయన అందరికీ పెద్ద. సృష్టికర్త ఆయనకు తెలుసు. మనకి ఏది ఇవ్వాలి ఏది ఇవ్వకూడదని. తెలుగులో మనం అంటుంటాం "పాల ముంచినా నీట ముంచినా నీ ఆజ్ఞ దేవుడా!" అని. (వెంగమాంబ: నేను నీ సొత్తును. నీవు నా స్వామివి. కాన భాధ్యమెక్కడ బోదు కృష్ణా!). అందుకే కబీర్ ఇందులో ఎవరికీ భక్తిలో ఆయనపై గల నమ్మకంలో సంశయం - అంటే సందేహం ఉంటుందో వారి ప్రభువు దగ్గరకు వెళ్లలేరు అని అంటున్నారు. ప్రేమా భక్తిలో భక్తులు ప్రేమతో ప్రేమ స్వరూపుడైన భగవంతుని సందర్శిస్తారు. అప్పుడు ఈ జగత్తంతా ప్రేమతో నిండిపోతుంది. ప్రభువు "మన బాగోగులు చూసుకుంటారు" అనుకున్నపుడు ఆయన మీద సందేహానికి తావులేదు. భగవంతునికి భక్తునికి మధ్యలో

గడ్డిపోచకు కూడా తావులేదు. అలాంటప్పుడు ఇంకా ప్రపంచంలో ఎవరిని ఏమనగలను? భగవంతుని మీద నమ్మకం ఉంచితేనే అతడు భక్తుడు కాగలడు. తల్లి సత్యం తండ్రి నమ్మకం అంటారు. ఆ సర్వ వ్యాపి భగవంతునిపై నమ్మకముంచి మన కర్మలను పూర్ణంగా ఆయనకు సమర్పించాలి. (ఏతద్ సర్వం జనార్ధనం). అదేలా పదిహేడో దోహాలో స్వార్థపూరిత మనుషులను గురించి చర్చిస్తూ "ఈ ప్రపంచంలో ఉన్న అన్ని బంధుత్వాలు స్వార్థంతో కూడుకున్నవి. వాళ్ళందరూ మన మీద చూపించే ప్రేమ ఏదో ఒక స్వార్దంతో కలిసి ఉంటుంది. ఎవరైతే స్వార్థరహితంగా ప్రేమిస్తారో వాళ్లే భక్తులవుతారు. అందుకే స్వార్థం లేకుండా పదిమందిని ప్రేమతో చూసేవాడే నిజమైన భక్తుడు." భక్తుడు అంటే నిస్వార్థంగా ఉండాలని కబీర్ పదే పదే చెబుతున్నారు.

*జిహి హిరదై హరి ఆయియా సో క్యోఁ ఛానాన్ హోయి*
*జతన్ జతన్ కరి దాబీయే తవు ఉజాలా హోయి*

ఈ 16 దోహాలో కబీరు చాలా చక్కగా ప్రేమ భక్తి గురించి వర్ణిస్తున్నారు ఎవరైతే హృదయంలో ఆ ప్రభువును సందర్శిస్తారు. వారు దాన్ని దాచలేరు. లక్ష ప్రయత్నాలు చేసినప్పటికీ వారివారి రూపాలు తేజోమయంగా కనబడుతుంది. అంటే ప్రతి వస్తువులోనూ భగవంతుని సందర్శించేవాడికి నాదీ నీదీ అనే భేద భావం ఉండదు. ఎవరి హృదయం భగవంతునికి అంకితమవుతుందో వారు ఇతరులకు భాగవతులుగా కనిపిస్తారు. ఇలా కబీర్ దోహాలో భగవద్గీత సారం చక్కగా నిండి ఉంటుంది. 16 దోహాలో హృదయంలో ఉన్న ఈశుని గురించి మాట్లాడుతున్నారు. ఎవరు తన హృదయంలో భగవంతుని దర్శిస్తారో దాని భావనను వ్యక్తం చేయలేరు. ఆ భగవంతుని దివ్య దర్శనాన్ని అతను హృదయంలో అనుభవిస్తాడు. ఆ అనుబంధాన్ని ఆనందాన్ని ఆ వ్యక్తి ఎవరికీ చెప్పలేడు, ఇదే సిద్ధాంతాన్ని మనము నారాయణ శాండిల్య భక్తి సూత్రాలలో చూడవచ్చు. భగవద్గీతలో చూడవచ్చు ఉపనిషత్తుల్లో చూడవచ్చు. చదువులేని కబీరు ఇంత జ్ఞానాన్ని దోహాల రూపములో ఎలా వ్యక్తం చేస్తున్నారు? అది సాహిత్య పరిశోధనకు అంతులేని ప్రశ్న.

ఈ 29వ అధ్యాయంలో కబీరు గారు జఢ స్వభావం గురించి వారి ప్రవర్తన గురించి గుణాల గురించి వివరిస్తున్నారు. ఎన్నోసార్లు సహజ స్వభావంతో ఉండేవాళ్లను కబీర్‌గారు చందన వృక్షాలతో పోల్చారు. ఒక మంచివాడి చుట్టూ ఎంతోమంది దుర్జనులు చెడ్డవాళ్ళు ఉన్నా కూడా అతని స్వభావంలో ఏం మార్పు ఉండదు. ఎందుకంటే అతను సహజంగా మంచి ప్రవృత్తి కలిగినవాడు. రెండవ దోహాలో ఇదే సత్యాన్ని వెల్లడిస్తున్నాడు కబీరుదాసు. సాధారణంగా జీవులలో చైతన్యం జ్ఞాతా, గ్నేయ, జ్ఞానం అనబడే మూడు పనులు చేస్తుంది. దేవుడు అంటే మనిషినిలో అంతరాత్మ నిక్షిప్తమై ఉంటుంది. అది ఈ మూడింటికి సాక్షిగా మేల్కుంటుంది. అంటే శారీరక కార్యాలన్నీ విశ్రాంతి తీసుకునే సమయంలో (మనం నిద్రిస్తున్నప్పుడు) మన అంతరాత్మ గుండెతో సహా మేల్కొని ఉంటుంది. అందుకే మాటల మధ్యలో మనం అంటుంటాము" నీ అంతరాత్మతో అడిగి చెప్పు నిజమే చెబుతున్నావా! అని.

దోహా 14లో ఆది శంకరాచార్యుల బోధనలను మనం కబీర్ దోహా ద్వారా తెలుసుకోవచ్చు. ఏ హృదయంలో సందేహం ఉంటుందో ఆ హృదయంలో పరమాత్మ ఉండదు. పరమాత్ముని నమ్మినవాళ్లకు ఏ సందేహం రాకూడదు. దీనినే సంస్కృతంలో సంశయాత్మ వినశ్యతి అంటారు. అంటే సందేహపడితే నాశనం చెందుతాడు. భగవంతునికి భక్తునికి ఉన్న బంధములో సందేహానికి తావులేదు. ఆ ప్రేమ భక్తిలో నిండు మనసుతో పుష్కలమైన భక్తిమార్గంలో సందేహానికి తావులేదు. సందేహం నాశనానికి హేతువవుతుంది. భగవంతుని మీద పరిపూర్ణ నమ్మకం ఉన్న భక్తుడు ఆయనను సంపూర్ణంగా నమ్ముతాడు. అందుకే అతనిని భగవంతుడు కడతేరుస్తాడు. భగవంతునికి భక్తునికి మధ్య గడ్డిపోచకు కూడా (అతి చిన్న సందేహానికి) తావులేదు. ప్రహ్లాదుడు హరిని పూర్ణంగా నమ్మాడు. హరి అతన్ని పలుమార్లు ఆదుకున్నాడు. ఇదే సత్యాన్ని భగవద్గీతలో కూడా పరమాత్మ శ్రీకృష్ణుడు వెల్లడించాడు దీనినే కబీర్ 14 దోహాలో చెప్తున్నారు. ఇక 17, 18 దోహాలలో హృదయంలో ఈశ్వరుని దర్శించే భక్తులను వివరిస్తున్నారు.

*పావక్ రూపీ రామ్ హై, ఘటి ఘటి రహా సమాయి*
*చిత్ చకముక్ లాగై నహీ తాతై ధూవా హ్వై హ్వై జాయి*

ఈ 19వ దోహాలో భగవంతుని అగ్నితోనూ మనసును చెకుముకి రాళ్లతోను పోల్చి కబీర్ మన మనస్సు భావాలతో చెకుముకి రాయిలాగా ఘర్షణ చేస్తేగానీ భగవంతుని సందర్శించలేడు అంటున్నారు. అంటే హృదయంలో భక్తి భావన తాకి ఘర్షణ జరిగితేనే దేవుణ్ణి చూడవచ్చు. హృదయం నిండా పవిత్ర భక్తి భావన త్రికరణ శుద్ధితో నిస్వార్థంతో అందరినీ ప్రేమిస్తే గానీ ఆ ప్రేమ స్వరూపుడైన భగవంతుని దర్శించగలం. ఆ అంతఃకరణ ఆయనను దర్శించాలన్న తీవ్ర తపనతో

ఉంటేనే భగవంతుని దర్శనం పొందవచ్చు. (శ్రద్ధావాన్ లభతే జ్ఞానం అన్నట్లు ప్రేమ భక్తి ఉంటేనే హరిని చూడగలం). హరి భక్తులలో ఆత్మ నిండైన భక్తితో మనసును తాకనపుడు హృదయమంతా అంధకారమయమై మిగులుతుంది. ఆ అజ్ఞాన చీకటిలో ప్రేమతో నిండిన ఆ భగవంతుని జ్యోతిని మనము చూడలేము. ప్రేమపూరిత భక్తి లేకుంటే ఆ హృదయంలో సర్వ వ్యాపి అంటే ఈ జగత్తులో నిండిన పరమాత్ముని మనం చూడలేము. ఆ భగవంతుడు దివ్యజ్యోతితో కూడిన తేజోమయ రూపాన్ని చూడాలంటే ఆ దారి ప్రేమతో నిండిన భక్తి హృదయమే. ఆ హృదయాన్ని భక్తితో స్పర్శిస్తే నే భగవంతుని స్వరూపాన్ని కృపను చూడగలం. ఇన్ని ఉపమానాలు ఇచ్చినా కూడా కబీరు తనను నిర్గుణవాదిగానే చెప్పుకుంటున్నారు. కానీ కబీర్ దోహాలను సూక్ష్మ దృష్టితో చూస్తే కచ్చితంగా ఎన్నోచోట్ల ఆయన సగుణ భక్తుడిగా దర్శనమిస్తాడు. కానీ పలుచోట్ల ఆయన స్వయంగా తనను నిర్గుణ వాదిగ పేర్కొనడానికి ఇష్టపడుతున్నారు. తన భగవంతుని నిర్గుణ నిరాకార నిరంగ అలౌకిక పరబ్రహ్మగా నామ రూప గుణాతీతుడుగా పేర్కొన్నారు. బహుశా ఆ కాలపరిస్థితుల్లో ముస్లింల ఏకేశ్వరవాద ప్రభావము సూఫీల ప్రేమ మార్గం ప్రభావము వైష్ణవుల సహనత్వం, జైనుల అహింసావాదం కబీర్‌పైపడి ఉండవచ్చు. సమాజంలో ఐక్యతను నెలకొల్పడానికే కబీర్ నిర్గుణ వాదాన్ని అవలంబి ఉండవచ్చు.

ఇక 30వ అధ్యాయము "సాధు మహిమా కొ అంగ్" అంటే సాధువుల మహిమలను ఇందులో చూడవచ్చు. కబీరు నసాధువు, భక్తుల యొక్క మహిమలను వేనోళ్ళ కొనియాడుతున్నారు. హిందీ నిర్గుణ, సగుణ భక్తి సాహిత్యంలో సాధువుల స్వభావాన్ని గురించి క్షుణ్ణంగా చెప్పబడింది. సగుణ రామ భక్త కవి తులసీ దాస్ కూడా ఎన్నో దోహాలలో సాధువుల భక్తుల స్వభావాన్ని వర్ణించారు.

***తులసీ సంత్ సు అంబ తరు ఫూల్ ఫలాహి పరహేత్***
***ఇతతే పాహాన్ హనత్ ఉతతే ఫల్ దేత్*** – (సాధువు అనబడేవాడు మామిడి చెట్టువంటివాడు, ఇక్కడ నుండి రాయి విసరినా అక్కడి నుండి మధురమైన పండ్లనిచ్చును. అంటే సాధువు అపకారికి కూడా ఉపకారము చేస్తాడు –తులసీ).

ఈ 30వ అధ్యాయములో మొత్తం 11 దోహాలు ఉన్నాయి. మొదటి రెండు దోహాలలో కబీరు భక్తి యొక్క ప్రాధాన్యతను వివరిస్తున్నారు. చందనం చెట్టు చిన్నదైనా దాన్ని ఒక చిన్న ముక్క కూడా పెద్ద వటవృక్షాన్నికంటే గొప్పది. అదేలాగా ఒక వైష్ణవ భక్తుడు అంటే ఒక విష్ణుమూర్తిని కొలిచే భక్తుడు పూరిగుడిసెలో ఉన్నా శాక్తులతో నిండిన గ్రామంకంటే గొప్పవాడు. ఆనాడు గాణపత్యులు, శైవులు, శాక్తులు వైష్ణవులతో సమాజం నిండి ఉన్నదని ఈ దోహా నుండి మనము స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఆనాటి పరిస్థితుల్లో శాక్తుల ప్రాబల్యం ఎక్కువ అని కబీరు చెబుతున్నారు. ఇక 3వ దోహాలో కబీరు భక్తుడు లేని గ్రామము వ్యర్థము అని చెబుతున్నారు.

***జిహి ఘర్ సాధు న పూజియే, హరి కీ సేవా నాహీ***
***తే ఘట్ మరహట్ సారీఖే భూత్ బ సై తా మాహి***

ఈ దోహాలో "భక్తులకు గౌరవ మర్యాదలు ఏచోట ఇవ్వబడ్డదో ఏ ఇంట్లో అయితే పూజ దేవుడి భజనలు చేయబడదో ఆ ఇల్లు శ్మశానానికి సమానము. అక్కడ ఉండేవాళ్ళందరూ శవాలకు సమానం. అంటే పూజ భక్తి లేని ఇల్లు అంటే భగవంతుని భక్తి లేనిచోట జీవిస్తున్న మనుష్యులందరూ ప్రాణమున్న శవాలు అని అర్థము. ఈ చోట కబీరుని మనము ఒక మంచి భక్తుడిగా చూడవచ్చు.

***కబీర్ ధనితే సుందరి జిమి జాయా బైస్ నో పూత్***
***రామ్ సుమరి నిరభై హువా సబ్ జగ్ గయా అ ఉత్***

అదేలా ఈ ఏడవ దోహాలో కబీరు భక్తిని గురించి స్పష్టంగా వివరిస్తున్నారు. హరిని సేవించే హరిని కొలిచే కొడుకును కన్న తల్లి ఉత్తమురాలు. ఆ కొడుకు హరిస్మరణవల్ల ఆ వంశమే కొనియాడబడుతోంది. మిగతా తల్లులు తను కన్న పిల్లలందరినీ పిల్లలని చెప్పినా అలాంటివాళ్లకు సంతానం ఉన్నా వాళ్ళు సంతానము లేనివారితో లెక్కే. ఇక్కడ బైస్ న్ అన్న శబ్దం వైష్ణవం అనడానికీ సూచించబడ్డ గ్రామీణ పదం. ఉత్తర భారతంలో రాజస్థాన్‌లో వైష్ణవ భోజనశాల అని కనిపిస్తుంది. దానికి అర్థం శాకాహారం అని. సందర్భాన్నిబట్టి అర్థం తీసుకోవాలి. ఈ దోహాలో కబీరు భక్తుడైన సంతానాన్ని కన్నతల్లి శ్రేష్ఠమని అంటున్నారు. ఆస్తి ఇస్తారో లేదో కానీ పిల్లలకు భక్తిని ఇవ్వండి అని కబీరు చెబుతున్నారు. భక్తుడుని కన్న తల్లిదండ్రులే సంతానము ఉన్నవాళ్ళతో లెక్క అంటే హరిని కొలిచే సంతానము కలిగితేనే వాళ్ళను సంతానంగా పరిగణించాలి. లేదంటే పిల్లలు ఉండి కూడా లేని వాళ్ళతో సమానం. ఆ భక్తుని కన్న వంశం పవిత్రమవుతుంది.

***కులములోన యొకడు గుణవంతుడుండిన / కులము వెలయు వాని గుణము చేత / వెలయు వనంబులోన మలయజంబున్నట్లు ॥ విశ్వ ॥***

ఇక ఎనిమిదో దోహాలో కబీర్ "ఏ వంశములో ప్రభువు యొక్క భక్తుడు పుడతాడో అంటే భగవంతునిపై భక్తి ఉన్న కొడుకు పుడతాడో (సంతానము) ఆ వంశము సర్వోత్తమమైనది. ఏ వంశములో ప్రభువు భక్తుడైన సంతానం

జన్మిస్తుందో ఆ వంశము సర్వ శ్రేష్ఠమైనది. భక్తి లేని సంతానం ఉన్నచోట లేదా ఆ వంశమే జిల్లేడు పలాస చెట్లలాగా విషపూరితమైనవి. అంటే వ్యక్తి యొక్క మంచితనంవల్ల ఆ వంశమే ఉన్నతంగా భావింపబడుతుంది.

**తులన:**

***రామ విభుడుపుట్టి రఘు కులం బలరించే***
***కురు విభుడు పుట్టి కులము చెరిచె.. వేమన***

ఇక ఈ అధ్యాయంలోని తొమ్మిదో దోహాలో కబీరు ఆనాటి సంఘంలో నెలకున్న శాక్తుల మతపరమైన భావాలను గురించి విమర్శిస్తున్నారు. శక్తి ఉపాసకులు తాము బ్రాహ్మణులని చెప్పుకుంటూ ఎలా సంఘంలో జాతి భేదాలను వ్యాపింపజేస్తారో వాటి గురించి కబీరు చక్కగా వివరిస్తున్నారు. శాక్తులు బ్రాహ్మణులైనా వాళ్లతో నేను కలవడానికి ఇష్టపడను. చండాలుడైనా వైష్ణవ భక్తుడు అయితే నేను కావలించుకుంటాను. ఎందుకంటే చండాలుడు అయినా హరి భక్తుడు నాకు శ్రేష్టుడు, ప్రేమనిండిన హరి అతనిలో నాకు దర్శనమిస్తాడు అని అంటున్నారు కబీరు. శాక్తులు తాము బ్రాహ్మణులని ఇతర కులాలను విమర్శించే వారు కానీ వైష్ణవులకు జాతి మత భేద భావాలు లేవు. ఉత్తర భారతదేశంలో రామానంద సంప్రదాయంవారు జాతి మత లింగ బేధాలను పట్టించుకోరని దీన్నిబట్టి తెలియుచున్నది రామానందుడు తన భక్తి భావనలో అందరూ సమానమని ఛాతీ చెప్పారు. ఇంకొక చోట – కబీరు నా రాముని భక్తుడి ఇల్లు దరిద్రంతో కూడి ఉన్నా సరే! పైకప్పు విరిగి ఉన్నా లేదా పైకప్పు లేని గుడిసైనా అది అభినందనీయమైన విషయము. కానీ భక్తి లేని పెద్దపెద్ద భవనాలు అన్నీ వ్యర్థము అని అంటున్నారు (భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు విశ్వదాభిరామ వినురవేమ).

ఇక 31వ అధ్యాయం మధి కౌ అంగ్. ఈ అధ్యాయంలో కబీరు ఈ ద్వంద్వ స్థితి అంటే ప్రతి వ్యక్తి యొక్క మధ్యమ స్థితిని గూర్చి చెబుతున్నారు. ప్రభువు యొక్క తీవ్రమైన భక్తిలో మునిగి ఉండేవాడికి ఏ విధమైన ఆశానిరాశలు ఉండవు. అది అతని మధ్యమస్థితి అతనికి తన పర బేధం ఉండవు. ఇక్కడ మధి అనే దానికి ద్వంద్వ అవస్థ అని సూచించి వాటిని కబీర్ వర్ణించారు. ఇక్కడ మధి అనే శబ్దానికి హఠ యోగానికి సంబంధించిన అర్థం కూడా ఉన్నది. అది హఠ యోగుల నాథ సిద్ధ యోగుల ద్వారా ప్రయోగింపబడిన శబ్దము. మధి అంటే మధ్యమ మార్గము అని కూడా అర్థము. "ఇడా"ర యోగ శబ్దము. కబీరు తపస్సులతో కూడిన కఠిన యోగ సాధనతో కూడిన భక్తిని నిరసిస్తూ సహజమైన సులభమైన మార్గం అవలంబించాలని చెబుతున్నాడు. ఈ 31వ అధ్యాయంలో మొత్తం పదకొండు దోహాలు ఉన్నాయి. మనసులో ఉండే మధ్యమ మార్గాన్ని అనుసరించమని ఈ అధ్యాయంలో కబీర్ పదేపదే చెబుతున్నారు. సరళమైన భక్తి మార్గాన్ని అనుసరించాలి. మధ్య మార్గాన్ని అనుసరించేవారు సంసార బంధంలో చిక్కుకోరు. ద్వంద్వ స్థితిలో ఉండేవారు ఈ సంసార చక్రంలో చిక్కుకుపోతారు. ద్వంద్వం అంటే సుఖదుఃఖాలు ప్రవృత్తి నివృత్తులు, ఆశానిరాశలు. వీటన్నింటినీ వదిలిపెట్టి మధ్యమ మార్గాన్ని అనుసరించాలి. అత్యధికమైన శీతలత్వం, అత్యధికమైన ఉష్ణోగ్రత రెండూ ప్రమాదకరమే. అందుకే ఈ మధ్యమ మార్గమే గొప్పది. గీతలో దీన్ని అనుసరించేవాణ్ణి గీతాచార్యులయిన శ్రీ కృష్ణపరమాత్మ స్థిత ప్రజ్ఞస్థితికలవాడిగా పేర్కొన్నారు. ఈ దోహాలలో చాలా గూడార్థాలు కనబడుతాయి. వాయువు అంటే గాలి చంద్ర నాడీ సూర్య నాడి ద్వారా గతిశీలమౌతుంది. అంటే వాయు లేదా గాలి చంద్రనాడీ సూర్యనాడి ద్వారా కదలడం ప్రారంభిస్తుంది. సుష్మన ఈ రెండిటికీ మధ్య కలదు. దీనినే మధ్య నాడీ లేదా బ్రహ్మనాడీ అని కూడా అంటారు ఇక్కడ ఆయన పేర్కొన్న శీతలత్వాన్ని సూచించేది చంద్ర నాడి. సూర్యనాడీ ఉష్ణత్వానికి ప్రతీక. ఒకటి శీతలత్వాకి ఇంకొకటి ఉష్ణానికి ప్రతీకగా ఉంటుంది. ఆధ్యాత్మిక జీవన దృష్టితో చూస్తే ఈ రెండు నాడులు అగ్నికి సమానము. సంకల్ప వికల్పాలతో కూడుకున్న మనసు లయ స్థితికి రానంతవరకూ వాయువు యొక్క సంచారము మధ్యనాడిలో ఉండదు. మధ్య నాడిలో సంకల్ప వికల్పపూరిత మనసు ఉంటేనే బ్రహ్మ సాక్షాత్కారం అవుతుంది. వాయువు యొక్క సంచారము మధ్యనాడి ద్వారా అవుతే మనసు లయ స్థితిని పొందుతుంది. ఆ లయ స్థితి పరమాత్మ దర్శనానికి దోహదపడుతుంది.

***సురగ నరక తేం మై రహా, సత్ గురు కే పర సాది***
***చరన్ కంవల్ కౌ మౌంజ్ మై, రహౌ అంతి అరు ఆది -04***

ఇక ఆరవ దోహా కబీరు ఇలా అంటున్నారు– "సద్గురు కృపవల్ల నేను స్వర్గ నరకాల నుండి బయటపడితిని. స్వర్గ నరకాలకు దూరంగా నేను ఉన్నాను. ఇవి రెండు భోగాలకు దారితీస్తుంది. ఈ రెండింటివల్ల జన్మ మరణ బంధములో పడక – నేను నిరంతరము ప్రభువు యొక్క చరణ కమలాలను ఆశ్రయించి, ఆనందాన్ని పొందుతూ నిమగ్నమై ఉన్నాను. సద్గురు కృపవల్ల నేను జననమరణ చక్రానికి అతీతుడై ఆ భగవంతుని పాదపద్మముల వద్ద ఆనందముతో హాయిగా

భక్తిలో నిమగ్నమై ఉన్నాను. ఇక్కడ కబీరు పేర్కొనే ఆనందం బ్రహ్మానందం దానిని ఆంగ్లేయ భాషలో Bliss అంటారు – (దీనిని త్యాగ బ్రహ్మంగారు బ్రహ్మానందం అన్నారు – చూడుడు "రామ భక్తి సామ్రాజ్యం ఏ మానవులు కనేరో ఆ మానవుల సందర్శనం అత్యంత బ్రహ్మానందమే మనసా!). దీన్ని గురించి గీతలో – ఎన్నో ఉదాహరణలతో చెప్పబడి ఉంది. అది భక్తుని ఉన్మాదక స్థితి. ఆ ఆనందంలో ఓలలాడుతున్న వ్యక్తికి ఈ లోకం కనబడదు. అతనిని సమదర్శి అన్నారు గీతాచార్యులు. రాగ ద్వేషాలకు అతీతుడు. (సమః శత్రవుచ, మిత్రౌ చ.. గీత). ఇక ఎనిమిదో దోహాలో కబీరుదాసు– "దుఃఖంలో మునిగిన వ్యక్తి దుఃఖంతో ఎప్పుడూ బాధపడుతూ ఉంటాడు. సుఖభోగాలలో మునిగిన వ్యక్తి ఇంకా సుఖాన్ని కావాలని భోగాలను అనుభవించాలని తపనలో మునిగిపోతూ ఉంటాడు. రాముని యొక్క నిజమైన భక్తుడు అంటే ఆ పరమాత్మ యొక్క నిజ – సుఖదుఃఖాలను త్యాగం చేసి సదా బ్రహ్మానందంలో ఓలలాడుతూ జీవితం గడుపుతాడు. అతనికి సుఖదుఃఖాలు ఉండవు. రాగద్వేషాలు ఉండవు. శత్రు మిత్రువులు ఉండరు ఎల్లప్పుడూ ఆ పరమాత్మతో తాదాత్మ్యం చెందుతూ పరమానంద స్థితిని అనుభవిస్తాడు. భగవద్గీతలో దీన్ని తామరాకుపైగల నీటి బిందువువలె ఈ లోకంలో జీవించాలని పేర్కొన్నారు. ఈ అధ్యాయంలో ఉన్న తొమ్మిదవ దోహాలో అద్వైత వాదాన్ని గురించి అద్భుతంగా సెలవిస్తున్నారు కబీరు. పసుపును తెల్ల రంగులో ఉన్న సున్నంతో కలిగితే అది ఎర్రబడుతుంది, అది సింధూరమవుతుంది. అంటే కొత్త రంగునిస్తుంది. అదెలా భగవంతుడితో భక్తుడు కలిసినప్పుడు భక్తుడు తన అహంకారమును వీడి భగవంతుని నిర్మలత్వంతో కలసి ఒక ప్రత్యేక స్థితిని పొందుతాడు. ఆ స్థితిలో అతను పూర్ణ రూపేణా మనుజుడు కాదు పూర్ణ రూపేణ దైవం కాదు. అది రూపాంతర స్థితి దాన్ని భాగవత స్థితి అంటారు. రాగద్వేషాలతో కూడిన మనిషి అయిన భక్తుడు భగవంతునితో కలిసి దివ్యత్వాన్ని పొందడం. ఇది చాలా ముఖ్యమైన దోహా. ఇక పదవ దోహాలో కట్టుబాట్లతో కూడిన సంప్రదాయ పద్ధతులు మనిషి మనిషిని వేరుపరుస్తున్నాయి. సంప్రదాయమైన మతపర సిద్ధాంతాలను విస్మరిస్తే పైన పేర్కొన్న మధ్య మార్గంలో పయనించవచ్చు. ఆ స్థితిలో (సమ దర్శన స్థితిలో) మక్కా, కాశీ ఒకటవుతుంది. రాముడు రహీమ్ ఒకటవుతారు. మతం పేరిట జరిగే ఉన్మాదంతో కూడిన కొట్లాటలు సమసిపోతాయి. వేదమనవదే ధాన్యాలు పిండి అయిపోతాయి. ఆ పిండిలో రొట్టెలు చేసుకుని చక్కగా వండుకొని తిని అని కబీరు అంటున్నారు. ఇలా ఈ అధ్యాయమంతా కబీరు మధ్య మార్గాన్ని అనుసరించాలని చెబుతున్నారు. ఇక 32వ అధ్యాయము సార్ గ్రాహీ కౌ అంగ్ అంటే సారాన్ని మాత్రం గ్రహించు అని అర్థం. ఈ అధ్యాయములో మొత్తము నాలుగు దోహాలు ఉన్నాయి. మొదటి దోహాలో కబీరు పాలను ఉపమానంగా స్వీకరించి భగవంతుని తత్వాన్ని చాటి చెబుతున్నారు. కబీర్ ఇలా అంటున్నారు– "ఈ లోకం పాలతో సమానము. అందులో ఎనభై శాతము నీరు ఉంటుంది. మిగతా ఇరవైపాళ్ళు పాల తత్త్వము. అదెలా ఈ జగత్తులో ప్రభువైన భగవంతుని భక్తి తత్వము వాస్తవమైనవి. మిగతావన్నీ నీటిలాంటివి. అంటే భక్తి తత్వం తక్కువ విషయ వాంఛలు ఈ లోకంలో ఎక్కువగా వ్యాపించి ఉంటుంది. హంసపక్షి ఎలా పాలను మాత్రం తీసుకుని నీటిని వదిలివేస్తుందో అదెలా సజ్జనులు ఈ జగత్తులోని భగవత్ తత్వాన్ని అంటే భక్తిని తీసుకుని సాంసారిక మాయా మోహాలను విడిచి పెడుతారు. అంటే ప్రేమతో కూడిన భక్తితత్వాన్ని మాత్రమే గ్రహించాలని భావం.

*కబీర్ సాకత్ కోయీ నహీ సబై బై స్నో జానీ*
*జా ముఖి రామ్ న ఊచరై, తాహి త న్ కి హాని*

ఇక రెండవ దోహాలో స్వభావంతో ఎప్పుడు ఎవ్వరూ శాక్తులు కాలేరు. ఎవ్వరూ శాక్తులు కాలేరు. కానీ అందరూ వైష్ణవులు. అణువు అణువున ఆ పరమాత్ముడు అందరిలో ఆ పరమాత్ముడు దాగి ఉన్నాడు. అందుకే అందరినీ హరి భక్తులనుకోండి. ఎవరిది నోటి నుండి హరినామం వినబడుతుందో వారు భక్తులు మిగిలినవారి శరీరాలు వ్యర్థము. ఇది వైష్ణవ భక్తులకు కబీరు ఇస్తున్న ప్రాధాన్యత (కమలాక్షునర్చించు కరములే శ్రీనాథు వర్ణించు జిహ్వాజిహ్వా –పోతన). ఇక అంతిమ నాలుగవ దోహాలో కబీర్ ఇలా అంటున్నారు– "ఈ జగత్తులో ఎన్నో వనాలున్నా జనులు మధురమైన పండ్లతో గుబాళించే సుగంధాలతో కూడిన పుష్పాలతో నిండిన వనాన్ని మాత్రమే ఇష్టపడతారు. వ్యర్థమైనవాటిని కోరుకోరు. అదేలా జనుల మధ్యగల భక్తులను గుర్తించి వారి ద్వారా భగవంతుని మహిమ తెలుసుకుని జీవితాన్ని సాఫల్యం చేసుకోవాలి (పురుషుల యందు పుణ్య పురుషులు వేరయా). ఈ అధ్యాయములో నాలుగు దోహాలే ఉన్నప్పటికీ భక్తి మార్గపు దృష్టితో పరిశీలిస్తే ఇవి శ్రేష్టమైన దోహాలు. *(సశేషం)*


---

ప్రొ. లక్ష్మీ అయ్యర్, రాజస్థాన్. ఫోన్: 968 027 6038.

## మనసు జారిపోయే చోటు
## కిలిమంజారో-2

*- నిమ్మగడ్డ శేషగిరిరావు*

ఆ రాత్రి ఇంకెలాంటి ప్రయత్నం లేకుండా కళ్ళు మూయగానే వెంటనే నమ్మశక్యం కాని విధంగా నిద్రలోకి వెళ్ళిపోయాను. సమాధిలాంటి టెంట్‌లో మమ్మీలా స్లీపింగ్ బ్యాగులో బిగదీసుకుని పడుకున్నప్పటికీ, తొమ్మిది గంటల పాటు అద్భుతమైన నిద్ర ప్రాప్తించింది. ఎలాంటి ప్రయత్నం చెయ్యకుండా అంతరాయం లేని నిద్ర పట్టటం ఒక అదృష్టం. అప్పటివరకూ శరీరం కోల్పోయిన శక్తిని తిరిగి చేకూర్చే గొప్ప వరం కూడా. మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకి టెంట్ మాష్టర్ జోసఫ్ అందరినీ నిద్రలేపుతున్నప్పుడు కూడా నాకు లేవాలనిపించలేదు. స్లీపింగ్ బ్యాగు బయట టెంట్‌లో చలిగా ఉండటం వల్ల, టెంట్ బయట ఇంకా చల్లగా ఉందని ఊహించాను. దానితో మరీ స్లీపింగ్ బ్యాగు వదిలి రావాలనిపించలేదు. కొన్ని గంటల క్రితం నరకం అనుకొన్న స్లీపింగ్ బ్యాగు ఇప్పుడు స్వర్గంలా అనిపించింది. ఇది నాలో వచ్చిన మార్పు అనుకోవాలో, లేక నా శరీరం వాతావరణాన్ని తట్టుకోవటానికి అనుసరించే సహజ విధానమనుకోవాలో, లేక రాత్రంతా స్వచ్ఛమైన కొండ గాలిని పీల్చటంవలన నా శరీరం పొందిన ఆత్మ జ్ఞానమనుకోవాలో తేల్చుకోలేకపోయాను.



ఆఫ్రికాలో మంచుపర్వతం

ఒక అరగంటలో తయారై మేమంతా మెస్ టెంట్ వద్ద ఉదయం ఏడు గంటలకి బ్రేక్ ఫాస్ట్‌కోసం చేరుకోవాలి. అందరం ఒకచోట చేరి, సెగలు కక్కే ఓట్స్ పోరిడ్జ్, వేడి వేడి ఆమ్లెట్, అప్పుడే టోస్ట్ చేసిన బ్రెడ్, టాంజానియా కాఫీతో అందించబడిన ఉదయపు అల్పాహారం తింటూ, మా ఆలోచనలను, అభిప్రాయాలను కలబోసుకునే అవకాశం అది. ఈ కాఫీ ఘుమఘుమ ఆ ఉదయం మాలో కొత్త శక్తిని నింపింది. ముఖ్యంగా అది నాలోని కాఫీ ప్రేమికుడిని పూర్తిగా సంతృప్తిపరచింది. కాఫీ ఉత్పత్తికి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన దేశాలలో టాంజానియా ఒకటి.

ఆ ఉదయం ట్రెక్ ప్రారంభించే సమయానికి ఒకరికొకరం ఎప్పటి నుండో తెలిసన్నట్టు అనిపించింది. ఇలాంటి సాహస కృత్యాలలో స్నేహ, సౌభ్రాతృత్వాలు బలపడుతాయని నా నమ్మకం. అందరమూ విజయసాధన వైపు కృత నిశ్చయంతో అడుగు వేశాము. మా బృందంలో రెండు రకాలవాళ్ళున్నారు. ఎక్కువమంది నాలాంటి డాక్టర్లు దాదాపు యాభైఏళ్ళ వయస్సువాళ్ళు. మిగిలినవాళ్ళు సగటున నలభైఏళ్ళ వయసున్న ఇంజనీర్లు, ఐ.టి. ప్రొఫెషనల్స్. మా అందరి మాతృభాష తెలుగు. ఎవరూ ఇండియాలో నివాసించటం లేదు. మూడు ఖండాలలోని అయిదు దేశాలలో నివసిస్తున్నవాళ్ళం. మా పద్నాలుగు మందిలో ఐదుగురు యు.కె., నలుగురు యు.ఎ.ఈ., ఇద్దరు ఒమాన్, ఇద్దరు యు.ఎస్.ఎ, ఒకరు కెనడాలో స్థిరపడిన వాళ్ళం. మాతృభాషతో పాటు అందరినీ కలిపింది, కిలిమంజారో.

డాక్టర్ల బృందం అంతా, 1970-80లలో అభివృద్ధి దిశగా అంతగా సాగని భారతదేశంలో పుట్టి పెరిగినవాళ్ళం. ఇలాంటి యాత్రలకు, సాహస క్రీడలకు దూరంగా ఉండే చిన్న పట్టణాలలో పెరిగినవాళ్ళం. ఇక ఐ.టి. గ్రూపు. వాళ్ళు తరువాత దశకం వారు. 1990వ సంవత్సరం తరువాత భారతదేశంలో ఆర్థికంగా, సామాజికంగా వచ్చిన మార్పు చవి చూసినవాళ్ళు. ఈ ప్రయాణంలో వయోభేదం, జీవన విధానంలో భేదం ఉన్న మేమంతా ఎలా కలుస్తామోనన్న భయం నాకుంది. ఒక విధంగా దుస్సాహసమేమోననిపించే ఇటువంటి పనులలో విజయానికి, అరమరికలు లేకుండా, ఒకరికొకరు సహాయపడుతూ, సమైక్యంగా ఉండే బృందం ఎంతో ముఖ్యం. దీనికి విరుద్ధంగా ఎవరికివారు చిన్నచిన్న బృందాలుగా విడిపోయి, ఒకరితో ఒకరు సహకరించుకోని విధంగా సాగే ప్రయాణాలలో సామూహిక విజయానికి భరోసా లేదు. అదృష్టంకొద్దీ, నా భయానికి పూర్తి విరుద్ధంగా అందరం పాలు-తేనెలా కలిసిపోయాం. హాస్య ప్రియుడైన మా గోపి మాటల్లో చెప్పాలంటే, 'విస్కీ - సోడా' మాదిరిగా కలిసిపోయాము. 'సోడాతో విస్కీ',

బ్రిటిష్‌వారు క్రికెట్ ఆటతో పాటు భారతీయులకు అందించి, వారి దేశంలో మరచిపోయిన సుర-రుచి.

**షిరా క్యాంపు-1 దిశగా:**

ఈ రోజు మా గమ్యం షిరా పీఠభూమి మీదున్న షిరా క్యాంపు-1. 2896 మీటర్ల నుండి 3505 మీటర్ల (9,500 అడుగులు నుండి 11,500 అడుగుల) ఎత్తువరకూ ఉన్న 8 కిలోమీటర్ల దూరాన్ని అధిరోహించబోతున్నాము. సరిగ్గా ఉదయం ఏడు గంటలకు మొదలు పెట్టిన మా నడకలో ఎక్కువ భాగం దట్టమైన అడవిలో సాగింది. వర్షం కురుస్తూ ఉంది. పచ్చటి పర్వతాలను ఎక్కుతూ దిగుతూ పోతున్నాము. దోవలో అక్కడక్కడా అరుదైన పుష్పాలు కనపడుతున్నాయి. చిన్న చిన్న నీటి ప్రవాహాలను దాటవలసి వచ్చింది. సాధారణంగా ఈ ప్రయాణానికి 5 నుండి 6 గంటలు పడుతుందట. 'పోలే, పోలే' అంటే స్వాహిలి భాషలో మెల్లగా మెల్లగా, అనుకొంటూ, మా మూపున సంచులు మోస్తూ, అక్కడక్కడ అగుతూ వెళితే, ఏడు గంటలలో మేము సుమారు 600 మీటర్ల (2000 అడుగుల) ఎత్తు ఎక్కగలిగాము. ఇంకా మాకు కిలిమంజారో పర్వతం కనిపించటం లేదు. కాని దూరం నుండి 'మేరు' పర్వతం మమ్మల్ని చూస్తూనే ఉంది. నాకు ఈ రోజు ట్రెక్ బాగా కష్టమనిపించింది. ముందెలా ఉంటుందో!! కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించటం అంటే కేవలం ఎక్కటం మాత్రమే కాదు. ఎక్కటం, దిగటం, మళ్ళీ ఎక్కటం. ఇలా ఉంటుందీ ప్రయాణం. నిజానికి ఇలా ఎత్తైన కొండలెన్నిటినో ఎక్కుతూ దిగుతూ, శిఖరాగ్రంవైపుగా రోజుకు 500 నుండి 600 మీటర్ల (1600 అడుగుల - 2000 అడుగుల) ఎత్తు మాత్రమే ఎక్కగలుగుతాము.



కిలిమంజారో - దారిలో

ప్రారంభం నుండి కిలిమంజారో శిఖరాగ్రంవరకు ఐదు రకాల వాతావరణ ప్రదేశాలు ఉన్నాయి. మొదటగా చిత్తడి వర్షారణ్యాల ప్రాంతంతో ప్రారంభమై, శిఖరాగ్రాన హిమనీనదాల మీద ముగుస్తుంది. అంటే భూమధ్యరేఖా ప్రాంతం నుండి ఉత్తర ధృవ ప్రాంతం వరకు ఎన్ని రకాల పర్యావరణ పరిస్థితులుంటాయో అన్నిటిని ఒక్క వారంలోనే ఇక్కడ చూస్తామన్నమాట. మోషి వద్ద బేస్ క్యాంపు దిగువ ప్రాంతమంతా పంటల కోసం చదును చేసి ఉంది. అంటే దాదాపు 900 మీటర్లకు దిగువ భాగం. ఇది మొదటి పర్యావరణ ప్రాంతం. అక్కడి నుండి దాదాపు 3000 మీటర్ల ఎత్తు వరకు ఉష్ణమండలపు వర్షారణ్యాలు. అది దాటితే సవన్నా అనబడే పొడవైన గడ్డి మైదానాలు, వాటి తరువాత చెదురుమదురుగా రాళ్ళ మీద పెరిగే నాచుతో పర్వత (ఆల్పైన్) వాతావరణం, ఆ తరువాత శిఖరాగ్రం వరకు ధృవప్రాంతపు మంచు ఎడారి ఉంటుంది.

ఈనాటి ఆఖరి పావువంతు ప్రయాణంలో అనుకోకుండా దట్టమైన రెయిన్ ఫారెస్ట్ నుండి, పొడవైన గడ్డితో ఉన్న సవన్నా మైదానం వైపు సాగింది. దానితో పాటు అక్కడక్కడ హెదర్ అనబడే కొండపూల మొక్కలు, నాచు మొదలైన పరాన్నభుక్కు మొక్కలు వ్రేలాడుతున్న అగ్ని పర్వత ప్రాంతం కూడా కనిపించింది. చివరికి మెల్లగా షిరా పీఠభూమి వైపుకు దారి తీస్తున్న షిరా పర్వతశ్రేణి అంచులను చేరుకున్నాము. అప్పటికి పెద్ద-పెద్ద వృక్షాలు అదృశ్యమైపోయుండటం చేత అక్కడి నుండి, పీఠభూమికి అవతలవైపు ఉన్న 'కిబూ' పర్వత శిఖరాన్ని పూర్తిగా చూడగలిగాము. ఇది మంచుతో కప్పబడి అందంగా కనిపించింది. అక్కడి నుండి రంగురంగుల చుక్కల్లా మా గుడారాలు కూడా దూరంగా కనబడుతున్నాయి. వాటికి దగ్గరవుతున్నకొద్దీ, వంటల ఘుమఘుమలు మా నాసికలను తాకాయి. దానితో అడుగులు మరింత త్వరగా సాగాయి. భోజనపు గుడారంలో వేడివేడిగా లంచ్ మా కోసం ఎదురు చూస్తూ ఉంది. వంటవాళ్ళు, పోర్టర్లు మరికొందరు ఇతర ఉద్యోగులు 'మకుబ్వా' క్యాంపు వద్ద మాకంటె చాలా ఆలస్యంగా బయలుదేరినా, మార్గ మధ్యంలో మమ్మల్ని దాటుకుని, ఇక్కడకు చేరి, గుడారాలు ఏర్పాటు చేసి మా కోసం మధ్యాహ్న భోజనం కూడా సిద్ధం చేశారు. అది వారికి బాగా అలవాటైన పనాయె. మా గైడ్స్, బరువులు మోసేవారు, ఇతర సహాయక బృందం అంతా కలిసికట్టుగా పనిచేయటం మమ్మల్ని బాగా ఆకట్టుకుంది. ఈ ఏజెంట్ సెలక్షన్‌లో మేము మంచి నిర్ణయమే తీసుకున్నామనిపించింది.

సరైన ఏజెంట్‌ని ఎంపిక చేయటానికి నేను పడ్డ పాట్లన్నీ అప్పుడు వరుసగా గుర్తొచ్చాయి.

యు.కె. పరిధిలో ఉన్న ఏజెంట్ల గురించి ఇంటర్నెట్‌లో నేను చేసిన పరిశోధన కూడా నన్ను బాగా అయోమయంలో పడేసింది. ఇలాంటి కీలక సమయంలో గొట్టిపాటి రాజేష్‌ని, విజయ్ నాకు పరిచయం చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మెడికల్ కాలేజీలో చదువుకుని, ప్రస్తుతం 'గ్లాస్గో'లో పనిచేస్తున్న రాజేష్ తన బృందంతో కలసి అప్పటికే ఇన్‌కా ట్రయల్, అన్నపూర్ణ బేస్ క్యాంపు ట్రెక్కులు పూర్తి చేసి, ఇప్పుడు మాలాగే కిలిమంజారో అధిరోహించే ప్రయత్నంలో ఉన్నారు. ముఖ్యమైన సమాచారాన్ని పంచుకోవటంతో పాటు, ఏజెంట్ విషయంలో అతని సలహాలు తీసుకొన్నాను. కిలిమంజారో దిగువ భాగాన ఉన్న 'మోషి' పట్టణాన్ని దృష్టిలో పట్టుకుని 'గ్లాడీస్ అడ్వంచర్' అనే సంస్థను ఏజెంట్ తనే సిఫార్సు చేశాడు. వాళ్ళు పాటించే నీతి నియమాలు, వాళ్ళవద్ద పనిచేసే శిక్షణ పొందిన పోర్టర్స్, గైడ్స్, వాళ్ళ జీతభత్యాల విషయంలో ఈ సంస్థ పాటించే నీతి నియమాల గురించి అతడు చెప్పిన విషయాలు నన్ను ఆకట్టుకున్నాయి. ఆ విధంగా 'గ్లాడీస్ అడ్వంచర్'తో పరిచయాలు పెంచుకున్నాను. వాళ్ళు చాలా బాధ్యత కలిగిన సహాయకులు. మా మధ్య మంచి సంబంధాలు ఏర్పడటంవలన, ఆ సంస్థను ఎంచుకోవటం జరిగింది. ట్రెక్ మొదలు పెట్టకముందే 'గ్లాడీస్' వారి ఉద్యోగస్థులతో సత్సంబంధాలు కలిగి ఉండటం చేత, మేము అందరం ఒకరికొకరం సుపరిచితులం అయ్యాం.


గైడ్ కాస్పర్‌తో డా. శేషగిరిరావు


షిరా క్యాంపు-1. ఇక్కడ బాగా చలి గాలులు వీస్తున్నాయి. ఇక్కడ నేను రెండవసారి నిర్వాణం పొందాను!! నేను రెండు దశాబ్దాలుగా శీతలంగా ఉండే ఇంగ్లాండ్‌లో సున్నాకంటె తక్కువ ఉష్ణోగ్రతను చాలాసార్లు చూసి ఉండటంవలన 'కిలిమంజారోలో చలిని తట్టుకోగలను' అనుకున్నాను. ఇది తప్పని ఇప్పుడు అర్థమైంది. నేను మరచిన విషయం ఏమిటంటే; ఇంగ్లండ్‌లో వెచ్చటి ఇళ్ళల్లో, ఆఫీసులలో, కార్లలో జీవిస్తామని. కిలిమంజారోలో మాదిరిగా నేను ఎప్పుడు చలికాలంలో నా గార్డెన్‌లో కూడా టెంట్‌లో గడపలేదు. ఆరు బయట, ఆకాశం క్రింద, అంత చలిలో, చిన్న గుడారాలలో, ప్రకృతి శక్తులకి లోబడి, నిలవటం అంత తేలిక కాదు.

భోజనం తరువాత రెండు గంటలు గుడారాల్లో విశ్రాంతి తీసుకున్నాము. నా అదృష్టంకొద్దీ వెంటనే నిద్రపోయి సేదతీరాను. తరువాత వాతావరణానికి అలవాటు చేసే ఉద్దేశ్యంతో, ఒక గంటపాటు దగ్గరలో ఉన్న షిరా పీఠభూమి మీద ఎత్తైనప్రాంతం ఎక్కటానికి మమ్మల్ని బయలుదేరదీశారు. మార్గమధ్యంలో ఇతర పర్వతారోహకుల గుడారాలు కన్పించాయి. ఆ ప్రాంతమంతా రకరకాల వ్యక్తులతో నిండి ఉంది. వాళ్ళతో మాట్లాడుతూ, ఒక స్వచ్ఛమైన నీటితో పారుతున్న సెలయేటిని దాటి సాగిపోయాము. ఆ తరువాత అలాంటి సెలయేళ్ళనెన్నిటినో చూశాము. ఆ నీరంతా కిలిమంజారోపై నుండి ప్రవహిస్తున్న, కరగిన మంచు. కిలిమంజారో హిమనీ నదాలు విశేషమైనవి. 'ఎర్నెస్ట్ హెమింగ్‌వే' తన రచనలలో వీటిని ప్రస్తావించి, ప్రాచుర్యంలోకి తెచ్చాడు. అతను ఈ ప్రాంతంలో కొంత కాలం నివశించాడట. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ శాస్త్రజ్ఞుల దృష్టి, భూగోళం మీద పెరుగుతున్న ఉష్ణోగ్రత మీదే. కిలిమంజారో హిమనీనదాలు రోజురోజుకూ కరగి, తరగి పోవటం వీరందరికీ ప్రధానమైన సమస్య. ఈ పరిస్థితిని నియంత్రించకపోతే భూమధ్యరేఖకు దగ్గరలో, కిలిమంజారో మీద ఉన్న ఒకే ఒక హిమనీనదం చరిత్రగా మిగిలిపోయే రోజు వస్తుంది. క్యాంపులన్నిటికీ జలాధారం వాటికి దగ్గరలో ఉన్న సెలయేరులే. నిజానికి క్యాంపులన్నీ ఏదో ఒక సెలయేటికి దగ్గరలో ఉంటాయి. ఈ నీటిలో ప్యూరిఫైయర్ బిళ్ళలు కలిపి మాకిస్తున్నారు. ఒక్కొక్కరికీ రోజుకి నాలుగు లీటర్ల నీరు ఇస్తారు. అది మంచు కరగిన స్వచ్ఛమైన నీరు కాబట్టి మా సిబ్బంది ఎలాంటి టాబ్లెట్‌లు ఉపయోగించరని తెలిసింది. అయితే మా విషయంలో వారు ఎటువంటి అజాగ్రత్తకు తావివ్వమని అన్నారు. నిజానికి టాబ్లెట్స్ కలిపిన నీరు అంత రుచిగా ఉండదు.

రాత్రి భోజన సమయంలో కాస్పర్, మరుసటిరోజు షెడ్యూల్ క్లుప్తంగా చెప్పాడు. మరుసటిరోజు (3వ రోజు) ప్రయాణం సుదీర్ఘంగా ఉంటుందని, వాతావరణ సర్దుబాటుకోసం, షిరా కథీడ్రల్ వైపుగా పర్వతారోహణ చెయ్యాల్సి ఉంటుందని, ఇప్పటివరకు ఎక్కినవాటిలో ఇదే ఎత్తైనదని వివరించాడు.

షిరా క్యాంపు-1లో చల్లగా, శరీరాన్ని గడ్డకట్టించేంత శీతలగాడ్పుతో ఉంది. అతి క్లిష్టమైన నడక తరువాత ఇంత చలిగాలితో కూడిన వాతావరణం చాలా నిరాశాజనకంగా ఉంది. ముందురోజు రాత్రి నేను తేలికగా చూసిన నా గుడారం, నా స్లీపింగ్ బాగ్‌ల భరోసా కోసం ఆరాటం మొదలయ్యింది. అవే ఇప్పుడు నా ప్రాణస్నేహితులు. రాత్రిపూట అసలు 'బయటకు రావటమే అసాధ్యం' అనే సమయంలో నేను నా చిన్న టెంట్‌లో సుఖంగా ఉన్నాను.

ఉదయపు దినచర్య కొంచెం అలవాటయ్యింది. టెంట్ మాష్టర్ జోసఫ్ మమ్మల్ని ఉదయం 6.30 గంటలకల్లా నిద్రలేపుతాడు. మేము ఏడు గంటలకల్లా వాళ్ళు సూచించిన బట్టలన్నీ దొంతర్లుగా వేసుకుని, క్యాప్స్, బూట్స్‌తో సహా తయారైపోతాము. అలా ఉదయమే గుడారాల నుండి బయటకు వచ్చేసరికి, వాటి మీద రాత్రి పడిన మంచు పేరుకుని ఉంది. ఉదయం ఏడు గంటలు అయినా, ఉష్ణోగ్రత దాదాపు సున్నాకంటె తక్కువగా ఉంది. జోసఫ్, అసిస్టెంట్ గైడ్ ఇమ్మాన్యుయేల్ నిజంగా మా సంరక్షకులు అని చెప్పవచ్చు. బూటు లేస్‌లు కట్టుకోవటానికి ప్రత్యేక నైపుణ్యం కావాలి, అలాంటి విషయంలో కూడా వాళ్ళు చేసిన సహాయానికి నేను ఎప్పుడూ కృతజ్ఞుడనై ఉంటాను.


కిలిమంజారో శిఖరం

షిరా క్యాంపు-1లో గడిపిన అతిశీతల రాత్రి అనుభవం ఎప్పటికీ మరచిపోలేను. అక్కడ రక్తం గడ్డకట్టే వాతావరణం ముందున్న పరిస్థితి గురించి మమ్మల్ని హెచ్చరించింది. అందుకే నేను ముందు జాగ్రత్త చర్యగా ఒకదాని మీద ఒకటిగా వేసుకోవటానికి మందపాటి వెచ్చటి బట్టలను సిద్ధం చేసుకున్నాను. అవసరాలకు తగిన సామాగ్రిని సమకూర్చుకోవటం, ఎప్పటికప్పుడు సరైనవి ఎంచుకోవటమే ముఖ్యమైన విషయం. కిలిమంజారో ట్రెక్కులో సరైన సామాగ్రి కొనటం కూడా, కిలిమంజారో ఎక్కటమంత కష్టం. ఈ సాధనాల్లో ముఖ్యమైనవి రెండు. అవి వాకింగ్ పోల్స్, బూట్లు. నేను ఎప్పుడూ బూట్లు వాడలేదు. ముందు చేసిన ట్రెక్కింగులని కొంచెం తేలికైన బూట్లుతోనే చేశాను. నా పరిశోధనలో తేలిందేమిటంటే, ఒక మంచి బూట్ల జత కొనటమే మొదటి కష్టమైన అడుగు. నేను దీని మీద పరిశోధన ప్రారంభించినప్పుడే తెలిసింది; ఈ విషయంలో తెలుసుకోవలసిందెంతో ఉందని. పర్వతారోహణ దిశగా ఇదే నా తొలి మెట్టు. మేము సమకూర్చుకోవలసిన సామనుల పట్టిక వివరంగా ఇచ్చాడు మా ఏజెంట్. వాటిని కొనుక్కోవచ్చు లేదా అద్దెకైనా తీసుకోవచ్చు. గెయిటర్లు, కామెల్ సాక్, మూడు వాతావరణాల జాకెట్లు, డౌన్ జాకెట్లు, ఇలా ఎన్నో కొత్త కొత్త పదజాలం ఉంది ఈ పట్టికలో. ఇవేమిటో తెలుసుకునేందుకు నేను గూగుల్ డిక్షనరీ సహాయం తీసుకోవలసి వచ్చింది.

ఒక్కొక్క వస్తువులో, మళ్ళీ ఎన్నో రకాలు ఉన్నాయి. ఉదాహరణకు వాకింగ్ పోల్స్ తీసుకోవాలంటే, అవి అల్యూమినియమ్‌తో చేసినవా లేదా కార్బన్‌తో చేసినవా అని చూడాలి. వాటిని బిగించుకునే విధానం, వాటి కొనకు వాడిన పదార్థం, వాటి మీద పడే వత్తిడిని తట్టుకునే శక్తి, వాటి పిడికి వాడిన పదార్థం (రబ్బరా, కార్కా).. ఇలా ఎవరికేది ప్రధానమో వాటిని ఎంచుకోవటానికి వీలుగా, రకరకాలుగా ఉంటాయి. అతి తక్కువ ధరకు పది రెట్లుంటుంది అత్యధిక ధర. మనకు కావలసినదేమిటో తేల్చుకోవటం, ఎంచుకోవటం అంతా అయోమయంగా ఉంటుంది. అలాంటప్పుడు మిగతావాళ్ళు ఏమి ఎంచుకుంటున్నారో తెలుసుకుందామని వాట్సాప్ గ్రూప్‌లో ప్రయత్నిస్తే, అదింకా ఇరకాటంలో పడేసేది. మనం ఎంతో ప్రయత్నం చేసి ఒక వస్తువు మంచిదనుకునికొంటే, అది మంచిది కాదని, దానికి ఎక్కువ ధర పెట్టామని తేలిపోయేది గ్రూప్‌లో. వేరేవాళ్ళు మనం చూడవలసిన మంచి లక్షణాలు ఇంకెన్నో ఉన్నాయంటూ ప్రతిపాదిస్తారు.

కావాల్సిన సామాగ్రిని సమకూర్చుకునే ప్రయత్నంలో, నా మిత్రుడు తోటి సైకియాట్రిస్ట్ అయిన సుభోద్‌తో సుదీర్ఘ

చర్చలు జరిపాను. అతను మరాథన్ రన్నర్, పర్వతారోహకుడు. కిలిమంజారోను కొన్నేళ్ళ క్రితమే అధిరోహించాడు. అతను నాకు తప్పనిసరిగా, కాలినడకకు అనువైన, మంచి ప్రత్యేకమైన బూట్లు ఉండాలని సూచించాడు. మామూలు షూస్ వేసుకుని కిలిమంజారో ఎక్కాలని చూడొద్దని విలువైన సలహా ఇచ్చాడు. మంచి బూట్లు, వాకింగ్ స్టిక్స్ మీద పెట్టే ఖర్చు చాలా ఉపయోగమని కూడా చెప్పాడు. ఎన్నో ఉత్పత్తులను అధ్యయనం చేసిన తర్వాత మా పట్టణం (న్యూ బరీ)లోనే 'బ్లాక్స్' అనే షాపులో దొరికే సలోమన్ బూట్లు తీసుకోవాలని నిశ్చయించుకున్నాను. మా గ్రూపులో చాలామంది కూడా వీటినే కొన్నారని నాకు తర్వాత తెలిసింది. సలోమన్ బూట్లు ఫ్రెంచి సైన్యం కోసం తయారు చేస్తారని తెలిసింది. సమ్మిట్‌కు చేరువలో చలి తట్టుకోవటానికి రెండు మూడు జతల మేజోళ్ళు ధరించవలసి ఉండటంవలన మామూలు సైజుకంటె కొంచెం పెద్ద బూట్లు కొనమని సలహా చెప్పారు.

ఇక ఈ బూట్లని మెత్తగా నలగకొట్టటం ముఖ్యం. స్పష్టమైన సలహా ఏమిటంటే, బూట్లను వాడకుండా వాటితో ట్రెక్కింగ్ చెయ్యకూడదని. కొత్త బూట్లు దారిలో నరకం చూపిస్తాయి. అందువలన వాటిని కంఫర్ట్ మోడ్‌లోకి తేవటానికి న్యూబెర్రీలో పదులకొద్దీ కిలోమీటర్లు నడిచాను. నాకు నేను సంతృప్తి చెందేవరకు వాటిని నలగకొట్టాను. ఒకసారి అవి మన ఆధీనంలోకి వస్తే, అవే మన కాళ్ళను కాపాడే సేవకులు అవుతాయి. నా టాంజానియా ప్రయాణానికి వారం రోజుల ముందే అన్ని వస్తువులూ సమకూర్చుకున్నాను, అనుకుంటున్నప్పుడే, నా ట్రావెలర్ మిత్రుడు కన్నన్ మెసేజ్ పెట్టాడు. అతను తన భార్య సునీతతో కలిసి వారం క్రితమే కిలిమంజారో సమ్మిట్‌కు చేరుకున్నాడు. వాళ్ళ ట్రెక్కింగ్‌లో మొదటి నాలుగురోజులూ ఎడతెరపి లేకుండా వర్షం కురిసిందని, వర్షం నుండి కాపాడే వస్తువులు తీసుకోమని సలహా ఇచ్చాడు. సమ్మిట్ అధిరోహణకు 'స్కీ ట్రౌజర్స్' అవసరం అని తెలిపాడు.

గంటల తరబడి వెబ్ బ్రౌజింగ్‌తో పాటు, మా లోకల్ మౌంటెనీరింగ్ స్టోర్‌లు: 'మౌంటెన్ వేర్ హౌస్' 'బ్లాక్స్'లో అనేక వస్తువులని పరిశీలించాను. నేను ఇంతకు ముందు ఎన్నోసార్లు అటు వెళ్ళినా ఈ రెండు స్టోర్స్‌లో ఏ ఒక్కటి నన్ను ఆకర్షించలేదు. ఇప్పుడు ఈ రెండు స్టోర్లమీద ఎక్సపర్ట్ అయ్యాను. ఈ సమయంలో ఒక చిన్న టౌన్‌లో ఉండటంవలన పని సులువయింది. లండన్‌లాంటి ఏ పెద్ద పట్టణంలోనో అయితే, ఇటువంటి పది షాపుల మధ్య కొట్టుమిట్టాడేవాడిని.

షిరా క్యాంప్-1కి వీడ్కోలు పలుకుతూ, షిరా క్యాంపు-2కు బయలుదేరాము. అది 3,850 మీటర్ల (12,631 అడుగుల) ఎత్తులో ఉంది. అంటే ఈ రోజు లక్ష్యం ఎత్తు 342 మీటర్లు. 'కిబో' పర్వతం ఆధారంగా షిరా పీఠభూమి 13 కిలోమీటర్ల మైదానంతో విస్తరించి ఉంది. భౌగోళికంగా ఇది 500,000 సంవత్సరాల నాటి అగ్ని పర్వతపు బిలంవల్ల ఏర్పడింది. ఇది చిన్న, పెద్ద రాళ్ళతో నిండి నల్లటి ఆకారంలో ఇది ఒక వింతైన, అధివాస్తవిక సౌందర్యంతో కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో ఇక్కడ అడవి జంతువులు కనపడతాయని కాస్పర్ చెప్పాడు. పొరుగు దేశమైన కెన్యా అంబొసాలి జాతీయ పార్క్ నుండి జంతువులు ఇక్కడకు మేతకు వస్తాయట. మేము ఇక్కడ కొన్ని అడవి బర్రెల గిట్టల గుర్తులు చూశాము.

షిరా క్యాంప్-1, క్యాంపు-2ల మధ్య వాతావరణ సర్దుబాటుకోసం, షిరా కథెడ్రల్ వైపుగా వెళ్ళాలి. ఇది నిలువుగా ఏర్పడిన అతి పెద్ద రాతి గుట్ట. దీని శిఖరం 3872 మీటర్ల ఎత్తులో ఎగుడుదిగుడుగా ఉంటుంది. అక్కడి నుండి కనిపించే దృశ్యాలు అద్భుతంగా ఉంటాయట.

షిరా కథెడ్రల్ చేరటానికి మేము వెళ్ళే మార్గం చాలా కష్టమైంది. బండరాళ్ళతో నిండి, ఎలాంటి ఆధారాలు లేకుండా, ఎగుడుదిగుడుగా ఉన్న మార్గంలో అప్పుడప్పుడూ నేను రెండు చేతుల మీద ఎక్కవలసి వచ్చింది. కొన్ని చోట్ల తరువాత అడుగు ఎక్కడ వెయ్యాలో, ఎక్కడ పట్టుకోవాలో ముందుగానే ఆలోచించుకోవలసి వచ్చింది.

ఈ దశలో అందరిలోనూ నేనే నిదానం అని తెలిసిపోయింది. అప్పటి నుండి కాస్పర్ నాకోసం ప్రత్యేకంగా ఒక సహాయక గైడ్‌ని పెట్టాడు. ముఖ్యంగా దిగేటప్పుడు. జాగ్రత్తగా లేకపోతే జారిపోయి, దొర్లుకుంటూ పడిపోవటమే. అప్పటి నుండీ క్యాంపుకు చేరుకోవటంలో నేను వెనకబడి ఉండేవాడిని. మిగతా గ్రూపుకంటే అరగంటనుండి గంట ఆలస్యంగా చేరుకునేవాడిని. నా వెనుక తోడుగా, ఒక చిన్న గైడ్స్ టీమ్ ఉండేది. మిగిలిన గైడ్స్ ముందే ఉండేవాళ్ళు. నాలుగవ రోజు నుండి నేను దాదాపు నా టీమ్ నుండి విడిపోయాను. ఆ విధంగా నాతో ఉన్న గైడ్స్‌తో వ్యక్తిగత పరిచయాలు

పంచుకోవటానికి, వాళ్ళ జీవన విధానం గురించి వివరంగా తెలుసుకోవటానికి అవకాశం దొరికింది.

ఒక విధంగా నేను అనుభూతి ప్రధానమనుకునే యాత్రికుణ్ణి. కొత్త ప్రదేశాల లక్షణాలను అర్థం చేసుకొని, వాటి చరిత్ర సంస్కృతి, అలవాట్లు, కట్టుబాట్లు మొదలైనవన్నీ తెలుసుకోవాలనుకుంటాను. భేషజాలను వదలి, నేను వెళ్ళిన ప్రదేశాలతో మమేకమయ్యే అనుభూతి నాకు ఇష్టం. సాహస కృత్యాలు నాకు సాధారణంగా పడవు. కిలిమంజారో యాత్రలో నాకు నచ్చేవీ, నచ్చనివీ రెండూ ఉన్నాయి. ఇది పూర్తిగా సాహసంతో కూడిన యాత్ర. ప్రపంచంలోని ఫ్రీ స్టాండింగ్ పర్వతాన్ని అధిరోహించటంతో ఒక ఘనకార్యం. నేను ఈ శిఖరాన్ని అధిరోహించినా, లేకపోయినా అదొక సంతోషకరమైన యాత్రానుభవంగా మిగిలిపోతుంది.

50 ఏళ్ళ వయస్సులో నేను ఈ ట్రెక్కింగ్‌కు వెళ్ళాలనుకోవటం నా కుటుంబానికి, మిత్రులకు అంతగా నచ్చలేదు. నేను రికార్డు బ్రద్దలు కొట్టటానికి వెళ్ళటంలేదనీ, నా సామర్థ్యాన్ని పరీక్షించుకోవటానికి మాత్రమే వెళుతున్నానని వాళ్ళను ఒప్పించాను. నేను విఫలమైతే, ప్రకృతి శక్తుల ముందు తలవంచినందుకు గర్వపడతాను. ఒకవేళ నేను శిఖరం చేరుకుంటే, అందరికీ అందని అందాన్ని అందుకునే అవకాశం నాకు ఇచ్చినందుకు ఆ గొప్ప పర్వతానికి, ప్రకృతి మాతకు తల వంచి నమస్కరిస్తాను. ఈ భావన ఈ ప్రయాణంలో నాకెంతో స్వాంతన ఇచ్చింది. కిలిమంజారో ఎక్కే వారందరూ, 'నేను శిఖరం చేరుకోలేనేమో!' అనే భయాన్ని భుజాలమీద మోస్తూ ఉంటారు. ఆ మధ్యాహ్నం మాలో కొందరు ఇండియన్ రుచుల కోసం ఆరాటపడ్డారు. దుబాయ్ నుండి మోహన్, ప్రియా పచ్చళ్ళు తీసుకొచ్చాడు. ఇంట్లో తిన్నదానికంటే పదిరెట్లు రుచిగా అనిపించాయి ఇక్కడ. మరొకరు బిర్యానీ తింటున్నట్లుగా ఊహించుకున్నారు. బిర్యానీ ప్రస్థావన రాగానే, ప్రసిద్ధ రచయిత జాన్ గ్రిషమ్ నవలలోని ఒక విషయం గుర్తుకొచ్చింది. మధ్య-అమెరికాలో మరణ శిక్ష విధించబడిన ఖైదీలు తమ మరణానికి ముందు 'ఛీజ్ బర్గర్'ను ఆఖరి మీల్‌గా కోరుకుంటారు. అదే మాంసాహారులైన భారతీయులైతే మరణశిక్షకు ముందు చికెన్ లేదా మటన్ బిర్యానీ కోరుకుంటారేమోనని నవ్వుకున్నాను. ఇక్కడ కలలో మాత్రమే బిర్యానీ దొరుకుతుందని మాకు తెలుసు. జోక్‌గా 'ఇక్కడ ఎవరైన బిర్యానీ వండగలరా?' అని ఒకరు సవాల్ విసిరారు. అన్నిటిలో రికార్డు నెలకొల్పే మహేష్ వంటలో దిట్ట. అతని ప్రత్యేకత బిర్యానీ తయారు చేయటం. సవాల్ వినగానే మహేష్ స్పందించి, "ఇక్కడ నిజమైన బిర్యానీ అసాధ్యం, కానీ నేను కిచెన్‌లోకి వెళ్ళి, మనందరికీ కావలసిన రుచులు పండించటానికి హెడ్ చెఫ్‌తో పాటు కలసి పనిచేస్తాను" అంటూ, మోహన్‌తో పాటు వెళ్ళాడు.

రెండు గంటల విశ్రాంతి తర్వాత లేచేసరికి నాసికాపుటాలకు ఘుమఘుమల విందు మొదలయింది. మహేష్ చరిత్ర సృష్టిస్తున్నాడనుకున్నాను. అదే జరిగింది. ఉన్న కొద్ది దినుసులు, బియ్యం, చికెన్‌తో రుచికరమైన బిర్యానీ తయారు చేశాడు మహేష్. హెడ్ చెఫ్, మా డాక్టర్ చెఫ్‌ను అభినందించి, ఒక కొత్త వంటకం నేర్పినందుకు ధన్యవాదాలు చెప్పాడు. ఎవ్వరూ అభ్యంతరం చెప్పకపోతే నేను దీన్ని ప్రపంచ రికార్డుగా పరిగణిస్తాను. 4000 మీటర్ల ఎత్తులో కిలిమంజారో మీద బిర్యానీ తయారు చేయటం ఒక రికార్డు అనిపించింది. అది మా మహేష్ సొంతం. బిర్యానీ మా అందరిలోనూ కొత్త ఉత్సాహం నింపింది.

అందరూ బాగా అలిసిపోయి ఉన్నారు. కాస్పర్ మరుసటిరోజు షెడ్యూల్ గురించి క్లుప్తంగా చెప్పాడు. ఇప్పటివరకు చేసిన ప్రయాణం కంటే అది పెద్దది. లంచ్ టైమ్‌కల్లా 4600 మీటర్ల ఎత్తులో ఉన్న (15091 అడుగులు) లావా టవర్ ఎక్కాల్సి ఉంటుంది. అక్కడి నుండి 'కరంగా' క్యాంపు వద్దకు దిగాలి. రేపటి షెడ్యూల్‌ని మనసులో ఉంచుకొని అందరం నిద్రపోవటానికి వెళ్ళాము. షిరా క్యాంప్-2 లో గడపిన రాత్రి గత రాత్రితో పోలిస్తే నాకు చాలా సౌకర్యంగా ఉంది. కాని మాలో కొందరికి, గాలిలో ఆక్సిజన్ సాంద్రత తగ్గటం వలన అప్పటికే ఆల్టిట్యూడ్ సిక్‌నెస్ వచ్చే సూచనలు అందాయి.

*(ఇంకా ఉంది)*

*రచయిత ఆంగ్లంలో రాసిన ఈ యాత్రావిశేషాలను - తెలుగు చేసింది 'భ్రమణకాంక్ష' - ఆదిరానారాయణ; జయశ్రీ అట్లూరి గారలు (లండన్).*

డా. నిమ్మగడ్డ శేషగిరిరావు
ఇంగ్లాండ్, e-mail: srnimmagadda@googlemail.com

## విలియం బ్లేక్


**(William Blake)** (1757 - 1827) -

## విలియం టర్నర్

(1775 - 1851)

*- తంగెడ విశ్వేశ్వరప్రసాద్*

"కళ సజీవ వృక్షం, సైన్స్ ఎండిన మోడు" అని నమ్మిన విలియం బ్లేక్ చిత్రకారుడు, కవి, మార్మికవాది, ప్రింట్ల తయారీదారుగా తన జీవితకాలంలో గుర్తింపు లేకుండా బతికి, ఇప్పుడు చిత్రకారునిగా, కవిగా రొమాంటిక్ యుగాన్ని ప్రభావితం చేసినవాడుగా కీర్తింపబడుతున్నాడు.



విలియం బ్లేక్

సాహితీ ప్రియులను తన రచనలతో, చిత్రకళా ప్రియులను తన వర్ణచిత్రాలలో ఏకకాలంలో అలరించిన గొప్ప భావుకుడు, స్వాప్నికుడు, బ్లేక్. సమకాలీనులు బ్లేక్‌ను పిచ్చివాడిగా తృణీకరిస్తే తర్వాతి విమర్శకులు బ్లేక్‌ను సృజనశీలిగా, వేదాంతిగా, మార్మికవాదిగా, నమ్మిన విషయాలను నిర్భయంగా వ్యక్తీకరించిన ధైర్యశాలిగా ఆకాశానికెత్తుతారు. నిబద్ధతగల క్రిష్టియన్ అయినా బ్లేక్ ఇంగ్లండ్ చర్చికి విరోధి.

లండన్ సోహో బ్రాడ్ స్ట్రీట్‌లో సాధారణ కుటుంబంలో జన్మించాడు. సంతానం ఏడుగురిలో మూడవవాడు. తండ్రి జేమ్స్ అల్లిక వస్తువుల వ్యాపారి. చదవడం, రాయడం వచ్చేవరకే పాఠశాల విద్యను నేర్చుకున్నాడు. పది సంవత్సరాల వయసులో పాఠశాలను వదిలేసిన బ్లేక్‌కు తల్లి కాథరీనే (Catherine) గురువు. తల్లి చెప్పిన బైబిల్ కథల ప్రభావం అమితం, అదే అతనికి జీవితాంతం స్ఫూర్తిగా నిలిచింది. బ్లేక్‌కు చిత్రకళనభ్యసించాలని మక్కువగా ఉండేది, కానీ ఆర్థికశక్తి లేని కారణంగా తండ్రి కొడుకును ఒక గురువు వద్ద చెక్కడపు పనిలో చేరుస్తాడు. ఏడేండ్లు చెక్కడపు పని (ఎన్‌గ్రేవింగ్, ఎచ్చింగ్)లో పరిపూర్ణత సాధించాడు.

బ్లేక్ పిన్నవయసులోనే లోకాతీత అనుభవాలు పొందాడు. నాలుగవ యేట కిటికీలో దేవుని రూపాన్నిచూసి భయపడుతాడు. చెట్ల కొమ్మలకు ఊయలలూగుతున్న దేవదూతలను చూస్తాడు. బహిర్భూమిలో ఇజేకియల్ కన్పించాడని చెప్పుకుంటాడు. పెరిగేకొద్దీ వాస్తవ జీవితంలోకంటే స్వప్న ప్రపంచంలోనే ఎక్కువకాలం గడిపేవాడు, తండ్రి కూడా మార్మికవాది కావడంతో కుమారుని స్వాప్నిక జగత్తును సమర్థించేవాడు. పాశ్చాత్యకళలో ప్రముఖ స్వాప్నికుడిగా గుర్తింపు పొంది బ్లేక్ అనితర సాధ్యమైన డిజైన్లు, బొమ్మలతో పుస్తకాలను ముదురు నీలిరంగులతో వైవిధ్యభరితంగా అలంకరించాడు. 21 సంవత్సరాల వయసులో సమర్థుడైన ఎన్‌గ్రేవర్‌గా వృత్తి జీవితంలోకి ప్రవేశిస్తాడు. తోటమాలి కుమార్తె కాథరీన్ బౌచర్‌ను పెండ్లి చేసుకుంటాడు. పెండ్లినాటికి భార్య నిరక్షరాస్యురాలు. బ్లేక్ ఆమెకు చదవడం, రాయడం నేర్పి తన రాత ప్రతులను కాపీ చేయించి, డ్రాయింగు వేసిన పుస్తకాలకు రంగులు అద్దడం నేర్పుతాడు. ఆఖరికి ఆమెను తన ఊహాలోకంలో విహరింపజేస్తాడు. హద్దులు లేని ప్రేమ, లోపం లేని స్నేహంతో ఇద్దరూ నిరాడంబరంగా పేద బతుకును వెళ్ళదీస్తారు. కవితల్లో - సాంగ్స్ ఆఫ్ ఎక్స్‌పీరియన్స్, సాంగ్స్ ఆఫ్ ఇన్నోసెన్స్ సంపుటాలతో బ్లేక్ ఆంగ్ల సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమిస్తాడు. షేక్స్‌పియర్ తర్వాత అంత శక్తివంతంగా వాక్చిత్రాలతో కవితలల్లాడు. వాక్చిత్రాలకు దీటుగా వర్ణచిత్రాలు రచించాడు. బతుకుతెరువు కోసం పాత, సమకాలీనుల పుస్తకాలను బొమ్మలు వేశాడు. చిత్రకళలో చిరస్థాయిగా నిలిచిపోయే బ్లేక్ దృశ్యాలన్నీ వ్యక్తిగతమైనవి, అసంగతమైనవి. అర్థంలేనివిగా ముద్రపడ్డాయి. నిర్జీవ వస్తువులకు మానవ లక్షణాన్ని ఆపాదించడం బ్లేక్ విశిష్టత.

ప్రకృతిని మోడల్‌గా చేసుకుని లాండ్‌స్కేప్‌లు వేసిన గత కాలపు మాస్టర్ చిత్రకారులందర్నీ నిరసించాడు. మోడళ్ళను చూపి పోర్ట్రెయిట్లు, ప్రకృతిని చూసి చిత్రాలు గీయడం అంటే కేవలం కాపీ చిత్రాలు రూపొందించడమే! దానికి ఊహాశక్తితో పనేముంది? దాన్ని ఎవరైనా చేయగలుగుతారు అంటాడు. చిత్రానికి స్ఫూర్తి, ప్రేరణలు పునాది, ప్రాతిపదిక అని బ్లేక్ ప్రగాఢ విశ్వాసం.

స్నేహితులు, శత్రువులు, జంతువులు సమస్తాన్నీ అనేక రూపాల్లో ఊహించాడు. ఆ రూపాల్లో బ్లేక్‌కు దైవత్వం కన్పించేది. ఏ పనికైనా గీటురాయి అంతిమ ఫలితం. చిత్రకళకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. బ్లేక్ పనితనంలో అతని స్వప్న రూపాలు కన్పిస్తాయి. బ్లేక్ సృష్టించిన రూపాల్లో ఆడో మగో చెప్పడానికి వీలుగాని కండలు తిరిగిన రూపాలు కన్పిస్తాయి. డాంటే డివైన్ కామెడీకి, జాబ్‌కథా పుస్తకానికి వేసిన 20 చిత్రాలు అన్నీ వాటర్ కలర్స్‌లో వేసినవే. బ్లేక్ వేసిన చిత్రాలు మానవ లక్షణాలతో కనిపించే, ఎవ్వరి ఊహకందని వింతరూపాలు. పుస్తకంలోని డిజైన్లు కూడా చైతన్యం, నాటకీయతను సూచించే సజీవ కళారూపాలే. దేవతల కోపాన్ని, ఆనందాన్ని, సున్నితత్వాన్ని, విషాదం, భయం మొదలైన భావోద్రాకాల్ని ఆ చిత్రాల్లో చూపించాడు.

బ్లేక్ ఏక వ్యక్తి కాదు – చెక్కడపు పనివాడు, ముద్రాపకుడు, అలంకారికుడు. వర్ణచిత్రకారుడు, బైండరు కలగలిసిన ఐదుగురు కళాకారుల మిశ్రమం. అతని పుస్తకాలు, చిత్రాలు అద్భుతమైన ప్రతిభ కలిగిన అనితరసాధ్యాలు. ప్రకృతి దయ్యపు సృష్టి. దాన్ని చూసి చిత్రించినట్లయితే ఊహాశక్తి ఎందుకు, ఆర్ట్ ఎందుకు? అని ప్రశ్నిస్తాడు. బ్లేక్ దృష్టిలో స్వప్నాలు, అభిరుచులు, ప్రేరణలు విడదీయరాని అంశాలు. స్వేచ్ఛగా, ధైర్యంగా చురుగ్గా బొమ్మలు వేయగలిగిన శక్తి సృజనకు తప్పనిసరి, ఏ కళకైనా సృజన ప్రాణం అంటాడు. చప్పగా, నిర్జీవంగా రూపొందించే కాపీ చిత్రాల్లో తర్కం తప్ప ఊహాశక్తి కన్పించదు. చైతన్యవంతమైన చెడు, యాంత్రికమైన మంచికన్నా గొప్పది. తపన, వ్యామోహం, ఆవేశం, అంతర్బుద్ధి (సిక్స్త్ సెన్స్) ఆధ్యాత్మికతలతో ఎంతటి సృజననైనా సాధించవచ్చు అంటాడు. ఆవేశాన్ని అదుపులో పెట్టుకోవడం కాదు. దానితో ఊహాశక్తికి పదును పెట్టుకోవాలి. అప్పుడే 'విజన్సు'ను చూడగలుగుతాము, దైవత్వాన్ని సాధించగలుగుతాం అంటాడు. ఒక్కమాటలో చెప్పాలంటే పైవన్నీ మార్మిక సిద్ధాంత విషయాలు. వాస్తవవాదులకు మింగుడుపడని విషయాలు. కంటికి కన్పించినవాటిని చిత్రాలలోకి మార్చిన ఏ వాస్తవవాది అయినా ఒక్క ఏంజిల్‌నైనా చూడగలిగాడా; చిత్రించగలిగాడా? అంటాడు. చాలామంది మార్మికవాదులవలె కాకుండా, బ్లేక్ దృక్పథం, దార్శనికత గందరగోళం లేనట్టిది. తన దార్శనికతను లోకానికి చిత్రాల రూపంలో అందించాడు. స్థిరమైన, కచ్చితమైన మార్మిక భావాలను డాంటే, జాబ్ పుస్తకాలకు వేసిన చిత్రాలలో చూపించాడు. శరీర నిర్మాణ శాస్త్రంపై అవగాహన లేకున్నా మోడళ్ళను చూసి చిత్రాలు వేయకున్నా వాటి అవసరం లేకుండానే తన ఊహాశక్తితో పెయింటింగులో విజయం సాధించాడు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి వనరులు, పరికరాలతోనే ఆశ్చర్యంగొలిపే నిర్దిష్టత, ఆత్మవిశ్వాసంతో, స్వీయనియంత్రణతో తన స్వప్న దృశ్యాలకు కల్పించిన రూపాలే అతని చిత్రాలు. న్యూటన్, ఓబెరాన్, ద బాడీ ఆఫ్ ఎబెల్, ద గ్రేట్ రెడ్ డ్రాగన్, గ్రాఫిక్ ఆర్టు సాతాన్ ఇన్‌హిజ్ ఒరిజినల్ గ్లోరీ, చిమ్నీ స్వీపర్సు, పుస్తకాలకు వేసిన ఇలస్ట్రేషన్లు మొదలైనవి బ్లేక్ ఇతర చిత్రాలు.

65 ఏండ్ల వయసులో ద బుక్ ఆఫ్ జాబ్ పుస్తకానికి కథాచిత్రాలు వేశాడు. జాన్ రస్కిన్ బ్లేక్‌ను రెంబ్రాంట్‌తో పోల్చి చూసి బ్లేక్‌ను మెచ్చుకుంటాడు. డివైన్ కామెడీకి చెక్కడపు బొమ్మలు వేసే పని దొరుకుతుంది. కానీ ఆ ప్రయత్నానికి బ్లేక్ మరణంతో ఆటంకం ఏర్పడుతుంది.

చనిపోయేరోజు 1 ఆగస్టు 12, 1827 నాడు అవిశ్రాంతంగా పనిచేసి భార్యను పిలిచి 'కేట్ అలాగే నిలబడు, నీ పోర్ట్రైయిట్ చిత్రిస్తాను' అంటాడు. 'నువ్వే నా దేవతవు' అని ఆమె బొమ్మను పూర్తిచేసి బ్రష్‌లు పక్కన పడేసి ప్రార్థనాగీతాలు, పాటలు పాడుతూ సాయంత్రం ఆరుగంటలకు అనాయసంగా మరణిస్తాడు. జీవితాంతం ఆమెతో ఉంటానని చేసిన వాగ్దానం నిలబెట్టుకుంటాడు. తాను సృష్టించుకున్న స్వర్గలోకంలోకే వెళ్తున్న భ్రమతో చనిపోతాడు. 1831లో అతని భార్య కూడా బ్లేక్‌లాగానే ఉల్లాసంగా ప్రార్థనాగీతాలు పాడుతూ అతనిని చేరుకోబోతున్న ఆనందంతో మరణిస్తుంది.

బ్లేక్ మరణించిన తర్వాత ఒక తరం వరకూ అతడు మరుగునపడిపోతాడు. 1860లో బ్లేక్ జీవిత చరిత్ర వెలువడడం, 20వ శతాబ్దపు మేధావులు, సాహితీవేత్తలు, కళావిమర్శకులు బ్లేక్ ప్రతిభను గుర్తించడంతో సాహితీరంగంలో, పెయింటింగు రంగంలో మళ్ళీ అతని గొప్పదనం వెలుగులోకి వచ్చింది.

✧ ✧ ✧


# విలియం టర్నర్

**(1775-1851)**

**టర్నర్:** శాస్త్రవేత్త అంత ఓపిగ్గా, శ్రద్ధగా; కళాకారునంత నిశితంగా ప్రకృతిని పరిపూర్ణంగా అవగాహన చేసుకుని, మానవ దేహాన్ని అణువణువునూ పరిశీలించిన మైఖెలేంజిలోలాగా ప్రకృతిని సమగ్రంగా అర్థంచేసుకుని ప్రకృతి చిత్రాలను చిత్రించిన ప్రతిభాశాలి. 60 ఏండ్ల జీవితంలో బ్రిటిష్ ఐల్సును (isles), యూరప్ పశ్చిమభాగాన్ని కాలినడకన తిరిగి భూమి ఆకాశం, కొండలు, గుట్టలు, సముద్రాన్ని సమగ్రంగా ఆకళింపు చేసుకున్న నిరంతర అన్వేషి. క్షణక్షణానికో రూపం ధరించే మేఘాలు, నదులు, సముద్రపు నడకలను, సూర్యోదయ వైభవాన్ని పారిశ్రామికీకరణవల్ల మానవళికి జరుగుతున్న నష్టాన్ని చిత్రాలలో చూపించిన మేధావి. లాండు స్కేపులు చిత్రించడంలో సమకాలీనులెవరికీ అందనంత ఎత్తుకు ఎదిగిన గొప్ప చిత్రకారుడు - టర్నర్.

టర్నర్ జీవితం అర్థం కానిది. తొందరగా వచ్చిన కీర్తిప్రతిష్టలు, భోగభాగ్యాలు తోడు దురలవాట్లు, స్నేహితులు లేకపోవడంతో ఒంటరివాడు కావడంతో డిప్రెషన్‌లో పడిపోతాడు. జీవితమంతా కళకే అంకితం చేసిన, అమిత మేధా సంపదతో సాంప్రదాయ విరుద్ధంగా జీవించిన చిత్రకారుడు.

టర్నర్, కోవెంట్ గార్డెన్స్‌లో (1775) జన్మించి, చెల్సియాలో (1851) మరణించాడు. పుట్టిందీ, పెరిగిందీ, మరణించిందీ కూడా లండన్‌లోనే, పూర్తి పేరు జోసఫ్ మలార్డు విలియం టర్నర్. తండ్రి క్షురకుడు. విగ్గుల తయారీదారు. తల్లి మేరీ మార్షల్ మాంస విక్రయ కుటుంబానికి చెందింది. ఉన్న ఒకే చెల్లెలు చిన్నతనంలోనే మరణించడం, తల్లి పిచ్చి (హాస్పిటల్‌లో చేరి)వల్ల మరణించడంతో టర్నర్ తండ్రి పెంపకంలో పెరుగుతాడు. తండ్రి వాచాలుడు ఆశబోతు. టర్నర్ స్టూడియోలో 30 సంవత్సరాలు కొడుక్కు సాయమందిస్తాడు. అటువంటి నేపథ్యంలో కాక్నీ (యాస) మాట్లాడే పరిసరాల్లో పెరిగిన టర్నర్ గొప్ప కళాకారుడిగా ఎలా ఎదిగాడో అర్థం కాని విషయం. తండ్రి షాపు థేమ్స్ నదికి సమీపంలో ఉండేది. టర్నర్ తరచుగా నదికి వెళ్ళి సముద్రంలోకి వెళ్ళే ఓడల్లోకి ప్రవేశించేవాడు. ఓడలను గురించి దొంగతనంగా నరంగులకన్నా ఎక్కువగా తెలుసుకుంటాడు.



విలియం టర్నర్

టర్నర్ బాల్యంనుండే చిత్రలేఖనంలో రాణించాడు. పెన్సిల్‌తో వేసిన డ్రాయింగులను తండ్రి బార్బర్ షాపు కిటికీలో ప్రదర్శించి, 30 షిల్లింగులకు అమ్మేవాడు. 11వ యేటికే ప్లేట్ల మీద బొమ్మలు చెక్కడంలో నేర్పు చూపించి బాలమేధావిగా గుర్తింపు పొందాడు. ప్రాథమిక విద్యతో 14వ ఏటికే రాయల్ అకాడమీ ఆర్టు క్లాసులు హాజరు కావడానికి అర్హత సంపాదించాడు. 15వ ఏట (1880) తన తొలి పెయింటింగులను ప్రదర్శించాడు. 1789 నాటికి టోపోగ్రాఫికల్ (topographical) డ్రాఫ్ట్‌మన్ నుండి స్థలాకృతులను రచించడం నేర్చుకుని, అప్పటి నుండే సంపాదించడం మొదలుపెట్టాడు. బ్రిటిష్ కోటలు, ఏబీల (Abbys) పెయింటింగులు, చర్చీల బొమ్మలు వేసి చదువుకి కావలసిన డబ్బు సంపాదించాడు. 18వ ఏటికే స్వంత స్టూడియో నిర్మించుకుని స్వతంత్రంగా చిత్రాలు వేశాడు. 27వ ఏటనే రాయల్ అకాడమీ సభ్యత్వం పొందిన పిన్నవయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. తర్వాత జీవితమంతా ప్రముఖ కళాకారునిగా గడిపాడు.

తొలిదశలో గృహాలంకరణకొరకని నగ్నచిత్రాలు, స్థలాకృతులు (టోపోగ్రాఫికల్ ఆర్టు) వేశాడు. క్రమక్రమంగా ప్రకృతిని, సముద్రాన్ని సమర్థవంతంగా పెయింట్ చేయగలిగిన ఏకైక కళాకారుడిగా ఖ్యాతినార్జించాడు. ఆ క్రమంలో ఇంగ్లండు పర్యటనలో పారదర్శక నీటిరంగు చిత్రాలు వేయడంలో తనదైన శైలిని అభివృద్ధి చేసుకున్నాడు. పుట్టుకతోనే దేశదిమ్మరిలాగా టర్నర్ రోజూ 25 మైళ్ళ నడిచేవాడు. ఏదైనా తిని, ఎక్కడైనా పడుకునేవాడు. ఎండనకా, వాననకా తిరిగితిరిగి స్వచ్ఛమైన వాటర్ కలర్ చిత్రాలు వేశాడు. పుడమితల్లి అంటే ఇష్టం. సముద్రమంటే మరీ ఇష్టం. తుఫానులను సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ తీర ప్రాంతమంతా నౌకల్లో తిరిగి అలలు, వాటి విన్యాస స్వభావం, మేఘాలు వాటి రూపురేఖలు బాగా జీర్ణించుకున్నాడు. 25 ఏండ్ల

వయసులో ఇంటిపని మనిషి సారాడేన్‌బీ; అన్న విధవరాలితో సంబంధం పెట్టుకుని, ఆ తర్వాత 16 ఏండ్ల పడుచుపిల్ల హేనీబీతో జీవితాంతం సహజీవనం చేశాడు. నౌకల్లో సముద్రం మీద పడి తిరుగుతుంటే హేనీబీ ఒంటరిగా అతని చిత్రాలు, డ్రాయింగుల్ని కాపాడుతూ ఉండేది. యూరప్ అంతా పర్యటిస్తూ శారీరక అవసరాలు తీర్చుకోవడానికి అలగా స్త్రీలతో గడిపేవాడు. ఫలితంగా కలిగిన నలుగురు సంతానంలో ఎవర్నీ తన సంతానంగా అంగీకరించలేదు. లాండ్‌స్కేపుల్ని ఎంతో ఆకర్షణీయంగా చిత్రించి అంతవరకూ చప్పచప్పగా ఉన్న లాండ్‌స్కేప్ చిత్రకళారంగంలో సంచలనం సృష్టించాడు. రాత్రి వెన్నెలలు, సముద్రం మధ్యలో వేటాడుతున్న జాలరుల తైలవర్ణచిత్రంతో (1796) రాయల్ అకాడమీ ప్రశంసలందుకొన్నాడు. 19వ శతాబ్దంలో రచయితలు, కళకారులు, రాజకీయ నాయకులలాంటి ప్రముఖులు నస్యం వీల్చడం ఫాషన్, టర్నర్‌కూ ఆ అలవాటు ఉండేది. 1838లో టర్నర్ ఫ్రాన్స్‌లో పర్యటించినప్పుడు ఫ్రెంచి ప్రభువు లూయీ ఫిలిఫ్ నుండి బంగారు ముక్కు డబ్బీని బహుమతిగా పొందాడు. 30 సంవత్సరాలు సేవలందించిన తండ్రి మరణంతో (1829లో) ఒంటరితనంతో డిప్రెషన్‌కు లోనయ్యాడు. వయసు మీద పడేకొద్దీ విపరీతంగా బొమ్మలు వేస్తూ అంతకుమించి తెగతాగుతూ, ఈస్టెండ్‌లోని చౌకబారు బార్లలో గడిపేవాడు. మరీ చివరి దశ అంతా తాగుడు ఎక్కువై ఊహాశక్తి దారి తప్పుతుంది. ఇల్లు బొమ్మలతో సహా తడిసి శిథిలమైపోతుంది. జీవితమంతా కష్టపడి సృష్టించిన కళాఖండాలు వానకు తడిసి ఎలుకల బారినపడతాయి. విశ్వాసంగా, తనను నమ్ముకున్న ఇంటి పనిమనిషిని కాదని నదీ సమీపాన చెల్సియాలో పాత స్నేహితురాలితో గడుపుతాడు. నావికులందరిచేత అడ్మిరల్ అని పిలిపించుకున్న టర్నర్ (1851) దీనస్థితిలో మరణిస్తాడు.

**టర్నర్ మోడళ్ళు :** మనుషులు వారి ప్రవర్తన పైన నమ్మకం లేని టర్నర్ కల్తీలేని నిర్మలమైన ప్రకృతిని అణువణువునా ఆకళింపు చేసుకుని ప్రకృతి కాంత ముఖాన్ని స్టడీ చేసినంత శ్రద్ధగా రోజుల తరబడి అలల విన్యాసాన్ని, సంవత్సరాల తరబడి తీర ప్రాంతంలో భూమిపై వచ్చే మార్పుల్ని, కొండల స్వభావాన్ని వెలుతురు వాతావరణ ప్రభావాన్ని కనీసం రెండు దశాబ్దాల పాటు, బాగా అధ్యయనం చేసి లాండ్‌స్కేపులకు కావలసిన ముడిసరుకును సేకరించుకున్నాడు. ఫ్రెంచి ఆర్టిస్టులు టర్నర్‌ను ఇంప్రెషనిజానికి ఆద్యుడని (Father of Impression) అంటారు. వేలకొలది డ్రాయింగులు, స్కెచ్‌లు, రెండువేల చిత్రాల సృష్టికర్త టర్నర్. సుఖదుఃఖాల్ని, నిరాశను, ఆశ్చర్యాన్ని అన్నిరకాల హావభావాలను చిత్రాల్లో ప్రదర్శించాడు. ప్రకృతి, దానికి వ్యతిరేకంగా మనిషి ఇవే అతని ఇతివృత్తాలు. ప్రకృతే అతనికి మోడల్, కాలీ పయిర్, ద షిప్‌రెక్‌లను అత్యంత వాస్తవంగా (ఎప్పుడూ చింత్రించని అంశాన్ని) చిత్రించాడు. తుఫాను కన్నా ముందే గమ్యం చేరుకోవాలన్న నావ బొమ్మను వాటర్ కలర్స్‌లో మూడే మూడు గంటల్లో చిత్రించిన ఘనుడు. టర్నర్ సముద్రానికి, నౌకలకు సంబంధించిన (Maritime) విజ్ఞానాన్ని ఉత్కృష్టంగా ప్రదర్శించాడు. ఆధునికత అంటే తిరస్కార భావం ఉన్నప్పటికీ రెయిన్, స్టీమ్, స్పీడ్ చిత్రంలో ఆధునిక విజ్ఞానశాస్త్ర ప్రభావాన్ని చూపించాడు.

50 సంవత్సరాలు ప్రకృతిలో సహజీవనం చేసి వెలుతురు, వాతావరణ ప్రభావాలకు చిత్రాల ద్వారా అమరత్వం కల్గించాడు. యార్క్‌షైర్ కొండల్ని సూర్యకాంతిలో మెరిసిపోతున్నట్లు; థేమ్స్ నదిని వెలుతురు ప్రవాహంగా, మునుగుతున్న నౌకను రక్తవర్ణపు సూర్యకాంతిలో చూపడం అందుకు ఉదాహరణలు. 'ది పెయింటర్ ఆఫ్ లైట్'గా పేరు పొందాడు. కలరా సోకడంవల్ల టర్నర్ లండన్‌లో 1857లో మరణించాడు. తన మూలాల్ని దాచుకోకుండా తానొక క్షురకుని కొడుకునని చెప్పుకున్నాడు. షేక్స్‌పియర్ టెంపెస్టు నాటకంలో నౌకాభంగాన్ని మాటల్తో చిత్రిస్తే, టర్నర్ రంగుల్లో రచించాడు. వెనిస్ బ్రిడ్జి దృశ్యాలు. స్విట్జర్లాండ్, 'లూసెర్న్ లేక్ కామన్స్' దృశ్యాలు, టర్నర్ ఇతర కళాఖండాలు.

"నాకు తెలిసినది కాదు. నేను చూసినది చిత్రిస్తాను" అని టర్నర్ అంటే "నేను చూసినది కాదు. నాకు తెలిసినది చిత్రిస్తాను" అని ఆ తర్వాత వందేళ్ళకు పికాసో అంటాడు. కాలీ పయర్ (Calais Pieir), డచ్ బోట్స్ ఇన్ ద గేల్, ద స్నో స్టార్మ్, ద స్టేవ్ షిప్, ద షిప్ రెక్, ఫిషర్ మన్ ఎట్ ద సీ, బర్నింగ్ ఆఫ్ పార్లమెంటు మొదలైన టర్నర్ వర్ణచిత్రాలు అనితరసాధ్యాలు. టర్నర్ వీలునామా ప్రకారం

టేట్ బ్రిటన్‌లో అతని చిత్రాలకొరకు ప్రత్యేకంగా గది కేటాయించబడింది. టర్నర్ పేరిట 1984లో అవార్డు, 2004లో విన్సర్ - న్యూటన్ వాటర్ కలర్ అవార్డు ప్రవేశపెట్టబడినాయి.

2014లో టర్నర్ జీవితచరిత్ర "మిస్టర్ టర్నర్" పేరుతో సినిమాగా వచ్చింది. 2020లో ఇంగ్లండు (బాంకు) 20 పౌండ్ల నోటు మీద టర్నర్ పోర్ట్రేట్ ముద్రించి గౌరవించింది. ప్రకృతి చిత్రాలకు బద్ధ వ్యతిరేకి బ్లేక్ అయితే ప్రకృతిలో జీవించి, అందులోనే ముక్తిమార్గం వెదుక్కున్న చిత్రకారుడు టర్నర్. అతని చివరి మాటలు 'Sun is The God'.

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
హైదరాబాద్. ఫోన్: 798 139 8250.

# కవి కళాకారుడు : విలియం బ్లేక్

రెండు వందల యాభై సంవత్సరాల క్రితం లండన్‌లో పుట్టి, పెద్దగా చదువుకోని, కొద్దిగా చిత్రకళ నేర్చుకుని, లోనాటి (Engraving) పనికి అప్పటికి బాగా పేరున్న జేమ్స్ బాసరెకి శిష్యునిగా జేరి - అదే జీవనోపాధిగా గడిపి, తన జీవిత కాలంలో ఏ ప్రాముఖ్యతా సంపాదించలేని వ్యక్తి, విలియమ్ బ్లేక్. ఆయన డైరీ వ్రాయలేదు - ఎవ్వరికీ పెద్దగా ఉత్తరాలు వ్రాసిన దాఖలాలూ లేవు. ఇరవై ఐదు సంవత్సరాల వయస్సులో కాథరిన్ అనే ఆమెను పెళ్లి చేసుకున్నా - సంతానం కలగలేదు. ఈ మధ్య పీటర్ ఆక్రాయిడ్ వెలువరించిన బ్లేక్ బయోగ్రఫీ కూడా -బ్లేక్ జీవిత విశేషాలకంటే కూడా - అప్పటి కాల - పరిస్థితులనే వివరించింది! అయినా బ్లేక్ తన తర్వాత కాలంలో ఎంతో గొప్ప కవిగా - చిత్రకారునిగా ప్రముఖ విమర్శకుల చేత కొనియాడబడ్డాడు. అందుకు ప్రధాన కారణం ఆయన స్వతంత్ర భావాలు - తిరుగుబాటు అభిప్రాయాలు - మనిషి నిస్సహాయత, యుద్ధాల విధ్వంసం, ఎంతో భావ సాంద్రతతో - మనిషి - ప్రకృతి సాపేక్ష చిత్రాలతో, దేవుడు - దయ్యం, స్వర్గం - నరకం, అన్ని వికృతాలతో బ్లేక్ వెలువరించిన వెలలేని కవిత్వం, విలువ కట్టలేని చిత్రాలు! కేవలం ఆయన కవిత్వం - చిత్రాల ద్వారానే బ్లేక్ ఎంతటి విప్లవ భావాలు కలవాడో - మన దారిద్ర్యాన్ని - అసహాయతను ఎంత లోతుగా - ఘాటుగా తెలియ జెప్పాడో తెలుసుకోగలం! అయితే విలియమ్ బ్లేక్‌ని చదవటం - చూడటం ఎంతో శ్రద్ధగా చేయవలసిన పని. బ్లేక్‌కు ముందు షేక్స్పియర్, మిల్టన్, వర్డ్స్‌వర్త్ లాంటి ఆంగ్ల సాహిత్య ప్రముఖులున్నారు. అలాగే రాజకీయ పరిణామాలు - 'ఫ్రెంచ్ రివల్యూషన్' అతని కాలంతో ముడిపడి ఉంది. అటువంటి సందర్భంలో -బ్లేక్ అభిప్రాయాలను, ఆలోచనలు, అతని భవిష్యత్ దర్శనాన్ని పైవన్నీ ప్రభావితం చేసి ఉండాలి. అయితే బ్లేక్ అక్కడితో ఆగలేదు - మిల్టన్‌ను "...తనకి తెలియకుండానే సైతాన్‌ను సమర్థించాడు...." అన్నాడు! అప్పటి మత ఛాందసులతో బహిరంగంగానే విభేదించాడు. ఆనాటి పాలకుల యుద్ధ కలాపాలను - సైనికుల దృష్టితో విమర్శించాడు- "ఏ యువకుడైనా సైనికుడెందుకవుతాడు?" అని సూటిగా ప్రశ్నించాడు! ఇన్ని వ్యతిరేకతల మధ్య ఇమడలేకేనేమో, అంతర్ముఖుడై - చిక్కని, అంతు చిక్కని, కవిత్వం వ్రాశాడు.

**ప్రపంచాన్ని ఒక ఇసుక రేణువులో చూడు,**
**స్వర్గాన్ని ఓ రెల్లు పూవులో దర్శించు-**
**విశ్వాంతరాళాన్ని అరచేతిలో ఇమడనీ-**
**అనంత కాలాన్ని ఒక్క ఘడియలో కుదించు-** అంటూ

తాత్విక కవిత్వాన్ని పాడగలిగాడు. అంతేగాక తన పద్యాలకు అతనే రూపం ఇవ్వగలిగాడు - ఆ విధంగా మనకు అతని అంతరంగంలోని సంఘర్షణకు ద్వారాలు తెరిచాడు - చూడమని! ఎంతో గాఢమైన అతని 'రాడికల్' భావాలు - అప్పటి వ్యవస్థలపై తిరుగుబాటు ధోరణి, అతని కవిత్వంలో అక్షరం - అక్షరంలో కూరుకుపోయి - పాఠకుని గందరగోళపెడతాయి. ఆ పదచిత్రాలకు అతని రూపకల్పన మనలను మరో లోకంలోకి తీసుకు వెళ్తాయి. ఒక మార్మిక అవస్థలో పడవేస్తాయి. బ్లేక్‌ది ఒక 'మైథాలజీ' అంటారు. ఒక వ్యక్తికి మైథాలజీ ఎలా ఉంటుంది? భావ గర్భితమైన సామ్య చిత్రాలు - కొత్త శ్లేషతో వ్యక్తి వర్ణనలు అతని కవిత్వాన్ని మార్మికంగా మార్చివేస్తాయి. దేవుడు కొత్తగా దర్శనమిస్తాడు. సృష్టి - విశ్వామిత్ర సృష్టిగా కనిపిస్తుంది. అయితే అంతర్లీనంగా అప్పటి సాంఘిక నైతిక శృంఖలాల ఘర్షణ ధ్వనులు - మత మౌఢ్యపు అంధకార ప్రార్థనా మందిరాలు - సైనికుల బూట్ల చప్పుళ్ళు - థేమ్స్ నది - రక్తప్రవాహం - సామాన్యుని దరిద్రం - ధనికుల ఆర్భాటాలు - అన్ని, అన్నీ వినిపిస్తుంటాయి - మీరు శ్రద్ధగా వింటే! బాల్యపు అమాయకత్వం - యౌవనపు బాధ్యతలుగా మార్పు చెందుతున్నప్పుడు - అమాయకపు భావాల్ని ఎక్కువ కాలం పొడిగించలేం - కాని ముంచుకువచ్చే యౌవన భావావేశాన్ని ఆపనూలేం. మొదటి బాల్యపు

అమాయిక నైజం ఎంత సహజమో, యౌవనపు భౌతిక సుఖాలూ అంతే సహజం కదా! ఇక్కడే మత ఛాందసులు నైతికత పేరుతో వ్యక్తి స్వేచ్ఛకు సంకెళ్ళు వేశారు!

బ్లేక్ ఈ విషయంలో ఫ్రాయిడ్ కంటే ఎంత ముందుగా ఈ మానసిక పరిణామాన్ని తులనాత్మకంగా కవిత్వీకరించి తెలియజేశాడు– అయితే అవి అర్థం కావటానికి – అప్పటి, ఆ తర్వాత తరాల వారికి ఎంతో సమయం పట్టింది. అతని "సాంగ్స్ ఆఫ్ ఇన్నొసెన్స్ అండ్ ఎక్స్‌పీరియన్స్" పద్యాలు – సాంద్ర భావగర్భిత వ్యక్తీకరణతో నిండు నదిలా కదులుతుంటాయి.

ఈ నది ప్రవహిస్తూనే ఉంది.
బొగ్గు దుమ్ము బూడిద గొట్టాలు!
ఈ వీధి పరచుకొంటూనే ఉంది..
పాపపు చర్చి చీకట్లతో మసక బారిన బాల్యం!
నేను రికామీగా తిరుగుతూనే ఉన్నా..
'గతి'లేని సైనికుల బూట్ల చప్పుడు– ఈ నిస్సారపు నైరాశ్యంతో
రాజమహలు గోడల రక్తపు మరకలు–
పసికందు ఆర్తనాదం మనిషి దుఃఖం!
ఈ అపరాత్రి నాకు వినిపించే అపస్వరాలు–
అన్ని గళాల్లో వింటూనే ఉన్నా...
దారిమళ్లిన యౌవనపు కుళ్లు ప్రేలుళ్లు–
ఆరిన నిప్పుల కుప్పలు – అప్పుడే వెళ్లిన పెళ్లి ఊరేగింపు గిట్టల గోల! ఇదీ లండన్ చిత్రం!

కవి లక్ష్యం లేకుండా తిరుగుతున్నప్పుడు – అతను విన్న వింత వికృత శబ్దాలు – అతని దృష్టిలో పడిన విపరీత దృశ్యాలను – సంబంధం లేనివాటిని – తన ఊహలతో ముడి పెట్టకుండా పచ్చిగా వివరిస్తున్నాడు :-

**లండన్ వీధులు పరచుకునే, తెరుచుకునే ఉంటాయి.**
**థేమ్స్ ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది.**
**ఇవి పైకిమాత్రమే :**


**వీధి చీకట్లలో ఎక్కడో ఓ పసికందు ఆర్తనాదం– మనిషి దుఃఖానికి ఇంతకంటే ఆరంభం ఏముంటుంది?** ప్రార్థనా మందిరాల్లో ప్రచారకులు వెచ్చగా ఉండాలంటే – చర్చిలోని చలిమంట పొయ్యిలు మండుతూ ఉండాలి. చిమ్నీలు మసిబారినపుడు – శుభ్రపరిచేందుకు పదేళ్ల బాలురే అందులో దూరి – బొగ్గు దుమ్ముని, బూడిద మసిని దులపాలివాళ్లు ఆ నుసిలో జీవికను వెతుక్కుంటారు! మరి ఎక్కడ దేవుని కరుణ? రాజప్రసాదంలో నిదురించే వరప్రసాదులు ప్రశాంతంగా నిదురపోవాలంటే – ఎక్కడో సైనికుల అవయవాలు తెగిపడుతుండాలి – వారి నెత్తుటి మరకలతో వీరి గోడలు మెరుస్తుండాలి?

**మరి ఎక్కడ సామాన్యునికి న్యాయం?**
**వేశ్యావాటికలో అకృత్యాల వికృత శబ్దాలు –**
**తలుపుల దద దడే – త్రాగుబోతుల రంకెలా?**
**లేదా వాటికలో క్రొత్తగా వచ్చిన**
**ఓ కన్య దైన్యపు కేకా?**

**ఇవన్ని కుళ్లు ప్రేలుళ్లు కాదా?** ఇన్ని వింటూ – అన్ని చూస్తూ తిరుగుతున్న కవి గుండెలు కొలిమిలా మండి – ఉక్కులా కరిగి, సమ్మెటలు మ్రోగి సంకెళ్లు పెనవేసుకోవా?

**ఆ కర్కశ ధ్వనులు – అప్పుడే అటుగా వెళ్లిన**
**పెళ్లి ఊరేగింపు గుర్రపు డెక్కల ఘంట ఘంటతో మార్మోగవా?** ఇది – అంతర్ చిత్రం– బ్లేక్ తన పద్యాలకు రూపకల్పన చేసినవి గాక – బైబిల్ నుంచి 102 చిత్రాలు తన వ్యాఖ్యాన శైలిలో, దేవుడు – మనిషి – సైతాన్‌లను, స్వర్గం, నరకం భూమికతో అద్భుతంగా చిత్రించాడు. – మార్మికతలోని తాత్వికతనూ, తాత్వికతలోని సౌందర్యాన్ని – భీభత్సాన్ని గొప్పగా చేసి దర్శింపజేస్తాడు. బ్లేక్ కవిత్వం ఎంత నిజాయితీగా – నిష్ఠురంగా, నిర్భీతిగా ఉంటుందో – అతని చిత్రాలు (పద్యాలకు వేసినవి కావు) అంత విస్మయం కలిగించే మార్మికతతో బైబిల్ 'కథ'లకు విచిత్రమైన కోణాలతో భీకర సౌందర్యాన్ని వ్యక్తీకరిస్తాయి. తన చుట్టూ ఉన్న జీవితాన్ని కవిత్వంలో గాఢంగా చెప్పిన వ్యక్తి – చిత్రాలలో తన ఊహలకు విచిత్రమైన స్వేచ్ఛనిచ్చి మనల్ని ఆశ్చర్యపరుస్తాడు. భౌతిక సత్యాలకంటే తాను దర్శించిన అంతర్ చిత్రాలు బహుధా వైవిధ్యమైనవి – ఆలోచింప చేసేవి – అవి రంగులు విరుస్తాయి – రెక్కలు విచ్చుతాయి!

"అన్ని మతాలు ఒక్కటే" అన్న భావాన్ని "ప్రకృతి సిద్ధమైన మతమే లేదు'' అని గుట్టు విప్పుతాడు! ఒక్కమాటలో చెప్పాలంటే – ఒకప్పుడు విమర్శకులు చెప్పినట్లు – బ్లేక్, తెలియచెప్పలేని, విప్పలేని మార్మికమైన అంతర్ముఖ మేధావి! గుంపులకు దూరంగా, ఒంటరిగా అతని కాలానికి అర్థం కాకుండా, ముందు తరాలకు ఏ సందేశమూ ఇవ్వని – చారిత్రక – సాంస్కృతిక విభాగి! ఒక అసందర్భపు అద్భుతం! కాని తర్వాతి తరాలు వారు లోతుగా అధ్యయనం చేసి, అదే బ్లేక్‌ని : రాజ్య–మతాధికారాన్ని ధిక్కరించి, వ్యక్తి స్వాతంత్ర్యాన్ని ఎగురవేసిన ఆత్మధృతి గలిగిన ధీరోదాత్తుడు అన్నారు. ఇప్పటికీ మనిషి దైన్యం – పాలకుల దౌర్జన్యం, వ్యవస్థల విధ్వంసం – ఇలా ముప్పేట సామాన్యుణ్ణి తిప్పలు పెడుతూనే ఉన్నాయి కదా – ఎప్పటికి ఈ ముడి వీడేది? విమోచన కలిగేది?




## ఫిక్షన్ ఆవిష్కర్త

# సెర్వాంటెస్ – డాన్ కిహోటీ



సెర్వాంటెస్

*– ముక్తవరం పార్థసారథి*

సెర్వాంటెస్ – ఆయన ఒక రచన చేశారు. 500 సంవత్సరాల క్రితం. ఆ పుస్తకం బైబిల్ కంటే ఎక్కువ ప్రతులు అమ్ముడుపోయింది. ప్రపంచంలో అన్ని పుస్తకాలకంటే ఎక్కువసార్లు ప్రచురించబడింది. ఈ పుస్తకం 200 భాషలలోకి అనువదింపబడింది. ఐరోపా సాహిత్యంలో మొదటి నవలారూపం సంతరించిపెట్టి 'ఫిక్షన్' రచనకు ఆవిష్కారం చేసి – తరువాత రచయితలకు ఆదర్శంగా నిలిచిన రచన. అదే **డాన్ కిహోటీ**. అలాంటి రచనను ఏ విధంగా అధ్యయనం చేయాలి? ఆ విషయమే విశదీకరిస్తున్నారు ముక్తవరం పార్థసారథి.

*– సం.*

1605 సీతాకాలంలో ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన దేశం ఆర్థికంగా పతనావస్థలో ఉంది. రాజకీయ స్తబ్ధత నెలకొంది. నిరాశానిస్పృహలు దేశమంతటా వ్యాపించిన ఆ నేపథ్యంలో జనం గుసగుసలాడుకోవటం ప్రారంభించారు – అదీ ఒక పుస్తకం గురించి. పుస్తక విక్రేతలు ఆ పుస్తకం ప్రతులను ప్రెస్సుల నుండి వచ్చినవి వచ్చినట్లుగా అమ్మేస్తున్నారు. కాగితాలు ఊడివస్తున్న ఆ పుస్తకం కాపీలను జనం ఆబగా తీసుకొని వీధుల్లోనే చదివి పొట్టచెక్కలయ్యేలా నవ్వుతున్నారు. చదువురానివాళ్ళ సత్రాల్లో, గ్రామాల్లోని రచ్చబండల వద్దా, మధ్య శాలల్లో గుమిగూడి ఎవరన్నా చదివితే విని అంత ఆనందమూ పొందుతున్నారు.

ఒక మధ్య శాలలో, చెక్క టేబుళ్ళ చుట్టూ కూర్చుని, పులిసిన వైను పాత్రలు చేతుల్లో పట్టుకుని, పొగ వస్తున్న పొయ్యి దగ్గర చలి కాచుకుంటూ ఒక వక్తను చెవులప్పగించి వింటున్నారు. ఆయన వీరాధివీరుల సాహస గాథలు చెప్పడంలేదు. ప్రేమకథలు అంతకంటే కాదు. మతం కోసం ప్రాణ త్యాగాలు చేసిన సెయింట్స్ గురించి ఒక మాటైనా ప్రస్తావించలేదు. ఇంతకూ ఆయన అంత ముఖ్యమైన విషయం చెబుతున్నాడు.

" 'లా మాంకా'లో ఎక్కడో ఒకచోట – ఎక్కడ జరిగిందో గుర్తుకురావడం లేదు – ఇటీవలిదాకా ఒక పెద్దమనిషి తన వింత చేష్టలతో నలుగురినీ ఆకర్షించాడు..."

మందుతో మత్తెక్కిన మధ్యశాలలోని ఆ జన సందోహం సంతోషంతో కేరింతలు వేయడానికే, నవ్వుతూ కిందపడి పొర్లటానికే ఇక ఎంతో సమయం పట్టదు. ఆ పెద్దమనిషి సాహసయాత్రల పేరుతో తిక్కతిక్క పనులన్నీ చేసి నవ్వుల పాలయ్యాడు. తను నవ్వులపాలైన విషయం అతడికి తప్ప అందరికీ కాదు. పిచ్చి ముదిరితే అంతే మరి.

లా మాంకాలోలోని కథానాయకుడు అతడే. ప్రపంచ సాహిత్యంలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. చిన్నా–పెద్ద తేడా లేకుండా అందరూ అతని గురించి తెలుసుకోవాలనుకునేవారే. ఆయన ఒకప్పుడు కాస్త బాగా

బతికిన భూస్వామే కావచ్చు. కానీ వెర్రికి కారణం ఉండదు కదా! ఉన్న భూమిని అమ్మి సాహస వీరుల కథల పుస్తకాలు కొనుక్కున్నాడు. ఇంకేముంది! ఇక ఉదయం నుండి రాత్రి దాకా రాత్రి నుండి ఉదయం దాకా అవి చదవటమే ఆయన చేసిన మహత్కార్యం. అందరికీ ఏదో ఒక జీవిత లక్ష్యముంటుంది. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసే జగదేకవీరుల గాథావళిని (అన్నీ కల్పితాలే. కొందరు కలం పేరుతో, కొందరు అసలు పేరుతో రాసిన చవకబారు కథలు) చదవడం కన్నా పుణ్యం పురుషార్థం ఏముంటుంది. జీవిత లక్ష్యం సంగతి అటుంచితే చదివీ, చదివి నిద్రలేమితో ఈ మహానుభావుని బుర్ర పాడైంది. 'పిచ్చెక్కింది' అనటం అతిశయోక్తి కావచ్చు. పిచ్చెక్కితే తలకు రోకలి చుట్టమన్నాడంటారు కదా! ఈ ప్రపంచ ప్రసిద్ధ ఉన్మాదికో అతి విచిత్రమైన ఆలోచన వచ్చింది. తన పరువు ప్రతిష్టల కోసం, లోకోద్ధరణ కోసం, తాను ఓ పని చేయక తప్పదు. కథలు చదివి ఆనందించడం కాదు. తను స్వయంగా ఆ వీరాధివీరుల్లా లోకకళ్యాణానికి బయలుదేరక తప్పదు. వాళ్లు చేసిన ఘనకార్యాలన్నీ తనూ చేయాలి. కావాల్సింది ఒక కవచం, ఒక శిరస్త్రాణం, ఒక అస్త్రం. ఇకనుండి ప్రమాదాలే తనకు వినోదం. ప్రాణాలు తృణప్రాయం. శాశ్వత కీర్తికి అడుగు దూరంలో ఉన్నాడు.

కథానాయకుని పిచ్చి వేషాలు విని శ్రోతలు పగలబడి నవ్వుతూనే ఉన్నారు. తుప్పు పట్టిన కవచం. అలాంటిదే శిరస్త్రాణం. వీటికి తగ్గ ఒక బరిసె. ఎముకలు పొడుచుకొస్తున్న గుర్రం, పుస్తకాలు చదివి పిచ్చెక్కిన వయసుమళ్ళిన ఊహల లోకంలో నివసించే ఉన్మాది – ఇంకేం కావాలి! జనం హాయిగా నవ్వుకోవడానికి. అతనిలో తమను తాము చూసుకొన్నారు శ్రోతలు. తమకు బాగా పరిచయమైన వ్యక్తిలాగానే ఉన్నాడు కథానాయకుడు. ఇలాంటివాళ్లు అందరి ఇళ్ళలోనూ ఉంటారు. మనం చూసే ఉంటాం. పలకరించే ఉంటాం. గుర్రబగ్గీలు తోలేవాళ్ళు, అంట్లు తోమేవాళ్ళు, రైతులు, క్షురకులు, వీధి వేశ్యలు – లోకం నిండా ఉన్నది ఇలాంటివాళ్ళే. ఎవరి కలలో – పగటి కలల్లో – వాళ్ళు బతుకుతుంటారు.

మొదటి అరగంట శ్రోతలకు కావల్సింది చెప్పాడు వక్త – వయసు మళ్ళిన పిచ్చోడికి ఒక పాత సత్రం దుర్భేధ్యమైన దుర్గంలా కనిపిస్తుంది. దాని యజమాని ఒక సాహసవీరుడు (!) ఇద్దరు వేశ్యలు కులీన స్త్రీలు. మన పుస్తకాల పిచ్చివాడికి లోకమంతా తలకిందులుగా కనిపిస్తుంది. సత్రానికి వెళ్లి విధ్వంసం సృష్టిస్తాడు. ఆ వృత్తాంతం విని వేశ్యలు కిసుక్కున నవ్వుతారు. సేవకుడి మీద చేయి చేసుకున్నందుకు ఒక రైతును చెడామడా వాయిస్తాడు. కథనంలోని కాసింత బూతు హుషారెక్కిస్తుంది. కథానాయకుని తలతిక్క వేషాలకు మధ్య శాలలో నవ్వనివాడంటూ లేడు. అప్పుడు పుంఖానుపుంఖంగా మార్కెట్‌లో కనిపిస్తున్న సాహస వీరుల మూస రచనల కన్నా ఎంతో భిన్నంగా ఉన్నదీ కథ. ఇది వ్యంగ్యమో, విమర్శో తెలియదు. కానీ ప్రతి వాక్యంలోనూ వినోదం మాత్రం ఖాయం. మధు పాత్రల్లో ఉన్న వైన్ రెండో రౌండో, మూడో రౌండో ముగిసినప్పుడు శ్రోతలకు కథానాయకుని గురించి ఒక కొత్త విషయం తెలుస్తుంది. అతడు ఏమో అసంతృప్తితో ఉన్నాడు. ఇంటికి వెళ్లి తన సాహసయాత్రలకవసరమైన సామాగ్రి అంతా తెచ్చుకోవాలి. ముఖ్యంగా సాహసవీరులందరికీ ఉండే సైడ్ కిక్కు అనుచరుణ్ణి తానింకా సంపాదించుకోలేదు. ఊర్లో తమ ఇంటి పక్కనే ఒక పేద రైతు ఉన్నాడు. పెళ్లయింది. పిల్లలు ఉన్నారు. తనంత తెలివైనవాడు కాదుగాని, వినయవంతుడు. చెప్పిన పనులు చేస్తాడు. రెండు వారాల కోసం స్వగ్రామానికి వచ్చిన కథానాయకుడు. రైతును తన వెంట రావడానికి ఒప్పిస్తాడు. అన్నీ వాస్తవాలే చెబితే సరిపోదుగా. కొన్ని కల్పించి కూడా చెప్పాలి. తాను ఒక దీపం కోసం అన్వేషిస్తున్నాడు. దాని ముద్దుగా ఒక లాటిన్ పేరు 'ఇన్సులా' అని పెడతాడు. స్పెయిన్‌లోని ఎడారి నేలల్లో వాళ్లు ప్రయాణిస్తున్నారు. మరి ద్వీపం కోసం ఎలా వెతుకుతారో అర్థం కాదు. ఎక్కడా నీటి చెలిమ కూడా కనిపించదు. కానీ ద్వీపం కావాలట!

కథానాయకుడికి సైడ్ కిక్కు దొరకటంతో కథ మారిపోతుంది. అక్కడి శ్రోతరులకు, మనకు, తరతరాల పాఠకులకు. డాన్ కిహోటీ అన్వేషణ పూర్తైంది. తనకు కావలసిన సాంకో పాంజా దొరికింది. (ఇప్పటిదాకా మనం మాట్లాడుకున్నది వీళ్ళిద్దరి గురించే. సాంకో పాంజా పాత్ర చిత్రణ గొప్పగా ఉంది. కొన్నిసార్లు అతడు ఓ జీనియస్‌ని తలపిస్తాడు. కానీ మద్యశాలలోని శ్రోతలకు హాస్య పాత్రలంటే తక్కువ చూపు. అతడు చేసిన ప్రతి పనికి

నవ్వటమే వాళ్ళకు ఇష్టం. ఆ రోజుల్లో మానసిక రోగులకు కొన్ని నేరాల నుండి రక్షణ ఉండేది. కానీ ఎద్దేవా చేయడం, తిట్టడం, బఫూన్‌లలాగా చూడటంలాంటివి వాళ్ళు చేసిన నేరాలే. మొత్తం మీద సాంకో పాజా సాంగత్యంతో డాన్ కిహోటీలో పెద్ద మార్పు వస్తుంది. ఇద్దరూ కలిసి రెండు మూడు రోజుల్లో, సాహిత్య చరిత్రలో అత్యంత ప్రసిద్ధమైన సాహస కార్యానికి సిద్ధపడతారు కిహోటి.

"అదృష్టం కలిసిరావటమంటే ఇదే. అటు చూడు మిత్రమా, సాంకోపాంజా, ముప్పై మందికన్నా ఎక్కువమంది రాక్షసులక్కడ గుమిగూడారు. వాళ్లను తుత్తునియలుగా నరకని నా జీవితం వృథా కదా! ఆ తర్వాత వాళ్ల సంపదంతా నాదే. ఇది భగవత్కార్యమని కూడా నా విశ్వాసం. దుష్టశిక్షణకు ఇదే నాంది పలుకుతోంది."

"రాక్షసులెక్కడున్నారు?" అని అడుగుతాడు సాంకోపాంజా.

"కనిపించడంలేదా? ఎదురుగా. పొడుగాటి చేతులు, అవి ఒక్కొక్కటీ పదకొండు కిలోమీటర్లున్నట్లుంది."

"మహాప్రభో, అవి రాక్షసులు కావు. గాలిమరలు. చేతుల్లా కనిపిస్తున్నవి గాలికి తిరుగుతున్న వాటి రెక్కలు."

డాన్ కిహోటీ గురించి ఇప్పటికే తెలుసుకున్నవాళ్లెవరికీ, అతని తిక్క చేష్టలు ఆశ్చర్యం కలిగించవు. సహజంగానే, సాంకోపాంజా చెప్పింది అతని తలకెక్కదు. తన గుర్రం మీద, బరిసెతో ముందుకురికి ఒక గాలి మర తెరను చించేస్తాడు. ఇంకేముంది! గాలి మర శక్తి ఏమిటో క్షణంలో తెలిసిపోతుంది. అతడు, అతడి గుర్రం అనెడి బరిసెతో సహా, అందరూ గాల్లోకెగిరి బరువున్న బస్తాల్లాగా కింతపడతారు. కిహోటీ నడ్డి విరిగిందని వేరే చెప్పక్కర్లేదనుకుంటాను. ఇక్కడే సాంకోపాంజా ప్రతిస్పందన భిన్నంగా ఉంటుంది. తన యజమాని పరిస్థితికి నవ్వడు. అది అతనికి వినోదం కాదు. డాన్ కిహోటీకి వీలైనంత సాయం చేయటం, సానుభూతి చూపటమే అతడి ఉద్దేశ్యం.

"సాంకోపాంజా (అతడి వాహనం గాడిద) తన గాడిద మీద వీలైనంత త్వరగా వచ్చి డాన్ కిహోటీని చేరుకున్నాడు కానీ డాన్ కిహోటీ నిశ్చేతనంగా పడివున్నాడు. రోసినాంటె (డాన్ కిహోటి వాహనం) మేడపై నుండి పడినప్పుడు దెబ్బలు బాగానే తగిలుంటాయి.

"ఎంత పనైంది. నేను చెబుతూనే ఉన్నాను. అవి గాలిమరలు. మీ బుర్రలో ఏవో వింత ఆలోచనలు చేరాయి. లేకపోతే మీరు నా మాట తప్పక వినేవారు.." అంటూంది సాంకోపాంజా.

అతడికి తన యజమాని కలలో బతికే మనిషనీ తెలుసు. బుర్ర పాడైంది. అయినప్పటికీ అతడి వద్దే పనిచేయాలని నిర్ణయించుకుంటాడు. అతడి నమ్మకం అంతా దైవాధీనం.

నవ్వుకోవటమే ప్రధానంగా ప్రారంభమైన కథ, కొద్ది పేజీల తర్వాత వ్యంగ్యం, సాహసకృత్యాల కథనంగా మారుతుంది. ఒక వ్యక్తితో ప్రారంభమై, ఇద్దరు వ్యక్తుల మధ్య సంబంధంగా పరిణామం చెందుతుంది. రెండవ భాగంలో (ఇది పదేళ్ల తర్వాత ప్రచురించబడింది) ఒక డచెస్, సాంకోను పిలిచి, డాన్ కిహోటికి మతిభ్రమించిందని ఒక వాంఙ్మూలం కూడా తీసుకొంటుంది. కానీ ఆమెకు సాంకో అంటే అసహ్యం. "నువ్వు నీ యజమానికన్నా పిచ్చివాడివి, మహామూర్ఖుడివి" అని నిందిస్తుంది. దానికి సాంకోపాంజా జవాబు:

"నేను తెలివైనవాణ్ణయితే నా యజమానినెప్పుడో వదిలేసేవాణ్ణి. కానీ నా జీవితం అతనితో ముడిపడి ఉంది. అంతా విధిరాత. నేను బాధపడి లాభంలేదు. అతడు పెట్టిన తిండి తిన్నాను. అందువల్ల అతణ్ణి గ్రామం నుండి గ్రామానికి అనుసరించాల్సిందే. అతడంటే నాకు ప్రేమ. అతడు నాకు తన గాడిదలను బహుమానంగా ఇచ్చాడు. ఇవన్నీ ఎందుకు! అతడి పట్ల కృతజ్ఞత చూపించడం నా ధర్మం. మమ్మల్ని వేరు చేయడం ఎవరికీ సాధ్యం కాదు."

జర్మన్ పండితుడు ఎరిక్ ఆమెర్ బాక్ రాసినట్టు "సాంకో కిహోటీలది విడదీయనిలేని బంధం. తన యజమాని సాంగత్యంలో సాంకో మరెన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాడు. మరెంతో జ్ఞానాన్ని ఆర్జించాడు."

మధ్యశాలలో, అందరూ ఇంటికి పోవాలన్నట్టుగా హెచ్చరించాడు యజమాని. ఈ కథను వినడానికి అక్కడికి కొందరికి అది వ్యంగ్య రచనలా కనిపించింది. కానీ కిహోటీకి మరికొంతమందికి ఒక కొత్త భాషను నేర్పించాయి. దాన్నే మనం ఫిక్షన్ భాష అంటున్నామిప్పుడు. ఫిక్షన్ అంటే ఏమిటి అని ఎవరైనా అడిగితే "వినోదం

కోసం రాసిన ఒక కల్పిత కథ" అని జవాబిస్తాం. ఆ సమాధానం సరైనదే. కానీ మనం చదివే క్రమంలో పదాలు, పదబంధాలు కొత్త అర్థాలతో కనిపిస్తే పాత్రలు తమతో తాము సంబంధాలు పెట్టుకుని, ఆ సంబంధాలు కొత్త పరిణామాలకు దారి తీస్తే... మనం మనంగా ఉంటామా? లేదా మనం కూడా ఒక పాత్రగా మారతామా? (కాసేపైనా)

దానికి జవాబు రెండూను: మనం మనంగానే ఉంటాము కానీ, పాత్రలు మనల్ని ఆవహిస్తాయి. మన ప్రపంచంలో, మన పరిసరాల్లోనే ఉంటాం కాని ఫిక్షన్‌లోని కొత్త లోకంలోకి కూడా ప్రవేశిస్తాం. చదువుతున్నంతసేపు అయినా మనం ఫిక్షన్‌లో పాత్రగా మారితే! ఈ పరస్పర విరుద్ధ అనుభవాలను కలిగింపచేయటమే ఫిక్షన్ లక్షణం. రెండూ వాస్తవాలే. అయితే ఈ కొత్త అనుభవాన్ని మనకు అందుబాటులోకి తీసుకురావడానికి మన సంస్కృతి వేల సంవత్సరాలు పరిణామం చెందాల్సి వచ్చింది. ఫిక్షన్ అనేక రూపాల్లో కనిపిస్తుంది. కానీ దాని అంతఃస్వభావం ఒక్కటే. మన అస్తిత్వాన్ని కోల్పోకుండా, ఫిక్షన్‌లోని పాత్రగా మారడం మామూలు విషయమేమీ కాదు. ఈ క్రొత్త ప్రక్రియకు నాంది పలికింది డాకిన్ కిహోటీ – సుమారు 400 ఏళ్ల క్రితం. అయితే ఈ ఫిక్షన్ ప్రక్రియను ఆవిష్కరించిన వ్యక్తి గొప్ప పండితుడు కాదు. రెనాసాన్స్ సృష్టించిన మహానుభావుడనీ అనలేము. ఆయనకు రాజాశ్రయం లేదు. కానీ రాజుల సైన్యంలో పనిచేశాడు. సాహసికుడిగా బతికాడు. జైలు జీవితం అనుభవించాడు. అప్పుల పాలయ్యాడు. చేసిన ఓ ఒక్క పనిలోనూ ఆశించిన విజయం సాధించలేకపోయాడు. జీవన చరమాంకంలో ఓ పుస్తకం రాశాడు. అదే రానున్న తరాల ఫిక్షన్‌కు ఆదర్శంగా నిలిచింది.

ఆ రచయితే మిగ్వెల్ డి సెర్వాంటెస్ సావెద్రా. 1605లో అచ్చయిన ఆ పుస్తకం పేరు The Ingenious Gentleman Don Quixote of La Mancha అనూహ్యంగా పాఠకులు బ్రహ్మరథం పట్టారు. ఎవరి చేతిలో చూసినా ఆ పుస్తకమే. ఇంట్లోనే కాదు వీధుల్లో నడుస్తున్నప్పుడు కూడా దాన్ని చదువుతూ కడుపుబ్బా నవ్వుకున్నారు. రాత్రికి రాత్రే అన్ని యూరోపియన్ దేశాల్లోనూ అదో బెస్ట్ సెల్లర్ అయిపోయింది. కీర్తైతే వచ్చింది గాని డబ్బులు వచ్చాయో లేదో తెలియదు – మరో పదకొండేళ్ల తర్వాత సెర్వాంటెస్ యించుమించు పేదరికంలోనే మరణించాడు. మరణానంతరం ఆయన కీర్తి మరింత పెరిగింది. ఇప్పుడు డాన్ కిహోటీ తొట్ట తొలి ఆధునిక నవల అని అందరూ అంగీకరించారు. పశ్చిమ దేశాల సాహిత్య సౌధానికిది తొలిమెట్టు. అంతర్జాతీయంగా పాఠకులకూ, నవలా రచయితలకు కూడా ఇది ప్రాతఃస్మరణీయ గ్రంథంగా నిలిచిపోయింది. ఫిక్షన్ ప్రక్రియను ఆవిష్కరించిన సెర్వాంటెస్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది.

సెర్వాంటెస్ డాన్ కిహోటీను ప్రచురించినప్పుడు, ఇప్పుడు మనం అర్థం చేసుకునే పద్ధతిలో అతడు దాన్ని ఫిక్షన్ అనుకోలేదు. అబద్ధం లేదా కల్పితం అనే అర్థంలోనే అప్పుడు 'ఫిక్షన్'ని వాడారు. ప్రాచీన గ్రీకు తత్త్వవేత్త అరిస్టాటిల్‌ను ప్రామాణికంగా తీసుకొన్న సాహితీ విమర్శకులు / పండితులు జరిగిన యథార్థ గాథను చరిత్రగానూ, జరగగలిగే అవకాశముందిగాని జరగలేదు. తనకున్నదాన్ని 'కవిత్వం'గానూ విభజించాడు. కవిత్వం పాఠకునికి ఆహ్లాదం కలిగించాలి కాని మరో రోమన్ పండితుడు డాన్ హోరేస్ ప్రకారం, కవిత్వం, ఆనందంతో పాటు నీతిని కూడా బోధించాలి.

మనం ఇప్పుడు ఫిక్షన్ అనుకుంటున్నది చరిత్ర, కవిత్వాలకన్నా భిన్నమైనది. వచన కథనం ఫిక్షన్ అనిపించుకోవాలంటే, అది కల్పితమైనప్పటికీ, చదువుతున్నంతసేపు వాస్తవమనిపించాలి. "ఇది యథార్థ కథనం" అనే నమ్మకాన్ని పాఠకుడు కాసేపు ప్రక్కన పెడతాడు. ఆ నిర్ణయాన్ని అతడు తాత్కాలికంగా, ఇష్టపూర్వకంగా వాయిదా వేస్తాడు. దీన్నే కవి సామ్యూల్ టేలర్ కోలరిడ్జ్ willing Suspension of Disbelief అన్నాడు. పాఠకుడు రెండు పరస్పర భిన్న అనుభూతులను ఏక కాలంలో పొందగలిగి ఉండాలి. రచయిత కథ చెబుతున్నాడనీ, అదంతా అబద్ధమనీ / కల్పితమనీ అంగీకరించగలగాలి. పాఠకుడిలో ఈ స్థితి కలిగించడానికి ఫిక్షన్ రచయిత కొన్ని ట్రిక్స్ వాడతాడు. కథ ముందుకు నడుస్తున్న క్రమంలో ప్రతిసారీ, కథలో మనకు తెలియని విషయాలు చాలా దాస్తున్నాడు రచయిత అనుకుంటాడు పాఠకుడు. రెండు గొడుగులతో కథలు చెబుతాడు

రచయిత. పాత్రలూ ఉంటారు, పాత్రలకు కూడా తెలియని కథ కూడా ఏకకాలంలో నడుస్తుంటుంది.

రచయితకున్న ఈ సామర్థ్యమే – పాత్రల ద్వారా కథ తెలుసుకోవటమూ, వాళ్లకు తెలియని విషయాలను తెలుసుకోవటమూ ఫిక్షన్ అనిపించుకుంటుంది. ఆధునిక పాఠకునికి వాస్తవంగా ఉండే పాత్రలు కావాలి. అవి కేవలం కల్పితం అయినప్పటికీ, 3 dimensional పాత్రల్ని సృష్టించిన రచయితల్ని మనం ప్రశంసిస్తాం. అలాంటి పాత్రలు పుస్తకం పేజీల్లోంచి మన జీవితాల్లో ప్రవేశిస్తారు. కార్డ్‌బోర్డ్ పాత్రలు లేదా 2 dimensional పాత్రలుంటే సాహిత్య విజ్ఞత కలిగిన పాఠకుడు 'ఇంత చవకబారు పుస్తకం' అంటారు.

సెర్వాంటెస్ రచనలో ఏ ఒక్క పాత్రా మరొక పాత్రను పోలి ఉండదు. అందరికీ ఎవరి ప్రత్యేకతలు వాళ్లకు, వాళ్లు మాట్లాడే పద్ధతి, ఆలోచనలు కూడా భిన్నంగా ఉంటాయి. ఒకే సన్నివేశాన్ని, సంఘటనను వివిధ పాత్రలు ఎలా చూస్తారు, ఎలా స్పందిస్తారు అని ఆలోచించాడు సెర్వాంటెస్. నవ్వైనా, నిర్వేదమైనా జీవితంలో నుంచే వస్తాయి అని గట్టిగా నమ్మాడు. పుంఖాను పుంఖంగా తను చదివిన పుస్తకాలలో డాన్ కిహోటీ భ్రమకూ, వాస్తవానికీ ఉన్న తేడాను గుర్తించలేని దశకు చేరాడు. డాన్ కిహోటీ ఒక్కడే కాదు, ప్రతి పాత్రకూ ఒక ప్రైవేటు జీవితం ఉంటుంది (ఈ పరిశీలన టాల్‌స్టాయ్‌కు బాగా ఉపయోగపడి ఉంటుంది).

ఇంతకూ సెర్వాంటెస్ ఈ రచనా నైపుణ్యాన్ని ఎలా అలవరుచుకున్నాడు? ఈ సాహసికుడు, సైనికుడు, దేశ సేవలో అంగవైకల్యానికి కూడా వెరవనివాడు. అపహరణకు గురై ఐదేళ్లు బానిసగా అల్జీర్స్ బందీఖానాలలో గడిపినవాడు. ఇన్ని చేసిన తర్వాత, స్వదేశానికి తిరిగి వచ్చి, తన కష్టాలకు తగ్గ ఫలితం, మంచి ఉద్యోగం వస్తుందని ఆశించి, చివరికి, ప్రజాదరణ కోల్పోయిన ప్రభుత్వానికి పన్నుల వసూలు దాకా (అందరూ అసహ్యించుకొనే ఉద్యోగం అది) పనిచేసి, చివరికి ఎందరో తన మీద కేసులు పెట్టి జైలుకు పంపించిన తర్వాత ఈ మహానుభావుడు తనకు పూర్వం ఎక్కడా లేని కొత్తరకం రచనా విధానాన్ని ఆవిష్కరించి, భవిష్యత్తరాల మీద చెరగని ముద్ర ఎలా వేశాడు?

1547లో స్పెయిన్‌లోని అల్కలాడి ఎనారెస్‌లో జన్మించాడు సెర్వాంటెస్. అక్కడో యూనివర్శిటీ కూడా ఉంది. యూరోపియన్ సమాజాలు, వలస ప్రాంతాలను ఆసక్తిగా గమనిస్తూ, వాటి గురించి క్రొత్త విషయాలు తెలుసుకొంటూ 1616 దాకా జీవించాడు సెర్వాంటెస్.

లోకంలో ఎన్ని మార్పులు వచ్చినా అన్నీ పరస్పర సంబంధమైన మార్పులే. కళారంగంలో పద్నాలుగవ శతాబ్ది కార్డ్‌బోర్డ్ పాత్రల యుగం అంతరించి వాస్తవికత గురించి ఆలోచించారు. ఆధునిక రంగస్థలం అప్పుడప్పుడే రూపుదిద్దుకుంటోంది. నటీనటులు నిజజీవితాన్ని ప్రతిబింబించే పాత్రలకు ప్రాధాన్యత ఇచ్చారు. శాస్త్రరంగంలో కోడ్‌ర్నికస్, కెప్లర్, గలీలియోలు భూమి, ఇతర గ్రహాలకు ఉన్న సంబంధం గురించి ఉన్న మూఢనమ్మకాలు ఇక చెల్లవని నిరూపించారు (భూమి సమస్త విశ్వానికే కేంద్రం కాదు) పరిశోధనల కోసం కొత్త, సమర్థవంతమైన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి.

అయితే ఎన్ని పెను మార్పులు వచ్చినా కొన్ని నమ్మకాలను అందరూ పంచుకున్నారు. తమ నివసిస్తున్న భూమిని తామే కొలుచుకొనే సర్వేయర్లలాగ, జనం ఈ లోకాన్ని రెండు రకాలుగా అర్థం చేసుకోవడానికి అలవాటు పడుతున్నారు. ఒకటి వయ్యక్తకానుభవం. మరొకటి ఒకటి బాహిరమైన ప్రపంచాన్ని చూసి అర్థం చేసుకోవటం. ఒకటి సబ్జెక్టివ్. మరొకటి ఆబ్జెక్టివ్. బాహిర ప్రపంచంలోని కోట్లాదిమందిలో తామొక్కరు. అందులో స్వోత్కర్షలు చెప్పుకోవడానికేమీ లేదు. ఇక నాటక రంగానికొస్తే వాళ్లు ప్రేక్షకుల్లో ఒకరిగా ఉంటూనే పాత్రలలో తీసుకుపోవడానికి అలవాటు పడుతున్నారు అంటే ప్రేక్షకుడు తను అస్తిత్వాన్ని మరచి ఒక రైతులాగాలో, ఒక సత్రం యజమానిలాగానో, ఒక బంట్రోతులాగానో కూడా అనుభూతి పొందగలడు. మొత్తం మీద ఏకకాలంలో రెండు అనుభవాలకు అలవాటు పడుతున్న కాలమది.

మరోవైపు స్పెయిన్ అగ్రదేశంగా, సంపన్న దేశంగా ఎదిగింది గాని ఆర్థిక, రాజకీయ సుస్థిరత లేకపోవడంతో కుప్పకూలింది. పాలకులు వాగ్దాన భంగం చేశారన్న నిస్పృహలో, కోపంలో ఉన్నారు ప్రజలు. నిన్న మొన్నటిదాకా అలరించిన వీరాధివీరుల సాహస గాథలిప్పుడు పిట్టలదొరల కథల్లా కనిపించాయి. చరిత్రకారుడు జె. హెచ్.

ఎలియట్ చెప్పినట్లు స్పెయిన్ ఉత్థాన పతనాలకూ, సెర్వాంటెస్ జీవితానికీ ఓ సారూప్యం కనిపిస్తుంది. స్పెయిన్‌లాగే బతికి చెడినవాడు ఆయన గతమెంత ఘనమైనా ప్రస్తుతానికి కారాగారంలో మగ్గుతున్నాడు.

ఒక కత్తియుద్ధంలో, మరో వ్యక్తిని గాయపరచిన కారణంగా యౌవనంలోనే సెర్వాంటెస్ దేశాంతరవాసం వెళ్లక తప్పలేదు. ఇటలీలో కాథలిక్ లీగ్‌లో సభ్యత్వం తీసుకున్నాడు. మధ్యధరా ప్రాంతంలో స్పానిష్ ప్రభుత్వానికీ, ఇస్లాంకూ జరిగిన అత్యంత క్రూరమైన పోరాటాలను కళ్లారా చూశాను. మరికొన్నాళ్లకు స్పెయిన్‌కు తిరిగి వెళ్లే క్రమంలో (అప్పటికే అతణ్ణి 'వృత్తామ వీరుడి'గా అధికారులు గుర్తించారు) బార్బరీ సముద్రపు దొంగల చేతిలో బంధీ అయి అయిదేళ్లు దుర్భారకారాగారవాసాన్ని భరించాడు. మనుషులు ఎంత ఉదాత్తమైన పనులు చేయగలరో. అదే సమయంలో ఎంత నీచంగా, క్రూరంగా, అమానవీయంగా ఉండగలరో అప్పుడే తెలిసివచ్చింది. ఇంత జరిగిన తర్వాత, స్వదేశానికి తిరిగివచ్చిన సెర్వాంటెస్ స్వదేశం నిరాశపరిచింది. తను దేశం కోసం చేసిన త్యాగాలను స్పెయిన్ మరిచిపోయింది. తమ పరిపాలనా లోపాలనూ, విదేశాంగ విధానంలోని తప్పులన్నీ కపిపుచ్చుకోవడానికి, మతోన్మాదాన్నీ, అమాయకుల్నీ దోషులనూ ప్రచారం చేసి అధికారంలో కొనసాగించటానికి ముప్పాతిప్పలు పడుతోంది. తిరస్కారానికీ, అవమానానికీ లోనైన సెర్వాంటెస్, ఏ గుర్తింపు నోచుకోక, తన తొలిప్రేమ, ప్రవృత్తి అయిన రచనా వ్యాసంగంలోనే శేషజీవితం గడపదలచి, అనేక ఇతర రచనలతో పాటు డాన్ కిహోటీ కూడా ముగించాడు.

సెర్వాంటెస్‌ది వింత జీవితం. సాహితీ సృష్టిలో కీర్తిశిఖరాలనధిరోహించినప్పటికీ, వరుస పరాజయాలు అతన్ని వెంటాడుతూనే ఉన్నాయి. యౌవనోత్సాహంతో కన్న కలలు ఆవిరైపోయాయి. తాను గాఢంగా నమ్మిన విషయాలు వాస్తవ జీవితంలో పేకమేడల్లా కనిపించాయి. సరిగ్గా విజయపరాజయాలు పెనవేసిన ఈ అనుభవమే అతడి ఫిక్షన్‌కు ముడిసరుకుగా మారింది. మనం వాస్తవం అనుకున్నవన్నీ భ్రమలుగా ఎలా మారిపోతాయో అతడు నిజజీవితంలో అనుభవించాడు. మన ఆలోచనలకూ, వ్యూహాలకూ, బాహిరమైన వాస్తవానికి ఎంతో తేడా ఉంటుంది. ఇదే లోకం తీరు. తను సైన్యంలో పనిచేశాడు. సాహసాలు చేశాడు. దుర్భర కారాగార జీవితం అనుభవించాడు. కానీ అవన్నీ జనం నవ్వుకోవడానికే పనికివచ్చాయి తప్ప, రాజుగానీ, అధికారులుగానీ గుర్తించలేదు.

కానీ ఈ లోకంలో తనలాంటి నిర్భాగ్యులు ఎందరో! భ్రమ – వాస్తవం మధ్య ఎన్ని జీవితాలు చితికిపోతున్నాయి! ఇలాంటి వాళ్ల పట్ల ఎవరికీ కనీసం కనికరం కూడా ఉండదు. స్పెయిన్‌లో దేశభక్తి మతోన్మాదంగా మారింది. పేదవాళ్లుగా పుట్టడం విధిరాత. ఎవరేం చేయగలరు? వాళ్ళు కష్టపడటం తప్పదు. పురుషులకు సేవలు చెయ్యటానికి, పిల్లల్ని కనడానికే దేవుడు ఆడవాళ్లను పుట్టించాడు. స్పెయిన్‌లోని అల్పసంఖ్యాకుల మనోభావాలను పాఠకులలో చర్చకు పెట్టడానికే సెర్వాంటెస్ ఫిక్షన్ రాశాడా అనిపిస్తుంది. తనకు తారసపడిన వ్యక్తులను పాత్రలుగా మలిచాడు.

పాత్రలను సృష్టించేటప్పుడు వాళ్ళని ఇతర వ్యక్తులుగా చూడకుండా వాళ్ళలోకి పరకాయ ప్రవేశం చేశారు. యౌవనంలో దేశం కోసం చేసిన యుద్ధాలు, త్యాగాలు, పరువు కోసం పోరాడటం, యుద్ధంలో ముందు వరుసలో ఉండి పోరాడటం, చివరికి ఘోర పరాజయాలు, అవమానాలు అతడిలో సాటి మనుషుల పట్ల విముఖత్వాన్ని, ద్వేషాన్ని పెంచటానికి బదులు వాళ్ల పట్ల సానుభూతినీ, మరింత లోతైన అవగాహనకూ పెంచాయి. లోపాలున్నంత మాత్రాన ఎవరినీ తక్కువరకం మనుషులుగా చూడలేదు. నీతులు చెప్పటంకన్నా సహానుభూతి ముఖ్యం.

తన దురదృష్టాన్ని తిట్టుకోవటం వల్లా, జీవితం పట్లా కోపాన్ని, ఫ్రస్ట్రేషన్ ప్రదర్శించటంవల్లా సెర్వాంటెస్ కొత్త కథాప్రక్రియకు ఆద్యుడు కాలేదు. ఏమి రాయాలో అని కాదు. ఎలా రాయాలో కూడా అతడు తన రచనల ద్వారా సూచించాడు. అనుభవాలను, ఆలోచనలను కథలుగా మార్చగలగటమే సృజన. ఇంచుమించు అరవైఏళ్ల నిరాశానిస్పృహలు, అవమానాలు, పరాజాయాలకు ప్రతిరూపం డాన్ కిహోటీ. కానీ వాటికి హాస్యలేపనం రాశాడు సెర్వాంటెస్. నాటకరంగంలో అతనికి సుదీర్ఘ అనుభవం ఉంది. రంగస్థలానికి ప్రేక్షకులు ఎలా

స్పందిస్తారో, కేరింతలు, కరతాళ ధ్వనులతో తమ స్పందనలను తెలియజేస్తారో అతనికి తెలుసు. నటుడు పాత్రలో ఒదిగిపోతూ నటిస్తున్నాడు. అక్కడే ప్రారంభమవుతుంది ద్వైధీభావం. రంగస్థలం దిగితే అతడు మరో వ్యక్తి. కానీ స్టేజీమీద ప్రేక్షకులకు మాజిక్ సృష్టించాలి. క్లుప్తంగా చెప్పాలంటే నాటకానుభవం అతడికి డాన్ కిహోటీ రాయటంలో సహాయం చేసింది. ఎవరో కల్పించిన పాత్ర అని తెలిసి కూడా నటుడు దానికి ప్రాణం పోస్తున్నాడు.

నాటకాలను గురించి నాటకాలు రాసిన సందర్భాలు ఉన్నాయి. అంటే నటుడు ఒక పాత్ర మరో పాత్రగా నటించడం సాధ్యమని చూపిస్తున్నాను. ఈ అంతర్నాటకంలో ప్రేక్షకులు కూడా భాగస్వాములే. అలాగే పుస్తకం గురించి మరో పుస్తకం రాశాడు సెర్వాంటెస్ (మేటాఫిక్షన్) ఆ మరో పుస్తకం లోని పాత్రలు తన పుస్తకంలోకి చొరబడుతున్నాయి. ఇలా చేయటంలో అతడు తన సమకాలికుడు షేక్స్‌పియర్. As You Like It నాటకంలో ఒక పాత్ర (jaques)తో చెప్పించినట్లుగా "ఈ లోకమే ఒక రంగస్థలం. స్త్రీపురుషులందరూ కేవలం నటీనటులు మాత్రమే'' అన్న సత్యాన్ని ఆచరణలో ప్రదర్శించాడు. మనం నిత్య జీవితంలో చేస్తున్నదదే. ఇతర్లతో మనం లౌకిక వ్యవహారాలు నడుపుతున్నప్పుడు మనం మనలా కాకుండా మరో మనిషిగా (పాత్రగా) మారిపోతున్నారు.

పాత్రలు మొహాలకు రంగేసినట్టు మనం మన స్వభావాల్ని దాచుకోవడానికి మాస్కులు కప్పుకుంటాం. మన రహస్యం మనం దాచుకుంటాం. కానీ ఎదుటి మనిషి చెప్పకుండా దాస్తున్నదేమిటో తెలుసుకోవాలనుకుంటాం.

సెర్వాంటెస్ సృష్టించిన రెండు గొప్ప పాత్రలు డాన్ కిహోటీ, సాంకోపాంజీలలో మనకు సెర్వాంటెస్ జీవన పోరాటమే కనిపిస్తుంది. మంచి చేసినవాడికి లోకం ప్రత్యుపకారం చేస్తుందనుకున్నాడు కానీ, *ఎవరి స్వార్థ ప్రయోజనాలు వారివే. ఎవరూ ఎవరికీ చిన్నమెత్తు సాయమైనా చేయరు* అని తెలిసి వచ్చింది. బాల్యంలో, యౌవనంలో సెర్వాంటెస్ తను స్పానిష్ పౌరుణ్ణని గర్వంగా చెప్పుకున్నాడు. స్పానిష్ అంటేనే ఆత్మగౌరవమని భ్రమ పడ్డాడు డాన్ కిహోటీలాగ. *దుష్టశిక్షణ శిష్టరక్షణ* ప్రతి స్పానిష్ పౌరుడి కర్తవ్యమనుకున్నాడు. కార్యసాధనలో ప్రాణాలను తృణప్రాయంగా అర్పించడానికి సిద్ధపడాలి. అప్పుడే కదా శాశ్వత కీర్తి తనను వరించేది.

కానీ వరుస పరాజయాలు, భరించలేని అవమానాలు అతని కళ్ళు తెరిపించాయి. *పరువు, గౌరవం* అనే మాటలకు విలువ లేదు. కానీ లోపల ఇంకా ఎక్కడో ఒక చిన్న దీపం మినుకుమినుకుమంటున్నది. సత్ప్రవర్తన, సచ్ఛీలత, నీతి, నిజాయితీ ఇంకా మిగిలి ఉన్నాయి ఈ లోకంలో. ఒంటరిగా అయినా సరే తను వాటినే ఆదర్శంగా తీసుకొని బతకాలి. డాన్ కిహోటీ, సాంకోపాంజా ఆ ఆదర్శాలకు సజీవ రూపాలు. డాన్ కిహోటీ చేసింది తప్పో ఒప్పో చర్చించనవసరం లేదుగానీ అప్పటికే ఆ సాహస వీరుల తరం అంతరించింది. ఒకనాటి జగదేకవీరులు మలితరానికి పిట్టలదొరలుగా విదూషకులుగా మారిపోతారు. డాన్ కిహోటీ, సాంకోపాంజాలలో తనను తానే చూసుకున్నాడు సెర్వాంటెస్.

మారుతున్న లోకం, పరిస్థితులు, సాంప్రదాయాలు అతని రచనలో ప్రతిబింబిస్తాయి. ఒక తరం వీడ్కోలు చెబుతూ మరొక తరానికి నాంది పలుకుతున్న కాలమది. అతని రచనా శైలి కూడా అలాగే ఉంటుంది. గతకాలపు సాహస గాథలిప్పుడు పుక్కిటి పురాణాలుగా, ప్రహసనాలుగా మారిపోయాయి.

అచ్చయిన రోజు నుండీ డాన్ కిహోటీ బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. ఆ పుస్తకం అచ్చవుతున్న ప్రెస్సుల ముందు క్యూ కట్టారు పాఠకులు. సాహిత్య చరిత్రలో అత్యధికసార్లు అచ్చయిన/ప్రచురించబడిన నవల అదే. అంతకన్నా ఎక్కువగా అది రాబోయే తరాల రచయితల మీద గొప్ప ప్రభావం చూపింది. ప్రముఖ విమర్శకుడు హెరాల్డ్ బ్లూమ్ చెప్పినట్టుగా "తరువాతి నవలలన్నింటికీ ఆధారం అదే. దాన్ని చదవని, మోడల్‌గా తీసుకోని పాశ్చాత్య రచయిత లేడంటే అతిశయోక్తి కాదు. నార్వేజియన్ నోబెల్ ఇన్‌స్టిట్యూట్ సాహిత్య అత్యంత ప్రముఖ రచననూ / గ్రంథాన్నీ ఎంపిక చేయమని అభిప్రాయ సేకరణ జరిపినప్పుడు అధికారులు సెర్వాంటెస్ / డాన్ కిహోటీలనే ఉదహరించారు. గత నాలుగు వందల సంవత్సరాలుగా తత్వవేత్తలు, మేధావులు, రచయితలు, అందరికీ అదో ప్రామాణిక మేథోశిఖరం. డేవిడ్ హ్యూమ్, బారుక్ స్పినోజా,

హేగెల్, జర్మనీ రొమాంటిక్ కవులు / రచయితలకు డాన్ కిహోటీ ప్రేరణ. ఆధునిక చైతన్యానికి ప్రతీక అన్నారు అందరు.

సెర్వాంటెస్ గురించీ, డాన్ కిహోటీ గురించీ మరింత వివరంగా చర్చిస్తుందీ పుస్తకం.

✧ ✧ ✧

## సెర్వాంటెస్, డాన్ కిహోటీ

– *పూర్వాపరాలు*

**1. కవిత్వం – చరిత్ర:**

తొలినాటి దృశ్యాన్ని మరోసారి గుర్తుచేసుకుందాం–

1604లో ఒక్కపోస్తున్న ఒక ఆగస్టు మధ్యాహ్నం స్పెయిన్లోని వాలడోలిడ్ నగర వీధుల్లో కుడిచేతిలో ఒక బరువైన కాగితాల కట్టను మోసుకుంటూ నడుస్తున్నాడు. అతడి బొమ్మలు ఎవరైనా గీశారో లేదో తెలియదుగానీ ప్రస్తుతానికి అలాంటివి ఏవీ లభ్యం కాలేదు. అయితే ఆయన మాటల్లోనే – గోధుమరంగు జుత్తు, నెరసిన గడ్డం, కొనదేరిన ముక్కు ఉంటాయి. కళ్ళలో ఆనందం కనిపిస్తుంటుంది. కళ్లకు అద్దాలుంటాయిగానీ వాటిని చూస్తే నూనెలో వేయించిన గుడ్లు జ్ఞాపకం వస్తాయి.

మరీ పొడవూ కాదు, పొట్టీ కాదు. పళ్ళు చాలామట్టుకు ఊడిపోయాయి. 60 దాటకుండానే పళ్ళు ఊడిపోవడం ఆ రోజుల్లో సహజం. అనేక సంవత్సరాల క్రితం లెపాంటో యుద్ధంలో తుపాకీ గుండు తగిలి, ఎడమ చేయి పనికిరాకుండా పోయింది. ఇక దుస్తులంటారా మెడ చుట్టూ ఒక కాలర్ ఉంటుంది. కాళ్లకున్న మేజోళ్ల నుండి గట్టిపడిన పిక్కలు కనిపిస్తుంటాయి. ఈ దుస్తుల్లో అతడు సంపన్నుడిగా కనిపించాలిగాని అతడు బతికిచెడినవాడని అందరికీ తెలిసిపోతూనే ఉంది.

అతడు ఇప్పుడే వాలడోలిడ్‌లో అడుగుపెట్టినప్పుడే అక్కడి మీట్ పాకేజింగ్ (మాంసం కోసి, ప్యాక్ చేసి అమ్మటం) బజారులో అందరికీ తెలిసినవాడే. ఒకప్పుడు అతడూ, అతడి భార్యా, ఇద్దరూ అక్కాచెల్లెళ్లు, మరో సంబంధం వల్ల పుట్టిన ఒక కూతురూ ఒక సత్రం పైనున్న గదిలో నివసించారు. అప్పటికా బజారు నగరానికి వెలుపల ఉండేది. నగరంలో జనాభా బాగా పెరిగిపోతోంది. అందువల్ల, సత్రం మీదున్న పదమూడు గదుల్లో మిగ్వెల్ డి సెర్వాంటెస్ సాకెద్రాతో పాటు మరో ఇరవైమందిని కుక్కేశాడు ఇంటి యజమాని. కసాయి వాళ్ల బస్తీ గనుక అక్కడ రక్తం నదులు ప్రవహించటం సహజమే. వాటిని దాటుకొంటూ నడిచాడు సెర్వాంటెస్ – కుడి చేతిలోని మూటను ఛాతీకి ఒత్తుకొంటూ ఆ మూటలో వందలాది కాగితాలున్నాయి. మార్జిన్స్ కూడా లేకుండా కాగితం మీద ఒక చివర నుండి మరో చివరిదాకా, వాస్తవంగా ఉన్న ముత్యాల్లాంటి అక్షరాలతో కాస్త ముడుతలు పడి ఉంది ఆ మూట. ఇప్పుడా వ్రాతప్రతి దొరకటంలేదుగాని అందులోని కొన్ని కాగితాలు అక్కడక్కడా లభ్యమవుతున్నాయి. సెవితా (నగరం) మునిసిపల్ జైల్లో ఉన్నప్పటి ఒక సంతకం పెట్టి దస్తావేజు – అక్కడున్నప్పుడే ఆయన డాన్ కిహోటీ రాయటం గురించి కలగన్నాడు – ఆ ఆర్చి బిషప్ ఆఫ్ టోలెడోకు రాసిన మరో అభ్యర్థన ప్రతి వగైరా.

వీటిలో తప్ప సెర్వాంటెస్ దస్తూరి మరెక్కడా కనిపించదు. ముద్రణా పరిశ్రమ లాభసాటిగా మారుతున్న దశ అని. ఇక తన పుస్తకం ప్రతులు విరివిగా అమ్ముడుపోయి దండిగా లాభాలు వస్తాయని ఆశపడ్డాడు సెర్వాంటెస్. గత శతాబ్దంతో పోలిస్తే అక్షరాస్యత కూడా బాగా పెరిగింది. కేవలం మతాధికారులు, కులీనులు మాత్రమే కాకుండా సామాన్యులు కూడా చదవగలుగుతున్నారు. డాన్ కిహోటీ తొలి పేజీలలోనే పుస్తకాల ప్రభావమెంత ఎక్కువగా ఉందో వివరిస్తాడు రచయిత. వయసు మళ్లిన వ్యక్తి, ఎకరాలకొద్దీ భూమి అమ్ముకొని పుస్తకాలు కొనటం మామూలు విషయమేమీ కాదు. డాన్ కిహోటీ కు పిచ్చెక్కటంతో ఇంట్లోని పనిమనిషి కూడా పుస్తకాలనే నిందిస్తుంది.

పుస్తకాల ముద్రణ ఇంతగా పెరగడానికి, నూటయాభై ఏళ్ల క్రితం ప్రారంభమైన సాంకేతిక ఆవిష్కరణే కారణం (అప్పటిదాకా చేతివ్రాత ద్వారానే పుస్తకం యొక్క మరో ప్రతి తయారయ్యేది).

ఆ రోజుల్లో సాహిత్యమంతా రెండు విభాగాలకే పరిమితమయ్యింది. అవి అరిస్టాటిల్ తన లాక్షణిక గ్రంథం *పొయెటిక్స్* లో చెప్పినట్టుగా కవిత్వం, చరిత్ర, *పొయెటిక్స్* అరబిక్ అనువాదాలు మాత్రమే రెనాసాన్స్ కాలంనాటి పాఠకులకు లభ్యమయ్యాయి. ఛందోబద్ధంగానో, గేయ రూపంగానో రాసేవాడు కవి. వచనం రాసేవాడు

చరిత్రకారుడూ అని అర్థం చేసుకోకూడదు. గతాన్ని అక్షరబద్ధం చేసేవాడు చరిత్రకారుడు. "ఇలా జరిగి ఉంటుంది అని చెప్పగలిగేవాడు కవి'' అంటాడు అరిస్టాటిల్. "కవిత్వంలో ఒక మార్పు కనిపించాలి" అయితే ఆ మార్పు మంచికా, చెడ్డకా అన్న విషయం ఆయన స్పష్టం చేయలేదు. ఏది ఏమైనప్పటికీ కవిత్వంలో ఒక తాత్వికత ఉంటుంది. చరిత్రకన్నా ఉన్నతమైన, ఉదాత్తమైన ప్రక్రియ, కవిత్వం సార్వజనీనం. చరిత్ర ఒక సంఘటనకో, ఒక ప్రాంతానికో, వ్యక్తులతో పరిమితమైనది. అరిస్టాటిల్ చెప్పిన Poeisisను ఈనాడు మనం అర్థం చేసుకోవాలంటే అదే ఫిక్షన్‌కు దగ్గరగా ఉంటుంది.

స్పానిష్ తత్వవేత్త అలోన్సో లోపెజ్ పన్సియానో 1595లో అరిస్టాటిల్‌కు రాసిన టీకా, టిప్పణి గ్రంథాలను బాగానే చదువుకున్నాడు సెర్వాంటెస్. డాన్ కిహోటీలో కూడా కవిత్వం – చరిత్ర గురించి చాలాసార్లు ప్రస్తావిస్తాడు. ఒకచోటనైతే డాన్ కిహోటీ గురించి "ఈ చరిత్ర రాస్తున్న రచయిత" అని తన గురించి చెప్పుకుంటూ "నిజాయితీగా రాస్తే చరిత్ర కూడా మంచిదే" అంటాడు మరొకచోట. అయినప్పటికీ, చరిత్రలో గతం మాత్రమే ఉంటే ఫిక్షన్‌లో నైతికత ఉంటుంది. ఈ కారణం వలననే మనం పాత్రలతో మమేకం అవుతాం. వాస్తవ సంఘటనలకన్నా ఎక్కువగా ఫిక్షన్, తన సుడిగుండాలవంటి సంఘటనలతో పాఠకుల్ని తనలోనికి లాక్కుంటుంది.

సెర్వాంటెస్‌కు తన పుస్తకం మీద చాలా అంచనాలున్నాయి. సాహితీ లోకం ఇంతవరకూ కనీవినీ ఎరుగని కొత్త రకం రచన / కొత్త ప్రక్రియను తను ఆవిష్కరించాడని తెలుసు. అయినప్పటికీ పుస్తకం భవిష్యత్తు ఎలా ఉండబోతోందో మాత్రం ఊహించలేకపోయాడు. మాడ్రిడ్‌లో ఉన్న ప్రింటర్ ఫ్రాన్సిస్కో డి రాబుల్స్, మరో ప్రింటర్ యువాన్ డిలా కెస్టాకు పుస్తకం ముద్రణా బాధ్యతలు అప్పగించాడు. మరుసటి సంవత్సరం జనవరిలో ప్రారంభమైంది ముద్రణ. ఆ తర్వాత, వందలు, వేలు కాదు, లెక్కించలేనని ఎడిషన్స్‌లో ఇంచుమించు అన్ని ప్రపంచ భాషల్లో వచ్చింది The Ingenious Gentleman Don Quixote of La Mancha.

మొదటి ముద్రణ తర్వాత కొన్ని నెలలకే తన పుస్తకాన్ని ఐబీరియన్ ద్వీపకల్పంలో అమ్ముకోవటం కోసం లైసెన్స్ కావాలని బెరియన్ ప్రభుత్వాన్ని అర్థించాడు సెర్వాంటెస్. రాబుల్స్, డిలా కెస్టా కలిసి, ఆ వేసవిలోనే రెండవ ఎడిషన్ ముద్రణకు సిద్ధపడ్డారు. కాని అప్పటికే పైరేటెడ్ ఎడిషన్లు లండన్, వాలెన్షియా, జరాగోలాలలో పుస్తకాల షాపుల్లో దర్శనమిచ్చాయి. ఇక రాబుల్స్ పని, పైరేటెడ్ ఎడిషన్స్ గురించి కోర్టులో కేసు వేయటమే. ఏది అదృష్టమో, ఏది దురదృష్టమో తెలియదుగాని పుస్తకంలోని కథానాయకుడు, సైడ్ కిక్ సాంకోపాంజాల గురించి పాశ్చాత్య ప్రపంచమంతా తెలిసింది. రాజ కుటుంబాల నుండి, సామాన్యుల దాకా వాళ్ల చిత్రాల్ని ఇళ్లల్లో అలంకరించుకున్నారు.

సెర్వాంటెస్ కీర్తి స్పెయిన్‌కు మాత్రమే పరిమితం కాలేదు. స్పెయిన్ రాజకీయ, సైనిక ప్రభావం ఉన్న సుదూర ప్రాంతాలకు కూడా స్పానిష్ సంస్కృతి వ్యాపించింది. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, ఇటలీలలలోని పాఠకులకు కూడా మతిభ్రమించిన డాన్ కిహోటీ అభిమాన కథానాయకుడయ్యాడు. బ్రిసెల్స్‌లో డాన్ కిహోటీ రెండు ఎడిషన్స్ వచ్చాయి. హైడెల్‌బర్గ్‌లో డాన్ కిహోటీ, సాంకోపాంజా చిత్రాలతో పెద్ద ఊరేగింపు తీశారు. 1612లో థామస్ షెల్టన్ డాన్ కిహోటీ ఇంగ్లీషు అనువాదం ప్రచురించి బాగా డబ్బు చేసుకున్నాడు. విలియం షేక్స్‌పియర్, జాన్ ఫ్లెచర్‌తో కలసి డాన్ కిహోటీ ఆధారంగా 'కార్డెనియో' అనబడే నాటకం రాశాడు.

తిండి పెట్టని కీర్తి ఎందుకు? డాన్ కిహోటీ ప్రచురణ తర్వాత పదేళ్లకు కూడా సెర్వాంటెస్ ఆర్థిక స్థితిలో ఏమాత్రం మార్పు రాలేదు. అవే కష్టాలు. అదే నిత్య దరిద్రం. వీటికి తోడు కుటుంబ సమస్యలు. జీవితమంతా ఏదో మంచి జరుగుతుందనీ, నాలుగు రాళ్లు సంపాదించకపోతానా అని అవమానాలు/తిరస్కరణలను భరించాడు సెర్వాంటెస్. డాన్ కిహోటీ తర్వాత జీవిత చరమాంకంలోనూ అదే పనిచేస్తున్నాడు. తీపి కలలు, చేదు వాస్తవం అతణ్ణి ఎండిన మోడులా మార్చాయి. ఒక జీవిత కాలం ఓటమి, పరాభవం, దారిద్ర్యం అనుభవించినవాడు రాసిన పుస్తకం డాన్ కిహోటీ.

*(విలియం ఎగింటన్ రచన ఆధారంగా)*

ముక్తవరం పార్థసారథి
హైదరాబాద్. ఫోన్: 917 761 8708.

# స్పర్శరేఖ
## (భమిడిపాటి గోపాలం)

*– వి. రాజారామమోహనరావు*


భమిడిపాటి గోపాలం గారు కథకులు, నవలా రచయిత, హాస్యప్రియులు, సంగీతజ్ఞుడు, అద్భుత సంగీత, మిమిక్రీ కళాకారుడు. ఎందరితోనో పరిచయాలు, అంతకుమించిన స్నేహాలు ఉన్న కలుపుగోలు మనిషి. ఎన్నో అద్భుత సావనీర్లు, ఎందరివో పుస్తకాలు అచ్చువేసిన సాహితీమూర్తి. ఆయన జీవితాంతం సాహితీ సేవలోనే గడిపాడు. ఆయన ఏం చేసినా కొత్తగా, నవ్యంగా ఉండేవి. ఎక్కువ కథలు, తక్కువ నవలలు రాశారు. ఆయన రాసిన నవలే *స్పర్శరేఖ*. ఈ నవలా రచన ఓ ప్రణాళిక ప్రకారం సాగింది. *స్పర్శరేఖ* అన్నది గణితశాస్త్రపు పదం. వృత్తాన్ని స్పర్శిస్తూ, వృత్తంలోకి ప్రవేశించని రేఖని *స్పర్శరేఖ* అంటారు. అలాంటి వ్యక్తే ఈ నవలా కథానాయకుడు. కొందరితో సంబంధం ఉండి, ఎవరితోటి గాఢ అనుబంధం లేని వ్యక్తి రిటైర్డ్ మేజర్ రంగారావు. అతనికి 52 ఏళ్లు. అతని కథే *స్పర్శరేఖ*. అతనికి అప్పటిదాకా పెళ్లి కాలేదు.

అతను తన 52 ఏట గాయత్రిని చూశాడు. గాయత్రి కాలేజీ ప్రిన్సిపాల్. 38 ఏళ్లు. ఆమెకు చిన్నతనంలోనే ప్రకాశరావుతో పెళ్లయింది. అతను చాలా తొందరగా చచ్చిపోయాడు. అతనితో అనుభవంలో ఉన్న కొద్దిపాటి శృంగారం ఎంతో మొరటుగా, ఇబ్బందిగా ఉండేది గాయత్రికి. అందుకే అతను పోయినా అంతగా బాధపడలేదు. చదువు పూర్తి చేసి, ఉద్యోగం తెచ్చుకుని స్వతంత్రంగా, స్వేచ్ఛగా బతుకుతోంది. అప్పటికీ ఆమె కన్యే. అందుకే పిల్లా జల్లా లేరు. ప్రకాశరావుతో చేదు అనుభవంవల్ల మళ్లీ పెళ్లి తలపెట్టలేదు గాయత్రి. ఆమెకి ఓ తమ్ముడు, అతని భార్య వాళ్ళతోటే ఉండే గాయత్రి చెల్లెలు లలిత ఉన్నారు. ఆ తమ్ముడు భార్యతో కలిసి మద్రాసు వెళుతూ లలితని గాయత్రి దగ్గరికి పంపించాడు. అతనికి తిరుగు ప్రయాణంలో రంగారావు తారసపడ్డాడు. తన చెల్లెలు లలిత విషయం చెప్పి ఓసారి పెళ్ళిచూపులకని ఆహ్వానించాడు. రంగారావు ఒప్పుకున్నాడు. అదే విషయం గాయత్రికి తెలియజేసి, ఆ పెళ్లి చూపులు వైజాగ్‌లో గాయత్రి దగ్గరే ఏర్పాటు చేశాడు.

ఆ ఆదివారం పెళ్ళిచూపులు, శనివారమే వైజాగ్ వచ్చిన రంగారావు గాయత్రి కాలేజీకి ఫోన్‌చేసి అభ్యంతరం లేకపోతే, ఆ సాయంత్రమే గాయత్రి ఇల్లు ఆనవాలు పట్టడానికి వస్తానన్నాడు. అలాగే రమ్మంది. అలాగే వచ్చాడు. గాయత్రిని చూశాక పూర్తిగా లలిత గొడవ వదిలేశాడు రంగారావు. ఆమెతో కబుర్లలో గాయత్రి గతం అంతా తెలుసుకున్నాడు. తెలుసుకున్న రంగారావు చాలా ఉద్వేగంగా మాట్లాడాడు. ముందు గాయత్రి పెళ్లి అవటం న్యాయం అన్నాడు. ఆ వయసులోనూ ఆమె అందంగా ఉందన్నాడు. ఆమె అలా మెండులా మిగిలిపోవడం అన్యాయం అన్నాడు. గాయత్రి కూడా అతని ఆ మాటల మత్తులో పడిపోయింది. మర్నాడు లాంఛనంగా పెళ్లి చూపులకు వచ్చినా, రంగారావు లలిత వేపు సరిగ్గా చూడనన్నా చూడలేదు. ఆ తర్వాత జరిగిన మరో కలయికతో రంగారావు, గాయత్రి పరస్పరం పెళ్ళికి ఇష్టపడ్డారు. పెళ్లి జరిగిపోయింది. అలా లలితకి భర్త కావాల్సిన అతను ఆమె అక్క గాయత్రికి భర్త అయ్యాడు. వాళ్ల తొలి మూడు రాత్రులు అద్భుతంగా గడిచాయి. రంగారావుని మించి గాయత్రి మురిసిపోయింది. ఆ ఉత్సాహంలోనే రెండు మూడు రోజులు ఏదైనా ఊరు వెళదామని రంగారావుని అడిగింది.

రంగారావు సొంత ఊరు విజయవాడ. అక్కడ అతనికో సొంత ఇల్లు కూడా ఉంది. ఎక్కడికో ఎందుకని ఆ ఊరే వెళ్లారు. సొంతింట్లో ఓ భాగం రంగారావు ఉంచుకున్నాడు. మరో భాగంలో రమణమ్మ వాళ్ళు అద్దెకు ఉంటున్నారు. చాలా రోజుల తర్వాత వెళ్ళటం కదా అని ఎందుకైనా మంచిదని బృందావన్ లాడ్జ్‌లో దిగి, సామాను పెట్టి సొంత ఇంటికి వెళ్లారు. ఇల్లు బాగా నచ్చింది గాయత్రికి. ఏం కావాలన్నా చేసిపెడతానని చెప్పింది రమణమ్మ. అందుకని లాడ్జి వద్దు, అక్కడే ఉందామని పెళ్లి సామాను తెచ్చిచేయమని రంగారావుని లాడ్జికి పంపింది. రంగారావు అలా వెళ్ళగా ఏం తోచని గాయత్రి ఆ గదిలో ఉన్న పుస్తకాలు చూస్తుంటే, అందులో ఆల్బమ్ కనిపించింది గాయత్రికి. ఆ ఆల్బం నిండా ఆడవాళ్ళ ఫోటోలు, ఆ ఫోటోల కింద వాళ్ళని రంగారావు

అనుభవించిన తారీకులు ఉన్నాయి. ఆఖర్లో రమణమ్మ ఫోటో కూడా ఉంది. అవి చూడగానే ప్రపంచం తలకిందులైనట్టుంది గాయత్రికి. తనలాగే పవిత్రుడనుకున్న రంగారావు అంత పచ్చి తిరుగుబోతు అని తెలిశాక అతని మీద విపరీతమైన అసహ్యం వేసింది గాయత్రికి. దాంతోటి రంగారావు మీద రకరకాల అనుమానాలు తలెత్తాయి. తను నిద్రపోయాక ఏ అర్ధరాత్రో రమణమ్మ పక్కలోకి వెళతాడేమో అనిపించి, తనే వెళ్ళి రమణమ్మ దగ్గర పడుకుంది. తెల్లారింది. రంగారావు గాయత్రిని "నాకు దడిసి రమణమ్మతో పడుకోవటం నిజమేనా'' అని అడిగాడు. భలే గ్రహించాడే అనుకుంది. కానీ రంగారావు గ్రహించింది వేరు. గాయత్రితో శారీరకంగా కలిసినప్పుడు రక్తస్రావం అవుతోంది. అది గైనకీ అనారోగ్యం. ఇద్దరూ అది చర్చించుకున్నారు. తిరిగి తమ ఊరు చేరాక, గాయత్రిని హాస్పిటలిల్‌కి తీసుకెళ్లి తనకు తెలిసి ఉన్న డాక్టర్ శాంతకు చూపించాడు. ఆమె గాయత్రికి ఆపరేషన్ చేసి గర్భ సంచి తీసేయాలి అన్నది. దానివల్ల వాళ్లకి ఇక పిల్లలు పుట్టరు. శాంత ఆపరేషన్ చేసి గాయత్రి గర్భసంచి తీసేసింది. రంగారావుకి, శాంతకీ ఇంతకుముందే సంబంధం ఉంది. ఆ విషయం తెలిసి గాయత్రికి రంగారావు మీద అసహ్యం మరింత పెరిగింది. మానసికంగా కృంగిపోయి, కోలుకోలేని జబ్బులో పడింది. రంగారావు ఆలోచన మరోరకంగా సాగింది. శాంతతో రెండో కాపురం పెట్టాలనుకున్నాడు. అయినా గాయత్రిని జాగ్రత్తగానే చూసుకోవాలనుకున్నాడు. అలాగే చూసుకున్నాడు కూడా. అకస్మాత్తుగా శాంత చచ్చిపోయింది.



రంగారావు ఊహలన్నీ తలకిందులయ్యాయి. ఆ తర్వాత అతని దృష్టి లలిత మీదకు మళ్ళింది. ఆమెను పెళ్లి చేసుకోవచ్చు అనుకున్నాడు. అలా అనుకొని ఆమెను లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. దొరికీ దొరకనట్టు ప్రవర్తించింది లలిత. తీసుకుని, తీసుకొని మరణించింది గాయత్రి. ఆమె ఆస్తి రంగారావు అధీనంలోకి వచ్చింది. ఆ ఆస్తితోటి, లలితతోటి హాయిగా ఉండొచ్చు అనుకున్నాడు. కానీ లలిత వేరే అతన్ని ప్రేమించింది. అది తెలిసి వాళ్లకు పెళ్లి చేసి గాయత్రి ఆస్తి వాళ్లకు ఇచ్చేశాడు రంగారావు. మళ్లీ రంగారావుది గాలి బతుకే అయింది. అదీకాక లలిత ప్రేమించింది రంగారావు అక్రమ సంబంధం ద్వారా పుట్టిన తన కొడుకునే. తనకు జీవితంలో ఇల్లాలు అచ్చిరాలేదు. ఆ యోగం లేదు అనుకున్నాడు రంగారావు. తనొక *స్పర్శరేఖ* లాంటివాడని, తనకొక వృత్తం, వృత్తాంతం లేవని సరిపెట్టుకున్నాడు. అదీ ముగింపు.

రచయిత భరాగో కొత్తగా రాయాలన్నదే ప్రధాన ఉద్దేశంగా పెట్టుకున్నారు. ఒక కొత్త శిల్పం, *స్పర్శరేఖ* అన్న శబ్దానికి అనువుగా, దానికి తగిన పాత్ర రంగారావు. కథకి, నవరసాలకీ అంతగా తన మొగ్గు చూపించలేదు భ.రా.గో. ఏమైనా కొత్తగా అనిపిస్తూ, బాగా చదివించే నవల *స్పర్శరేఖ.*

వి. రాజారామమోహనరావు - ఫోన్: 939 473 8805.

"... ఈ నెల **మిసిమి** (అక్టోబర్–22)లో తంగెడ విశ్వేశ్వర ప్రసాద్ గారు చిత్రకారుడు TITIAN గురించి క్లుప్తంగా వ్రాశారు. బాగుంది. 1490 ప్రాంతంలో పుట్టి 1576లో మరణించిన ఈ గొప్ప చిత్రకారుడు 86 ఏళ్ల సుదీర్ఘ జీవితంలో ఎంతో పేరు సంపాదించాడు. అయితే ఆయన వ్యాసం ముగింపులో వ్రాసిన వ్యాఖ్య ముళ్లకిరీటంతో ఉన్న క్రీస్తు ఆయన వేసిన మొదటి, ఆఖరి మతైక చిత్రం అనటం సరికాదు... ఆయన అనేక చిత్రాలు మతైక పరమైనవే కొన్ని నేను ఉదహరిస్తాను..

- *Holy family with Sniper 1510*
- *Noli Me Tangere (నన్ను ముట్టుకోవద్దు) 1514*
- *Assumption of the Virgin - 1516-18*
- *Venus and Adonis 1554*
- *Pieta -1575-76, The Fall of Man - 1550*
- *Ecce Homo - 1558* – ఇది క్రీస్తును ముళ్లకిరీటంతో వేసిన చిత్రం. Penitent St Mary Magdalene 1560-65. ఇదే చిత్రాన్ని ఆయన మరో రీతిలో 1531లో కూడా గీశారు.

మోటూరు శివరాంప్రసాద్ సి.ఎ., హైదరాబాద్. ఫోన్: 986 633 8088.

# దానగుప్తుడు నిజాం వెంకటేశం

సి. యస్. రాంబాబు

*'నిజాం వెంకటేశ్' ఈ పేరే వింతగా వినపడింది. ఎన్నో ఏళ్లనాడు పుస్తకాల సంతలో ఎంతో సందడిగా సంతోషంగా తిరుగుతూ **మిసిమి** స్టాల్‌కి వచ్చారు. నాకు ఆయన కొత్తగాని ఆయనకు **మిసిమి** కొత్త కాదు. ఎంతో ఆప్యాయంగా కౌగిలించుకొని (కోవిడ్‌కు ముందు సంవత్సరాలు) 'మీరెంతో సేవ చేస్తున్నారు' అంటూ కొన్ని వేల రూపాయల పుస్తకాలు కొన్నారు. అంతేకాదు – స్టాల్ ఎదురుగా కూర్చొని మాతో కబుర్లు చెబుతూ ఆయన మిత్రులెందరినో **మిసిమి** కి పరిచయం చేసి చందాలు కట్టించారు. ఇవన్నీ ఒక ఎత్తు, ఇప్పుడు **మిసిమి** కి వచ్చినా పుట్టెడంత ఆనందాన్ని తెచ్చి – సంచి నిండా పుస్తకాలు తీసుకెళ్లేవారు. ఎక్కడ ఏ సమయంలో కలిసినా ప్రేమ కురిపించేవారు. అలాంటి వ్యక్తి మూలాలు ఎప్పుడూ తెలుసుకుందామని నేను ప్రయత్నించలేదు. ఆయన హఠాన్మరణం తెలిసి ఎంతో బాధపడ్డాను. మొన్న సంతాప సభకు వెళ్తే – ఆయన ముందు వెనుకలు తెలిసి ఆశ్చర్యపోయాను! జీవితం ఇలా ఖాళీ అయిపోతోందేమిటి?! వారి కుటుంబం – ఒక కొడుకు – ఇద్దరు కుమార్తెలు సభకు వచ్చిన ప్రతి వ్యక్తి దగ్గరకు వెళ్లి పలకరించి, నమస్కారం పెట్టటం – నిజాం వెంకటేశ్ నేర్పిన సంస్కారం!*

*– సం.*

కొంతమంది తాము జీవించినంత కాలం స్ఫూర్తిని పంచుతారు. అందులో భాగంగా వచ్చే కీర్తికి మాత్రం దూరంగా ఉంటారు.

అలాంటివారు శాశ్వతంగా దూరమయినప్పుడు మాత్రం మనచుట్టూ శూన్యం పేరుకుపోతుంది. అలాంటి దుఃఖ సమయంలో వారి జ్ఞాపకాలే మనకు చలువపందిరై నీడనిస్తాయి. ఎక్కడ సాహిత్య సభ జరిగినా వారు లేకుండా జరిగేదికాదు. నిష్కపటమైన వారి చెరగని చిరునవ్వు, ఆత్మీయమైన పలకరింపు వారి సిగ్నేచర్ ట్యూన్. వారే ప్రముఖ సాహితీవేత్త, సాహితీ పిపాసి నిజాం వెంకటేశం.

సెప్టెంబర్ 18న వారి ఆకస్మిక మరణం తెలుగు సాహిత్య ప్రపంచానికి తీరని లోటు.

ఆయనో దానగుప్తుడు. ఎడమచేతి దానం కుడిచేతికి, కుడిచేతి దానం ఎడమచేతికి తెలియనంత గోప్యత పాటించేవారు. ఆయనో పుస్తక ప్రియులు. మంచి పుస్తకాలను కొని విద్యార్థులకు, మిత్రులకు కానుకగా ఇచ్చేవారు. డబ్బు కొరత చదువుకు కొరత వేస్తుంటే తను వెనకుండి అండగా నిలబడేవారు. ఆ అంశాన్నెక్కడా తెలియనిచ్చేవారు కాదు.

ఎంతోమంది ఎదుగుదలకు ఆయన నిచ్చెనై నిలిచారు. ఏ రోజూ తనకు ప్రచారం కోరుకోలేదాయన. తెలంగాణ సాహిత్య సమాజం వారిని పెద్ద దిక్కుగా భావించింది. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సాహిత్యకారులకు ఆయన తల్లో నాలుకలా ఉండేవారు. అలిసెట్టి ప్రభాకర్ రచనలన్నా, అలిసెట్టన్నా ఆయనకు అపార ప్రేమ. అలిసెట్టి రచనలు వెలుగు చూడటంలో ఆయన కృషి అపారం. తుమ్మేటి రఘోత్తమరెడ్డి, సుద్దాల అశోక్ తేజ, బి. నర్సన్ ఇలా ఎంతోమందిని ఆయన ప్రోత్సహించారు. బి.ఎస్. రాములుగారితో విడదీయరాని బంధం వారిది.

ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన బహు పాత్రలు పోషించారు. సొంత రచనల కన్నా ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహించటం ముఖ్యమని భావించారు. రచయితను గౌరవించటం తెలిసిన గొప్ప పాఠకుడు. ఎవరి పుస్తకాన్ని ఉచితంగా స్వీకరించేవారు కాదు. పుస్తకం మనిషి వికాసానికి ప్రధానమని దృఢంగా నమ్మారు. స్వయంగా మంచి పుస్తకాలను కొని యువ రచయితలకు పంచేవారు. సొంతంగా గ్రంథాలయం నడిపారు. జగిత్యాలలో దిక్సూచి పత్రికను నడిపారు. కరీంనగర్ బుక్ ట్రస్ట్ ప్రచురణ పెట్టి అల్లం రాజయ్య కథలను అచ్చేశారు. అనువాదకుడిగా లాయర్ విద్యాసాగర్ రెడ్డిగారి రచనలను అనువదించారు. సేంద్రియ వ్యవసాయం గురించి సుభాష్ పాలేకర్ రచనను తెలుగులోకి తెచ్చారు. పద్మారావు నగర్‌లోని తన ఇంటిని పుస్తక భాండాగారంగా మార్చేశారు.

ఒకసారి వారితో మాట్లాడితే వారిని మర్చిపోలేం. కల్మషం లేని ఆ చిరునవ్వుకు బద్ధులమయిపోవాల్సిందే. ఎన్నో పర్యాయాలు వారితో కలిసి సాహిత్య సభలకు హాజరైన అనుభవం ఈ వ్యాసకర్తది. జీవితం, సాహిత్యం తనకు విడదీయరాని నేస్తాలని వెంకటేశం సార్ పేర్కొంటూ ఉండేవారు. జగిత్యాల జీవితాన్ని వివరంగా చెబుతుండేవారు. మానవత్వాన్ని వెలిగించే దీపం సాహిత్యం అని ఆయన ప్రగాఢంగా నమ్ముతుండేవారు.


అలా అని వారి జీవితం వడ్డించిన విస్తరించి కాదు. జీవితంలో ఎదురుదెబ్బలు తిన్నా, పడిలేచిన కెరటమై సాగిపోవటం నిజాం వెంకటేశంగారి నైజం. కన్నతల్లంటే వారికి ఎనలేని ప్రేమ. చివరివరకు కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఇటీవలే భౌతికంగా వీడిన తన తల్లిని స్మరించుకుంటూ స్మృతి సంచిక వెలువరించారు. అంతలోనే వారు శివైక్యం చెందటం సాహిత్య లోకానికి తీరని లోటు.

ఉద్యోగ జీవితంలోను, సాహిత్య జీవితంలోను గొప్ప సమన్వయం పాటించారు. పదవీవిరమణ అనంతరం కొంతకాలం ఒక ప్రైవేటు సంస్థకు పనిచేశారు. ఇరవైరెండునెలల కాలంలో ఉత్తరప్రదేశ్‌లోని గ్రామాలలో ముప్పైవేల ఎలక్ట్రిక్ పోల్స్ వేసి, నలభైవేల విద్యుత్ కనెక్షన్‌లను ఇవ్వటంలో కీలక పాత్ర పోషించారు. బిజలీ కే సాబ్ అని ఆ ప్రాంతంలో ఖ్యాతి గడించారు. ప్రచార పటాటోపాలకు దూరంగా ఉండేవారు. తన విజయాలను కానీ, తన దాతృత్వాన్ని ఎన్నడూ ప్రకటించుకోలేదు. చివరివరకూ అదే నిరాడంబరతను పాటించారు. ఆయనది అపురూపమైన జ్ఞాపకశక్తి. వారిని కదిపిస్తే జ్ఞాపకాల చెట్టయ్యేవారు. ఏ అంశంపైనైనా సాధికారికంగా అనర్గళంగా ప్రసంగించేవారు. అలా వారొక మౌఖిక సాహితీవేత్త. వారిని రికార్డు చేసి ఉంటే డెబ్బై, ఎనభై దశకాల ఉత్తర తెలంగాణ సాహిత్య చరిత్ర రికార్డయి ఉండేదేమో.

“అజాత శత్రువు నిజాం వెంకటేశం” శీర్షికతో ఆయన అడుగుజాడలు స్మరిస్తూ స్మృతి సంచిక వెలువరించారు సాహితీ మిత్రులు. వెంకటేశంగారి అత్యంత సన్నిహితులు బి.ఎన్. రాములు, ఎ. గంగారెడ్డి, సి.హెచ్.వి. ప్రభాకరరావులు సంపాదకత్వం వహించిన ఈ సంచికలో పత్రికలలో మిత్రులు రాసిన నివాళి వ్యాసాలు, సన్నిహితుల జ్ఞాపకాలు ఉన్నాయి.

ఒకొక్కరిది ఒక్కో అనుభూతి.

అక్షరనివాళి ఘటించిన అందరు తమ జ్ఞాపకాలతో మనలను తడిపేస్తారు. రచనలకు తోడుగా నిజాం వెంకటేశం గారి ఛాయాచిత్రాల మాలికను పొందుపరచారు. వివిధ సందర్భాలను ప్రతిబింబించే ఆ ఛాయాచిత్రాలు ఎన్నో అనుభూతులను మనలో ఒంపుతాయి.



ఇవన్నీ మనకు తెలియని నిజాం వెంకటేశం గారి పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తాయి. చదివినవారి కళ్ళు కన్నీటి కొలనులవుతాయి. నిజాం వెంకటేశం వంటి వ్యక్తులు అరుదుగా పుడమిపై అడుగిడతారు. తమచుట్టూ ఉన్న సమాజంలోని అశాంతిని, అలజడిని తొలగించటంలో ముందుంటారు. సాహిత్యం సమాజాన్ని మార్చగలదని ఉపన్యాసాలతో సరిపెట్టక, ఆచరించి చూపుతారు. పుస్తకంతోనే వ్యక్తిత్వ నిర్మాణం సాధ్యమని కడవరకు నమ్మారు వారు. వారు వెలిగించిన సాహిత్య దీపాలు వారి కృషిని కొనసాగించటమే వారికి సమర్పించే నిజమైన నివాళి.

***ప్రతులకు: నిజాం ప్రశాంత్, ఫోన్: 996 623 3980.***


* * *

సి. యస్. రాంబాబు - హైదరాబాద్. ఫోన్: 837 481 8961.


## పత్రహరిత పుడకల పరిమళభరిత సంకలనాలు

*వెలుతురు తోవలు, వెలుగుపూలు, వెలుగుదివ్వెలు*


**- చంద్రశేఖర్ మల్లాది**




గూటి కోసం ఒక పిచ్చుక పుడకలు ఏరటం మొదలు పెట్టింది. తన తోటి వారిని కలుపుకుంది. ఆ గూళ్ళు ఒకటి రెండై రెండు మూడై ఇప్పటికి మూడు గూళ్ళు తయారయ్యాయి. పత్ర హరిత పుడమిన ఏరిన పుడకలు కదా అందుకని ఆ గుడిలో మట్టి పరిమళం మిగతా పిచ్చుకలకు ఎంతో నచ్చింది. మనం కూడా మన గూడు ఇలానే కట్టుకొంటే ఎంత బావుంటుందో అనుకొనేలా చేశాయి. ఇంతకీ ఆ పిచ్చుకలు గూడు కట్టింది తమ పిల్లల కోసం కాదు. గూడును పుట్టించిన పుడమి రేడు కోసం.




ఆహారం, ఆశ్రయం, ఆచ్ఛాదన, తిండి-గూడు-గుడ్డ మనకు అందాలంటే నిన్నటి విత్తనంతో నేటి పంట కోసి రేపటి ఆకలి తీర్చే అన్నదాత రైతన్న కావాల్సిందే. బోసి నేలపై సేద్యాన్ని స్వేదముతో కలబోసిన ఆ హరిత హలధారికి మార్గదర్శిగా ఎవరో ఒకరు కావాల్సిందే. మరి ఎవరా మార్గదర్శి? అతడికి మంత్రాలు రావు. కానీ విత్తు గమ్మత్తు తెలిసిన మంత్ర స్రష్ట. అతని మంత్రాలకు మొలకలు కైమోడ్పులతో మట్టి పొరలును చీల్చుకుని జేజేలు పలికాయి. అతను శాస్త్రజ్ఞుడు కాడు. కానీ మొలకల మౌన వ్రతాన్ని కళ్ళతో ఒకపక్క, మరొకపక్క అరచేతి నీడల్లో సూర్యుడిని చూస్తూ జల ధారల దారి వెంట ధనధాన్యాలు పారించాలని చూసే రైతులకు చుక్కాని. నవజాత మొలకలకు గుండె చప్పుడు తానై, హెక్టార్ల ఎకరాల హత్తుకునే తన పొడవాటి చేతులతో పుడమిని గుండెకు హత్తుకుని, ఉప్పొంగే ఉగ్ర జలధారల దారులకు చుక్కాని తానై, చుక్క చుక్కను పొదిగి పట్టి, మట్టిలో దాగిన గింజల దాహార్తిని తీర్చి పుడమి తల్లి నుదిటిన సూర్య తిలకమై, చంద్రకాంతి నీడన దాగిన చీకటిని కాటుకగా దిద్దాడు, అందుకే అతను, తన సహస్ర బాహువులతో పొలమంతా నాట్యమాడే పంట కంకుల గుసగుసల భాష తెలిసిన భాషా కోవిదుడు అయ్యాడు. ప్రకృతి వైచిత్రి తెలిసిన చిత్రకారుడు అతను. కాలాంతపు సంతకాలు, ఋతువుల వీలునావాలు మొక్కలకు అందేలా చేసే న్యాయకోవిదుడు. మహీతల రక్షణకు హరిత కంకణ ధారియై అహరహం శ్రమించే నిత్య శ్రామికుడు. ప్రకృతి క్షేత్రంలో ప్రతి జీవి పులకించేలా కాలానికి కట్టలు వేసి చెట్లకు కాసులు కాచేలా చేస్తూ , ఎర్రని తూరుపులో పచ్చని ప్రకృతి పరవశాన్ని కోరే వ్యక్తి అతను.




అతను ఎవరినేగా? వాన కురిస్తే మెరుపు మెరిస్తే తమకోసం అనుకునే చిన్నారులకు పోటీగా నిలిచే రైతు నేస్తం కోసం, నేలలో ఖనిజాన్ని ఘర్మజల లవణాన్ని పుడమిలో రంగరించి, దుర్భిక్షాన్ని తరిమికొట్టే లక్ష్మికి జన్మనిచ్చిన శ్రమ సముద్రుడు రైతన్న కోసం పనిచేస్తాడతడు. బీజాల మంత్రాక్షతలు చల్లి జలహోమం చేస్తూ యజ్ఞఫలితం ఆశించని ఆరైతు కోసం వెన్నుముకై నిలుస్తాడు. మట్టి ముద్దను అన్నపు ముద్దగా మలచే ఆ విశ్వంభర సేవకునికి దారిచూపే మార్గదర్శి ఇతనే. 75 ఏళ్ళుగా నేను సైతం అంటూ కదం తొక్కి పదం పాడుతూ వ్యవసాయ విజ్ఞానాన్ని అందిస్తూ బాపట్ల వ్యవసాయ కళాశాలలో రూపుదిద్దుకున్న జ్ఞానమూర్తులైన వ్యవసాయ శాస్త్రవేత్తల విజ్ఞాన గనిలో వెలుగొందిన ఎందరో ఎందరెందరో చరిత్రను అక్షరబద్ధం చేసి, భావితరాలకు స్ఫూర్తి ప్రదాతలుగా న భూతో న భవిష్యతి అన్నట్టుగా రూపుదిద్దుకున్న ఆ మూడు గూడులే ఇప్పుడు మన చేతుల్లో ఉన్న ఈ మూడు

పుస్తకాలు. లోతంతు చూసే నీటి వాటాన్ని, ఆకాశపు వీధుల్లో నడుచుకుంటూ పోయే మేఘమాలికల జాలువారడాన్ని, నేల లోతుల్లో పొరల అరలలో గాలి వాలులో, ఎండవేడిలో పంటకంకుల బరువును మోసే గడ్డిపోచకు ప్రాణం పోసే ఎందరో అపర బ్రహ్మల జీవితాలు పారిజాతాలై పరిమళిస్తాయి ఈ పుస్తకాలలో. ఇంకా ఈ పుస్తకాలలో వ్యవసాయ విజ్ఞానాన్ని కార్తెలలో కొలిచిన అవధానులు ఉన్నారు. మట్టికి పచ్చతనమద్దిన చిత్రలేఖకులూ ఉన్నారు. మోడుకు చిగురులు తొడిగిన శిల్పులు ఉన్నారు. చినుకుల సంగీతానికి పిట్టల గానానికి నాట్యమాడే నాట్యాచార్యులు కూడా ఉన్నారు.

పొడుగాటి గడ్డపార, పొట్టిదైన పలుగు పార, శనగ కాయలు త్రవ్వే తోలిక, భూమిని పెకలించే గుద్ధలి, కాయలు కోసే చిలుకు దోటి, వలకట్టిన చిక్కందోటి, వడిసెల, గాలం, దబ్బణం, ఎద్దును అదిలించే ముల్లు కర్ర, జూటీ, పైకి ఎక్కించే నిచ్చెన, ఎలపట దాపట కాడి, పిక్కాసు, పగ్గం, గత్తిగోర, దోకుడు పార, ఊదర ఇలా ఎన్ని వ్యవసాయ పరికరాలు ఉన్నాయో అన్ని రకాల జీవన వైవిధ్య చరిత్రలు ఇందులో ఉన్నాయి. మరణం రెండు కళ్ళను మాత్రమే మూయగలదుకానీ జీవితంలో గెలుచుకున్న మంచి పేరును కాదు, అన్న దానికి నిదర్శనంగా, నిలిచివున్న మానులవంటి మాన్యులతో పాటుగా రాలిపోయిన మానులువంటి అసామాన్యుల చరిత్రలు ఇందులో పొందుపరిచారు. పెద్దలు అన్నట్టుగా పూర్వవిద్యార్థుల వివరాలతో పాటు ప్రచురణ తీరు మరింత చక్కగా ఉంది. వ్యవసాయం అంటే ఆసక్తి ఉన్న యువతకు ఈ పుస్తకాలు దిశానిర్దేశం చేస్తాయి. ఆకాశవాణిలో మూడు దశాబ్దాలకు పైగా వ్యవసాయ కార్యక్రమాలతో పాటు పలు విభాగాల నిర్వాహకుడిగా సేవలందిస్తున్న వలేటి గోపీచంద్ తన మిత్రబృందంతో ఈ సంకలనాన్ని రూపొందించిన తీరు నచ్చి తీరుతుంది. వారి కృషికి రైతు నేస్తంవారు పుస్తకాల అచ్చులో తీసుకున్న శ్రద్ధ, చూపిన నైపుణ్యం వీటికి అదనపు వెలుగు నిచ్చాయి.

**తమసోమా జ్యోతిర్గమయ:**

వెలుతురును జ్ఞానజ్యోతి ప్రదాయినిగా ఆరాధిస్తారు. ఆ వెలుతురుతోవ ఎందరికో మార్గదర్శి. మొదటి పుస్తకం వెలుతురు తోవలుగా దారి చూపిస్తే, రెండవ పుస్తకం వెలుగుపూలుగా పరిమళాలు వెదజల్లుతుంది. మూడవ పుస్తకం ఆ వెలుతురు తోవల పూసిన వెలుగుపూల వెంట వెలుగు దివ్వెలు వెలిగిస్తుంది. తన బాపట్ల వ్యవసాయ కళాశాల మీద అపారమైన ప్రేమ, నిబద్ధత, శ్రద్ధలతో పాటు కృషి, పట్టుదల, సంకల్పం అన్నీ కలిపి ఈ హరిత రేఖల సంకలనాలు మన ముందు వెలుగుతూ వాసనలు వెదజల్లుతున్నాయి. జీవనానికి జీవితానికి తోవ చూపిస్తూ జీవన సౌరభాన్ని మనసు లోతుల్లో ఇంకిపోయేలా చేస్తూ, ఆదర్శ జీవనానికి దివ్వెలా నిలిచిపోయే ఈ కృషి, కృతి, మరెందరో విద్యార్థులకు మార్గదర్శి. అభినందనలకేకాక పరిశోధనా పరిశీలకులకు ఈ పరిశోధన గ్రంథం స్ఫూర్తినిస్తుంది. ప్రకృతి ప్రేమికుల జీవన గమనంలో పుడమి తల్లి పాదాల నీడలో హరిత సంతక నీరాజనం ఈ సంకలన సౌరభం.

**ప్రతులకు:** *పద్మశ్రీ డా. ఐ.వి. సుబ్బారావు స్మారక కమిటీ, వలేటి గోపీచంద్. ఫోన్: 944 127 6770 ను సంప్రదించగలరు.*

చంద్రశేఖర్ మల్లాది - ఫోన్: 944 110 8108.



కాండ్రేగుల నాగేశ్వరరావు

అరనవ్వుతో ఆత్మీయంగా పలకరించే మిత్రుడు – అన్నిటిలో వెన్నుదన్నుగా నిలిచిన విశ్వాసపాత్రుడు – ప్రతి ప్రయాణంలో తోడుగా వచ్చిన నీడ – కొండంత అండ – దేనికీ ఎప్పుడూ అడ్డురాని, ఆదుకునే ఆత్మబంధువు – హఠాత్తుగా నన్ను వదిలి – తోడువీడి – నీ దారి నీది – అనకుండా తన దారిన వెళ్ళిపోయిన స్నేహపాత్రుడు – ఎన్నార్కెకి స్మృత్యంజలి (నవంబరు – 6)

*ఎ.కె.*


# మిసిమి
మాసపత్రిక


**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

*మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.*


**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi Publication


## మిసిమి ప్రచురణలు



**నోబెల్ వ్యాసాలు**





**మిసిమి** పార్థసారథి వ్యాసాలు



**చిత్రకళా నీరాజనం**



**నరిసెట్టి ఇన్నయ్య మిసిమి వ్యాసాలు**



**పురస్కార సాహిత్యం**



**వ్యాస మంజూష**


**సారస్వత వ్యాసాలు**



చార్లీ చాప్లిన్



**రజ్జు సర్ప భ్రాంతి**



**బైరన్**




**షెల్లీ జీవిత కథ**



దోసిట చినుకులు


**నృత్యభారతి**



పారిజాతం


సిద్ధార్థ



**సప్తపర్ణి**

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

**మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**